సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 330
గురువారం 20-2-2025


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'


పాక్‌కు పరాభవం
చాంపియన్స్‌ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ చేతిలో ఓటమి
-14లో


బంగారం.. బూమ్‌
మరోసారి జీవితకాల గరిష్టానికి.. రూ.900 ర్యాలీతో రూ.89,400
-15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


నిరభ్యంతరంగా స్నానం, ఆచమనం
మహా కుంభమేళాను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు కుట్రలకు పాల్పడుతున్నాయని యూపీ సీఎం యోగి మండిపడ్డారు.
వివరాలు 6లో ▸



భారత్‌కు సాయం అనవసరం
భారత్‌లో ఓటింగ్‌ను పెంచడానికి ఇస్తున్న 2.1 కోట్ల డాలర్ల నిధిని రద్దు చేస్తూ 'డోజ్‌' తీసుకున్న నిర్ణయాన్ని ట్రంప్‌ సమర్థించుకున్నారు.
వివరాలు 6లో ▸


అండగా ఉన్నోళ్లకే ప్రోత్సాహం
ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీ కోసం నిలబడిన వారిని ప్రోత్సహించాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పార్టీ శ్రేణులకు సూచించారు.
వివరాలు 6లో ▸


రష్యా అబద్ధాల వలలో ట్రంప్‌
జెలెన్‌స్కీ కారణంగానే రష్యా దండయాత్రకు తెగించిందని ట్రంప్‌ చేసిన వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ దీటుగా స్పందించారు.
వివరాలు 6లో ▸

సీఈసీగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ్‌
- 18 ఏళ్లు నిండిన ప్రతీ భారతీయుడు ఓటర్‌గా మారాలని పిలుపు
- ప్రతి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచన
- ఎన్నికల కమిషనర్‌గా వివేక్‌ జోషి బాధ్యతల స్వీకరణ

6 లో


బాధ్యతలు స్వీకరిస్తున్న జ్ఞానేశ్‌ కుమార్‌


తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌. చిత్రంలో కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఇతర ముఖ్య నేతలు

కాంగ్రెస్‌ గ్రాఫ్‌ డౌన్‌

ఎప్పుడైనా ఉప ఎన్నికలు..సిద్ధంగా ఉండండి బీఆర్‌ఎస్‌ విస్తృతస్థాయి భేటీలో కేసీఆర్‌

- కేసీఆర్‌ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- చంద్రబాబు ఎన్డీయే పేరిట తెలంగాణలో అడుగు పెట్టాలనుకుంటున్నారు
- తెలంగాణ మళ్లీ వలసవాద కుట్రలకు బలి కావొద్దు.. అదే జరిగితే రాష్ట్రం కోలుకోకుండా ఆగమయ్యే ప్రమాదం
- తెలంగాణకు రాజకీయ అస్తిత్వం, రక్షణ కవచం బీఆర్‌ఎస్‌ పార్టీనే అన్న మాజీ సీఎం

సాక్షి, హైదరాబాద్‌

'రాష్ట్రంలో కాంగ్రెస్‌ గ్రాఫ్‌ వేగంగా పడిపోతోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఇంత త్వరగా వ్యతిరేకత వస్తుందని అనుకోలేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టులో గట్టిగా కొట్లాడుతున్నాం. ఉప ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉండాలి. కేసీఆర్‌ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జనం కోరుకుంటున్నారు. సోషల్‌ మీడియాలో వస్తున్న ఈ విషయాన్ని నేను గమనిస్తున్నా. చంద్రబాబు నాయుడు ఎన్డీఏ పేరిట మళ్లీ ఏదో ఒక రూపంలో తెలంగాణలో అడుగు పెడుతానంటున్నడు. తెలంగాణ మళ్లీ వలసవాద కుట్రలకు బలికావొద్దు..' అని మాజీ సీఎం, బీఆర్‌ఎస్‌ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, బీఆర్‌ఎస్‌ ప్రస్థానం, సంస్థాగత నిర్మాణం, పార్టీ రజతోత్సవాల
మిగతా 3వ పేజీలో ▶

ఏడాది పొడవునా రజతోత్సవాలు: కేటీఆర్‌ 3 లో

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా



- ఎట్టకేలకు బీజేపీ అధిష్టానం నిర్ణయం
- కొనసాగిన 'కొత్త ముఖం' ఆనవాయితీ.. ఢిల్లీకి నాలుగో మహిళా ముఖ్యమంత్రి
- ప్రస్తుత బీజేపీ సీఎంల్లో ఏకైక మహిళ.. నేడు రాంలీలా మైదానంలో ప్రమాణం
- పాల్గొననున్న మోదీ, షా, కేంద్ర మంత్రులు, సినీ, పారిశ్రామిక ప్రముఖులు

6 లో

..అలా కలిసొచ్చింది

3 బిల్లులపై అసెంబ్లీ ప్రత్యేక భేటీ



మార్చి 1 నుంచి 5వ తేదీ లోపు నిర్వహణ

1	2	3
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు..	స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా రిజర్వేషన్లు	ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత.. ఏకసభ్య కమిషన్‌ నివేదిక ఆధారంగా బిల్లు

అసెంబ్లీ ఆమోదం తర్వాత మూడింటినీ కేంద్రం ఆమోదానికి పంపనున్న రాష్ట్ర ప్రభుత్వం
3లో

హైదరాబాద్‌లో 'మిస్‌ వరల్డ్‌'
మే 7 నుంచి 31 వరకు పోటీలు
- ప్రారంభ, ముగింపు, గ్రాండ్‌ ఫినాలే వేడుకలకు వేదిక
- 120 దేశాల నుంచి రానున్న సుందరీమణులు..
- అధికారికంగా ప్రకటించిన మిస్‌ వరల్డ్‌ లిమిటెడ్‌ సీఈవో



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ మరో ప్రతిష్టాత్మక పోటీలకు వేదిక కాబోతోంది. ప్రపంచమంతా ఆసక్తిగా తిలకించే ప్రపంచ సుందరి (మిస్‌ వరల్డ్‌) పోటీలు ఈ ఏడాది హైదరాబాద్‌లో జరగనున్నాయి. మే 7వ తేదీ నుంచి 31 వరకు నగరంలో 72వ ఎడిషన్‌ మిస్‌ వరల్డ్‌ పోటీలను నిర్వహించనున్నట్లు మిస్‌ వరల్డ్‌ లిమిటెడ్‌ చైర్‌పర్సన్, సీఈవో జులియా మోర్లే.. తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌ బుధవారం సంయుక్తంగా
మిగతా 16వ పేజీలో ▶

ఎల్‌ఆర్‌ఎస్‌కు లైన్‌ క్లియర్‌

మార్చి 31లోపు చెల్లిస్తే ఫీజులో 25 శాతం రాయితీ
- 2020 ఆగస్టు 28 నాటికి ఉన్న లేఅవుట్లకు పథకం వర్తింపు
- గతంలో ప్లాట్లు కొని రిజిస్ట్రేషన్‌ చేసుకోని వారికీ రాయితీ
- ఎల్‌ఆర్‌ఎస్‌ కింద గతంలో దరఖాస్తు చేసుకోని వారికీ చాన్స్‌
- పథకంపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు సమీక్ష.. వేగంగా దరఖాస్తుల పరిశీలనకు ఆదేశం
- ఖజానాకు రూ.20 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా


సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీఎస్‌ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్‌: నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకానికి (ఎల్‌ఆర్‌ఎస్‌)కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. బుధవారం సచివాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌ అంశంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉన్నతస్థాయిలో సమీక్షించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ పథకం అమలును వేగవంతం చేయాలని నిర్ణయించారు. 2021లో ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం దరఖాస్తు చేసుకొన్నవారిలో.. 2020 ఆగస్టు 28కు ముందు నాటి
మిగతా 16వ పేజీలో ▶

గుంటూరు మిర్చి యార్డు వద్ద మాజీ సీఎం వైఎస్‌ జగన్‌ను కలిసేందుకు తరలివచ్చిన అశేష జనసందోహంలో ఓ భాగం. (ఇన్‌సెట్లో) మిర్చి యార్డులో మహిళా రైతు ఆవేదనను ఆలకిస్తున్న వైఎస్‌ జగన్‌



రైతు బతికే పరిస్థితి లేదు!



చంద్రబాబూ.. ఇకనైనా కళ్లు తెరువ్‌
గుంటూరు మిర్చి యార్డులో వైఎస్‌ జగన్‌ కన్నెర్ర

- ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు.. పత్తి, మినుము, కందులు, టమాటా.. అదే దుస్థితి
- దిగుబడులు పడిపోయాయి.. పంటలకు 'మద్దతు' లేదు.. రైతన్నకు 'భరోసా' కరువు
- సూపర్‌ సిక్స్‌ హామీలన్నీ ఎగ్గొట్టి.. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు

భారీగా తరలి వచ్చిన రైతన్నలతో కిక్కిరిసిన గుంటూరు మిర్చి యార్డు

వివరాలు 12లో

అవసరాలకే కేటాయించాలి.. అత్యాశకు కాదు!

కృష్ణా ట్రిబ్యునల్‌-2 ఎదుట తెలంగాణ వాదనలు
- ఏపీలోని పరీవాహకం వెలుపలి ప్రాంతాలు కృష్ణా నీళ్లు వాడుకోవడాన్ని అనుమతించొద్దు
- కృష్ణా పరీవాహకం వెలుపలకు ఏపీ 323 టీఎంసీలు తరలిస్తోంది
- తెలంగాణలోని పరీవాహక ప్రాంతాలు నీటి కోసం కటకటలాడుతున్నాయి

సాక్షి, హైదరాబాద్‌: అవసరాలు తీర్చడానికి నీళ్లు కేటాయించాలి కానీ అత్యాశ తీర్చడానికి కాదని తెలంగాణ పేర్కొంది. ఏపీలో కృష్ణా పరీవాహకం పరిధిలోని ప్రాంతాలకు సాగునీటి సరఫరాపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. అయితే తెలంగాణ పరీవాహకం పరిధిలోని ప్రాంతాలు కనీసం ఒక ఆరుతడి పంటకు సైతం సాగునీటికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. రైతులు నీళ్లు లభించక గోస పడుతున్నారని తెలిపింది. ఈ పరిస్థితుల్లో ఏపీలోని పరీవాహకం వెలుపలి ప్రాంతాలు కృష్ణా నీళ్లు



మిగతా 12వ పేజీలో ▶

ఔటర్‌ చుట్టూ హౌసింగ్‌ కాలనీలు
- హైదరాబాద్‌ నగరంలోని భూములమ్మి నిర్మించేందుకు హౌసింగ్‌ బోర్డు కసరత్తు

5 లో


...నియమించేటపుడు కళ్లు మూసుకున్నాడు.. ఇప్పుడు చెవులు మూసుకుంటున్నాడు మన సారు..!!

రండి బాబూ రండి.. ముందే రిజర్వ్‌ చేసుకోండి!



అడ్మిషన్లకు ముందే ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల సీట్ల అమ్మకాలు

- వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ముందే బుక్‌ చేసుకోవాలంటూ ప్రచారం
- ఇప్పుడే రిజర్వ్‌ చేసుకుంటే ఫీజులు తగ్గిస్తామంటూ ఆఫర్లు
- రంగంలోకి ఏజెంట్లు, టీచర్లు.. తాత్కాలికంగా నిరుద్యోగుల నియామకం.. విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు ప్రోత్సాహకాలు, నజరానాల ఎర
- ముందస్తు అడ్మిషన్లకు అనుమతి లేకున్నా బేఖాతర్‌

32,000 ఇంజనీరింగ్‌లో యాజమాన్య కోటా సీట్లు

రూ. 1,000 కోట్లు కంప్యూటర్‌ సైన్స్‌ సీట్ల ద్వారా వసూళ్లకు టార్గెట్‌

36 లక్షలు 11,000 ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్‌:

జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం కోసం ప్రైవేటు విద్యాసంస్థలు సీట్లను అమ్మకానికి పెట్టాయి. విద్యార్థులను ఆకర్షించేందుకు కొత్త పద్ధతులు అవలంభిస్తున్నాయి. మధ్యవర్తులు, ఏజెంట్లు, తమ సంస్థల్లో చదివే సీనియర్లను రంగంలోకి దించుతున్నాయి. పెద్ద ఎత్తున కరపత్రాలు, ప్రకటనలతో హోరెత్తిస్తున్నాయి. గ్రామాల్లో ఆటోలకు మైకులు పెట్టి ఊదరగొడుతున్నాయి. పల్లెల్లో పెద్దల్ని ఆశ్రయించి తమ విద్యార్థులకు తమ సంస్థలను సిఫారసు చేయమని అడుగుతున్నాయి. నిరుద్యోగులను నియమించుకుని వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షించేలా ఇల్లిల్లూ తిప్పుతున్నాయి. వీలున్న మార్గాల్లో విద్యార్థుల ఫోన్‌ నంబర్లు, వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నాయి. ఎల్‌కేజీ మొదలుకుని, ఇంజనీరింగ్‌ వరకు స్కూళ్లు, కాలేజీలు ముందస్తు ప్రవేశాలకు తెరతీశాయి. ముందస్తు అడ్మిషన్లకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకున్నా వెనక్కి తగ్గకుండా దూసుకెళ్తున్నాయి.

'బీ' బ్యాచ్‌ టార్గెట్‌ రూ.1,000 కోట్లు!
ఇంటర్మీడియెట్‌ పరీక్షలు ఇంకా పూర్తవ్వలేదు. ఇంజనీరింగ్‌ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు మొదలవ్వలేదు. కానీ ప్రైవేటు ఇంజనీరింగ్‌ కాలేజీలు అప్పుడే
మిగతా 5వ పేజీలో ▶

ప్రమాదంలో 'శ్రీశైలం'
జలాశయం స్పిల్‌వే దిగువన విస్తరిస్తున్న భారీ గుంత
- ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌కు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ లేఖ
- 2009 వరదల్లో గుంత ఏర్పడినా ఇంకా జరగని మరమ్మతులు
- నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- జలాశయం తెగితే రెండు రాష్ట్రాల్లో భారీ విపత్తు సంభవిస్తుందని ఆందోళన




సాక్షి, హైదరాబాద్‌: రెండు తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని... తక్షణమే జోక్యం చేసుకోవాలని నేషనల్‌ డ్యామ్‌ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ)కి తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆనకట్టల భద్రత కమిటీ చైర్మన్‌ హోదాలో రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (జనరల్‌) ఎస్‌.అనిల్‌కుమార్‌ బుధవారం ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌కు లేఖ రాశారు. 1981లో నిర్మించిన శ్రీశైలం జలాశయానికి 2009లో వచ్చిన భీకర వరదలతో స్పిల్‌ వే దిగువన నీళ్లుపడే ప్రాంతంలో
మిగతా 12వ పేజీలో ▶


A quality product from
PAN BAHAR
PAN BAHAR
ది హెరిటేజ్ ఇలాచి
విజయానికి గుర్తింపు
NEW PACK
PAN BAHAR PRODUCTS (P) LTD.
PAN BAHAR
THE HERITAGE ELAICHI
TOLL FREE NO.: 1800 257 2258
www.panbahar.in

భారత శ్రమకు మస్త్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలో అత్యధిక యువ జనాభా ఉన్నదేశం మనదే. అత్యధికంగా ఉద్యోగ, కార్మిక శక్తి లభ్యత ఉన్న దేశం కూడా భారతే. ఈ భారతీయ వర్క్‌ఫోర్స్‌ను ఇప్పుడు కొన్ని దేశాలు కళ్లకద్దుకొని ఆహ్వానిస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియా, యూరప్, జపాన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో భారత ఉద్యోగ, కార్మిక శక్తికి డిమాండ్ వేగంగా పెరుగుతోంది.

- మనదేశ ఉద్యోగ, కార్మికులకు విదేశాల్లో పెరుగుతున్న అవకాశాలు
- పశ్చిమాసియా, యూరప్, జపాన్, ఆస్ట్రేలియాలో మంచి మార్కెట్
- 2030 కల్లా 30 లక్షల మందికి ఉపాధి దొరకవచ్చని కేంద్రం అంచనా
- సీఐఐతో కలిసి నైపుణ్యాల గుర్తింపునకు కేంద్ర కార్మికశాఖ 'ఫ్రేమ్‌వర్క్'



అమెరికా వద్దన్నా..

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన తర్వాత అమలుచేస్తున్న కఠిన నిబంధనలతో ఆ దేశంలో భారతీయులకు ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. అదే సమయంలో ఆసియా, యూరప్‌లో మనవాళ్లకు అవకాశాలు పెరుగుతున్నట్లు కేంద్ర కార్మికశాఖ గణాంకాలు చెబుతున్నాయి. భారత కార్మిక శక్తికి ఇప్పటికే పశ్చిమాసియా అతిపెద్ద జాబ్ మార్కెట్‌గా ఉంది. సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్ వంటి దేశాల్లో లక్షల మంది భారతీయులు ఉద్యోగాలు చేస్తున్నారు. జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా, ఫిన్లాండ్ వంటి దేశాల్లో కూడా ఇప్పుడు అవకాశాలు పెరుగుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ దేశాల్లో 30 లక్షల మంది భారతీయులకు ఉపాధి అవకాశాలు లభించవచ్చని కేంద్ర కార్మికశాఖ అంచనా వేసింది. ఒక్క సౌదీ అరేబియాలోనే పదేళ్లలో 20 లక్షల మంది భారతీయులకు ఉపాధి లభించవచ్చని పేర్కొంది. ఆ దేశంలో నిర్మాణ, రిటైల్, రవాణా, స్టోరేజీ, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో భారతీయులకు మంచి డిమాండ్ ఉన్నట్టు గుర్తించారు.

సీఐఐతో కలిసి 'ఫ్రేమ్‌వర్క్' తయారీ

సౌదీ, ఖతార్, ఒమన్, జపాన్, జర్మనీ, ఫిన్లాండ్, ఆస్ట్రేలియాలో భారత వర్క్‌ఫోర్స్‌కు అవకాశాలు పెంచేందుకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)తో కలిసి కేంద్ర కార్మికశాఖ ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందిస్తోంది. కార్మికుల నైపుణ్యాలు, విద్యార్హతలను గుర్తించి పై దేశాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చటం ఈ ఫ్రేమ్‌వర్క్ ముఖ్య ఉద్దేశమని అధికారవర్గాలు తెలిపాయి. ఒమన్‌లో ఇంజనీరింగ్, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి.. ఖతార్‌లో ఆతిథ్యం, ఏవియేషన్, స్పోర్టింగ్ ఈవెంట్లతో ముడిపడిన పరిశ్రమలు.. జపాన్‌లో నర్సింగ్, ఆతిథ్యం, ఉత్పత్తి, ట్రాన్స్‌పోర్టేషన్, హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ (హెచ్‌వీఏసీ) రంగాల్లో భారతీయులకు పుష్కలంగా అవకాశాలు ఉన్నట్టు గుర్తించారు. టర్కీ, దక్షిణాఫ్రికా, కువైట్, గయానా, కెనడా, మలేసియాలలో కూడా భారత వర్కర్లకు అవకాశాలు పెరుగుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

యూఏఈ అతిపెద్ద మార్కెట్

వివిధ దేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.. మనదేశంలో అందుబాటులో ఉన్న వర్క్‌ఫోర్స్ తదితర అంశాలపై విశ్లేషణ కోసం నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్‌లో నమోదైన డేటాను కేంద్ర కార్మికశాఖ విశ్లేషించింది. దీని ప్రకారం యూఏఈ భారత వర్కర్లకు అతిపెద్ద గమ్యస్థానంగా నిలుస్తున్నట్టు వెల్లడైంది. 2023–24లో ఇజ్రాయెల్‌లో భారత వర్కర్లకు గణనీయంగా ఉద్యోగాలు లభించాయి.

నిపుణులకు జర్మనీ ఆహ్వానం

జర్మనీలో వచ్చే ఐదేళ్లలో రెండు నుంచి మూడు లక్షల మంది భారతీయ వర్కర్లకు ఉపాధి లభించే అవకాశం ఉందని అంచనా వేశారు. జర్మనీ ఎకనమిక్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ప్రకారం 2035 నాటికి ఆ దేశంలో 70 లక్షల మంది స్కిల్డ్ వర్కర్ల కొరత ఏర్పడనుంది. ఆస్ట్రేలియాలో నర్సులు, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్లు, భవన నిర్మాణ కార్మికులు, ఫిన్లాండ్‌లో హెల్త్‌కేర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, విద్య, ఉత్పత్తి రంగాల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ దేశాల్లో ప్రస్తుతం భారతీయులకు కాంట్రాక్టు, ప్రాజెక్టు ఆధారిత ఉపాధి అధికంగా ఉంది. కానీ, ఫుల్‌టైమ్ ఉద్యోగాల కల్పనకు మనదేశం మొగ్గుచూపుతున్నట్టు కార్మికశాఖ చెబుతోంది.

క్లుప్తంగా...

నేడు ఈఏపీసెట్ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్) నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఈనెల 25 నుంచి ఈఏపీసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. సెట్‌కు సంబంధించి సమగ్ర వివరాలను నోటిఫికేషన్‌లో అధికారికంగా పొందుపరుస్తారు. రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు అమలులో ఉన్న స్థానికేతర కోటాను ఈసారి ఎత్తివేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ కూడా వచ్చింది. వీటన్నింటినీ నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారు.

సమ్మెకి దిగితే వేటే

ఆర్టిజన్ల తొలగింపునకు జెన్‌కో ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సమ్మెకు దిగే ఆర్టిజన్లను తక్షణమే ఉద్యోగాల నుంచి తొలగించాలని జెన్‌కో ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జెన్‌కో డైరెక్టర్ ఎ.అజయ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం గురువారం విద్యుత్ సౌధను ముట్టడించాలని ఆర్టిజన్లు నిర్ణయం తీసుకోవడంతో అప్రమత్తమైన జెన్‌కో ఈ మేరకు చర్యలకు ఉపక్రమించింది. విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న 22వేల మంది కార్మికులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్ల పేరుతో విద్యుత్ సంస్థల్లో విలీనం చేసుకుంది. అయితే, వారికి విద్యుత్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ఇతర ప్రయోజనాలు లభించడం లేదు.


పాస్‌పోర్టు కోసం హైదరాబాద్ వచ్చాడు

- పార్టీ మీటింగ్ పెట్టి అసహనంతో మాట్లాడుతున్నాడు
- కేసీఆర్‌పై మంత్రి పొన్నం ఫైర్



సాక్షి, హైదరాబాద్: ఎలాగూ పాస్‌పోర్టు కోసం ఫామ్‌హౌస్ నుంచి హైదరాబాద్ వచ్చాం కదా అని పనిలో పనిగా పార్టీ ఆఫీసుకెళ్లి కేసీఆర్ మీటింగ్ పెట్టాడని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఎవరైనా ఏడాదిగా ఫామ్‌హౌస్‌లో ఉంటారా? అని ప్రశ్నించారు. బుధవారం సచివాలయంలో పొన్నం విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కేసీఆర్ తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. అధికారం దరిదాపుల్లో కూడా కనిపించకపోవడంతో ఆయన అసహనంతో మాట్లాడుతున్నారని, అటు ప్రభుత్వంతో పాటు ఇటు తన పార్టీ కేడర్‌ను కూడా నిందిస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు నిజాలు మాట్లాడుతుంటే ఆయన జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కేసీఆర్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర పెద్దలను కలిసేందుకు త్వరలోనే ఢిల్లీ వెళ్తామని, కేసీఆర్‌కు బీసీలపై ప్రేమ ఉంటే తమతో కలిసి రావాలన్నారు.

జోష్ కోసమే కేసీఆర్ వ్యాఖ్యలు: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు వస్తాయంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు కేవలం ఆ పార్టీ కార్యకర్తల్లో జోష్ కోసమేనని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఉనికి లేదని, అందుకే ఫామ్‌హౌస్ నుంచి అప్పుడప్పుడు బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం చామల మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపఎన్నికలు వచ్చే అవకాశమే లేదన్నారు. నిజంగా కేసీఆర్‌కు తెలంగాణ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రతిపక్ష నాయకుడి హోదాలో అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చ జరిపేవాడని చామల పేర్కొన్నారు.

మరిన్ని వార్తలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

కాంగ్రెస్ గ్రాఫ్ డౌన్

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహణ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తదితర అంశాలపై మాట్లాడారు.

సీఎంకు పాలనపై పట్టు లేదని తేలిపోయింది

'తెలంగాణ ప్రజలకు నచ్చి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాలేదు. అధికారంలో వచ్చినా కాంగ్రెస్‌కు అచ్చి రాలేదు. మంత్రివర్గానికి, సీఎంకు నడుమ సమన్వయం లేదు. ఐఏఎస్, ఐపీఎస్‌లు అవినీతికి పాల్పడుతున్నారని సీఎం చెప్పడం ద్వారా ఆయనకు పాలనపై పట్టు లేదని తేలిపోయింది. మనం ఏటా రూ.15 వేల కోట్ల ఆదాయం పెంచుకుంటూ వచ్చి ప్రజలకు కావాల్సినవి సమకూర్చాం. కానీ గడిచిన మూడు త్రైమాసికాల్లో రూ.12 వేల కోట్ల ఆదాయాన్ని రాష్ట్రం కోల్పోయింది. ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసి ఖజానాను ఎలా నింపాలో వారికి తెలియడం లేదు..' అని కేసీఆర్ అన్నారు.

తెలంగాణ చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్‌ఎస్

'తెలంగాణ సమాజం సామాజిక, చారిత్రక అవసరాల కోసం తెలంగాణ చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్‌ఎస్ పార్టీ. అలా పురుడు పోసుకున్న బిడ్డను నలిపివేయాలని ఎన్నో కుట్రలు సాగాయి. గతం గాయాల నుంచి కోలుకుంటున్న మనం తిరిగి వలసవాద పాలకుల చేతిలో పడితే తెలంగాణ కోలుకోకుండా ఆగమయ్యే ప్రమాదముంది. తెలంగాణకు రాజకీయ అస్తిత్వం, రక్షణ కవచం బీఆర్‌ఎస్ పార్టీనే. తెలంగాణకు శాశ్వత న్యాయం జరగాలంటే ప్రజలను తిరిగి చైతన్యం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉంది..' అని బీఆర్‌ఎస్ అధినేత చెప్పారు.

7 నెలల పాటు సంస్థాగత నిర్మాణం

'ఏప్రిల్ 10 నుంచి అక్టోబర్ వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంపై పనిచేయాలి. ఏప్రిల్ 10న పార్టీ ప్రతినిధుల సభ, అదే నెల 27న బహిరంగ సభ నిర్వహిస్తాం. దీనికి సంబంధించి సబ్ కమిటీ బాధ్యతలు హరీశ్‌రావుకు అప్పగిస్తున్నాం. ఏప్రిల్ 10 నుంచి సభ్యత్వ నమోదుతో పాటు గ్రామ, వార్డు, పట్టణ, మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీల ఏర్పాటు జరుగుతుంది. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది. సంస్థాగత శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ కూడా ప్రకటిస్తాం. త్వరలో 30 మందికి పైగా కీలక నేతలతో భేటీ జరిపి అన్ని అంశాలపైనా స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తాం. సోషల్ మీడియా సహా పార్టీ అనుబంధ కమిటీలను బలోపేతం చేస్తాం..' అని కేసీఆర్ తెలిపారు.

అభిప్రాయాలు వెల్లడించిన నేతలు

సుమారు నాలుగున్నర గంటల పాటు సాగిన సమావేశంలో పార్టీ నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు కేసీఆర్ అవకాశం ఇచ్చారు. పలువురు మాజీ మంత్రులతో పాటు సీనియర్, జూనియర్ నాయకులు 29 మంది మాట్లాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, యువతతో పాటు వివిధ వర్గాలకు చేరువ కావాల్సిన అవసరం, పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కొందరు మాజీ ఎమ్మెల్యేలు క్షేత్ర స్థాయిలో చురుగ్గా పనిచేయాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాతా మధు, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రాకేశ్‌రెడ్డి, రాజా వరప్రసాద్, మూల విజయారెడ్డి, దాసరి ఉష, సత్య తదితరులు ప్రసంగించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు సహా మాజీ మంత్రులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, తదితర నేతలు హాజరయ్యారు.

కొత్త తరంలో తెలంగాణ సోయి లేనందుకే ఓటమి

'రాజకీయ పార్టీలకు అధికారమే పరమావధి. కానీ బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ప్రయోజనాలే ప్రాధాన్యత. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కొత్త తరంలో తెలంగాణ సోయి లేనందునే పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోయాం. కొత్త తరానికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ నేపథ్యం, బీఆర్‌ఎస్ పోషించిన పాత్రను వివరించాలి. తెలంగాణ చరిత్రను అర్థం చేసుకుంటే గుండె బరువెక్కుతుంది. భారతదేశంలో విలీనం తర్వాత కూడా తెలంగాణ ఒక రాష్ట్రంగా తన రాజకీయ అస్తిత్వాన్ని చాటుకోలేక పోయింది. రాజకీయంగా తెలంగాణ నాయకత్వాన్ని విస్మరించి కాంగ్రెస్ అడుగడుగునా కుట్రపూరిత రాజకీయాలు చేసింది. వలసాంధ్ర ముఖ్యమంత్రులు తెలంగాణను అన్ని విధాల నాశనం చేశారు. తెలంగాణలో నెత్తురు ఏరులై పారిన సందర్భంలో నా ఉద్యమ ప్రస్థానం ప్రారంభమైంది. తెలంగాణ జాతి ప్రస్థానంలో తలెత్తిన గాయాలు బాధలను పూర్తిగా తొలగిపోయే విధంగా, స్వేచ్ఛావాయువులు పీల్చుకునే విధంగా తెలంగాణ తనకు తాను నిలబడాలనే ఆకాంక్షతో పుట్టిందే బీఆర్‌ఎస్ పార్టీ. సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పార్టీ యంత్రాంగంతో పాటు కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, వివిధ వర్గాలను కలుపుకోవాలి. తెలంగాణ ఉద్యమ తరహాలో పార్టీ రజతోత్సవ వేడుకలు ఏడాది పొడవునా నిర్వహించాలి. తెలంగాణ చరిత్ర, బీఆర్‌ఎస్ ప్రస్థానాన్ని వివరించే డాక్యుమెంటరీలకు రూపకల్పన జరగాలి..' అని మాజీ సీఎం ఆదేశించారు.

ఏడాది పొడవునా రజతోత్సవాలు

ప్రజల పండుగలా బీఆర్‌ఎస్ 25 ఏళ్ల సంబురాలు: కేటీఆర్

- వచ్చే ఏడాది ఏప్రిల్ 27 వరకు వరుస కార్యక్రమాలు
- ఏప్రిల్ 10న ప్రతినిధుల సభ, 27న భారీ బహిరంగ సభ



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, సురేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ఆవిర్భవించిన బీఆర్‌ఎస్ 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఏడాదిపాటు రజతోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. రజతోత్సవాలను కేవలం పార్టీ కార్యక్రమంగా కాకుండా ప్రజల ఉత్సవంలా పండుగ వాతావరణంలో జరుపుతామన్నారు. రజతోత్సవాల నిర్వహణ కోసం ఉద్యమకారులు, సీనియర్ నాయకులతో కమిటీలు ఏర్పాటు చేసి వారం రోజుల్లో ప్రకటిస్తామన్నారు. ఏప్రిల్ 9 లేదా 10వ తేదీన హైదరాబాద్‌లో పార్టీ ప్రతినిధుల సభ నిర్వహిస్తామని, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినం సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. బహిరంగ సభ వేదికను త్వరలో ఖరారు చేసి వివరాలు ప్రకటిస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశం వివరాలను కేటీఆర్ మీడియాకు వెల్లడించారు. 'పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ సహా 29 మంది నేతలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఇక్కడి ప్రజల సామాజిక స్థితిగతులు మార్చడం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే సాధ్యమని కేసీఆర్ భావించారు. అనేక త్యాగాలు, పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం సాధించిన తీరును, నేపథ్యాన్ని కేసీఆర్ వివరించారు. బీఆర్‌ఎస్‌కు అధికారమే పరమావధి కాదు, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటమే ముఖ్యమని సమావేశం అభిప్రాయపడింది. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారనేందుకు ఆయన జన్మదినం సందర్భంగా ఎర్రవల్లి నివాసానికి తండోపతండాలుగా ప్రజలు వెళ్లడమే నిదర్శనం' అని పేర్కొన్నారు.

ఏడాదిలోనే సంక్షోభం: 'కాంగ్రెస్ ఏడాది పాలనలోనే తెలంగాణలో సంక్షోభం తలెత్తి రైతులు, గురుకుల విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తెలంగాణ కోసం త్యాగాలు వృథా కానీయకుండా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని కేసీఆర్ ఆదేశించారు. ఓవైపు రజతోత్సవ సంబరాలను నిర్వహిస్తూనే సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం, పార్టీ కమిటీలు, ప్రజా పోరాటాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలపైనా పనిచేస్తాం. ఏప్రిల్ 27 తర్వాత సభ్యత్వ నమోదు ప్రారంభించి గ్రామ, వార్డు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల ఏర్పాటుతో పాటు అక్టోబర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నిక ఉంటుంది. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలతో చెలగాటమాడతోంది. దీనిపై పార్టీ తరఫున కార్యాచరణ రూపొందించి పోరాటం చేస్తాం. కాంగ్రెస్, బీజేపీకి చెరో ఎనిమిది మంది ఎంపీలున్నా బడ్జెట్‌లో రాష్ట్రానికి నయాపైసా దక్కలేదు. ఎన్నికల అఫిడవిట్‌లో అన్ని విషయాలున్నా కేసీఆర్, కేటీఆర్ సర్వేలో పాల్గొనలేదని సీఎం అంటున్నాడు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఎలా సాధ్యమో ప్రభుత్వం వివరించాలని సమావేశంలో చర్చ జరిగింది' అని కేటీఆర్ వెల్లడించారు.

రేవంత్‌కు రూ.4.20 లక్షల కోట్ల జరిమానా వేసినా తప్పులేదు

'ఎక్స్' వేదికగా కేటీఆర్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: సింగపూర్ పార్లమెంటులో రెండు అబద్ధాలు చెప్పిన ఎంపీకి 14 వేల డాలర్ల జరిమానా విధించిన వార్తలను ఉటంకిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో రేవంత్ ప్రభుత్వంపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు, రాష్ట్ర అప్పులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రైతు రుణమాఫీ, రైతుబంధు, రూ.4 వేల పింఛన్లు, మహిళలకు రూ.2,500 అంటూ 420 అబద్ధాలు చెప్పిన ముసలి నక్క కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి రూ.4.20 లక్షల కోట్ల జరిమానా వేసినా తప్పులేదు' అని పేర్కొన్నారు.

పెండింగ్‌లో 'ప్రాధాన్యం'

ఆర్థిక బిల్లుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ కొత్త సూత్రం

- 15 రోజులకోసారి సీఎం, డిప్యూటీ సీఎంల భేటీ?
- టోకెన్లు వచ్చి పెండింగ్‌లో ఉన్న బీఆర్‌ఎస్ హయాంలోని బిల్లుల చెల్లింపుపై చర్చ


సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యం పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బిల్లుల మంజూరు క్రమంలో వస్తున్న అపవాదులు, ప్రతిపక్షాలు మోపుతున్న నిందలకు చెక్ పెట్టేలా అందుబాటులో ఉన్న నిధులను బట్టి ప్రాధాన్యతల వారీగా మంజూరు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు ప్రతి 15 రోజులకోసారి సమావేశం కావాలని, ఈ బిల్లులపై చర్చించి అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాలని నిర్ణయించినట్టు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకుగాను టోకెన్లు వచ్చి పెండింగ్‌లో ఉన్న బిల్లుల గురించి ఈ సమావేశంలో చర్చించి తగిన విధంగా నిర్ణయాలు తీసుకుంటారని తెలుస్తోంది. ప్రతినెలా రాష్ట్ర ఖజానాపై పెద్దభారం పడకుండా, తక్కువ నిధులతో ఎక్కువమందికి ప్రయోజనం కలిగే విధంగా ఉండే బిల్లులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలల్లో పుస్తకాలు, క్రీడా పరికరాల సరఫరా, మెడికల్ బిల్లులు, ఆరోగ్యశ్రీ ట్రస్టు, సర్పంచ్‌లకు రూ.5 లక్షల లోపు బిల్లులను వీలున్నంత త్వరగా క్లియర్ చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. తద్వారా ఇష్టారాజ్యంగా బిల్లులు ఇస్తున్నారన్న విమర్శలకు చెక్ పెట్టాలనేది అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కాంగ్రెస్ పార్టీ పెద్దల ఉద్దేశమనే చర్చ ప్రభుత్వవర్గాల్లో జరుగుతోంది.

అంతర్గత విమర్శలకూ తావు లేకుండా

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంలో భాగమైన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బిల్లుల మంజూరులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాము చెప్పినా బిల్లులు రావడం లేదనే అసంతృప్తితో వారున్నారనేది కాంగ్రెస్ పార్టీలో బహిరంగ రహస్యమే. ఈ అసంతృప్తికి కూడా చెక్ పెట్టాలని కాంగ్రెస్ అధిష్టానం సూచించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీలో అంతర్గత విమర్శలకు కూడా తావులేకుండా పెండింగ్ బిల్లుల మంజూరులో ప్రాధాన్యం పాటించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ ప్రాధాన్యతల ప్రకారం అడిగే బిల్లులను కూడా వీలున్నంత త్వరగా క్లియర్ చేసేలా 15 రోజులకోసారి జరిగే సీఎం, డిప్యూటీ సీఎంల భేటీలో నిర్ణయాలు తీసుకుంటారని సమాచారం.

విద్యుత్ డిమాండ్‌లో కొత్త రికార్డు

తొలిసారి 16 వేల మెగావాట్లను అధిగమించిన డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో కొత్త రికార్డు నమోదైంది. బుధవారం ఉదయం 7.55 గంటలకు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 16,058 మెగావాట్లకు పెరిగింది. ఈనెల 10న ఏర్పడిన 15,998 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ రికార్డును తాజాగా రాష్ట్రం అధిగమించింది. రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 16 వేల మెగావాట్లను దాటడం ఇదే తొలిసారి. వేసవి ప్రారంభంలోనే విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుండటంతో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలతో పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

మూడు బిల్లులపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

మార్చి 1 నుంచి 5వ తేదీ లోపు నిర్వహణ

- అసెంబ్లీ ఆమోదం తర్వాత మూడింటిని కేంద్ర ఆమోదానికి పంపనున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు, ఎస్సీల వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీలోపు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ప్రత్యేక భేటీలో బీసీలకు స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను, ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రతిపాదించనుంది. అసెంబ్లీలో చర్చ అనంతరం ఈ బిల్లులను ఆమోదిస్తారు. ఆపై వీటి ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. ఎస్సీల వర్గీకరణకు సంబంధించి ఏకసభ్య కమిషన్ గడువు పొడిగించిన నేపథ్యంలో ఆ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బిల్లును రూపొందించనున్నారు. ఈ బిల్లు అసెంబ్లీ ఆమోదం అనంతరం చట్టంగా రూపాంతరం చెందనుంది. దీంతోపాటు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను కూడా అసెంబ్లీలో పెట్టి ఆమోదం తీసుకోనుంది. ఈ మూడు బిల్లుల ముసాయిదా రూపకల్పనలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారని సమాచారం. త్వరలోనే జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మూడు ముసాయిదా చట్టాలకు తుదిరూపు లభించనుంది.

బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల మూడోవారంలో !

2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం బడ్జెట్ సమావేశాలను వచ్చే నెల మూడో వారంలో నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఏడాది మార్చి 31లోపు బడ్జెట్‌కు అసెంబ్లీ ఆమోదం తప్పనిసరి కావడంతో మూడో వారంలో బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

పాస్‌పోర్టు కార్యాలయానికి కేసీఆర్



పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చిన కేసీఆర్

రాంగోపాల్‌పేట్: మాజీ సీఎం కేసీఆర్ బుధవారం ఉదయం సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లారు. సతీమణి శోభతో కలిసి వెళ్లిన ఆయన సీఎంగా ఉన్న సమయంలో ఉన్న డిప్లొమాటిక్ పాస్‌పోర్టును కార్యాలయంలో అందించి సాధారణ పాస్‌పోర్టు రెన్యువల్ చేసుకున్నారు. అలాగే కేసీఆర్ సతీమణి పాస్‌పోర్టు కూడా రెన్యువల్ చేసుకున్నారు. ఆర్పీవో స్నేహజ కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కూడా ఉన్నారు.

మేడమ్ వచ్చాకేనా!

పీసీసీ కొత్త కార్యవర్గం ప్రకటన వాయిదా

- మీనాక్షి వచ్చిన తర్వాతే తుది జాబితా ఖరారు
- లీకైన పీసీసీ ఉపాధ్యక్షుల జాబితా
- ఇతర పార్టీల నుంచి వచ్చినవారికే అధిక పదవులు



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ కార్యవర్గ ప్రకటన తాత్కాలికంగా వాయిదా పడినట్లు తెలిసింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా తమిళనాడుకు చెందిన సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ నియమితులైన నేపథ్యంలో ఆమె రాష్ట్రానికి వచ్చి బాధ్యతలు స్వీకరించిన తర్వాతే ఈ ప్రకటన ఉంటుందని గాంధీభవన్ వర్గాల సమాచారం. వాస్తవానికి పీసీసీ కార్యవర్గాన్ని ఇప్పటికే ప్రకటించాల్సి ఉంది. గత నెలలో కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో వీలున్నంత త్వరగా పీసీసీ పదవులు భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ నెల మొదటి వారంలో జరిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో కూడా రెండుమూడు రోజుల్లో కార్యవర్గాన్ని ప్రకటిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. అయితే, ఈ జాబితా ఖరారవుతున్న సమయంలోనే రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్‌ని మార్చటంతో జాబితా ప్రకటనను వాయిదా వేశారని తెలుస్తోంది. కాగా, మీనాక్షి నటరాజన్ ఈ నెల 23న రాష్ట్రానికి వస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

ఉపాధ్యక్షుల జాబితా లీక్: పీసీసీ ఉపాధ్యక్షులుగా ఎంపికచేసినవారి జాబితా లీకైంది. మొత్తం 8 మందిని ఈ జాబితాలో ఫైనల్ చేశారని, అందులో ఐదుగురు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారేనని చర్చ జరుగుతోంది. మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఎస్.వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, నాయిని రాజేందర్‌రెడ్డి, ఫిరోజ్‌ఖాన్, ఫహీం ఖురేషీ, నీలం మధు, టి.కుమార్‌రావును పార్టీ ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. లీకైన ఈ జాబితాలో ఒక్క బీసీ వ్యక్తి పేరు మాత్రమే ఉండటంపై కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ చైర్మన్‌కు మాతృవియోగం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ చైర్మన్ కళ్లం సతీష్‌రెడ్డి మాతృమూర్తి కళ్లం సామ్రాజ్యం (79) బుధవారం కన్నుమూశారు. రెడ్డీస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్ అంజిరెడ్డి సతీమణి అయిన సామ్రాజ్యం హైదరాబాద్ లయన్స్ క్లబ్ మెంబర్‌గా పనిచేశారు. ఆమె రక్తదానంతోపాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.



మౌనంగా ఉండగలిగే సత్తువ ఉన్నవాడికే,
సత్తువ ఉన్న మాటలు చెప్పగలిగే శక్తి ఉంటుంది.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 20 ఫిబ్రవరి 2025

దీనావస్థలో యూరప్ దేశాలు

కళ్లముందు ప్రమాదకర సంకేతాలు కనబడుతున్నా అమెరికాను గుడ్డిగా అనుసరిస్తూ పోవటం అలవాటు చేసుకున్న యూరప్‌కి డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక వరస షాక్‌లు తప్పడం లేదు. గతవారం జర్మనీలో జరిగిన మ్యూనిక్ భద్రతా సదస్సుకొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'వాక్ స్వాతంత్ర్యానికీ, ప్రజాస్వామ్యానికీ మీవల్లే ముప్పు ముంచుకొస్తున్నద'ని యూరప్ దేశాలపై విరుచుకుపడ్డారు. దాన్నుంచి తేరుకోకముందే ఆ దేశాల ప్రమేయం లేకుండా ఉక్రెయిన్ యుద్ధం నిలుపుదలపై రష్యాతో సౌదీ అరేబియాలోని రియాద్‌లో అమెరికా భేటీ అయింది. యూరప్ వరకూ ఎందుకు... రష్యాతో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధంలో శిథిలావస్థకు చేరిన ఉక్రెయిన్‌నే ఆ చర్చలకు ఆహ్వానించలేదు. యుద్ధం ఆపడానికి అవకాశాలున్నాయా, ఆ విషయంలో తొలి అడుగువేయటం అసలు సాధ్యమేనా అనే అంశాలను నిర్ధారించుకోవటానికే రియాద్ సమావేశం జరిగిందని అమెరికా విదేశాంగశాఖ సంజాయిషీ ఇస్తున్నా దాని వ్యవహారశైలి యూరప్ దేశాలకు మింగుడు పడటం లేదు. ఆ విషయంలో నిజంగా చిత్తశుద్ధి వుంటే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడటానికి ముందు ట్రంప్ యూరప్ దేశాల అధినేతలను సంప్రదించేవారు.

దాదాపు ఎనభైయ్యేళ్లుగా యూరప్ దేశాలన్నీ అమెరికా అడుగుజాడల్లో నడిచాయి. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ సైన్యాన్ని మట్టికరిపించిన సోవియెట్ సేనలు తూర్పు యూరప్ దేశాల తర్వాత తమవైపే చొచ్చుకొస్తాయని, తాము బలికావటం ఖాయమని పశ్చిమ యూరప్ దేశాలు వణికిపోయాయి. నాటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ దీన్ని చక్కగా వినియోగించుకుని ఉత్తర అమెరికా ఖండంలో తన పొరుగు దేశమైన కెనడాను కలుపుకొని పశ్చిమ యూరప్ దేశాలతో జత కట్టి పటిష్టమైన సైనిక కూటమి నాటోకు అంకురార్పణ చేశారు. అమెరికా–సోవియెట్‌ల మధ్య సాగే పోటీలో యూరప్ దేశాలు అవసరం లేకున్నా తలదూర్చాయి. ఆర్థికవ్యవస్థలు అనుమతించక పోయినా తమ తమ జీడీపీల్లో రెండు శాతం నాటో కోసం వ్యయం చేశాయి. యూరప్ భూభాగంలో అణ్వాయుధాల మోహరింపు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, మారణాయుధాలు జోరందుకున్నాయి. యూరప్ దేశాలకు ఆనాటి సోవియెట్ నుంచి లేదా ప్రస్తుత రష్యా నుంచి ఎన్నడూ ముప్పు కలగలేదుగానీ... నాటోవల్ల లిబియా, సిరియా, అఫ్గానిస్తాన్, సూడాన్, సోమాలియా తదితర దేశాలు అస్థిరత్వంలోకి జారుకుని ఉగ్రవాదం వేళ్లూనుకుంది. సిరియావంటి దేశాల్లో ప్రభుత్వాలను కూలదోసేందుకు విచ్చలవిడిగా ఆయుధాలందించటంవల్ల ఐసిస్ అనే భయంకర ఉగ్రవాద సంస్థ ఆవిర్భవించింది. ఉక్రెయిన్ దురాక్రమణకు రష్యాను రెచ్చగొట్టింది కూడా యూరప్ దేశాలే. 2013లో అమెరికా ప్రోద్బలంతో ఉక్రెయిన్‌తో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకోవటంతోపాటు ఐఎంఎఫ్ రుణం పొందేందుకు సహకరించింది ఈయూ దేశాల కూటమే. అయితే ఐఎంఎఫ్ కఠిన షరతులను తిరస్కరించి రష్యా ఇచ్చే 1,500 కోట్ల డాలర్ల రుణం తీసుకోవటానికి అప్పటి ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యనుకోవిచ్ నిర్ణయించటంతో దేశంలో ప్రజా ఉద్యమం పేరిట తిరుగుబాటుకు అంకురార్పణచేసి అస్థిరపరచటంలో అమెరికా, ఈయూల పాత్ర వుంది. ఈ పరిణామాలే పుతిన్‌ను క్రిమియా ఆక్రమణకు పురిగొల్పాయి. ఎన్నికల్లో చట్టబద్ధంగా గెలిచిన యనుకోవిచ్‌ను ఈ వంక చూపి 2019లో కూలదోసి, సినీ నటుడు జెలెన్‌స్కీని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం, పర్యవసానంగా మూడేళ్లక్రితం పుతిన్ ఉక్రెయిన్‌పై దండెత్తటం వర్తమాన చరిత్ర.

యుద్ధంపై తమ ప్రమేయం లేని చర్చల్ని గుర్తించబోనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యూరప్ దేశాలకు కనీసం ఆ మాత్రం ధైర్యం కూడా లేదు. తాజా పరిణామాల నేపథ్యంలో ఏం చేయాలో చర్చించటానికి ఫ్రాన్స్ చొరవతో సోమవారం పారిస్‌లో జరిగిన అత్యవసర భేటీకి అరడజను దేశాలు హాజరయ్యాయి. అవి కూడా కింకర్తవ్య విచికిత్సలో పడ్డాయి. ఉక్రెయిన్‌కు శాంతి సేనలను పంపటానికి తాను సిద్ధమని ప్రకటించిన బ్రిటన్... ఆ వెంటనే 'అమెరికా అందుకు అనుమతిస్తేనే' అని ముక్తాయించింది. ఈలోగా జర్మనీ, పోలాండ్, స్పెయిన్‌లు దాన్ని అసందర్భ ప్రతిపాదనగా కొట్టిపారేశాయి. అమెరికా తాజా వైఖరితో యూరప్ స్వీయరక్షణ కోసం సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న ప్రతిపాదనపై సైతం అనుకూల స్వరాలు వినబడటంలేదు. ట్రంప్ ఆగమనం తర్వాత అమెరికాతో యూరప్ దేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్న అభిప్రాయం అందరిలో ఏర్పడింది. దీనికితోడు ట్రంప్ అనుచరగణం యూరప్‌లో తీవ్ర మితవాద పక్షాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం వివిధ దేశాధినేతలకు ఉంది.

ట్రంప్ వైఖరి ఎలా వుంటుందన్న అంశంలో ఆయన తొలి ఏలుబడిలో యూరప్ దేశాలకు తగినంత అవగాహన వచ్చింది. కానీ దశాబ్దాల తరబడి అమెరికా అనుసరిస్తున్న విధానాలను రెండో దఫాలో మెరుపువేగంతో ఆయన తిరగరాస్తారని ఆ దేశాలు ఊహించలేదు. ఈసారి ట్రంప్ వెనకున్న ఎలాన్ మస్క్, స్టీవ్ బానన్, మార్కో రుబియో తదితరులతోపాటు సమర్థుడైన దూతగా పేరున్న విట్‌కాఫ్‌లే అందుకు కారణం కావొచ్చు. పర్యవసానంగా ట్రంప్ రంగప్రవేశం చేసి నెల తిరగకుండానే యూరప్ దేశాలకు ప్రపంచం తలకిందులైన భావన కలిగింది. స్వతంత్రంగా ఎదగటానికి ప్రయత్నించక కీలుబొమ్మల్లా వ్యవహరించిన ఆ దేశాలు ఇప్పటికైనా వివేకం తెచ్చుకోవాలి. సొంత ఆలోచనతో, స్వీయప్రయోజనాల కోసం పనిచేయటం నేర్చుకోవాలి. రోజులు ఎప్పుడూ ఒకేలా వుండవని గ్రహించాలి.

ఉచితమా? అనుచితమా?

విశ్లేషణ



టంకశాల అశోక్

ఉచిత పథకాల గురించి సుప్రీం కోర్టు ఈనెల 12న వ్యాఖ్యానించటంతో ఈ విషయం మరొకమారు చర్చలోకి వచ్చింది. ఈ ధోరణులకు మూలం ఎక్కడున్న దనేది ఒక ప్రశ్న అయితే, అందుకు అసలు పరిష్కారం ఉందా అన్నది రెండవ ప్రశ్న.

ఇండియా మధ్యయుగాల కాలం నుంచి ఫ్యూడల్ వ్యవస్థలలో, తర్వాత దానితో పాటు కొన్ని వందల సంవత్సరాలపాటు వలస పాలనలో మగ్గిపోయి అన్ని విధాలుగా వెనుకబడింది. అట్లాగని దేశంలో సహజ వనరులకు, కష్టించి పనిచేసే మానవ సంపదకు కొరత లేదు. ఏవో కొన్నిచోట్ల తప్ప, గ్రామీణ ఆర్థికతపై, అవసరాలపై ఆధారపడి సాగే సకల వృత్తుల వారున్నారు. అయినప్పటికీ, 1947లో దేశానికి స్వాతంత్ర్యం సాధించుకునే నాటికి, అత్యధిక శాతం ప్రజలు దయనీయంగా వెనుకబడి ఉన్నారు. తమ స్థితిగతుల పట్ల, అందుకు కారణాలపట్ల, ప్రజలలో చైతన్యానికి ఎంత మాత్రం కొరత లేదు. వాస్తవానికి అటువంటి చైతన్యాలు గలవారు అనేక రూపాలలో సాగించిన ఉద్యమాలూ, తిరుగుబాట్లూ, 1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికీ, 1885 నుంచి కాంగ్రెస్ నాయకత్వాన స్వాతంత్ర్యోద్యమానికీ భూమికగా పనిచేశాయి.

ప్రణాళికలు సరిగ్గా అమలైవుంటే...

ఈ నేపథ్యాన్నంతా ఇంతగా చెప్పుకోవటానికి కారణాలున్నాయి. వనరులు, ప్రజల చైతన్యాలు గల దేశంలో గత 75 సంవత్సరాల స్వాతంత్ర్య కాలంలో తగిన విధానాలు, వాటి అమలు ఉండిన పక్షంలో ఈరోజు అసలు ఉచితాల అవసరమే ఏర్పడేది కాదు. ఎన్నికలకు ముందు ఎందుకీ ఉచితాలని, అందువల్ల ప్రజలు పనిచేసేందుకు ఇష్టపడటం లేదని, ఆ విధంగా పరాన్నజీవుల తరగతి ఒకటి సృష్టి అవుతున్నదని సాక్షాత్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించవలసిన పరిస్థితి వచ్చేది కాదు.

ఇక్కడ కొన్ని విషయాలు చెప్పుకోవాలి. దేశం పేదరికం నుంచి బయటపడి అభివృద్ధి సాధించేందుకు చేయవలసిందేమిటన్న అవగాహన స్వాతంత్ర్యోద్యమ నాయకులకు 1947 కన్న ముందే స్పష్టంగా ఉంది. వ్యవసాయిక, పారిశ్రామిక, వాణిజ్య రంగాలన్నింటికి సంబంధించి వారంతా బాగా చదివి అనేక దేశాలను, అక్కడి ఆలోచనా విధానాలను, అభివృద్ధి విధానాల తీరుతెన్నులను గమనించినవారు. వాటిని భారతదేశ పరిస్థితులకు ఏ విధంగా అన్వయించాలో అర్థం చేసుకున్నవారు. ఇటువంటి నేపథ్యాల వల్లనే వారి మేధస్సుల నుంచి, సుదీర్ఘ చర్చల నుండి, అప్పటికే చిరకాలంగా ప్రజాస్వామికంగా ఉండిన దేశాలకు మించి, ప్రపంచంలోనే ఎక్కడా లేనంత గొప్ప రాజ్యాంగం రూపుదిద్దుకున్నది. దేశ స్వాతంత్ర్యోద్యమం వలెనే రాజ్యాంగం కూడా ఆసియా, ఆఫ్రికాలలోని ఇతర వలస వ్యతిరేక ఉద్యమాలకు ఆదర్శప్రాయమైంది. ఆ రాజ్యాంగానికి అనుగుణంగా తర్వాత కాలంలో చట్టాలు, ప్రణాళికలు, సంక్షేమ పథకాలు రూపు తీసుకున్నాయి. అవి సక్రమంగా అమలై ఉండినట్లయితే ఈ చర్చలకు ఆస్కారమే ఏర్పడేది కాదు.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి పేద స్థితిగతులను బట్టి సంక్షేమం తప్పనిసరి. దేశం, దానితోపాటు వారూ అభివృద్ధి చెందటం రాత్రికి రాత్రి జరిగేది కాదు. సంక్షేమ దృక్పథం పారిశ్రామిక విప్లవం నుంచి యూరప్‌లో, ఇంకా చెప్పాలంటే మన దేశంలోనూ మొదటి నుంచి ధార్మిక భావనలలో భాగంగా ఉన్నదే. అయితే, ఆధునిక ప్రజాస్వామిక, ఆర్థిక వ్యవస్థలు ఏర్పడిన తర్వాత, సకల జనుల అభివృద్ధి క్రమంలో, ఆ పని సవ్యంగా జరిగినట్లయితే, సంక్షేమ చర్యల అవసరం క్రమంగా తగ్గిపోవాలి. పేదలు తమ కాళ్లపై తాము నిలబడగలగాలి. అదే ప్రభుత్వం లక్ష్యమై, దాని విధానాలు, ఆచరణలు అందుకు దోహదం చేయాలి. ఆ పని జరగనపుడు అంతా అస్తవ్యస్తమవుతుంది. ఈ పరిస్థితుల నుంచి పుట్టుకు వచ్చేదే పాప్యులిజం. సంక్షేమం కాస్తా పాప్యులిజంగా లేదా జంక్ వెల్ఫేర్‌గా మారటం.

అభివృద్ధి మార్గం

స్వాతంత్ర్య సమయానికి దేశ పరిస్థితులు ఏమిటో స్పష్టంగా తెలిసిన నాయకులు అందుకు పరిష్కార మార్గాలను కూడా అన్వేషించినట్లు పైన చెప్పుకున్నాము. వారి అవగాహనలు, అన్వేషణలు అంతకుముందే ఉండినట్లు 1947కు ముందు కాంగ్రెస్ మహాసభల ఆర్థిక సంబంధ తీర్మానాలను, 1935 నాటి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్ ప్రకారం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాల చర్యలను పరిశీలించినట్లయితే అర్థమవుతుంది. అటువంటపుడు 1947 తర్వాత, 1951–52 నాటి మొదటి ఎన్నికల వెనుక జరిగిందేమిటి? పరిస్థితులను మార్చేందుకు నెహ్రూ ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన చట్టాలు చేసింది. వాటిలో భూసంస్కరణలు, గ్రామ పంచాయితీ వ్యవస్థ, సహకార సంఘాల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు మొదలైనవి ఉన్నాయి. ఇవి అమలైనట్లయితే గ్రామీణ భారతంలో పేదలకు భూములు లభించటం, పంచాయితీలలో, సహకార సంఘాల ద్వారా లభించే వాటిలో వారికి అవకాశాలు, రిజర్వేషన్ల ద్వారా విద్యా – ఉద్యోగాలు, అంతిమంగా ఫ్యూడల్ శక్తుల పట్టు క్రమంగా సడలి పేద ప్రజల అభ్యున్నతి వంటివి జరుగుతాయి. పలు దేశాలలో భూసంస్కరణలు ఇటువంటి ఫలితాలను ఇవ్వటమే గాక, వ్యవసాయ రంగంలో సంపదల సృష్టి జరిగి అది పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడిగా ఉపయోగ పడింది. భారతదేశంలో అటు వంటి క్రమం మొదలై సాగి ఉంటే, సంక్షేమం ఉచితాలుగా, ఉచితాలు ఊబిగా మారి ఉండేవి కావు. నిజానికి చాలా కాలం వరకు సంక్షేమం కూడా సరిగా అమలు కాలేదు. కనుక ఇదంతా కేవలం స్వయంకృతం.

ప్రహసన ప్రాయంగా...

అదట్లుంచితే, తొలి దశలో రూపొందిన ఈ గొప్ప ప్రణాళికలు ఎందువల్ల విఫలమైనట్లు? సూటిగా చెప్పాలంటే, కాంగ్రెస్‌లో స్వాతంత్ర్యోద్యోమ కాలం నుంచే బలంగా ఉండిన ఫ్యూడల్ వర్గాలు, తర్వాత ఆ పార్టీలో చేరిన మాజీ రాజసంస్థానాలవారు, గొప్పగా కాకున్నా ఒక మేరకు ఉండిన పారిశ్రామిక వర్గాలు కలిసి, అధికార యంత్రాంగాన్ని తమకు విధేయులుగా మార్చుకుని, తమ ప్రయోజనాల కోసం అన్నింటినీ కుంటుపరిచారు. నెహ్రూ నిస్సహాయునిగా మిగిలారు. అందుకే ఏ ఒక్కటీ సవ్యంగా అమలుకాక, స్వాతంత్ర్య ఫలితాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తుండిన పేదలు, మధ్య తరగతి వర్గాలను తీవ్రంగా నిరాశపరచింది. దాని పర్యవసానంగానే 1957 ఎన్నికలలో కాంగ్రెస్ కొన్ని ముఖ్యమైన రాష్ట్రాలలో ఓడటం, 1960ల మధ్యకు వచ్చేసరికి వివిధ తరగతుల ఆందోళనలు, 1967లో కాంగ్రెస్‌ను 9 రాష్ట్రాలలో ఓడించి సంయుక్త విధాయక్ దళ్ ప్రభుత్వాల ఏర్పాటు, 1969 నుంచి నక్సలైట్ ఉద్యమం వంటివి వరుసగా జరుగుతూ వచ్చాయి. భూసంస్కరణలు, పంచాయితీరాజ్ వ్యవస్థ, సహకార సంఘాలు, రిజర్వేషన్ల అమలు ప్రహసనంగా మిగిలాయి.

ఇందుకు ప్రజలను నిందించటంగానీ, వారు ఉచితాల కారణంగా పనులకు వెళ్లటం లేదనటంగాని పూర్తిగా నిర్హేతుకమైనది. మారుతున్న పరిస్థితులలో వారికి నిత్య జీవిత వ్యయం, ఇతర అవసరాల ఖర్చు చాలా పెరుగుతున్నాయి. కేవలం ఉచితాలు ఎంత మాత్రం సరిపోవు. ఉచితాల ఊబికి ఏకైక పరిష్కారం ప్రభుత్వాలు, పార్టీలు తామే చేసిన రాజ్యాంగాన్ని, చట్టాలను నిజాయితీగా అమలు పరచటం. పేదలు పెట్టుబడిదారీ వ్యవస్థ కోసం సరిగా పని చేయాలన్నా, తిరుగుబాట్లు చేయవద్దనుకున్నా వారికి సంక్షేమ పథకాలు అవసరమని సిద్ధాంతీకరించి సవ్యంగా అమలు చేసిన బ్రిటిష్ వ్యవస్థను, జర్మన్ నియంత బిస్మార్క్‌ను మనం ఒకసారి చదువుకుంటే ఉపయోగపడుతుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు



- వనరులు, ప్రజల చైతన్యాలు గల దేశంలో గత 75 సంవత్సరాల స్వాతంత్ర్య కాలంలో తగిన విధానాలు, వాటి అమలుండిన పక్షంలో ఈరోజు అసలు ఉచితాల అవసరమే ఏర్పడేది కాదు.
- ఆధునిక ప్రజాస్వామిక, ఆర్థిక వ్యవస్థలు ఏర్పడిన తర్వాత, సకల జనుల అభివృద్ధి క్రమంలో, ఆ పని సవ్యంగా జరిగినట్లయితే, సంక్షేమ చర్యల అవసరం క్రమంగా తగ్గిపోవాలి. పేదలు తమ కాళ్లపై తాము నిలబడగలగాలి. ఆ పని జరగనపుడు అంతా అస్తవ్యస్తమవుతుంది.
- పలు దేశాలలో భూసంస్కరణలు మంచి ఫలితాలను ఇవ్వటమే గాక, వ్యవసాయ రంగంలో సంపదల సృష్టి జరిగి అది పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడిగా ఉపయోగపడింది.

సోషల్ మీడియా

జై శివాజీ! జై భవానీ!



ఇవ్వాళ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి (ఫిబ్రవరి 19). రాజకీయ కారణాల కోసం చరిత్రను కావాల్సిన మేరకు వాడుకున్న కాలంలో ఒక ఆసక్తికర అంశం: శివాజీ సైన్యంలో 13 మంది ముఖ్యమైన ముస్లిం కమాండర్లు ఉండేవాళ్లు. సిద్ధి హిలాల్, దౌలత్ ఖాన్, ఇబ్రహీమ్ ఖాన్, ఖాజీ హైదర్, సిద్ధి ఇబ్రహీం, సిద్ధి వాహ్వా, నూర్‌ఖాన్ బేగ్, షమా ఖాన్, హుస్సేన్ ఖాన్ మిర్యానీ, సిద్ధి మిస్త్రీ, సుల్తాన్ ఖాన్, దావూద్ ఖాన్, మదారీ మెహెతర్. మొఘలుల మీద సాహసోపేతమైన పోరు సలిపాడు శివాజీ. అయినా తన రాజ్యంలో మత సామరస్యత చెడనివ్వలేదు. జై శివాజీ! జై భవానీ!

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

మేళా గమనింపులు



కుంభమేళాలో కొన్ని పరిశీలనలు: 1. విమల్ పాన్ మసాలా అనేది ఇండియాలో నంబర్‌వన్ లగేజీ బ్యాగు. 2. కుంభమేళాలో తప్పిపోయి దొరికిన వాళ్లతో లౌడ్‌స్పీకర్ 24 గంటలూ మోగుతూనే ఉంది. 3. చూస్తుంటే ధార్మిక ప్రయాణాలను బిహారీలు ఎక్కువ ఇష్టపడతారు.

– శ్రుతీ చతుర్వేది, ఆంట్రప్రెన్యూర్

స్నేహ హస్తం



విద్వేషంలో ఒక మంచి విషయం. గత శుక్రవారం యాభై మంది పాలస్తీనియన్లు, ఇజ్రాయెలీలు కలిసి బెత్లెహాం దగ్గరి బత్తీర్ గ్రామంలో ఆలివ్ మొక్కలు నాటారు.

– ఇహాబ్ హసన్ పాలస్తీనా యాక్టివిస్ట్

డచ్ కోణం



ఈ ఏడాది నా డిస్కవరీలో నాకు బాగా నచ్చింది, 'డచ్ యాంగిల్' అని గూగుల్ చేస్తే ఏం వస్తుందో తెలియడం. మీరూ ప్రయత్నించండి! (అది సినిమాల్లో ముఖ్యమైన కెమెరా కోణం.)

– శ్రేయా ధన్వంతరి, నటి

పాడు సమాజం



అసభ్యత కళలా, అనైతికత భావస్వేచ్ఛలా చెల్లిపోతున్నదంటే, ఆ సమాజం పాడైపోయిందని అర్థం.

– స్వామి సమర్పణానంద, ఆధ్యాత్మిక గురువు

ఇన్‌బాక్స్

సామాజిక న్యాయం కావాలి!

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ పిలుపు మేరకు 2009 నుంచి ఫిబ్రవరి 20వ తేదీన 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవా'న్ని జరుపుతున్నారు. సమాజాల మధ్య సంఘీభావం, సామరస్యం, సమాన అవకాశాలను ప్రోత్సహించడానికీ; పేదరికం, నిరుద్యోగాన్ని తొలగించవలసిన ప్రాముఖ్యాన్ని గుర్తించడం దీని వెనుక ఉన్న లక్ష్యం. ఈ ఏడాది ఉత్సవం సందర్భంగా... విద్యార్థులకు పేదరికం, ప్రపంచ పౌరసత్వం, మానవ హక్కులు, స్థిరమైన అభివృద్ధి వంటి సామాజిక న్యాయ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

జాతి, లింగ, వయస్సు, లైంగిక ధోరణి, మతం, జాతీయత, విద్య, మానసిక లేదా శారీరక సామర్థ్యం వంటివాటిలో పక్షపాతం వల్ల ఈ అసమానతలు ఉత్పన్నమవుతాయి. సామాజిక న్యాయం లేక పోవడానికి గల కారణాలలో వలసవాదం, బానిసత్వం, లేదా అణచివేత ప్రభుత్వాలకు మద్దతు, ఆర్థిక అధికార దుర్వినియోగం, జాత్యహంకారం, ఆర్థిక అసమానత, వర్గ వివక్ష ముఖ్యమైనవి. 2024 నాటికి, సామాజిక న్యాయం అందించడంలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్న దేశాలు: స్విట్జర్లాండ్, న్యూజిలాండ్, డెన్మార్క్, లక్సెంబర్గ్, ఐర్లాండ్. మానవ హక్కులు లేకపోవడం, న్యాయం పొందడం కష్టమవ్వడం, అవినీతి రాజ్యమేలడం వంటి అంశాల్లో ముందున్న దేశాలు వెనిజులా, కంబోడియా, అఫ్గానిస్తాన్, హైతీ, మయన్మార్‌లు.

భారతదేశంలో సామాజిక న్యాయాన్ని నెలకొల్పడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి అపారమైనది. అందుకే 'భారత సామాజిక న్యాయ పితామహుని'గా అంబేడ్కర్‌ను గౌరవించుకుంటున్నాం. భారతదేశంలో రాజ్యాంగం పీఠిక సామాజిక న్యాయాన్ని సూచిస్తోంది. భారతదేశంలో సామాజిక న్యాయాన్ని నెలకొల్పడంలో మూడు అంశాలను పేర్కొనాలి: ఒకటి – ప్రాథమిక హక్కులు, నిర్దేశక సూత్రాల రూపంలో రాజకీయ సామాజిక–ఆర్థిక హక్కులను కల్పించడం. ఇది సమాన స్వేచ్ఛా సూత్రాన్ని పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది. రెండవది–సామాజిక–ఆర్థిక అభివృద్ధి మధ్య, విరుద్ధమైన సామాజిక–ఆర్థిక లక్ష్యాల మధ్య సమాన సంతులనాన్ని సాధించే నమూనాను అవలంబించడం. మూడవది – భారతీయ సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక రక్షణలు నిశ్చయాత్మక చర్యలను అందించడం. ఇందుకోసం దేశంలో ఎప్పటికప్పుడు అనేక కార్యక్రమాలు, పథకాలు, చట్టాలు రూపొందించి అమలు చేయడం.

– డా॥ పి.ఎస్. చారి । 83090 82823

(ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం)

బీసీలకు అభయ'హస్తం'

అభిప్రాయం



బి. మహేశ్ కుమార్ గౌడ్

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మకమైన కులగణన పూర్తి చేసింది. దీంతో ప్రతిపక్ష పార్టీల్లో వణుకు మొదలైంది. కులగణనను శాస్త్రీయంగా పూర్తిచేసి దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి... ప్రతిపక్షాలు దిగజారుడుతనంతో విమర్శలు కొనసాగించడం బాధాకరం.

జనాభాలో సగంపైగా ఉన్న బీసీలకు సమ న్యాయం జరగాలనే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ... తొలుత తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దీనిపై ముందడుగు వేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందే 2023 నవంబర్‌లో కామారెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ 'బీసీ డిక్లరేషన్' ప్రకటించింది. 'భారత్ జోడో యాత్ర' సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో కులగణన చేపడుతామని చెప్పారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన అంశాన్ని చేపట్టి పూర్తి చేసింది. రాష్ట్రంలో 56 శాతానికి పైగా బీసీ జనాభా ఉందని నిర్ధారణ కావడంతో బీసీలకు న్యాయం చేసే దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులేస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుపుల్ల లేస్తున్నాయి.

గతంలో బీఆర్ఎస్ చేపట్టిన 'సమగ్ర కుటుంబ సర్వే' వివరాలను కేసీఆర్ సర్కార్ ఎందుకు బయట పెట్టలేదు? ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన కులగణనలో బీసీ జనాభా 56 శాతానికి పైగా ఉందంటే, తక్కువ చేసి చూపిస్తున్నారంటూ ఆ పార్టీ నేతలు గగ్గోలు పెట్టడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా శాసనం చేసేందుకు అనేక చట్టపరమైన ప్రక్రియలుంటాయి. దీనికి సమయం పట్టే అవకాశం ఉండడంతో కాలయాపన జరగకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రకటించినట్టు బీఆర్ఎస్, బీజేపీలు కూడా 42 శాతం బీసీలకు టికెట్లిస్తాయా అని ప్రశ్నిస్తే ఆ పార్టీలు సరైన రీతిలో స్పందించకుండా అసలు విషయాన్ని దారి మళ్లిస్తున్నాయి. గతంలో స్థానిక ఎన్నికల్లో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించింది బీఆర్ఎస్. ఇప్పుడు అది నిరాధార ఆరోపణలతో జనాన్ని తప్పుదోవ పట్టిస్తోంది.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశంలో జనగణన చేపట్టకుండా తాత్సారం చేస్తోంది. తక్షణమే జనగణన నిర్వహించి, అందులో భాగంగా కులగణన



కూడా చేపట్టి జనాభా ప్రాతిపదికన సంబంధిత సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తున్నా ఎన్డీపే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మనుశాస్త్ర ధర్మాన్ని అనుసరిస్తూ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌నే అవమానిస్తున్న బీజేపీ నుండి సామాజిక న్యాయం ఆశించడం అత్యాశే అవుతుంది.

బీజేపీవారు దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబంపై అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారు. దేశంలో జనగణన, కులగణన చేపట్టాలని సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ కోరుతుంటే వారి కులాలను ప్రస్తావించి అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ముస్లింలను బీసీ సామాజికవర్గంలో ఎలా చేరుస్తారనీ, వారికి రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారనీ బీజేపీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రంలో మత ఉద్రిక్తతలు సృష్టించాలని చూస్తున్నారు. ముస్లింలలో వెనుకబడిన వారు లేరా? బీజేపీ వారి మోడల్‌గా చెప్పుకునే గుజరాత్‌లో ఓబీసీ ముస్లింలుండగా, తెలంగాణ రాష్ట్రంలో ఉండకూడదా? తెలంగాణ ప్రభుత్వం కులగణన నివేదిక అనంతరం బీజేపీ రాజ్యసభ సభ్యులు, బీసీ నేత ఆర్.కృష్ణయ్య ఈ అంశాన్ని స్వాగతిస్తుంటే, ఆ పార్టీలో మరికొందరు కులగణన తప్పుడు లెక్కలంటూ వ్యాఖ్యానించడం ఆ పార్టీ ద్వంద్వ నీతికి నిదర్శనం.

బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను విఫలం చేయడానికి ప్రతిపక్షాలు పన్నుతున్న కుట్రలను వెనుకబడిన తరగతుల ప్రజలు గమనించాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి బిల్లు ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్న బీజేపీ నేతలు బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం కోసం ప్రధాని మోదీని ఒప్పించగలరా? ఇందుకోసం బీఆర్ఎస్ కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

2023 ఎన్నికల్లో బీసీని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పిన బీజేపీ... ఎన్నికల సమయానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉన్న బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌ను తొలగించి, ఆయన స్థానంలో ఓసీ వర్గీయుడైన కిషన్‌రెడ్డిని నియమించింది. తెలంగాణకు ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని చెప్పిన కేసీఆర్ తానే అందలమెక్కారు. ఈ రెండు పార్టీలకు భిన్నంగా సామాజిక న్యాయం పాటిస్తూ కాంగ్రెస్... బీసీ సామాజిక వర్గానికి చెందిన నన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, బీసీలకు కాంగ్రెస్సే అభయహస్తం ఇవ్వగలదని కుల గణనతో మరోసారి నిరూపితమైంది. ప్రతిపక్షాలు కీలకమైన విషయాలను పక్కదారి పట్టిస్తే రాష్ట్రంలోని బీసీ సామాజికవర్గం సరైన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయం.


వ్యాసకర్త ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు

నాదోపాసన

నాదోపాసన (నాదాన్ని ధ్యానించడం) అనేది ఒక గొప్ప ఆత్మ విజ్ఞాన శాస్త్రం. మన పవిత్ర గ్రంథాలు నాదాన్ని నాదబ్రహ్మగా ప్రకటించాయి. అంటే నాదమే సర్వోత్తమమైన శక్తి అని తెలియజేస్తున్నాయన్న మాట. నాదాన్ని ఏకాగ్ర చిత్తంతో ధ్యానించినట్లయితే దైవద్వారం తెరచుకొంటుంది, సాధకుడు పరమాత్మలో ఐక్యమైపోతాడు.

ఒక సంగీత విద్వాంసుడు నాదాన్ని (సంగీతాన్ని) జీవనాధారం కోసం, తనకు పేరు ప్రఖ్యాతులు రావడం కోసం ఉపయోగించుకుంటే అతడూ సామాన్య వ్యక్తే అవుతాడు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఎందుకంటే అతను నాదోపాసనను ఆధ్యాత్మిక ఉన్నతికి ఉపయోగించుకోవడం లేదు. భగవంతుని తృప్తిపరచుట కోసం సంగీతాన్ని కేవలం ఆధ్యాత్మిక సాధన మార్గంలో ఉపయోగిస్తూ, ఆయన దర్శనాన్ని పొందగోరి నాదాన్ని సాధన చేస్తే, అది ఉపాసకుని శుద్ధచైతన్య స్థితికీ, జీవిత లక్ష్యాన్ని సాధించు స్థితికీ తీసికొని వెళ్తుంది.

ఎవరైతే కఠినంగా, చిత్త వికారం లేకుండా తన పనిలో నిమగ్నుడై ఉంటాడో అతడే నిజమైన యోగి. అతడు అనేక పనులను చేపట్టి సమర్థంగా చేస్తాడు. అవి అతని మనస్సులో ఎటువంటి మార్పూ చేయలేవు. భౌతిక విషయాల వలన అతని మనస్సు ప్రభావితం కాకుండా ఉంటుంది. తన దగ్గరికి చేరిన వారిని కాని, లేక తనయెడల ముభావంగా ఉండేవాళ్లను కాని, లేక తనకు వ్యతిరేకంగా ఉండేవారిని కాని అతను లెక్కలోకి తీసుకోడు. అతడు ఆకర్షణ, వికర్షణలకు అతీతంగా ఉంటాడు.

సముద్రంపై అలలు వచ్చినట్లు, సామాన్య మానవుల మనస్సుల్లో ఆలోచనలు, భావోద్రేకాలు కలుగుతూ ఉంటాయి. కాని, యోగి మనస్సు అలలులేని సముద్రం లాంటిది. అతడు ఆత్మ నిగ్రహంతో ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉంటాడు. ఇంద్రియ విషయాలకు పసిపిల్లలు లోనుకానట్లు, యోగి కూడా వాటికి లోనుకాడు. అతడు ఎప్పుడూ దేనినీ ఆశతో చూడడు. దృష్టిని ఇతర విషయాల వైపు మళ్లించడు. ఎందుకంటే అతడు ఇంద్రియ భోగాలను అనుభవించాలనే కోరికను అధిగమించి ఉంటాడు. గొప్ప పనులను చేస్తూనే ఉంటాడు. కాని, వాస్తవంగా ఆయన ఒక సన్యాసి. అతడి మనస్సు దేనినీ అంటిపెట్టుకొని ఉండదు. అతని కోరికలన్నీ నిర్మూలనమై ఉంటాయి. ఆయన ఎల్లప్పుడూ బ్రహ్మానంద స్థితిలో ఉంటాడు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.6.41 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** విశాఖ ఉ.10.42 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ప.3.04 నుండి 4.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.22 నుండి 11.10 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** రా.1.26 నుండి 3.11 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.29, **సూర్యాస్తమయం:** 5.59.

మధుకర్‌రెడ్డి క్షేమంపై సీఎంవో ఆరా

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉపాధి కోసం వెళ్లి.. సైబర్ క్రైం సెంటర్‌లో చిక్కుకుపోయిన మధుకర్‌రెడ్డి క్షేమంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసింది. బుధవారం ఉదయం సీఎంవో నుంచి సాక్షికి ఫోన్ వచ్చింది. మధుకర్‌రెడ్డి తల్లిదండ్రులతో దరఖాస్తు పెట్టమని అధికారులు సూచించారు. దీంతో తమ కుమారుడిని కాపాడేందుకు సాయపడాలంటూ సీఎంవో కార్యాలయానికి లక్ష్మారెడ్డి దంపతులు దరఖాస్తు చేసుకున్నారు. అదే సమయంలో మంగళవారం మధ్యాహ్నం ఇండియాకు మధుకర్ చివరిసారి కాల్ చేశాడు. ఆ తర్వాత కాల్ చేయకపోవడంతో అతని ఫోన్‌ను అక్కడివారు తీసేసుకున్నారని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. థాయ్‌లాండ్, మయన్మార్ కేంద్రంగా జరుగుతున్న సైబర్ నేరాలపై అంతర్జాతీయంగా ఒత్తిడితో ఆ దేశాల్లో కదలిక మొదలైంది. బుధవారం వరకు దాదాపు 7,000 మంది బందీలను మయన్మార్ సరిహద్దులోని మైవాడీని ఆనుకొని ఉన్న థాయ్‌లాండ్‌లోని మాయ్‌సాట్ ప్రావిన్స్‌కు తరలించే ఏర్పాట్లు మొదలుపెట్టారు. అక్కడ నుంచి వారిని స్వదేశాలకు పంపుతారు. తీవ్రవాదుల నిలయంగా ఉన్న మైవాడీ జిల్లాలో ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్యం నుంచి దాదాపు 10 వేల మంది విదేశీయులు బందీలుగా ఉన్నారని, అందులో రెండు వేలమంది భారతీయులేనని సమాచారం. అమెరికా, భారత్‌తోపాటు, అంతర్జాతీయంగా వస్తున్న దౌత్యపరమైన ఒత్తిళ్ల వల్ల వీరందరినీ పంపించేందుకు మయన్మార్, థాయ్‌లాండ్ సిద్ధమవుతున్నాయి. త్వరలోనే మైవాడీలో బందీగా ఉన్న మధుకర్‌రెడ్డి ఆచూకీని కనిపెడతామని యంగాన్‌లోని భారత దౌత్య కార్యాలయం ధీమా వ్యక్తం చేసింది.

నిజామాబాద్‌లో పసుపు కొనుగోలు కేంద్రం

- మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పసుపు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమీక్షించిన ఆయన.. వ్యవసాయ మార్కెట్లో ప్రత్యక్ష కొనుగోలు కేంద్రం ద్వారా వెంటనే పసుపు సేకరించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా.. దళారుల జోక్యం లేకుండా నేరుగా రైతులే గరిష్ట మద్దతు ధర పొందేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. సీసీఐ కేంద్రాల్లో రైతుల ఆధార్ ప్రామాణికత సమస్య వల్ల సర్వర్లు నిలిచిపోయి.. కొద్దిరోజులుగా పత్తి కొనుగోళ్లు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియను వెంటనే పునరుద్ధరించాలని కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి తుమ్మల లేఖ రాశారు. మిర్చి రైతుల శ్రేయస్సు కోసం నాఫెడ్ ద్వారా మార్కెట్ ధరకు ఎండుమిర్చిని కొనుగోలు చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

మార్చి 5 నుంచి ఎస్‌కేఎం రాష్ట్రవ్యాప్త ధర్నాలు

సాక్షి, హైదరాబాద్: సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 5 నుంచి 13 వరకు జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర కన్వీనర్లు పశ్య పద్మ, టి.సాగర్, వి.ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించి, 3 వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను తీసుకొచ్చిందని ఆరోపించారు. విద్యుత్ సవరణ బిల్లుని రైతు సంఘాలతో చర్చించకుండా పార్లమెంటులో ప్రవేశపెట్టనని హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం కన్వీనర్లు జక్కుల వెంకటయ్య, కెచ్చెల రంగయ్య, వెంకట్రాములు, నాగిరెడ్డి, కొండల్, నరసింహులు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య



భారతి

పరిగి: అప్పుల బాధతో మహిళా రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలోని నజీరాబాద్ తండాలో బుధవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన భారతి (45), బాలయ్య దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇంటిపై లోన్ తీసుకుని పొలంలో నాలుగు బోర్లు వేయగా.. అన్నీ ఫెయిలయ్యాయి. అప్పటికే కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు రూ.10 లక్షల వరకు పేరుకుపోయాయి. ఇంటి లోన్‌తోపాటు అప్పులు కట్టలేమనే మనస్తాపంతో మంగళవారం సాయంత్రం భారతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తండాలో బంధువుల ఇళ్లలో పూజలు జరుగుతుండటంతో అక్కడికి వెళ్లిందని కుటుంబసభ్యులు భావించారు. కానీ బుధవారం ఆమె పొలం వద్ద ఉన్న విద్యుత్ టవర్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఔటర్ చుట్టూ హౌసింగ్ కాలనీలు

- హైదరాబాద్ నగరంలోని భూములమ్మి నిర్మించేందుకు హౌసింగ్ బోర్డు కసరత్తు
- అందుబాటు ధరల ఇళ్ల కోసం పాలసీ
- దీనిపై కన్సల్టెన్సీ ఏర్పాటు కోసం టెండర్లు పిలిచిన బోర్డు
- విస్తృత స్థాయిలో అపార్ట్‌మెంట్లు నిర్మించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మధ్య తరగతి ప్రజల కోసం అందుబాటు ధరల్లో ఉండే గృహాలను నిర్మించేందుకు గృహనిర్మాణ మండలి (హౌసింగ్ బోర్డు) సిద్ధమైంది. ఒకప్పుడు ఆసియాలోనే అతిపెద్ద కాలనీగా కేపీహెచ్‌బీ వంటి భారీ హౌసింగ్ కాలనీలను రూపొందించిన బోర్డు.. ఇప్పుడు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) చుట్టూ కాలనీలు నిర్మించేందుకు చర్యలు చేపడుతోంది. ఉమ్మడి ఏపీ సమయంలో 2013లో హైదరాబాద్ శివార్లలోని రావిర్యాలలో విల్లాల నిర్మాణమే హౌసింగ్ బోర్డు చివరి ప్రాజెక్టు కావడం గమనార్హం. తెలంగాణ ఏర్పాటయ్యాక ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదు. సుమారు పుష్కరకాలం తర్వాత మళ్లీ ఇప్పుడు గృహ నిర్మాణాలకు శ్రీకారం చుడుతోంది. హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో అందుబాటు ధరల్లో ఇళ్లను నిర్మించేందుకు పాలసీని రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పాలసీ ఎలా ఉండాలి, తక్కువ ధరలో ఇళ్లు అందుబాటులో ఉంచేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, ఇళ్ల నమూనాలు, ఖర్చును తగ్గిస్తూ మన్నికను పెంచేందుకు వినియోగించే ఆధునిక పరిజ్ఞానం తదితర అంశాలపై సూచనల కోసం కన్సల్టెన్సీని నియమించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు హౌసింగ్ బోర్డు బుధవారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 28న టెక్నికల్ బిడ్లు, మార్చి 3న ఫైనాన్షియల్ బిడ్లను తెరవనుంది.

సిటీలో భూములు అమ్మి..

హైదరాబాద్ నగరంలోపల కాలనీలను నిర్మించాలంటే భారీ వ్యయం అవుతుంది. ఇళ్ల ధరలు ఎక్కువగా ఉంటాయి. దీనితో అందుబాటులో ఇళ్ల ధరలు ఉండేలా.. ఔటర్ రింగు రోడ్డు చుట్టూ కాలనీలు నిర్మించాలని, అవి శాటిలైట్ టౌన్‌షిప్‌ల తరహాలో ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. హౌసింగ్ బోర్డుకు చాలా ప్రాంతాల్లో వందల ఎకరాల స్థలాలు ఉన్నాయి. కానీ వాటిలో దాదాపు 1,200 ఎకరాలు వివాదాల్లో ఉన్నాయి. మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల్లో చిన్న చిన్న స్థలాలు కూడా బోర్డు ఆధీనంలో ఉన్నాయి. ఇందులో ఖరీదైన ప్రాంతాల్లోని భూములను వేలం వేసి, ఆ నిధులతో శివార్లలో భూములు సేకరించాలని బోర్డు భావిస్తున్నట్టు తెలిసింది.

ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి..

ఉమ్మడి రాష్ట్రంలో హౌసింగ్ బోర్డు అమలు చేసిన విధానాలు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. పలు రాష్ట్రాలు వీటిని అనుసరించాయి కూడా. అయితే అనంతర కాలంలో రాష్ట్రంలో హౌసింగ్ బోర్డు నామమాత్రంగా మారగా.. ఇతర రాష్ట్రాల్లో పురోగతి సాధించాయి. ఈ క్రమంలో కన్సల్టెన్సీ ఆయా రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసి, అనుసరించదగిన అంశాలను సూచించనుంది. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు వద్ద నిధులు లేవు. అయితే వందల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉన్నందున.. వాటిని తనఖా పెట్టి హడ్కో వంటి సంస్థల నుంచి రుణం తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. ఆ నిధులతో కాలనీల నిర్మాణం చేపట్టనుంది.

అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి చాన్స్..

గతంలో హౌసింగ్ బోర్డు రూపొందించిన కాలనీల్లో 80శాతం వ్యక్తిగత ఇళ్లే. అప్పట్లో వాటికే డిమాండ్ ఉండటంతో అవే నిర్మించింది. ఎల్‌ఐజీ కేటగిరీలో మాత్రం అల్పాదాయ వర్గాల కోసం క్వార్టర్ల రూపంలో ఇళ్లను నిర్మించింది. ఇప్పుడు భూముల ధరలు అధికంగా ఉన్నందున వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం కాకుండా.. విస్తృత స్థాయిలో అపార్ట్‌మెంట్లనే నిర్మించే అవకాశం ఉంది.

వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనే..

ఔటర్ రింగు రోడ్డును నిర్మించిన తర్వాత దాని చుట్టూ శాటిలైట్ టౌన్‌షిప్స్ నిర్మించాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ నగరంపై జనాభా ఒత్తిడి తగ్గుతుందని భావించి, టౌన్‌షిప్‌లకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ ఆయన అకాల మరణంతో అమల్లోకి రాలేదు, తర్వాతి ప్రభుత్వాలేవీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అదే తరహాలో ఆలోచనతో కసరత్తు ప్రారంభించింది.

ఎస్సీ వర్గీకరణపై మరింత లోతుగా అధ్యయనం

- రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వర్గీకరణ ప్రకటనపై పలు అభ్యంతరాలు
- క్షేత్రస్థాయి నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించే దిశగా చర్యలు
- ఇందులో భాగంగా వన్‌మెన్ కమిషన్ గడువు నెలరోజులు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై జస్టిస్ షమీమ్‌అక్తర్ అధ్యక్షతన ఏర్పాటైన వన్‌మెన్ కమిషన్ మరింత లోతుగా అధ్యయనం చేయనుంది. ఇంతకుముందు కమిషన్ ఇచ్చిన సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపర్చి.. వర్గీకరణపై ప్రకటన చేసి సభ ఆమోదించింది. అయితే వర్గీకరణలో భాగంగా చేసిన గ్రూపుల ఏర్పాటులో కొన్ని వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆయా కులాలు ఆందోళనకు దిగాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డిని పలువురు ఎస్సీ కుల సంఘాల ప్రతినిధులు కలిసి వినతులు సమర్పించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం మరింత లోతైన అధ్యయనానికి వన్‌మెన్ కమిషన్‌ను ఆదేశించింది. ఇందులో భాగంగా జస్టిస్ షమీమ్‌అక్తర్ కమిషన్ గడువును మరో నెలరోజులు పొడిగించింది. మార్చి 10వ తేదీ వరకు వినతులు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను కొనసాగించాలని వన్‌మెన్ కమిషన్ భావిస్తోంది.

వినతులు, అభ్యంతరాల స్వీకరణ...

కమిషన్ అధికారులు క్షేత్రస్థాయి నుంచి వినతులు, అభ్యంతరాల స్వీకరణను మరోమారు ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్‌తోపాటు వివిధ కులాలకు చెందిన ప్రతినిధులు కమిషన్ అధికారులను కలిశారు. ఎస్సీ వర్గీకరణపై వన్‌మెన్ కమిషన్ ఇచ్చిన నివేదికపైన పూర్తిస్థాయి చర్చ జరపకుండా తీర్మానం చేయడం ఆమోదయోగ్యం కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ అన్నారు. వన్‌మెన్ కమిషన్‌కు వినతి సమర్పించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. ఎస్సీల్లోని అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడాలన్నారు. బుడగజంగం, డక్కలి, మాంగ్ వంటి కులాలను అభివృద్ధి చెందిన పంబాల, మన్నె కులాలతో కలిపి వారికి ఒక శాతం రిజర్వేషన్ కేటాయించారని, దీనివల్ల వెనుకబడిన కులాలు మళ్లీ దోపిడీకి గురవుతాయన్నారు.

పెద్దగట్టులో ఘనంగా నెలవారం

- లింగమంతుల స్వామిని దర్శించుకున్న మంత్రి కోమటిరెడ్డి



దేవరపెట్టెను కేసారానికి తరలిస్తున్న యాదవులు


సూర్యాపేట: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో జరుగుతున్న లింగమంతులస్వామి జాతరలో బుధవారం యాదవులు భక్తిశ్రద్ధలతో నెలవారం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం చంద్రపట్నం వేసి సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి వెళ్లిన పూజారులు, మెంతనబోయిన, గొర్ల వంశీయులు తిరుగు పయనమై బుధవారం గట్టుకు చేరుకున్నారు. వారు తమ వెంట తెచ్చిన పాలు, నెయ్యి, పూజా సామగ్రితో బోనం వండి లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి సమర్పించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం తమ వెంట తెచ్చిన తొలిగొర్రెను బలి ఇచ్చి భక్తులు, బైకాన్లు, మున్న వంశీయులకు పంచి పెట్టారు. అనంతరం దేవర పెట్టెతో కేసారం గ్రామానికి బయలు దేరారు. నాలుగో రోజుకూడా భక్తులు భారీగా తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం జాతర ముగియనుంది. కాగా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేలు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మల్టీ జోన్‌–2 ఐజీ సత్యనారాయణ తదితరులు బుధవారం లింగమంతుల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దోలు వాయిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వీలైనంత త్వరగా 'భూ భారతి' అమలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- అధికారంకోసం కేసీఆర్ పగటి కలలు



సాక్షి, హైదరాబాద్: భూమిని నమ్ముకుని బతికే కష్టజీవులను ఈ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, వీలైనంత త్వరగా భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూభారతి చట్టం విధివిధానాలపై బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో రెండో రోజు జరిగిన వర్క్‌షాప్‌లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్న పొరపాట్లకు కూడా తావులేకుండా ముసాయిదా భూభారతి చట్టం విధివిధానాలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. భూములకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ధరణి పోర్టల్ వల్ల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని ఆరోపించారు. రైతులు తమ భూములను కోల్పోవాల్సి వచ్చిందని, తొందరపాటు నిర్ణయాలతో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని ఆరోపించారు. ఈ పరిస్థితికి పరిష్కారంగానే, తమ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. భూమికి సంబంధించి రైతుకు ఎలాంటి కష్టం వచ్చినా రెవెన్యూ కార్యాలయాలలో పరిష్కారం లభించేలా విధి విధానాలను తయారు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, భూ చట్టాల నిపుణుడు సునీల్, సీసీఎల్‌ఏ పీడీ, సీఎంఆర్‌వో మకరంద్, సీసీఎల్‌ఏ సహాయ కార్యదర్శి లచ్చిరెడ్డి, జిల్లాల కలెక్టర్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అజ్ఞాతంలో ఉన్నవారికి అభివృద్ధి ఎలా కనిపిస్తుంది

ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్టు, ఫామ్‌హౌస్ దాటని దొర.. అధికారంకోసం పగటి కలలు కంటున్నారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పార్టీ ఓడిపోగానే పదేళ్లు తనకు అధికారమిచ్చిన ప్రజలను మర్చిపోయి, అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన కేసీఆర్‌కు 14 నెలల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఎలా కనపడుతుందని ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటివరకు ఫాంహౌస్ దాటని కేసీఆర్, స్థానిక ఎన్నికల కోసమే ప్రజల్లోకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

రండి బాబూ రండి.. ముందే రిజర్వ్ చేసుకోండి!

▶ మొదటి పేజీ తరువాయి

యాజమాన్య కోటా సీట్ల కు అడ్మిషన్లు మొదలుపెట్టాయి. ఇప్పుడే సీటు రిజర్వు చేసుకుంటే తక్కువ మొత్తానికే లభిస్తుందని, తర్వాత డిమాండ్ పెరిగే అవకాశం ఉందంటూ తల్లిదండ్రులకు చెబుతున్నాయి. రాష్ట్రంలో 150 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలుండగా.. కన్వీనర్, యాజమాన్య కోటా కలిపి 1,07,039 సీట్లున్నాయి. ఇందులో యాజమాన్య కోటా సీట్లు 30 శాతం.. అంటే 32 వేల సీట్లుంటాయి. ప్రధానంగా పది కాలేజీల్లోనే 15 వేల యాజమాన్య కోటా సీట్లున్నాయి. ఇందులో కంప్యూటర్ సైన్స్ సీట్లు 12,500 వరకూ ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా మరో 3 వేల సీట్లు వచ్చే వీలుంది. వీటికే ప్రధానంగా డిమాండ్ ఉంటోంది. జేఈఈ, ఈఏపీసెట్, ఇంటర్ మార్కుల కొలమానంగా మెరిట్ విద్యార్థులకే సీట్లివ్వాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వసూలు చేయాలి. కానీ యాజమాన్యాలు ఒక్కో సీటు గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు చెబుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఒక్కో సీటు సగటున రూ.7 లక్షలు అనుకున్నా..17 వేలకు పైగా యాజమాన్య సీట్ల విలువ రూ.1,000 కోట్లు దాటిపోతుందని అంటున్నారు.

తగ్గేదే లేదంటున్న కార్పొరేట్ జూనియర్ కాలేజీలు

ఇంటర్ మొదటి సంవత్సరంలో ఏటా సగటున 4.50 లక్షల మంది ప్రవేశాలు పొందుతున్నారు. 2 లక్షల మంది ప్రభుత్వ కాలేజీలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, గురుకులాల్లో చేరుతుంటే, మిగిలిన 2.50 లక్షల మంది ప్రైవేటు కాలేజీల్లో చేరుతున్నారు. రాష్ట్రంలో 1,500 వరకూ ప్రైవేటు జూనియర్ కాలేజీలున్నాయి. ఇందులో 500కు పైగా కాలేజీలున్న నాలుగు కార్పొరేట్ సంస్థలే హవా కొనసాగిస్తున్నాయి. దాదాపు 1.80 వేల మంది ఈ కాలేజీల్లోనే చేరుతున్నారు. 1,000 వరకు ఉండే లోబడ్జెట్ కాలేజీల్లో చేరే వారి సంఖ్య 70 వేల వరకూ ఉంటోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ కాలేజీలు ముందే ప్రవేశాల ప్రక్రియ మొదలు పెట్టాయి. టెన్త్ పరీక్షలకు ఇంకా ఎంతో సమయం ఉన్నా..భవిష్యత్‌ను నిర్ణయించేది ఇంటర్మీడియెట్టేనని, ఇక్కడే అసలైన పునాది అంటూ ప్రచారం హోరెత్తిస్తున్నాయి. అత్యాధునిక పద్ధతుల్లో బోధన, నిష్ణాతులైన సిబ్బంది, కొన్నేళ్లుగా వస్తున్న పరీక్షల ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఊళ్లల్లో చోటామోటా నేతలకు ప్యాకేజీలిస్తున్నాయి. విలాస వంతమైన ట్రిప్పులు ఏర్పాటు చేస్తున్నాయి.

'కేజీ' చదువులపైనా క్రేజ్

ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లూ జోరు కొనసాగిస్తున్నాయి. కొత్త విద్యార్థులను చేర్పించమని స్కూల్‌లో ఉన్న విద్యార్థులు, టీచర్లకు టార్గెట్లు పెడుతున్నాయి. అడ్మిషన్లకు వేతనాలకు లింక్ పెడుతున్నాయి. రాష్ట్రంలో 30 వేల ప్రభుత్వ రంగ స్కూళ్లల్లో 24 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. అయితే కేవలం 11 వేల ప్రైవేటు స్కూళ్లల్లో 36 లక్షల మంది చదువుతుండటం గమనార్హం. తల్లిదండ్రులు కూడా ప్రైవేటు స్కూళ్ల వైపే మొగ్గ చూపుతున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీల్లో చేర్పించేటప్పుడే మంచి స్కూళ్ల కోసం గాలిస్తున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వారికి గాలం వేస్తున్నాయి. అందమైన బ్రోచర్లతో, ఆకర్షణీయమైన వాట్సాప్ మెసేజీలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తమ స్కూల్‌లో చేరితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నమ్మ బలుకుతున్నాయి. అడ్మిషన్లు మొదలయ్యే లోగా చేరే వారికి ప్రత్యేక ప్యాకేజీ అంటున్నాయి. రూ. 50 వేలు మొదలుకొని, పెద్ద కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లలో రూ.12 లక్షల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, ఇంజనీరింగ్ సీట్లు, వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు

విభాగం	సంఖ్య	మొత్తం విద్యార్థులు	సాధారణంగా చేరేవాళ్లు	ప్రచారంతో చేరేవాళ్లు	వార్షిక ఫీజు
పాఠశాలలు	11000	36 లక్షలు	16 లక్షలు	20 లక్షలు	రూ.50 వేలు – రూ.12 లక్షలు
జూనియర్ కాలేజీలు	1500	2.5 లక్షలు	1.20 లక్షలు	1.30 లక్షలు	రూ. 80 వేలు – రూ. 9 లక్షలు
ఇంజనీరింగ్ కాలేజీలు	150	32000	15 వేలు	19 వేలు	గరిష్ఠంగా రూ. 20 లక్షలు
		(బి కేటగిరీ)	(కోర్ గ్రూపులు కలిపి)		

ప్రభుత్వం దృష్టికి పరిస్థితి



నోటిఫికేషన్ ఇవ్వకుండానే అడ్మిషన్ల కోసం వెంటపడే కాలేజీల వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటోంది. యాజమాన్య కోటా సీట్లను ఆన్‌లైన్ వ్యవస్థలోకి తేవాలి. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అనుమతి వచ్చి న తర్వాత అడ్డుకట్ట వేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తాం.

– ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి (ఉన్నత విద్యామండలి చైర్మన్)

తల్లిదండ్రులు తొందరపడొద్దు



వచ్చే విద్యా సంవత్సరానికి గాను ఇప్పటివరకు ఏ కాలేజీకీ అఫ్లియేషన్ ఇవ్వలేదు. కాబట్టి అడ్మిషన్లు చేపట్టినట్టు ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు కూడా తొందరపడి అడ్మిషన్లు తీసుకోవద్దు.

– కృష్ణ ఆదిత్య (ఇంటర్ బోర్డు కార్యదర్శి)

వరుసబెట్టి ఫోన్లు.. మెసేజ్‌లు..



మా అబ్బాయి టెన్త్ చదువుతున్నాడు. ఇంటర్ అడ్మిషన్ కోసం విపరీతంగా కాల్స్, వాట్సాప్ మెసేజీలు వస్తున్నాయి. రోజుకో కాలేజీ వాళ్లు వచ్చి ఒత్తిడి చేస్తున్నారు.

– వి.సూర్యప్రకాశ్‌రావు, ఖమ్మం



ఆలయ స్వర్ణ ధ్వజస్తంభానికి పుణ్యాహవాచనం చేస్తున్న అర్చకులు

స్వస్తివాచనంతో మహా కుంభాభిషేక సంప్రోక్షణకు శ్రీకారం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ దివ్య విమాన గోపురానికి మహా కుంభాభిషేకం సంప్రోక్షణ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఉదయం ప్రధానాలయ ముఖమండపంలో విష్వక్సేనుడిని వేద మంత్రాలతో ఆరాధించారు. అనంతరం స్వస్తివాచనం జరిపించారు. గర్భాలయం, ముఖమండపం, ధ్వజ స్తంభం చెంత, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాల్లో పుణ్యాహవాచనం నిర్వహించారు. అలాగే గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు, ముఖ మండపంలోని ఉత్సవ మూర్తులకు రక్షాబంధనం చేశారు. ఆయా వేడుకల్లో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, 108 మంది రుత్వికులు, 50 అర్చక, పారాయణీకులు పాల్గొన్నారు.

పంచకుండాల్లో అగ్నిప్రతిష్ఠ

పంచకుండాత్మక యాగంలో భాగంగా యాగశాలలో శ్రీస్వామి అమ్మవార్లను అధిష్ఠించి, యాగశాల ప్రవేశ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిని పంచకుండాల్లో ప్రతిష్ఠించి, హోమాది పూజలకు శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం సమయంలో నిత్య పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ద్వారాధి కుంభార్చన, బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధన, మూర్తి మంత్ర హోమాలు జరిపించారు. అనంతరం రాత్రి జలాధివాసం చేపట్టి, నిత్య పూర్ణాహుతి నిర్వహించి, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి చేశారు. తిరువీధి సేవ చేపట్టి, ఉత్సవమూర్తులను ఆలయంలోకి తీసుకెళ్లారు.

ప్రజలందరికీ భగవంతుడి ఆశీస్సులుండాలి

- కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలపై సీఎం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ దివ్య విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాల సందర్భంగా 'ఎక్స్' ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గర్భగుడిపై పంచతల దివ్య విమాన గోపురానికి స్వర్ణ తాపడ మహా కుంభాభిషేక ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా ప్రజలందరిపై భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

భారత్‌కు సాయం అనవసరం

- ఓటింగ్ శాతం పెంపు నిధి రద్దుపై ట్రంప్
- భారత్ దగ్గర ఎంతో డబ్బుందని వ్యాఖ్యలు
- భారత్‌పై గౌరవం ఉందన్న అధ్యక్షుడు



వాషింగ్టన్: భారత్‌లో ఓటింగ్‌ను పెంచడానికంటూ అందిస్తూ వస్తున్న 2.1 కోట్ల డాలర్ల నిధిని రద్దు చేస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. భారత్‌కు అసలు ఇంతకాలంగా ఆ మొత్తం ఎందుకు ఇస్తూ వచ్చినట్టని ప్రశ్నించారు. విదేశాలకు సహాయ నిధులకు కోత పెడుతూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన అనంతరం మంగళవారం తన నివాసం మార్-ఎ-లాగోలో అధ్యక్షుడు మీడియాతో మాట్లాడారు. ''భారత్ దగ్గర చాలా డబ్బుంది. అమెరికా నుంచి ప్రపంచంలోనే అత్యధికంగా పన్నులు విధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. మాపై వాళ్ల టారిఫ్‌లు చాలా ఎక్కువ. అలాంటి దేశానికి 2.1 కోట్ల డాలర్లు ఎందుకిస్తున్నామో అర్థం కావడం లేదు!'' అన్నారు. అయితే భారత్ పట్ల, ఆ దేశ ప్రధానిపై నాకెంతో గౌరవముందని చెప్పుకొచ్చారు. భారత్‌తో పాటు పలు దేశాలకు అందిస్తున్న మొత్తం 72.3 కోట్ల డాలర్ల సహాయ నిధులకు డోజ్ ఆదివారం మంగళం పాడటం తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు, ఆర్థికవేత్త సంజీవ్ సన్యాల్ స్పందించారు. భారత్‌లో ఓటింగ్ శాతం మెరుగుపరిచేందుకు అమెరికా నుంచి 2.1 కోట్ల డాలర్లను ఇన్నేళ్లుగా ఎవరు అందుకుంటూ వచ్చారో తెలుసుకోవాలనుకుంటున్నానంటూ ట్వీట్ చేశారు. భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అమెరికా నిధులు సమకూరుస్తోందన్న వార్తలను కేంద్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి ఎస్వై ఖురేషీ ఇప్పటికే ఖండించడం తెలిసిందే. 2012లో తాను సీఈసీగా ఉండగా ఈ మేరకు అమెరికా ఏజెన్సీ నుంచి ఎన్నికల సంఘం ఒప్పందం కుదుర్చుకున్నట్లు వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు.

'స్పేస్'లో మస్క్ జోక్యముండదు

అంతరిక్ష సంబంధిత ప్రభుత్వ నిర్ణయాల్లో టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ జోక్యం ఉండబోదని ట్రంప్ స్పష్టం చేశారు. మస్క్ ప్రధానంగా డోజ్ ద్వారా ప్రభుత్వానికి ఖర్చులను తగ్గించే పనిమీద ఉంటారన్నారు. ''ఆయనను మీరు ఉద్యోగి అని పిలవవచ్చు. కన్సల్టెంట్ అనొచ్చు. మీకు నచ్చినట్లుగా పిలవవచ్చు. కానీ ఆయన దేశభక్తుడు'' అని చెప్పుకొచ్చారు. మస్క్ ప్రభుత్వోద్యోగి కాదని, ఆయనకు ఎలాంటి నిర్ణయాధికారాలూ లేవని వైట్‌హౌస్ సోమవారం పేర్కొనడం తెలిసిందే.

టారిఫ్‌లపై తగ్గేదే లేదు

పరస్పర టారిఫ్‌ల విషయంలో తగ్గేదే లేదని ట్రంప్ కుండబద్దలు కొట్టారు. ఈ విషయంలో తనతో ఎవరూ వాదించలేరని స్పష్టం చేశారు. 'భారత్‌కు మినహాయింపు లేదు. మీరెంత విధిస్తే మేమూ అంతే విధిస్తా'మని ప్రధాని మోదీకి స్పష్టం చేశానని చెప్పారు. ప్రతి దేశానికీ ఇదే వర్తిస్తుందన్నారు. ఎలాన్ మస్క్‌తో కలిసి ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఆటోమొబైల్ వంటి రంగాల్లో అమెరికాపై భారత్ ఏకంగా 100 శాతం సుంకాలు విధిస్తోందని ట్రంప్ చెప్పగా అవునంటూ మస్క్ శ్రుతి కలిపారు.

'బైడెన్ అటార్నీ'లకు ఉద్వాసన

మాజీ అధ్యక్షుడు జో బైడెన్ నియమించిన అటార్నీలందరినీ తొలగించాలని ట్రంప్ ఆదేశించారు. న్యాయశాఖను గత నాలుగేళ్లలో మునుపెన్నడూ లేనంతగా రాజకీయమయం చేశారంటూ ఆక్షేపించారు. అందుకే ఆ శాఖలో 'బైడెన్ శకం' ఆనవాళ్లను తొలగించాలని ఆదేశించినట్టు తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ''నమ్మకాన్ని పునరుద్ధరించాలంటే ఇంటిని ప్రక్షాళన చేయాల్సిందే. స్వర్ణయుగపు అమెరికాలో నిష్పాక్షిక న్యాయ వ్యవస్థ ఉండాలి. ఈ రోజు నుంచే అది మొదలవుతుంది'' అన్నారు. యూఎస్ అటార్నీలుగా పిలిచే ఫెడరల్ ప్రాసిక్యూటర్లను నామినేట్ చేయడం అధ్యక్షుడి బాధ్యత. అమెరికాలో ప్రస్తుతం 93 మంది అటార్నీలున్నారు. ప్రభుత్వ చట్టాల అమలు వీరి బాధ్యత. రిపబ్లికన్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి న్యాయ శాఖ తీవ్ర ప్రకంపనలకు గురవుతోంది. పలువురు ఉన్నతాధికారులను తొలగిస్తున్నారు.

ఉక్రెయిన్లో సైనిక పాలన

జెలెన్‌స్కీకి స్వదేశంలో ఆదరణ పూర్తిగా అడుగంటిందని ట్రంప్ అన్నారు. ''జెలెన్‌స్కీ రేటింగ్స్ 4 శాతానికి పడిపోయాయి. ఆయనకు ధైర్యముంటే తక్షణం ఎన్నికలకు వెళ్లాలి'' అని సవాలు కూడా చేశారు. రష్యా కోరిక మేరకే ఇలా ఉక్రెయిన్‌లో ఎన్నికలకు డిమాండ్ చేస్తున్నానన్న ఆరోపణలను తోసిపుచ్చారు. ''నాతో పాటు చాలా దేశాలు ఈ మేరకు డిమాండ్ చేస్తున్నాయి. ఎందుకంటే ఉక్రెయిన్‌లో ఏళ్లుగా సైనిక పాలన నడుస్తోంది'' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నెలాఖర్లోగా పుతిన్‌తో తాను భేటీ అయ్యే అవకాశముందని ఈ సందర్భంగా ట్రంప్ వెల్లడించారు. ఉక్రెయిన్‌పై ట్రంప్ తాజా వ్యాఖ్యలను డోజ్ అధిపతి ఎలాన్ మస్క్ పూర్తిగా సమర్థించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో స్పందించారు. ''జెలెన్‌స్కీకి శాంతి ఇష్టం లేదు. ఆయనకు కావాల్సిందల్లా మరింత డబ్బు, అధికారం మాత్రమే'' అంటూ ఆక్షేపించారు.

ఉక్రెయిన్ వల్లే యుద్ధం

- రష్యాతో ఎప్పుడో రాజీకి రావాల్సింది: ట్రంప్
- చర్చలకు పిలవలేదన్న జెలెన్‌స్కీ వ్యాఖ్యలపై ధ్వజం
- ఆయన తక్షణం ప్రజాతీర్పు కోరాలన్న అధ్యక్షుడు

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా స్వరం మారింది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు మూడేళ్లుగా అన్నివిధాలా దన్నుగా నిలుస్తూ వస్తున్న అగ్ర రాజ్యం కాస్తా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ రాకతో ఒక్కసారిగా యూ టర్న్ తీసుకుంది. అసలు యుద్ధం మొదలవడానికి ఉక్రెయినే కారణమంటూ అంతర్జాతీయ సమాజమే అవాక్కయేలా ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. రష్యాతో మొదట్లోనే అది ఓ ఒప్పందానికి వచ్చి ఉంటే బాగుండేదన్నారు. యుద్ధానికి తెర దించే మార్గాలపై సౌదీ అరేబియాలో జరిగిన తాజా చర్చలకు ఉక్రెయిన్‌ను ఆహ్వానించకపోవడం ఏమిటన్న అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ''ఉక్రెయిన్ అసలు ఈ యుద్ధాన్ని మొదలు పెట్టి ఉండాల్సిందే కాదు. వాళ్లను మేం చర్చలకు ఆహ్వానించలేదంటూ బాధపడుతున్నారు. కానీ మూడేళ్లుగా, అంతకుముందు కూడా ఎన్నోసార్లు ఈ విషయమై రష్యాతో ఉక్రెయిన్ చర్చించింది. అప్పుడే చాలా సులువుగా పరిష్కరించుకోగలిగిన సమస్య ఇది. కానీ ఆ అవకాశాలను వాళ్లు వినియోగించుకోలేదు. లేదంటే ఒప్పందం కుదుర్చుకుని తమ భూభాగంతో పాటు సర్వస్వాన్నీ నిలుపుకునేవాళ్లు. ఇంత జన నష్టం జరిగేది కాదు. ఏ నగరమూ నేలమట్టమయ్యేది కాదు'' అని వ్యాఖ్యానించారు. ''ఈ విషయంలో ఏదో ఒకటి చేయాలని రష్యా భావిస్తోంది. మతిలేని ఆటవికత్వానికి ఏదోలా తెర దించాలని కోరుకుంటోంది'' అంటూ కితాబు కూడా ఇచ్చారు! తన మార్-ఎ-లాగో నివాసంలో మంగళవారం విలేకరులతో ట్రంప్ మాట్లాడారు. యుద్ధాన్ని ముగించే శక్తి తనకుందని చెప్పుకున్నారు. ఉక్రెయిన్‌కు దన్నుగా సైన్యాలను పంపుతామన్న యూరప్ దేశాల ప్రకటనలను ప్రస్తావించగా, ''వారు పంపాలనుకుంటే మంచిదే. ఫ్రాన్స్, ఇంగ్లండ్ తదితర దేశాల ప్రకటనలు చూశాను. అందుకు నా మద్దతూ ఉంటుంది. కానీ మాది సుదూర దేశం. మేమైతే ఆ పని చేయబోవడం లేదు'' అని స్పష్టం చేశారు.

రష్యా అబద్ధాల వలలో ట్రంప్

- నాకు ప్రజాదరణ లేదనేది ఒట్టిమాట
- ట్రంప్ వ్యాఖ్యలకు దీటుగా స్పందించిన జెలెన్‌స్కీ



కీవ్/మియామీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కారణంగానే రష్యా దండయాత్రకు తెగించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ దీటుగా స్పందించారు. గురువారం ఉక్రెయిన్ పౌరులనుద్దేశిస్తూ టీవీలో జెలెన్‌స్కీ ప్రసంగించారు. '' ఉక్రెయిన్‌లో నాకు ప్రజాదరణ భారీగా తగ్గిపోయిందని ట్రంప్ చెబుతున్నారు. ఉక్రేనియన్లలో నాకు ఆదరణ 4 శాతానికి పడిపోయిందని ఆయన ప్రకటించారు. ఇలాంటి వార్తలు, సమాచారం అంతా అమెరికాకు రష్యా నుంచి అందుతోంది. ఇలాంటి అబద్ధపు, తప్పుడు సమాచారంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిక్కుకున్నారు'' అని జెలెన్‌స్కీ అన్నారు. తనతో భేటీ కోసం తమ రాజధాని కీవ్ సిటీకి అమెరికా రాయబారి కెయిత్ కెల్లాగ్ విచ్చేసిన వేళ జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉక్రెయిన్, రష్యాల్లో అమెరికా ప్రత్యేక రాయబారిగా విధుల్లో ఉన్న కెయిత్ జెలెన్‌స్కీతోపాటు ఉక్రెయిన్ మిలటరీ కమాండర్లతో భేటీ కానున్నారు. చక్కటి, ఫలవంతమైన చర్చలను ఆశిస్తున్నట్లు కెయిత్ చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు మంగళవారం సౌదీ అరేబియా వేదికగా అమెరికా-రష్యా మధ్య చర్చలు ప్రారంభమైన విషయం విదితమే. బాధిత దేశం ఉక్రెయిన్ భాగస్వామ్యం లేకుండానే అమెరికా, రష్యా విదేశాంగ మంత్రులు తొలి దఫా చర్చలు మొదలెట్టడం గమనార్హం. ఒక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని ఇరుదేశాలు నిర్ణయించారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్ట్‌జ్, అమెరికా పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ఈ భేటీలో పాలుపంచుకున్నారు. సౌదీ యువరాజు మొహమ్మద్ సల్మాన్ ఈ భేటీకి కీలకభూమికగా నిలిచారు. అయితే తమ భాగస్వామ్యం లేకుండా జరిగే చర్చలను అంగీకరించబోమని జెలెన్‌స్కీ కుండబద్దలుకొట్టారు.

జెలెన్‌స్కీ ఒక నియంత: ట్రంప్

రష్యా అందిస్తున్న తప్పుడు సమాచార లోయలో ట్రంప్ పడిపోయారని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించడంపై ట్రంప్ స్పందించారు. '' ఎన్నికలు నిర్వహించకుండా ఉక్రెయిన్‌ను ఏలుతున్న నియంత జెలెన్‌స్కీ. ఈ చక్కటి కమేడియన్ గురించి ఓసారి ఆలోచించండి. ఎప్పటికీ గెలవలేని యుద్ధంలో తమ కోసం 350 బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టేలా అమెరికాను ఒప్పించాలని చూశాడు. అమెరికా, ట్రంప్ లేకుండా ఆ యుద్ధం ఎన్నటికీ ఓ ముగింపునకు రాదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

సీఈసీగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ్



సీఈసీ జ్ఞానేశ్ కుమార్

- 18 సంవత్సరాలు నిండిన ప్రతీ భారతీయుడు ఓటర్‌గా మారాలని పిలుపు
- ఎన్నికల కమిషనర్‌గా వివేక్ జోషి బాధ్యతల స్వీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది మార్చి నెల నుంచి కేంద్ర ఎన్నికల సంఘంలో ఎలక్షన్ కమిషనర్‌గా సేవలందిస్తున్న జ్ఞానేశ్‌ను సీఈసీగా ఎంపికచేస్తూ ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ రాష్ట్రపతి ముర్ముకు సిఫార్సు చేయడం, వెనువెంటనే ఆ సిఫార్సును ఆమోదిస్తూ, ఆయనను సీఈసీగా నియమిస్తూ గెజిట్ నోటిఫికేషన్ వెలువడటం తెల్సిందే. మరోవైపు హరియాణా కేడర్ మాజీ ఐఏఎస్ అధికారి వివేక్ జోషి ఎన్నికల కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజీవ్ కుమార్ సీఈసీగా పదవీ విరమణ చేశాక ఆ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జ్ఞానేశ్ మాట్లాడారు. ''దేశ నిర్మాణంలో తొలి సోపానం ఓటు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటర్‌గా కొత్త బాధ్యతలు స్వీకరించాలి. ప్రతి ఎన్నికల్లో తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి. భారత రాజ్యాంగంలోని ఎన్నికల చట్టాలు, నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల సంఘం అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడూ ఓటర్లకు అండగా నిలబడుతుంది'' అని జ్ఞానేష్ స్పష్టం చేశారు. జ్ఞానేశ్ ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో కీలకమైన సార్వత్రిక ఎన్నికలు, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీలకు సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించారు. మరోవైపు ఎలక్షన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వివేక్ జోషి గతంలో హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ఐఐటీ రూర్కీలో మెకానికల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడైన జోషి ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలోని ఎలక్షన్ కమిషనర్లలో అత్యంత పిన్న వయస్కుడు. అయితే సీనియారిటీ ప్రకారం ఒకవేళ ఈయన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పదోన్నతి పొందితే ఈయన సారథ్యంలోనే 2029లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

ఢిల్లీకి నాలుగో మహిళా ముఖ్యమంత్రి



"నాకు అవకాశమిచ్చినందుకు ప్రధాని మోదీకి, బీజేపీ నాయకత్వానికి, అగ్ర నేతలకు కృతజ్ఞతలు. ఢిల్లీ సమగ్రాభివృద్ధికి సంక్షేమానికి పూర్తి నిజాయితీతో, చిత్తశుద్ధితో కృషి చేస్తా. నగరాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తా" - రేఖా గుప్తా

న్యూఢిల్లీ: పదకొండు రోజుల సస్పెన్స్‌కు తెర పడింది. ఢిల్లీ ముఖ్యమంత్రి ఎవరో తేలిపోయింది. కొన్నాళ్లుగా ముఖ్యమంత్రులుగా కొత్త ముఖాలకు అవకాశమిస్తున్న ఆనవాయితీని ఢిల్లీ విషయంలోనూ బీజేపీ అధిష్టానం కొనసాగించింది. అంతటితో ఆగకుండా ఓ మహిళకు పట్టం కడుతూ బుధవారం అనూహ్య నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన 50 ఏళ్ల రేఖా గుప్తాను సీఎంగా ఎంచుకుంది. సుష్మా స్వరాజ్ (బీజేపీ), షీలా దీక్షిత్ (కాంగ్రెస్), ఆతిశి (ఆప్) తర్వాత ఆమె ఢిల్లీకి నాలుగో మహిళా సీఎం కానున్నారు. మదన్‌లాల్ ఖురానా, సుష్మ, సాహెబ్‌సింగ్ వర్మ తర్వాత రాష్ట్రానికి మొత్తమ్మీద నాలుగో బీజేపీ సీఎం కూడా. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రస్తుతం మహిళలెవరూ సీఎంగా లేరు. దాంతో ఆ పార్టీ నుంచి ఏకైక మహిళా ముఖ్యమంత్రిగానూ రేఖ నిలవనున్నారు. దేశవ్యాప్తంగా చూస్తే మమతా బెనర్జీ తర్వాత రెండో మహిళా సీఎం అవుతారు. గురువారం సాయంత్రం రాంలీలా మైదానంలో అట్టహాసంగా జరిగే బహిరంగ సభలో రేఖ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలతో పాటు సినీ, పారిశ్రామిక ప్రముఖులు కూడా పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొననున్నారు. రేఖకు అమిత్ షా అభినందనలు తెలిపారు. రాజధాని ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆమె నాయకత్వంలో నూతన బీజేపీ ప్రభుత్వం రేయింబవళ్లు కృషి చేస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. తాజా మాజీ సీఎం ఆతిశితో పాటు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కూడా రేఖకు అభినందనలు తెలిపారు.

పర్వేశ్ అనుకున్నా...

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించి ఆప్ పదేళ్ల పాలనకు తెర దించడం తెలిసిందే. రాష్ట్రంలో 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అధికారం చేపట్టబోతోంది. మాజీ సీఎం సాహెబ్‌సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మకు సీఎంగా చాన్స్ దక్కుతుందని తొలుత భావించారు. కేజ్రీవాల్‌ను ఓడించి జెయింట్ కిల్లర్‌గా నిలవడంతో ఆయన పేరు మార్మోగింది. కానీ క్రమంగా పలువురు ఇతర నేతల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈసారి మహిళకే అవకాశమని కొద్ది రోజులుగా బీజేపీ నేతలే చెబుతుండటంతో రేఖ పేరు ప్రముఖంగా విన్పించింది. చివరికదే నిజమైంది. బుధవారం సాయంత్రం ఢిల్లీ బీజేపీ శాసనసభా పక్ష భేటీ జరిగింది. రేఖను శాసనసభా పక్ష నేతగా పర్వేశ్ వర్మ తదితర సీనియర్లు ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం ఎల్పీ భేటీకి పరిశీలకులుగా వచ్చిన బీజేపీ అగ్ర నేతలు రవిశంకర్ ప్రసాద్ తదితరులతో కలిసి రేఖ రాజ్‌నివాస్‌కు వెళ్లారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వెలిబుచ్చారు.

..అలా కలిసొచ్చింది!

- రేఖా గుప్తాను వరించిన అదృష్టం
- కలిసొచ్చిన బనియా సామాజికవర్గం
- ఏబీవీపీతో రాజకీయ ప్రస్థానం మొదలు

ఎమ్మెల్యేగా తొలిసారి నెగ్గిన రేఖా గుప్తాను ఢిల్లీ సీఎంగా ఎంచుకోవడం ద్వారా బీజేపీ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎంతోమంది సీనియర్లున్నా చాలా సమీకరణాలు ఆమెకు అనుకూలించాయి. మహిళ కావడంతో పాటు వైశ్య (బనియా) సామాజికవర్గం కూడా కలిసొచ్చింది. ఆప్ అధినేత కేజ్రీవాల్‌ది కూడా బనియా సామాజికవర్గమే. ఇక ఆ పార్టీకి చెందిన మహిళా నేత ఆతిశి తాజా మాజీ సీఎం. రేఖ ఎంపిక వెనక ఈ రెండు అంశాలనూ బీజేపీ అధిష్టానం దృష్టిలో ఉంచుకున్నట్టు కన్పిస్తోంది. పార్టీ పట్ల తిరుగులేని విధేయత వీటికి తోడైంది.

మహిళల్లో మరింత ఆదరణ కోసం...

ఈసారి ఢిల్లీ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలే అధికంగా ఓట్లేశారు. పురుషుల ఓట్లపై అధికంగా ఆధారపడ్డ ఆప్ పరాజయం పాలవగా మహిళల ఆదరణే తమకు అధికారం అందించిందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. అందుకే మహిళను సీఎం చేసి వారి రుణం తీర్చుకోవాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. బీజేపీ నుంచి 9 మంది మహిళలు పోటీ చేయగా నలుగురు గెలిచారు.

ఆరెస్సెస్‌తో బంధం

50 ఏళ్ల రేఖ వివాదాలకు సుదూరం. ఆర్‌ఎస్‌ఎస్‌తో ఆమెది సుదీర్ఘ అనుబంధం. 1974 జూలై 19న హరియాణాలో జన్మించారు. ఢిల్లీలోని దౌలత్‌రామ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేస్తుండగానే ఏబీవీపీలో చేరారు. ఢిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికలతో ఏబీవీపీ అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేశారు. విద్యార్థి సంఘం కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా పనిచేశారు. తర్వాత న్యాయ విద్య అభ్యసించి కొంతకాలం అడ్వొకేట్‌గా ప్రాక్టీస్ చేశారు. 2002లో బీజేపీలో చేరి యువజన విభాగం జాతీయ కార్యదర్శి సహా పలు హోదాల్లో పని చేశారు. మూడుసార్లు ఢిల్లీ కౌన్సిలర్‌గా గెలిచారు. సౌత్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎస్‌డీఎంసీ) మేయర్‌గా సేవలందించారు. మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కృషి చేశారు. బాలికల విద్య కోసం సుమేధ యోజన ప్రారంభించారు. 2022లో ఢిల్లీ మేయర్ పదవికి పోటీ పడి ఆప్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ చేతిలో ఓడారు. ప్రస్తుతం రేఖ బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలు. అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్‌బాగ్ నుంచి 29,595 వేల ఓట్ల మెజార్టీతో ఆప్ అభ్యర్థిపై గెలిచారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎక్కువ టికెట్లు ఎందుకమ్మారు?

ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ఘటనలో రైల్వేశాఖను ప్రశ్నించిన హైకోర్టు

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ఘటనపై రైల్వే శాఖను ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాధ్యతారహితంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లడానికి న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌కు వచ్చి ఫిబ్రవరి 15వ తేదీ రాత్రి దాదాపు ఒకే పేరుతో ఉన్న రెండు రైళ్లలో ఏది ఎక్కాలో తెలీక గందరగోళంలో జనం పరుగెత్తడంతో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే. దీంతో రైల్వేస్టేషన్లలో తొక్కిసలాట ఘటనలు జరక్కుండా రైలు బోగీల్లో ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే నిబంధనల్ని అమలు చేయాలంటూ అర్థ్ విధి అనే స్వచ్ఛంద సంస్థ వేసిన ప్రజా ప్రయోజనా వ్యాజ్యాన్ని జస్టిస్ తుషార్ రావు గేదెల, జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయల ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. ''ఒక్కో కోచ్‌లో ఎంత మంది ప్రయాణికులను అనుమతిస్తామనే నిబంధనను పూర్తిగా గాలికొదిలేశారు. ఒకవేళ ఒక్కో కోచ్‌లో ఇంత మంది ప్రయాణికులనే అనుమతిస్తామనే నిబంధన అమల్లో ఉంటే పరిమితికి మించి టికెట్లు ఎందుకు విక్రయించారు?. ఆ రాత్రి ఎన్ని లక్షల మంది ప్రయాణికులు స్టేషన్ కొచ్చారో మీకు అవగాహన ఉందా?. అంతమంది జనాన్ని అదుపుచేయడం అసాధ్యం.'' అని రైల్వేస్ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది. రైల్వే చట్టంలోని 57, 147 సెక్షన్ల అమలులో మీ నిర్లక్ష్యంపై స్పందన తెలుపుతూ అఫిడవిట్ వేయాలని ఆదేశించింది.


స్నానం, ఆచమనం నిరభ్యంతరంగా ఆచరించవచ్చు

- త్రివేణి సంగమంలో నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం
- గంగ, యమున నదుల్లో వ్యర్థాలు చేరకుండా చర్యలు చేపట్టాం
- కుంభమేళాపై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి
- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మండిపాటు

లక్నో: మహా కుంభమేళాపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, పవిత్రమైన కార్యక్రమాన్ని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా కుట్రలకు పాల్పడుతున్నాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మండిపడ్డారు. మహాకుంభమేళాను, సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. కుంభమేళా కేవలం ఒక మతపరమైన కార్యక్రమం కాదని చెప్పారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక అని స్పష్టంచేశారు. మన ప్రాచీన గ్రంథాల్లో కూడా కుంభమేళా ప్రస్తావన ఉందని పేర్కొన్నారు. మహా కుంభమేళాలో ఇప్పటిదాకా 56 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని వివరించారు. కుంభమేళా ప్రాధాన్యతను తగ్గించడానికి విపక్షాలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. భారతీయ ఆత్మ అయిన సనాతన ధర్మం గౌరవాన్ని మరింత పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలోని నీళ్లు స్నానానికి పనికిరావంటూ కొన్ని సంస్థలు, వ్యక్తులు చేస్తున్న వాదనను యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. త్రివేణి సంగమంలో నీళ్లు కలుషితమయ్యాయంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కుంభమేళా గురించి అసలేమీ తెలియని వాళ్లే ఇలాంటి దుష్ప్రచారానికి తెరతీశారని ధ్వజమెత్తారు. అక్కడి నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని స్పష్టంచేశారు. కేవలం స్నానాలకే కాదు, తాగడానికి సైతం ఆ నీళ్లు పనికొస్తాయని తేల్చిచెప్పారు. కుంభమేళాలో స్నానం, ఆచమనం నిరభ్యంతరంగా ఆచరించవచ్చని ఉద్ఘాటించారు. ఇటీవల కొన్ని అధ్యయనాలు సైతం ఈ విషయాన్ని నిర్ధారించాయని గుర్తుచేశారు. గంగ, యమున నదుల్లో వ్యర్థాలు చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని చెప్పారు.

మృత్యుకుంభ్ అనడం దారుణం

దేశం యావత్తూ ఘనంగా నిర్వహించుకుంటున్న పవిత్రమైన వేడుకపై ప్రతిపక్షాలు బురదజల్లడం హిందువుల మనోభావాలను గాయపరుస్తోందని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. మహాకుంభ్‌ను వ్యతిరేకిస్తున్న వాళ్లే రహస్యంగా త్రివేణి సంగమానికి వెళ్లి పవిత్ర స్నానాలు చేస్తున్నారని విపక్ష నాయకులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మహాకుంభ్ కాదు...మృత్యుకుంభ్ అనడం దారుణమని విపక్ష నేతలపై మండిపడ్డారు. కుంభమేళాలో తొక్కిసలాటలో మృతిచెందిన భక్తుల కుటుంబాలకు తమ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని వెల్లడించారు. బాధ్యతల నుంచి తాము తప్పించుకోవడం లేదన్నారు. తొక్కిసలాట ఘటనలో 30 మంది మరణించగా, 36 మంది గాయపడినట్టు తెలియజేశారు. కుంభమేళాలో పుణ్యస్నానాలు చేయడానికి వస్తూ రోడ్డు ప్రమాదాల్లో మరణించిన భక్తుల కుటుంబాలను కూడా ఆదుకుంటామని యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు.



అండగా ఉన్నోళ్లనే అక్కున చేర్చుకోండి

- కష్ట సమయాల్లో పార్టీని వీడిన వారిని పక్కనపెట్టండి
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జిలకు పార్టీ చీఫ్ ఖర్గే సూచన

సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ భావజాలానికి కట్టుబడి, ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీకోసం నిలబడిన వ్యక్తులను ప్రోత్సహించాలని, కష్ట సమయాల్లో పార్టీని వీడిన నేతలను దూరం పెట్టాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. 'పార్టీకి సైద్ధాంతికంగా కట్టుబడి ఉన్న వ్యక్తులను ప్రోత్సహించండి. కష్ట సమయాల్లో పారిపోయే బలహీనులకు దూరంగా ఉండండి. కొన్నిసార్లు పార్టీని బలోపేతం చేసే ప్రయత్నంలో భాగంగా కష్టకాలంలో పార్టీని వీడిన నేతలను తొందరపడి చేర్చుకుంటారు. మనం అలాంటి వ్యక్తులను దూరం పెడదాం' అని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలోని కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఇన్‌ఛార్జిలతో ఖర్గే సమావేశమయ్యారు. ఈ భేటీకి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హాజరయ్యారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ పటిష్టత, భవిష్యత్ ప్రణాళికలపై ఆ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడారు. 'పార్టీని బూత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బలోపేతం చేసే బాధ్యతను ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జీలు తీసుకోవాలి. ఈ పని కోసం మీరే బూత్‌కు వెళ్లాలి. కష్టపడి పనిచేయాలి. కార్మికులతో సంభాషించాలి. పార్టీ విభాగాలతో చర్చించాలి. సంస్థ పునర్ నిర్మాణంలో ఇండియన్ నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) ని భాగస్వాములను చేయండి'' అని ఖర్గే సూచించారు. ''రాష్ట్రాల్లో పార్టీ నిర్వహణ, భవిష్యత్తు ఎన్నికల ఫలితాలకు ఆయా రాష్ట్రాల ఇన్‌ఛార్జీలే బాధ్యత వహించాలి. ప్రత్యర్థి పార్టీలు ఎన్నికల సమయంలో మన పార్టీ మద్దతుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడమో లేక ఆ పేరును మరో బూత్‌లోకి మార్చడమో చేస్తున్నారు. ఈ రిగ్గింగ్‌ను ఎలాగైనా మనం ఆపాలి'' అని ఖర్గే పిలుపునిచ్చారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



వర్సిటీలు, ఎంబసీ ఉద్యోగుల పాత్ర?

నకిలీ సర్టిఫికెట్ల తతంగంలో వర్సిటీలు, ఎంబసీ ఉద్యోగుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందా నిర్వహించిన మహ్మద్ హబీబ్ వ్యవహారమే తాజా ఉదాహరణ. -8లో



ఇంటీరియర్.. ఇదో ట్రెండ్..

ఇంటీరియర్ డిజైనింగ్ కొత్త పుంతలు తొక్కుతోంది. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు మొదలు విలాసవంతమైన ఇళ్ల వరకు ఈ ట్రెండ్ కొనసాగుతోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/22.0

నగర పరిధిలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

నకిలీ టాస్క్‌ఫోర్స్ పోలీసు అరెస్టు

నిందితుడు మాజీ హోంగార్డు..

బంజారాహిల్స్: తాను టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌నని నమ్మించి పెద్దలతో పరిచయాలు ఉన్నాయని ఓ యువకుడిని వ్యాపారం పేరిట బోల్తా కొట్టించి డబ్బులు దండుకున్న ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన జ్ఞానసాయి ప్రసాద్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొద్ది రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని నిలోఫర్ హోటల్‌లో స్నేహితులతో కలిసి వ్యాపారానికి సంబంధించి చర్చిస్తున్నాడు.



నిందితుడు గోవర్ధన్

అమాయకులను బోల్తా కొట్టించడంలో ఆరితేరిన గోవర్దన్ అనే వ్యక్తి వీరి వద్దకు వచ్చి తాను టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌ను అంటూ.. ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పని చేస్తుంటానని చెప్పాడు. తనకు ఎంతోమంది పెద్దలతో పరిచయాలు ఉన్నాయని, వ్యాపారానికి పెట్టుబడి పెట్టిస్తానని నమ్మించాడు. జ్ఞానసాయిప్రసాద్ ఈ విషయం నమ్మి తనకు హోటల్ వ్యాపారం పెట్టాలని ఉందని చెప్పడంతో ఇందుకోసం ఖర్చవుతుందని గోవర్దన్ విడతలవారీగా రూ.2.82 లక్షలు తీసుకున్నాడు. ఎప్పుడు వ్యాపారం గురించి అడిగినా గోవర్దన్ దాటవేస్తూ వచ్చాడు. తాను టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌నంటూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నుంచి బయటికి వస్తున్నట్లు జ్ఞానసాయిప్రసాద్‌ను నమ్మించేవాడు. కొద్ది రోజులకు తాను మోసపోయానని తెలుసుకుని.. గోవర్దన్ గురించి ఆరా తీయగా నకిలీ పోలీస్ అని తేలింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఏపీలోని అనంతరం జిల్లా గుంతకల్ మండలం కాసాపురం గ్రామానికి చెందిన నిందితుడు 2009 నుంచి 2013 వరకు ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డ్‌గా పని చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీకి చెందిన వారిని అక్కడికి పంపించగా గోవర్దన్ ఫైల్ కూడా బదిలీ అయ్యింది. కొద్ది రోజులకే ప్రవర్తన బాగోలేకపోవడంతో ఆయనను సర్వీస్ నుంచి తొలగించారు.

అప్పటి నుంచి ఈజీ మనీ కోసం అలవాటు పడి.. ఖాకీ దుస్తుల్లో కొద్ది రోజులు పని చేసిన అనుభవం ఉండడంతో దీనిని ఆసరాగా చేసుకుని అమాయకులను మోసం చేయడం మొదలుపెట్టాడు. ఎక్కడైనా అమాయకులు కనిపిస్తే వారిని మాటల్లో పెట్టి తాను పోలీస్‌ననని నమ్మిస్తూ అందినకాడికి వసూలు చేసినట్లుగా తేలింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులో కుప్పకూలిన న్యాయవాది

కోర్టు చలాన్ డబ్బులు చెల్లిస్తుండగా ఘటన

కంటోన్మెంట్: కోర్టు చలాన్ డబ్బులు జమ చేసే నిమిత్తం బ్యాంకుకు వచ్చిన ఓ న్యాయవాది బ్యాంకులోనే కుప్పకూలి మరణించిన ఘటన మారేడుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాకలో ఉంటున్న న్యాయవాది వెంకటరమణ (58) సికింద్రాబాద్ కోర్టులో కేసులు వాదిస్తుంటారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మారేడుపల్లి కొండారెడ్డి స్ట్రీట్‌లో ఉన్న ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకుకు ఆయన వెళ్లారు. బ్యాంకు చలాన్ రిసీట్ తీసుకుంటూనే ఫ్లోర్‌పై కుప్పకూలడంతో ఆయన తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు వెంకటరమణకు సీపీఆర్ చేసేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. వెంకటరమణ మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద కుమార్తె అమెరికాలో ఉండగా, చిన్న కుమార్తె తల్లిదండ్రులతోనే ఉంటోంది. ఇటీవలే చిన్న కూతురు పెళ్లి నిశ్చయమైనట్లు సమాచారం. తండ్రి మరణ వార్త తెలిసిన వెంటనే బ్యాంకుకు చేరుకున్న వెంకటరమణ కుమార్తె కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడి వారిని కదిలించింది. మారేడుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బ్యాంకులో వెంకటరమణ మృతదేహం

రూ.20 లక్షలు ఇస్తా.. నన్ను మరిచిపో..

ప్రేమికురాలిని మోసగించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్




బంజారాహిల్స్: ప్రేమించానన్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. సదరు యువతితో చనువుగా మెదిలాడు. పెళ్లి మాట ఎత్తేసరికి మాత్రం .. మరిచిపో అంటూ తాపీగా చెప్పేశాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధిత యువతి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–10లోని గాయత్రీహిల్స్‌లో నివసిస్తున్న సాయిప్రణీత్ (26) సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పని చేస్తున్నాడు. ఆయన బెంగళూరులో ఉన్న సమయంలో 2023లో ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఒకే హాస్టల్ గదిలో పేయింగ్ గెస్ట్‌గా ఉండేవారు. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో నమ్మిన యువతి సాయిప్రణీత్‌తో సాన్నిహిత్యం పెంచుకుంది. అనంతరం నగరంలోని గాయత్రీ హిల్స్‌కు మకాం మార్చిన సాయిప్రణీత్.. కొద్ది రోజులు యువతితో కలిసి సహజీవనం కూడా చేశాడు. తన చెల్లెలి పెళ్లి తర్వాత మన పెళ్లి జరుగుతుందంటూ ఆమెను నమ్మించి గత ఏడాది నవంబర్‌లో వెళ్లిపోయాడు.

మీ చెల్లెలి పెళ్లి ఫొటోలు పంపించాలని యువతి చెప్పగా.. కొన్నింటిని పంపించాడు. ఆ ఫొటోలను చూసి అనుమానం వచ్చిన బాధితురాలు ఇటీవల మరింతగా ఒత్తిడి చేయడం ప్రారంభించింది. దీంతో రెండు రోజుల క్రితం సాయిప్రణీత్ గదికి వెళ్లిన ఆమెను కొట్టి.. మెడపట్టి గెంటివేశాడు. ఇన్ని రోజులు నాతో తిరిగినందుకు ఖరీదుగా రూ.20 లక్షలు ఇస్తాను.. మన బంధం మరిచిపో అంటూ చెప్పేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు జూబ్లీహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

శనివారాల్లో 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం'

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు



లక్డీకాపూల్: ఆస్తి పన్ను సమస్యల పరిష్కారం కోసం 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' (పీటీపీ) కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. గ్రేటర్ పరిధిలోని ప్రజలకు ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' (పీటీపీ) నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పన్ను సమస్యలు, పునఃసమీక్ష అభ్యర్థనలు (ఆర్పీఎస్) ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, బిల్ కలెక్టర్ల ద్వారా/ఆర్టీజీఎస్ ద్వారా చెల్లింపుల నమోదు, ఆన్‌లైన్ బకాయిలు సరిచేయడం, కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్ఎస్ సమస్యలు, స్వయం మూల్యాంకనం (సెల్ఫ్ అసెస్ మెంట్) తదితరాలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార కార్యక్రమం ఈ నెల 22న, మార్చి 1, 8, 15, 22,29 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు డిప్యూటీ కమిషనర్స్ కార్యాలయాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆస్తిపన్నుకు సంబంధించిన ఏవైనా సమస్యలున్న వారు తమ సంబంధిత జీహెచ్ ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పైన పేర్కొన్న తేదీలలో నిర్వహించే ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.



జై వీర శివాజీ

ఇమ్లిబన్ పార్కు సమీపంలోని బ్రిడ్జి వద్ద శివాజీ విగ్రహ ఊరేగింపు, శివాజీ చిత్రమున్న జెండాను చేబూని ఓ మహిళ నృత్యం

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శివాజీ విగ్రహాలను ఊరేగించి నివాళులర్పించారు. శత్రువులను గడగడలాడించి.. వీర శివాజీగా పేరు గడించి.. భరత మాత సేవలో పునీతుడయ్యాడని కొనియాడారు.

లీకేజీలకు చెక్!

ఐదు ప్రధాన పైపులైన్ మార్గాల్లో తనిఖీలు

షట్ డౌన్‌తో ముందస్తు మరమ్మతులు

- ఈ నెలాఖరులోగా లీకేజీల కట్టడి
- వేసవి నీటి సరఫరాలో అంతరాయం తలెత్తకుండా జలమండలి చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలోని నీటి సరఫరా పైపులైన్ల లీకేజీలపై జలమండలి దృష్టి సారించింది. మండుటెండలకు తాగునీటి వినియోగంతో పాటు పడిపోతున్న భూగర్భ జలాలతో ఇతర అవసరాలకు సైతం నీటికి డిమాండ్ పెరగుతోంది. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటి కంటే ఒక మిలియన్ గ్యాలన్ల లీటర్ ఫర్‌డే (ఎంజీడీ) కూడా అధికంగా సరఫరా చేసే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ప్రధాన జలాశయాల పైపులైన్ల మార్గమధ్యలో ఎక్కడ కూడా లీకేజీలతో నీరు వృథా కాకుండా పూర్తి స్థాయిలో సరఫరా జరిగే విధంగా చర్యలకు ఉపక్రమించింది. ప్రధాన పైపులైన్ మార్గాల్లో లీకేజీలను గుర్తించి షట్‌డౌన్‌తో యుద్ధ ప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించింది. గత నెల రోజులుగా ప్రధాన పైపులైన్ మార్గాల్లో లీకేజీలను అరికట్టే పనిలో పడింది. మరోవైపు క్షేత్ర స్థాయిలో సర్వీస్ పైపులైన్లపై దృష్టి సారించి మరమ్మతులు చేస్తోంది. ఈ నెలాఖరులోగా సాధ్యమైనంత వరకు లీకేజీల కట్టడితో వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించాలని జలమండలి భావిస్తోంది.

సరఫరా చేసే నీటిలో 20 శాతం వృథా..

జలమండలి రోజువారీగా సరఫరా చేస్తున్న నీటిలో సుమారు 20 శాతానికి పైగా నీరు లీకేజీలతో వృథాగా పోతున్నట్లు తెలుస్తోంది. మిగిలిన 80 శాతం నీరు సరిపోవడం లేదు. వాస్తవంగా మహా నగరానికి తాగునీటి అవసరాల జలాశయాలే ఆధారం. నగరం ఎత్తయిన ప్రదేశంతో పాటు రాళ్లు, కొండలతో నిండి ఉండటంతో భూగర్భ జలాలపై ఆధారపడకుండా వంద కిలోమీటర్ల దూరంలోని జలశయాల నుంచి నీటిని తరలిస్తున్నారు. కాగా.. మార్గమధ్యలో లీకేజీలు తప్పడం లేదు. ప్రస్తుతం నాగర్జున సాగర్ నుంచి మూడు దశల్లో 271 ఎంజీడీల కృష్ణాజలాలు, శ్రీపాద ఎల్లంపల్లి నుంచి 163.51 ఎంజీడీల గోదావరి జలాలు, ఉస్మాన్ సాగర్ నుంచి 20 ఎంజీడీలు, హిమాయత్‌సాగర్ నుంచి 10.45 ఎంజీడీలు, సింగూర్ మంజీరా నుంచి 109.48 ఎంజీడీల నీటిని తరలిస్తున్నట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వెంటాడుతున్న లీకేజీల సమస్య..

- గండిపేట నుంచి రోజువారీగా సుమారు 20 నుంచి 22 ఎంజీడీల నీరు తరలిస్తుండగా.. కాండూట్‌కు అడుగడుగునా లీకేజీల కారణంగా దాదాపు 8 నుంచి 10 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వరకు ఉన్న సుమారు 14.5 కిలోమీటర్ల పొడవు గల కాండూట్‌కు దాదాపు 45 ప్రాంతాల్లో లీకేజీ సమస్య వెంటాడుతోంది. అయితే.. నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా జర్మనీ టెక్నాలజీతో లీకేజీల మరమ్మతులకు జలమండలి ఉపక్రమించింది.

ఇప్పటికే 2 ఎంజీడీల నీటి వృథాను అరికట్టాం..



తాగునీటి సరఫరాలో పైపులైన్ల లీకేజీలను కట్టడి చేస్తున్నాం. ప్రధాన పైపులైన్ మార్గాల్లో నీటి సరఫరాకు అవసరమైతే షట్‌డౌన్ తీసుకొని మరమ్మతులు చేపడుతున్నాం. ఇప్పటికే గండిపేట కాండూట్ మరమ్మతులు చేపట్టి సుమారు రెండు ఎంజీడీల వరకు నీటి వృథాను అరికట్టగలిగాం.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

దళితవాడకు దారి!

దేవరయాంజాల్‌లో ప్రహరీ తొలగించిన హైడ్రా



దళిత వాడకు దారి ఏర్పాటు చేస్తున్న హైడ్రా సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: ఓ కాలనీ వెంచర్ నిర్వాహకులు దళితవాడకు వెళ్లే దారిని మూసేశారు. దీనిపై బాధితుడు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీని (హైడ్రా) ఆశ్రయించారు. దీని పూర్వాపరాలు పరిశీలించిన అధికారులు బుధవారం ప్రహరీ తొలగించి, దళితవాడకు సంబంధించిన దారిని పునరుద్ధరించారు. శామీర్‌పేట్ మండలం తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజాల్‌లో ఇది చోటు చేసుకుంది. ఒకప్పుడు ఈ దళితవాడకు వెళ్లేందుకు నలువైపుల నుంచి దారి ఉండేది. అక్కడ 1985లో తిరుమల కాలనీ పేరుతో ఓ వెంచర్ వచ్చింది. వీరు ఆ దారులు మూసేయడంతో దళితవాడకు చెందిన వారంతా కేవలం చిన్న బాటకు పరిమితమయ్యారు. దీనిపై వాళ్లు గతంలో పలుమార్లు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా ఫలితం దక్కలేదు. దీంతో ఈ నెల 17న హైడ్రా ప్రజావాణిలో కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 2022 ఫిబ్రవరిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఆ కమిషన్ ఆదేశాలను హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. తమ ప్రాంతానికి దారులు మూసుకుపోవడంతో కనీసం అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు కూడా రాలేని పరిస్థితి ఏర్పడిందని, తాము కూడా చుట్టూ తిరుగుతూ కేవలం ద్విచక్ర వాహనాలపై మాత్రమే రాకపోకలు సాగించగలుగుతున్నామని హైడ్రాకు విన్నవించారు. ఈ ఫిర్యాదుకు కీలక ప్రాధాన్యం ఇచ్చిన కమిషనర్ ఏవీ రంగనాథ్ నిబంధనలు, చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చివరకు ప్రహరీ తొలగించేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో హైడ్రా సిబ్బంది బుధవారం తిరుమల వెంచర్ నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. దీంతో తమ వాడకు దారి దొరికిందని దళితవాడకు చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గర్భిణీ స్త్రీలతో పాటు అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని తాము బయటకు మోసుకువచ్చి అంబులెన్సు ఎక్కించేవారమని, ఇప్పుడు దారులు తెరుచుకోవడంతో ఉపశమనం లభించినట్లు పేర్కొంటున్నారు.

బిర్యానీకి నో



హోటళ్లలో చికెన్ బిర్యానీ ఆర్డర్లు తగ్గుముఖం

- ఫుడ్ ఆర్డర్ యాప్స్‌లోనూ దీనిపై విముఖత
- బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో భారీగా పడిపోయిన అమ్మకాలు
- లబోదిబోమంటున్న నగర హోటళ్ల పరిశ్రమ

సాక్షి, సిటీబ్యూరో: బిర్యానీ.. ఈ పేరు వినగానే మాంసాహార ప్రియులకు పండగే. లొట్టలు వేసుకుంటూ లాగించాల్సిందే. చికెన్ బిర్యానీ అంటే మరింత మక్కువ. కానీ.. ప్రస్తుతం నగరంలో చికెన్ బిర్యానీల విక్రయాలు తగ్గిపోయాయి. ఫిష్, మటన్ బిర్యానీల వైపు మొగ్గు కనిపిస్తోంది. చికెన్ బిర్యానీ అమ్మకాలు ఒక్కసారిగా పడిపోయాయి. దీని అంతటికీ కారణం బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్. ఈ వైరస్ కారణంగా కోళ్లు చనిపోతుండటంతో చికెన్ బిర్యానీల విక్రయాలు ఒక్కసారిగా పడిపోయాయి. చికెన్‌తో చేసే వంటకాలకూ డిమాండ్ తగ్గిపోవడంతో హోటళ్ల పరిశ్రమ లబోదిబోమంటోంది. ఈ పరిణామాలు చివరికి గిగ్‌వర్కర్లపైనా పడింది. టేక్ అవే.. ఇతర ఆన్‌లైన్ ఆర్డర్లు కూడా తగ్గిపోవడంతో స్విగ్గీ, జొమాటో తదితర ఆహార పదార్థాల సరఫరాల రంగంపైనా ప్రభావం చూపుతోంది. ఐకానిక్ చికెన్ బిర్యానీ పరిస్థితి ఇలావుంటే.. కోడిగుడ్ల అమ్మకాలు క్రమంగా పడిపోతున్నాయి. బర్డ్‌ఫ్లూ ప్రభావం మన రాష్ట్రంలో లేదని పౌల్ట్రీరంగం, ప్రభుత్వం నిత్యం చెబుతున్నా.. పక్క రాష్ట్రంలో దీని ఆనవాళ్లు భారీగా ఉండడంతో చికెన్, గుడ్డు తినే అంశంపై జనాలు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు.

మాంసం, సీ ఫుడ్స్‌కే ప్రాధాన్యం..

గ్రేటర్ పరిధిలో ప్రతిరోజు 15 నుంచి 20 లక్షల చికెన్ బిర్యానీలు అమ్ముడవుతుండగా.. తాజాగా ఇవి సగానికి తగ్గిపోయినట్లు ప్రముఖ హోటల్ షాదాబ్ యజమాని స్పష్టం చేశారు. దీని స్థానంలో శాకాహార వంటకాలు లేదా మాంసం, సీ ఫుడ్స్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. బర్డ్‌ఫ్లూ మూలంగా చికెన్ బిర్యానీ ఆర్డర్లు భారీగా తగ్గాయని షాదాబ్ హోటల్ యజమాని ఆదిల్ సోహెల్ 'సాక్షి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో చికెన్ ఆర్డర్‌ను కూడా తగ్గించినట్లు ఆయన చెప్పారు. ఈ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఫిష్, మటన్‌ను ఎక్కువ వండి వడ్డిస్తున్నట్లు తెలిపారు. వీటికి డిమాండ్ పెరగడంతో వీటి సరఫరాదారులు ధరలు కూడా పెంచినట్లు ఆయన వివరించారు. 'ఇంతకు ముందు మేం రోజుకు 70– 80 హండీల బిర్యానీ సిద్ధం చేసేవాళ్లం. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ బిర్యానీ విక్రయాలు తగ్గాయి. 30 హండీలు కూడా సేల్ కావటం లేదు. గతంలో మేం 15 హండీల మటన్ మాత్రమే విక్రయించేవాళ్లం. ప్రస్తుతం మటన్ బిర్యానీకి గిరాకీ పెరిగింది. గతంలో కంటే మూడు రెట్లు ఎక్కువగా దాదాపు 45 హండీల మటన్ బిర్యానీ విక్రయిస్తున్నాం' అని అఫ్జల్‌గంజ్‌లోని న్యూ గ్రాండ్ హోటల్ యజమాని మహ్మద్ హుస్సేన్ యావరీ తెలిపారు. కాగా.. సాధారణ రోజుల్లోనే గ్రేటర్ పరిధిలో 3 లక్షల కిలోల చికెన్ అమ్మకాలు ఉండగా.. ఆదివారం 10– 12 లక్షల కిలోలు అమ్మేవారు. ప్రస్తుతం లక్ష కిలోల చికెన్ విక్రయాలు కూడా జరగడం లేదు.

తగ్గిన ఆన్‌లైన్ ఆర్డర్లు..

స్విగ్గీ ఆర్డర్లలో 90 శాతం చికెన్ బిర్యానీ ఉంటుంది. నాలుగు రోజులుగా స్విగ్గీ, జొమాటో నుంచి చికెన్ బిర్యానీలు ఆర్డర్ చేసే వారి సంఖ్య 70 శాతం మేరకు పడిపోయినట్లు సమాచారం.

దరఖాస్తులు దండిగా..

రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల్లో నమోదు

- వారం రోజుల్లో సుమారు 2 లక్షలకుపైగా అర్జీలు
- సర్కిల్ కార్యాయాల్లో ప్రతుల సమర్పణ
- కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ

మహానగరంలో కుటుంబాలు: 40 లక్షలు
దారిద్ర్య రేఖకు దిగువనున్నవి: 27.41 లక్షలు
గత పదేళ్లలో మంజూరైన రేషన్ కార్డులు: 1.21 లక్షలు
ఆహార భద్రత (రేషన్) కార్డులున్నవి: 17.21 లక్షలు
కార్డులు లేనివి: 10.10 లక్షలు
ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాలు: 5.73 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు నమోదు చేసి వాటి ప్రతులను సివిల్ సప్లయ్ సర్కిల్ కార్యాలయంలో సమర్పిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే సుమారు రెండు లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో హైదరాబాద్ పౌరసరఫరాల పరిధిలోని తొమ్మిది సర్కిళ్లలో మంగళవారం నాటికి 92,892, శివారులోని రంగారెడ్డి జిల్లా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో మరో 1.1 లక్షల వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. అధికారికంగా గత నాలుగేళ్లుగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరణ లేకుండా పోయింది. తాజాగా దరఖాస్తుల స్వీకరణకు అదేశాలు జారీ కావడంతో రేషన్ కార్డులు లేని నిరుపేదలు మీ సేవ కేంద్రాలకు క్యూ కడుతున్నారు.

కార్డుల సంఖ్యలో పెరిగిపోవడంతో..

పదేళ్ల క్రితం పౌరసరఫరాల శాఖ సంస్కరణలో భాగంగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కోసం ఈపీడీఎస్ ఎఫ్ఎస్‌సీ ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నిరంతర ప్రక్రియ అంటూ ఆదిలో వచ్చిన దరఖాస్తులు వచ్చినట్లే క్షేత్ర స్థాయి విచారణ జరిపి మంజూరు చేస్తూ వచ్చింది. కార్డుల సంఖ్య పెరిగిపోతుండటంతో మంజూరును నిలిపివేస్తూ దరఖాస్తులు మాత్రం స్వీకరిస్తూ వచ్చింది. దరఖాస్తుల పెండెన్సీ పెరిగిపోవడంతో 2021లో కొత్త వాటి స్వీకరణ ప్రక్రియను నిలిపివేసింది. అప్పటి వరకు వచ్చిన వాటిని 360 డిగ్రీల్లో పరిశీలించి అర్హత గల కుటుంబాలకు కార్డులు మంజూరు చేసింది. అప్పట్లో మొత్తమ్మీద దాదాపు 60 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఆన్‌లైన్ ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల చేసుకునే వెసులుబాటు లేకుండాపోయింది.

ప్రజా పాలనలో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం నిర్వహించిన ప్రజాపాలనలో పేద కుటుంబాల నుంచి పెద్ద ఎత్తున కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చి చేరాయి. వాస్తవంగా అధికారికంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ లేనప్పటికీ పేద కుటుంబాలు ఆరు గ్యారంటీల పథకాలతో పాటు ప్రత్యేకంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ప్రభుత్వం కూడా వాటిని ఆఫ్‌లైన్‌ల్లోనే స్వీకరించింది. వాటిని మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. అనంతరం ఇటీవల జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేని కుటుంబాలను గుర్తించి విచారణ జరిపింది. వార్డు సభలు ఏర్పాటు చేసి జాబితా ప్రకటిస్తామని ప్రకటించినప్పటికీ.. తీవ్ర వ్యతిరేకత రావడంతో తిరిగి ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుల స్వీకరణకు సిద్ధమైంది.

ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి


విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న మంత్రి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బోడుప్పల్: కాశీవిశ్వనాథ్ స్వామి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం బోడుప్పల్ కేశవనగర్ కాలనీలోని శ్రీ అన్నపూర్ణదేవి సహిత విశ్వనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు పూర్ణ కుంభం స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కోటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అరుదైన కాశీ విశ్వనాథుని ఆలయాన్ని బోడుప్పల్‌లో నిర్మించడం అభినందనీయమన్నారు. శ్రీ అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి కృపతో తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. ఆలయాన్ని నిర్మించిన శిల్పులకు, దాతలకు, కాలనీ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఉప్పల్, ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులను 18 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇస్తుందని ముఖ్యమంత్రి, మంత్రులకు అండగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షులు జెపి పటేల్, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజు, కోశాధికారి రాజేష్, ఉపాధ్యక్షులు బస్వారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

బండి సంజయ్ కేసు వాయిదా

సిటీ కోర్టులు: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు ఆయన గైర్హాజరు కావడంతో న్యాయవాది కరుణసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగత పనులతోపాటు పార్టీ కార్యకలాపాల నేపథ్యంలో ఆయన కోర్టుకు రాలేకపోయారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కోర్టు విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడలో రోడ్డుపై ఎన్నికల ప్రచార సభ ఏర్పాటు చేసినందుకు బండి సంజయ్‌తోపాటు మరో ఆరుగురిపై అక్కడి పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం విదితమే.

రంగరాజన్‌కు పరామర్శ

సాక్షి, సిటీబ్యూరో: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను ధార్మిక జనమోర్చా నాయకుడు డాక్టర్ ఆతిఫ్ ఇస్మాయిల్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ధార్మిక జనమోర్చా నాయకులు ఆయనపై జరిగిన దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. రంగరాజన్‌కు తామంతా అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. రంగరాజన్‌ను పరామర్శించిన వారిలో మజీదుల్లాఖాన్, మహమూద్ షరీఫ్, అజహర్ సులేమాన్ ఉన్నారు.

వర్సిటీలు, ఎంబసీ ఉద్యోగుల పాత్ర?

- సునీల్ కపూర్ చిక్కితేనే అనేక చిక్కుముడులు వీడేది
- అన్ని విభాగాలు స్పందిస్తేనే ఇలాంటి వారికి కట్టడి

నకిలీ సర్టిఫికెట్స్ కేసులో నగర పోలీసుల అనుమానం


మహ్మద్ హబీబ్


నకిలీ సర్టిఫికెట్లు చూపిస్తున్న పోలీసు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ సర్టిఫికెట్లతో అడ్డదారిలో అవకాశాలను తన్నుకుపోతున్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరుగుతోంది. ఫ్లై అబ్రాడ్ కన్సల్టెన్సీ కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల దందా నిర్వహించిన మహ్మద్ హబీబ్ వ్యవహారమే దీనికి తాజా ఉదాహరణ. ఉత్తరాదిలోనూ విస్తరించి ఉన్న ఈ భారీ నెట్‌వర్క్‌లో కొందరు యూనివర్సిటీలకు చెందిన ఉద్యోగులు, ఎంబసీల అధికారులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవస్థీకృత నేరాన్ని ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్న అధికారులు పరారీలో ఉన్న కీలక నిందితుడు సునీల్ కపూర్ కోసం గాలిస్తున్నారు.

ఏడేళ్లుగా వేల సర్టిఫికెట్లు విక్రయం...

పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులకు మంగళవారం చిక్కిన ముఠా నాయకుడు మహ్మద్ హబీబ్ 2012లో జేఎన్టీయూ నుంచి బీటెక్ (ఈఐఈ) పూర్తి చేశాడు. కొన్నాళ్లు పాటు టోలిచౌకిలోని ఓ కాలేజీలో పరిపాలన విభాగంలో పని చేశాడు. ఆపై మలక్‌పేటలో సొంతంగా అలీఫ్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ (ప్రస్తుతం దీని పేరు ఫ్లై అబ్రాడ్ కన్సల్టెన్సీ) ఏర్పాటు చేశాడు. ఢిల్లీకి చెందిన సునీల్ కపూర్ ఛత్తీస్‌గఢ్‌లోని బోర్డ్ ఆఫ్ స్కూల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో పనిచేస్తూ... తమ సంస్థ తరఫున ప్రచారం కోసం తరచు హైదరాబాద్ వస్తుండేవాడు. ఇలా ఇతడికి హబీబ్‌తో పరిచయం ఏర్పడింది. 2015లో అక్కడి హైకోర్టు బోర్డ్ ఆఫ్ స్కూల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై నిషేధం విధించింది. దీంతో నకిలీ సర్టిఫికెట్ల దందాకు దిగిన సునీల్ ఈ విషయం హబీబ్‌కు చెప్పాడు. అప్పటి నుంచి ఇద్దరూ ఈ సర్టిఫికెట్ల దందా మొదలుపెట్టారు. 2019, మార్చి 19న తొలిసారిగా హబీబ్ చిక్కాడు. అప్పటి నుంచి తన పంథా కొనసాగిస్తున్న ఈ ద్వయంపై ఇప్పటికి నాలుగు కేసులు నమోదయ్యాయి.

క్లియరెన్స్ నేపథ్యంలోనే అనుమానాలు...

వీరి వద్ద నకిలీ సర్టిఫికెట్లు ఖరీదు చేసిన వాళ్లల్లో అనేక మంది విదేశాలకు వెళ్లారు. ప్రధానంగా దుబాయ్, సౌదీ తదితర చోట్లకు వెళ్లి స్థిరపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దేశాలకు వెళ్లేప్పుడు అభ్యర్థుల సర్టిఫికెట్లను వీసా జారీకి ముందు ఎంబసీలు పరిశీలిస్తాయి. ఆయా యూనివర్సిటీలకు ఈ-మెయిల్ పంపడం ద్వారా సర్టిఫికెట్ల పూర్వాపరాలు సరి చూసుకుంటాయి. ఇలా వచ్చే మెయిల్స్‌కు స్పందించడానికి, అవి నిజమైనవే అంటూ జవాబు ఇవ్వడానికి ఆయా వర్సిటీల్లో కొందరిని సునీల్ కపూర్ ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అలా కానిపక్షంలో నకిలీ సర్టిఫికెట్లుగా గుర్తించి, వీసా జారీ ఆగిపోయేదని చెబుతున్నారు. క్లియరెన్స్ కోసం వర్సిటీ ఉద్యోగులను మేనేజ్ చేయడం సాధ్యం కానప్పుడు ఎంబసీలకు చెందిన వారినే చేసినట్లు భావిస్తున్నారు. దీనిపై స్పష్టత రావాలంటూ తొలుత సునీల్ కపూర్‌ను పట్టుకోవాల్సి ఉందని, అతడి విచారణలో కీలక విషయాలు బయటకు వస్తాయని అంటున్నారు.


ఆయా అధికారులూ స్పందించాల్సిందే...

ఈ నకిలీ సర్టిఫికెట్ల గ్యాంగ్ దొరికిన ప్రతిసారీ పోలీసులు పదుల సంఖ్యలో నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకుంటున్నారు. మంగళవారం సైతం వీరి నుంచి ఆంధ్రా, తెలంగాణ, అన్నా యూనివర్సిటీల సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ వీరిపై ఫిల్మ్‌నగర్‌లో ఒకే కేసు నమోదైంది. గతంలోనే ఇలానే జరగడంతో వీరికి తేలిగ్గా బెయిల్ దొరికి బయటకు వచ్చి దందా కొనసాగిస్తున్నారు. ఏదైనా అంశంలో ప్రభుత్వ అధికారుల సంతకాలు ఫోర్జరీ జరిగితే ఆయా అధికారులూ ఫిర్యాదు చేస్తారు. ఈ గ్యాంగ్ పలు యూనివర్సిటీలకు చెందిన రిజిస్ట్రార్లు, వీసీల సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ స్టాంపులు వేసి సర్టిఫికెట్లు తయారు చేస్తోంది. నిబంధనల ప్రకారం వారందరూ తమ పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్లలో వీరిపై ఫిర్యాదు చేసి, కేసులు నమోదు చేయించే అవకాశం ఉంది. అలా జరిగితే వీరిపై పీడీ యాక్ట్ ప్రయోగం, బెయిల్ అడ్డుకోవడం సాధ్యమవుతుంది. పోలీసులు ఈ కోణంలోనూ చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

తుంగభద్రలో నగర వైద్యురాలి గల్లంతు

– హంపీ విహారయాత్రలో విషాద ఘటన


గాలిస్తున్న పోలీసులు


బండరాయి మీద నుంచి దూకుతున్న అనన్య

సాక్షి, బళ్లారి: సరదాగా విహారయాత్రకు వచ్చిన యువ వైద్యురాలు తుంగభద్ర నదిలో మునిగిపోయింది. ఈ సంఘటన బుధవారం కర్ణాటకలోని హంపీ వద్ద చోటుచేసుకుంది. డాక్టర్ అనన్యరావు (27), స్నేహితుడు సాత్విక్, హషితలతో కలిసి హంపీ టూర్‌కి వచ్చారు. నది ఒడ్డున సణాపురలో ఓ రిసార్టులో మకాం వేశారు. బుధవారం మధ్యాహ్నం నదిలో ఈత కొట్టడానికి వచ్చారు. సుమారు 25 అడుగుల ఎత్తు గల బండరాయి నుంచి అనన్యరావు దూకి ఈత కొట్టాలనుకుంది. నదికి మరోవైపు నుంచి స్నేహితులు సరదాగా వీడియో తీస్తున్నారు. అంతెత్తు నుంచి దూకిన అనన్య కొన్ని క్షణాల పాటు ఈత కొట్టి నీటి ఉధృతికి నదిలో కొట్టుకుపోసాగింది. స్నేహితులు గట్టిగా కేకలు వేసినా ఫలితం లేదు. నీటి ప్రవాహంలో కనుమరుగైపోయింది. స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బందితో వచ్చి బండరాళ్ల మధ్య గాలించారు. రాత్రి అయినప్పటికీ అనన్యరావు జాడ కానరాలేదు. ఈ సంఘటన ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. అనన్యరావు తండ్రి డా.మోహన్ రావు అని, ఆమె వీకేసీ ఆస్పత్రిలో వైద్యురాలని తెలిసింది. కొప్పళ జిల్లా ఎస్పీ రామ్ అరసిద్ది మాట్లాడుతూ ఆమె కోసం గాలిస్తున్నామని, ప్రాణాలతో ఉందో లేదో తెలియదని అన్నారు. గంగావతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
10	3310	66.33
11	3365	67.09
12	3437	69.18
13	3455	69.04
14	3353	68.08
15	3203	64.87
16	2899	60.06
17	3358	66.07
18	3423	70.01

భానుడు భగభగ.. మీటర్ గిరగిర!

పగటి ఉష్ణోగ్రతలు 35.7 డిగ్రీలు

భానుడు భగ్గుమంటున్నాడు. తాజాగా పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.7 డిగ్రీలు నమోదు కాగా.. ఎండ తీవ్రతకు ప్రజలు విలవిలలాడుతున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లకు పనిచెప్పారు. దీంతో విద్యుత్ డిమాండ్ అమాంతం పెరిగింది. సగటున విద్యుత్ డిమాండ్ 60 మిలియన్ యూనిట్లు నమోదు కాగా.. అది తాజాగా 70ఎంయూకి దాటింది.

- ఉక్కపోతతో ప్రజలు విలవిల
- ఆన్ అయిన ఏసీలు, కూలర్లు
- పెరిగిన విద్యుత్ వినియోగం
- సగటున 60 మిలియన్ యూనిట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎండలు మండిపోతున్నాయి. గ్రేటర్‌లో బుధవారం పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.7 డిగ్రీలు, కనిష్ఠంగా 21.3 డిగ్రీలు నమోద య్యాయి. ఈ ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో ఉపశమనం కోసం ప్రజలు ఏసీలను ఆన్ చేస్తున్నారు. మొన్నటి వరకు మూలన పడిన కూలర్లు మళ్లీ వినియోగంలోకి వస్తున్నాయి. ఇంట్లోనే కాదు వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్‌లో ఉండటంతో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. ఫిబ్రవరి మొదటి రెండో వారం వరకు గ్రేటర్‌లో రోజు సగటున డిమాండ్ 60 మిలియన్ యూనిట్లు నమోదు కాగా, తాజాగా 70 ఎంయూ దాటింది.

అత్యవసరమైతేనే.. ఎల్సీలకు అనుమతి

విద్యుత్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజినీర్లలో ఆందోళన మొదలైంది. వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం డిస్కం ముందస్తు లైన్ల పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్‌లలో ఆయిల్ లీకేజీల నియంత్రణ చర్యలు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, లూజు లైన్లను సరి చేయడం, దెబ్బతిన్న ఇన్సులేటర్లను మార్చడం, ఎర్తింగ్ సిస్టం పక్కాగా ఉండేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం సబ్‌స్టేషన్ల మధ్య ఇంటర్ లింకింగ్ వర్క్స్ నిర్వహిస్తుంది. వారం పది రోజుల్లో వీటిని కూడా పూర్తి చేయనుంది. మార్చి మొదటి వారంలో ఇంటర్మీడియట్, రెండో మూడో వారంలో టెన్త్ వార్షిక పరీక్షలు మొదలు కానున్నాయి. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లైన్ క్లియరెన్స్ (ఎల్సీ)లకు స్వస్తి చెప్పింది. అత్యవసరమైతే తప్ప.. ఎల్సీలకు అనుమతి ఇవ్వడం లేదు.

ఫిబ్రవరిలోనే.. ఏప్రిల్ డిమాండ్

మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కానీ 2022 ఏప్రిల్ నెలలో నమోదైన సగటు గరిష్ఠ (3435 మెగావాట్లు)డిమాండ్.. ప్రస్తుతం ఫిబ్రవరిలోనే (3455 మెగావాట్లు) నమోదవుతోంది. ఇక మార్చి, ఏప్రిల్ నెలలో డిమాండ్ ఎంత పెరుగుతుందో అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. మే చివరి నాటికి రోజు సగటు డిమాండ్ 100 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేస్తోంది.

ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రణాళికలు

60 శాతానికి మించి లోడు ఉన్న 33కేవీ, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, ప్రత్యామ్నాయ మార్గాలకు విద్యుత్ పంపిణీ సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం 571 (33కేవీ) సబ్‌స్టేషన్లు ఉండగా, వీటి సామర్థ్యం 9,675 ఎంవీఏగా ఉంది. కొత్తగా మరో 213(33/11 కేవీ) సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు గ్లోబల్ టెండర్లు పిలిచింది. పనులు చేసేందుకు ముందుకు వచ్చే కాంట్రాక్టర్లకు ఆయా సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు అప్పగించి, నిర్దేశిత లక్ష్యం లోగా వాటిని పూర్తి చేయించాలని డిస్కం నిర్ణయించింది. అంతే కాదు కొత్తగా నాలుగు వేల కిలో మీటర్ల 33 కేవీ లైన్లు, ఏడు వేల కిలో మీటర్ల 11 కేవీ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సీఎండీ ముషారఫ్ ఫరూఖీ రోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఎస్‌ఈలు, సీజీఎంలు, డీఈలతో సమావేశాలు ఏర్పాటు చేసి, లైన్ల పునరుద్ధరణ, కొత్త లైన్ల ఏర్పాటు వంటి పనులను సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా నిజాంపేట, బాచుపల్లి, కూకట్‌పల్లి, గండి మైసమ్మ, అమీన్‌పూర్‌లలో నమోదవుతున్న విద్యుత్ డిమాండ్, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రూ.212.20 కోట్లతో బౌరంపేటలో కొత్తగా నిర్మించిన 220/132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఈ నెలాఖరు లోగా ఛార్జ్ చేయనున్నారు.

ఫైళ్ల పెండింగ్‌పై సీఎండీ సీరియస్

సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్ నగర్, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో కొత్త కనెక్షన్ల జారీకి సంబంధించిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటాన్ని సీఎండీ ఫారూఖీ సీరియస్‌గా తీసుకున్నారు. బుధవారం ఉదయం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయా సర్కిళ్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయా కనెక్షన్లను ఎందుకు పెండింగ్‌లో పెట్టాల్సి వచ్చిందని నిలదీసినట్లు తెలిసింది. నిర్దేశించిన గడువులోగా కనెక్షన్లు జారీ చేయాలని ఆదేశించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా సైబర్ సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని కొంత మంది ఇంజినీర్లు తీరు మార్చుకోవడం లేదని, పరిస్థితిలో మార్పు రాకపోతే ఉపేక్షించబోమని హెచ్చరించినట్లు తెలిసింది.

ఉత్తమ కళా ఖండాలకు నేడు అవార్డులు ప్రదానం

నాంపల్లి: నుమాయిష్‌లో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ పలువుర్ని ఆకట్టుకుంది. ఇక్కడ ఉంచిన చిత్రాలు మంచి గుర్తింపు పొందాయి. వీటిలో కొన్ని కళాఖండాలు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికయ్యాయి. ప్రదర్శనలో ఉంచిన 200 బొమ్మల్లో సుమారు 50 మంది గీసిన చిత్రాలు ఉత్తమంగా నిలిచాయి. వీటిని ఆవిష్కరించిన కళాకారులకు గురువారం ఉదయం 11 గంటలకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డులను బహూకరిస్తారు. హైదరాబాదు ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి.రమణారెడ్డి అధ్యక్షతన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని గాంధీ సెంటినరీ హాలులో ఈ ప్రదానోత్సవ సభ ఏర్పాటు చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరవుతారు.

పరువు నష్టం కేసులో తీర్పు రిజర్వు

సిటీ కోర్టులు: సీఎం రేవంతర్ రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఇరువురి తరుపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. అనంతరం కోర్టు తీర్పును రిజర్వు చేస్తూ మార్చి 3కు వాయిదా వేసింది. అదే రోజు తీర్పును వెల్లడించనున్నట్లు సమాచారం. అయితే ఈ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గతేడాది మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగా సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీపై అసత్య ఆరోపణలు చేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే

కెనడాకు పంపిస్తానని రూ.10 లక్షలు వసూలు

– నిందితురాలిపై కేసు నమోదు

బంజారాహిల్స్: కెనడా దేశానికి పంపిస్తానని నమ్మించి అమాయక యువతుల నుంచి లక్షలాది రూపాయలు దండుకుని పరారైన మహిళపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..ఎన్టీఆర్ జిల్లా చిన్న నందిగామకు చెందిన యువతి (24) బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఓ ఆస్పత్రి హాస్టల్‌లో ఉంటుంది. ఇటీవల ఆమెకు మాధవి అనే మహిళ తన పెద్దమ్మ ద్వారా పరిచయమైంది. విదేశాల్లో తనకు ఎన్నో పరిచయాలు ఉన్నాయని, కెనడాకు పంపిస్తానని మాధవి నమ్మించి ఇందుకోసం రూ.3.30 లక్షలు బాధిత యువతి నుంచి వసూలు చేసింది. ఆమె లాగే మరో 10 మంది వరకు కెనడాకు పంపిస్తానని చెప్పడంతో రూ.10.60 లక్షలు చెల్లించారు. అయితే ఎన్నిసార్లు అడిగినా నిందితురాలు మాధవి దాటవేస్తూ వస్తుంది. మీరు ఒత్తిడి తీసుకువస్తే మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించసాగింది. నాలుగు రోజుల క్రితం ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లగా ఇల్లు ఖాళీ చేయడమే కాకుండా ఫోన్ కూడా స్విచ్చాఫ్ ఉండడంతో తాము మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు మాధవితో పాటు ఆమె భర్త అజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా వ్యాపారవేత్తకు ఆన్‌లైన్ వేధింపులు

– సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ కేంద్రంగా వ్యాపారం చేస్తున్న ఓ మహిళా వ్యాపారవేత్తకు (26) వేధింపులు ఎదురయ్యాయి. దీనిపై బాధితురాలి ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో బుధవారం కేసు నమోదైంది. ఈమె ఉత్పత్తులు ఖరీదు చేస్తానంటూ ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో సంప్రదించాడు. అనివార్య కారణాల నేపథ్యంలో ఆమె నిరాకరించడంతో ఫోన్ చేసి ఒత్తిడి చేయడం మొదలెట్టాడు. దీంతో ఆమెకు సంబంధించిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేయడం మొదలెట్టాడు. నకిలీ ఇన్‌స్టాగామ్ ఖాతా ద్వారా ఈ ధోరణి కొనసాగించాడు. తన వ్యాపారంపై ఎలాంటి ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో ఆమె చాలాకాలం ఈ వేధింపులను ఉపేక్షించారు. చివరకు అతగాడు ఆమె యూట్యూబ్ ఛానల్‌లోనూ అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో ఎట్టకేలకు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

బావపై కత్తితో బావమరిది దాడి

పోచారం: బావపై బావమరిది కత్తితో దాడి చేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంపల్లి టూబీహెచ్‌కేలో ఉంటున్న సయ్యద్ అలీ, అతని భార్య రుక్సానా మధ్య యాకుత్‌పురాలోని 100 చదరపు గజాల ఇంటి విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సయ్యద్ అలీపై కోపం పెంచుకున్న అతడి బావమరిది జాఫర్ అలీ, మరో ముగ్గురితో కలిసి బుధవారం రాత్రి కత్తులతో దాడి చేశాడు. ఈ ఘటనలో అతడి కడుపులో, చేతిపై గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల మౌనం?



బస్తీలోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణం

రహమత్‌నగర్: అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చడం..కొన్ని రోజులకే పునః నిర్మాణం జరగడం రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ పరిపాటిగా మారుతుంది. ఇందుకు మహాత్మానగర్‌లో జరిగిన ఘటనే ఉదాహరణగా చెప్పవచ్చు. మహాత్మా నగర్‌లో గతేడాది ఆగస్టులో ఓ మహిళ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం అందుకున్న ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది బస్తీకి చేరుకుని సదరు నిర్మాణాన్ని కూల్చివేశారు. అయితే కొన్ని నెలల తతార్వత ఓ నాయకురాలి అండతో సదరు మహిళ అదే స్థలంలో ఇంటి నిర్మాణం ప్రారంభించిందని బస్తీవాసులు చెబుతున్నారు. ఇదే విషయంపై బస్తీ అధ్యక్షుడు అనంద్‌కూమార్ పలుమార్లు సికింద్రాబాద్ ఆర్డీఓ, ఖైరతాబాద్ మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఇదే విషయమై గతనెలలో ప్రజా పాలనలో కూడా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై నిఘా ఉంచాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: మహా శివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 26న సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 6 గంటలవరకు 'శంభో..స్వయంభో మహాశివరాత్రి అహోరాత్ర అభిషేకాలు' పేరుతో జాగారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్వయం భూ సాలగ్రామ శ్వేతార్క గణపతి సహిత చాముండేశ్వరి అనుగ్రహ పీఠాధిపతులు కృష్ణచాముండేశ్వర మహర్షి తెలిపారు. ఈ కార్యక్రమం కూకట్‌పల్లి, కైత్లాపూర్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన కన్వీనర్ డాక్టర్ జి.వెంకటేశ్వర రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాక్షరి మంత్ర జప జాగరణ, మహారుద్రాభిషేకం, వేదపారాయణం, విశేష పూజలు, జపం, అభిషేకాలు, స్వామీజీల ప్రవచనాలు, ఆధ్యాత్మిక మార్గదర్శనం, భక్తి సంగీత విభావరి, భజనలు, కీర్తనలు, సంగీత నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారన్నారు.

మొండి గోడలు వెక్కిరిస్తున్నాయి



ఆశయ్యనగర్‌లో..



నవీన్‌నగర్‌లో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ పనులు

అర్ధంతరంగా కమ్యూనిటీ హాళ్ల పనులు

రహమత్‌నగర్: ప్రజల అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టిన సామాజిక భవనాలు నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా శుభకార్యాలు,సభలు,సమావేశాలు నిర్వహించుకునే సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లో గత ప్రభుత్వ హయాంలో నవీన్‌నగర్, ఆశయ్యనగర్, కమలానగర్ బస్తీల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే నవీన్‌నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు కాక మధ్యలోనే ఆగిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా నేటికి పనులు పునఃప్రారంభం కావడం లేదు. అలాగే కమలానగర్ బస్తీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు గోడలవరకే పరిమితం కాగా, ఆశయ్యనగర్ బస్తీలోని కమ్యూనిటీ హాల్‌కు ప్రహరీ లేక పై అంతస్తు నిర్మాణం జరగలేదు. దీంతో ఆయా బస్తీల ప్రజలు శుభకార్యాలు జరుపుకోవాలంటే ఫంక్షన్ హాళ్లను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఇదే పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన కమ్యూనిటీ హాళ్లను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఆటోలో మృతిచెందిన ఉప్పలయ్య

వరంగల్ క్రైం: బోరబండకు చెందిన ఆటో డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏసీపీ దేవేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన ఉప్పలయ్య హైదరాబాద్‌లో రాకేశ్ అనే వ్యక్తి నుంచి గత నెల 23న ఆటోను కిరాయికి తీసుకుని నడుపుతున్నాడు. బుధవారం ఆటోలో హనుమకొండకు వచ్చాడు. ఆటో హంటర్‌రోడ్డులో నిలిపి ఉండగా వెనక సీట్లో మృతిచెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఉప్పలయ్యను ఎవరైనా హత్య చేశారా? లేదా సాధారణంగా మృతి చెందాడా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఆటో నంబర్ ఆధారంగా యజమానితో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నట్లు ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు.

పైపులైన్ వేశాక హైడ్రాలిక్ టెస్టింగ్

- నీటి సరఫరా సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు పరీక్ష
- ముందస్తుగానే లోపాలు సరిదిద్దుకోవడానికి అవకాశం
- లోపాలు బయటపడితే వెంటనే మరమ్మతు



హైడ్రాలిక్ టెస్టింగ్ చేస్తున్న జలమండలి అధికారులు

బంజారాహిల్స్: భారీ పైపులైన్ల నిర్మాణం జరిగిన తర్వాత జాయింట్లు సరిగ్గా కుదిరాయో లేదో తెలుసుకోవడంతో పాటు ఎక్కడైనా పైపులైన్లు వేసే క్రమంలో లోపాలు తలెత్తితే వాటిని సరిదిద్దుకోవడానికి వీలుగా జలమండలి పైప్‌లైన్లు వేయగానే హైడ్రాలిక్ టెస్టింగ్ చేస్తుంది. ఈ తనిఖీల ద్వారా పైప్‌లైన్లలో మంచినీటి సామర్థ్యం ఒత్తిడిని తట్టుకుంటుందా? లేదా? అని సరిచూస్తారు. దీనివల్ల పైప్‌లైన్లు వేసిన తర్వాత కొద్ది రోజులకు ఎక్కడైనా లోపాలు తలెత్తితే మళ్లీ మళ్లీ తవ్వకాలు లేకుండా ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది. జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 23 వాటర్ రిజర్వాయర్ల పరిధిలో ఇటీవల కొత్తగా వేస్తున్న భారీ పైప్‌లైన్ల నిర్మాణం తర్వాత హైడ్రాలిక్ టెస్టింగ్ చేసిన తర్వాతనే నీటి సరఫరా కొనసాగిస్తున్నారు.

ముందస్తుగా లీకేజీల గుర్తింపు..

గతంలో హైడ్రాలిక్ టెస్ట్ చేయకుండానే కొత్తగా వేసిన పైపుల ద్వారా నీటి సరఫరా జరిగినప్పుడు కొద్ది రోజులకే మరమ్మతు చేయాల్సి వస్తోంది. జాయింట్లు కొత్త కదలికతో మరమ్మతుకు వచ్చేవి. కొన్ని చోట్ల లీకేజీలు కూడా జరిగేవి. దీనివల్ల సమయంతో పాటు డబ్బు కూడా వృథా అవుతుండడం గమనించిన జలమండలి అధికారులు ముందస్తుగానే లోపాలు సరిదిద్దడానికి ఈ పరీక్ష ద్వారా తెలుసుకుని వాటిని పునరుద్ధరిస్తున్నారు. ఇటీవల ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో జలమండలి కొత్తగా భారీ మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణాలు చేపట్టింది. తాజాగా కొన్ని చోట్ల పైపులైన్ల నిర్మాణం కూడా జరుగుతుంది. రాబోయే రోజుల్లో కూడా భారీ పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులు కూడా మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో రిజర్వాయర్లకు మంచినీటి సరఫరా జరగకముందే హైడ్రాలిక్ టెస్టింగ్ బాగా ఉపయోగపడుతుంది.దీని ద్వారా ఎక్కడైనా లీకేజీ ఉంటే వెంటనే తెలుస్తుంది. దీనికి తోడు ఈ పరీక్ష జరిపేటప్పుడు నీటి ఒత్తిడిని పెంచి సరఫరా సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు.

మూడుసార్లు టెస్టింగ్ ప్రక్రియ

మొదటి దశలో 24 గంటల పాటు నీటి ఒత్తిడితో సరఫరా చేసి ఎక్కడైనా లోపాలు తలెత్తితే వాటిని సరిదిద్దుతున్నారు. ఆ తర్వాత కూడా 2 నుంచి 3 సార్లు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేవని ఈ పరీక్ష ద్వారా నిర్ధారించాక లైనింగ్ క్లియర్ ఫర్ ఆపరేషన్ అని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుంది. జాయింట్ల సామర్థ్యాన్ని టెస్ట్ చేసేందుకే ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 300 ఎంఎం డయా, ఆపై పైప్‌లైన్లు వేసినప్పుడు ఈ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా లోపాలు బయటపడితే వాటిని సరిద్దిద్దుకోవడానికి ఈ పరీక్షలు బాగా ఉపయోగపడతాయని అధికారులు పేర్కొంటున్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ఫిలింనగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌లోని హకీంపేటలో నివసించే బానావత్ హనుమంత్ అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 170 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని హనుమంత్‌పై కేసు నమోదు చేశారు.

- టోలిచౌకీ హకీంపేట లిమ్రా హోటల్ వద్ద నివసించే షేక్ ఆయూబ్ గత కొంతకాలంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు ఫిలింనగర్ పోలీసులకు సమాచారం అందింది. బుధవారం దాడిచేసి 45 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నిషేధిత సిగరెట్ల విక్రేత అరెస్టు

బంజారాహిల్స్: నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బలక్రంపేటకు చెందిన వెంకట సాంబశివరావు యూసుఫ్‌గూడ వెంకటగిరి ప్రాంతంలో కిరాణా షాపు నిర్వహిస్తూ అందులోనే నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పలు సిగరెట్ల ప్యాకెట్లు సాధీనం చేసుకుని వెంకట సాంబశివరావును అరెస్టు చేశారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఇద్దరు మహిళలకు జైలు

పంజగుట్ట: రహదారులపై రాకపోకలు సాగించే వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న యువతులను పట్టుకోవడానికి వెళ్లిన కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో ఇద్దరు మహిళలకు జైలుశిక్ష విధించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లికి చెందిన పర్వేజ్‌బేగం (40), అదే ప్రాంతానికి చెందిన షాహీన్‌బేగం (33) 2017లో ఎర్రమంజిల్ వీధిలో రాత్రిసమయంలో రోడ్లపై రాకపోకలు సాగించే వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. గమనించిన డ్యూటీలో ఉన్న అప్పటి పంజగుట్ట కానిస్టేబుల్ కిషోర్ (ప్రస్తుతం జూబ్లీహిల్స్ పీఎస్) వారిని అడ్డుకునేందుకు యత్నించగా అతడిపై రాళ్లతో దాడి చేయగా తలకు తీవ్ర గాయామైంది. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జీషిట్ దాఖలు చేయగా విచారించిన నాంపల్లి కోర్టు బుధవారం ఇద్దరికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి



హోటల్‌ను సీజ్ చేయడానికి వచ్చిన జీహెచ్‌ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: ఆరేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించకుండా బకాయి పడ్డ హోటల్‌ను జప్తు చేసేందుకు జీహెచ్ఎంసీ సర్కిల్–18 పన్నుల విభాగం అధికారులు రావడంతో స్పందించిన యజమాని కొంత డబ్బును చెల్లించాడు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్ భవనం యజమాని 2009 నుంచి ఆస్తి పన్ను చెల్లించడం లేదు. డిమాండ్, రెడ్ నోటీసులు జారీ చేసిన అధికారులు ఇటీవల ఆస్తులు జప్తు చేస్తామంటూ వారెంట్లు జారీ చేశారు. అయినా స్పందించకపోవడంతో బుధవారం ఏఎంసీ ఉప్పలయ్య, పన్నుల విభాగం అధికారి విఠల్, ఇతర సిబ్బందితో కలిసి హోటల్‌ను సీజ్ చేసేందుకు వచ్చారు. ఈ భవనం రూ.1.28 కోట్లు ఆస్తి పన్ను బకాయిపడడంతో ఆస్తులు జప్తు చేస్తామని అధికారులు హెచ్చరించగా యజమాని వచ్చి రూ.31 లక్షల చెక్కు అందజేసి మిగతాది మార్చి 31వ లోపు చెల్లిస్తానని హామీ పత్రంలో రాసిచ్చాడు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు.

నేడు చలో విద్యుత్ సౌధ



ప్రచారం చేస్తున్న టీవీఏసీ జేఏసీ నేతలు

బంజారాహిల్స్: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ (టీవీఏసీ) జేఏసీ ఆధ్వర్యంలో గురువారం చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ చైర్మన్ ధన్‌రాజ్, కన్వీనర్ శంకర్‌నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేష, టి.శ్రీనివాస్, ఖాదర్‌ఖాన్, పైసలుల్లాఖాన్, నందీశ్వర్‌రెడ్డి వాల్‌పోస్టర్ల ద్వారా చలో విద్యుత్ సౌధపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే అనేక పోరాటాల ద్వారా యాజమాన్యం, ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేలకూ వినతిపత్రాలను కూడా ఇచ్చామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారమే తమకు ఆర్టిజన్ కన్వర్షన్ ఇచ్చి న్యాయం చేయాలన్నారు.


ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న సుల్తాన్ యాదగిరి, ప్రఫూల్ రాంరెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ఉద్యమకారులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 250 గజాల ఇంటి స్థలాన్ని, నెలకు రూ.30వేల గౌరవ వేతనాన్ని ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులకు జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫూల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమంలో పనిచేసిన కళాకారులను సాంస్కృతిక సారథిలోని వివిధ పోస్టుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు ఆరోగ్య బీమా, అర్హులైన కుటుంబాలకు సంక్షేమ నిధిని అందించాలని కోరారు. ప్రతి జిల్లాలో అమరులైన ఉద్యమకారులకు స్మారక భవనం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోమన్న, యాదగిరి, చంద్రన్న, ప్రసాద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి



ట్రాన్స్‌జెండర్స్ సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్స్ వెల్ఫేర్ అకాడమీని ఏర్పాటు చేయాలని టీపీఎస్‌కె రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ట్రాన్స్‌జెండర్స్, టీపీఎస్‌కే ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అత్యంత వివక్షకు గురతున్న ట్రాన్స్‌జెండర్స్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణలో మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి విడదీసి ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్స్ ఇజ్రా వెల్ఫేర్ అకాడమీని ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాన్స్‌జెండర్స్ ఆరోగ్య సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 32మందికి ట్రాఫిక్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశారన్నారు. అర్హత కలిగిన వారందరికీ అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ నాయకులు ప్రియా, నగ్మా, హారతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యం, దేశభక్తికి మారుపేరు శివాజీ



నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయారెడ్డి

ఫిలింనగర్: ధైర్యం, దేశ, దైవభక్తికి శివాజీ మారుపేరని పలువురు నేతలు కొనియాడారు. జూబ్లీహిల్స్ డివిజన్ బీజేవైఎం నాయకుడు మంజలి నర్సింహ, గుంటి ఆనందసాగర్ ఆధ్వర్యంలో బుధవారం దీన్‌దయాళ్‌నగర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..కోట్లాది భారతీయులకు స్ఫూర్తిదాయకుడు, మరాఠా యోధుడు, భరతమాత ముద్దు బిడ్డ ఛత్రపతి శివాజీ మహరాజ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో శశిశేఖర్, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్, బోయ రామాంజనేయులు, గందె అరుణ్‌కుమార్, దండుగుల శేఖర్, గణేష్‌యాదవ్ పాల్గొన్నారు.



గౌతమ్‌నగర్ చౌరస్తాలో..

రహమత్‌నగర్ : ఛత్రపతి శివాజీ గొప్ప పోరాట యోధుడని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కొనియాడారు.శివాజీ శివాజీ జయంతి సందర్భంగా బుధవారం ఎస్ఆర్‌టీనగర్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శివాజీ పోరాట చరిత్ర భారతీయులందరికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ ఎన్ఎస్‌బీనగర్‌లో స్థానిక యువకులు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

గౌతమ్‌నగర్ చౌరస్తాలో..

జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటూరి రమేష్, డాన్ రాజ్, బి.నాగార్జున, ఆంజనేయులు ఆధ్వర్యంలో గౌతమ్‌నగర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఖైరతాబాద్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బుధవారం ఖైరతాబాద్ డివిజన్‌లోని రైల్వే గేట్ చౌరస్తాలో ఉన్న శివాజీ విగ్రహానికి కార్పొరేటర్ విజయారెడ్డి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



దీన్‌దయాళ్‌నగర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

రహమత్‌నగర్ డివిజన్‌లో కలెక్టర్ పర్యటన



మాట్లాడుతున్న కలెక్టర్

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం పర్యటించారు. తొలుత ఆయన ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానాన్ని పరిశీలించిన అనంతరం దళిత్ స్టడీ సెంటర్ భవనాన్ని సందర్శించారు. ఆ తర్వాత శ్రీరాంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని అక్కడి సమస్యలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇంటిముందు పార్కింగ్ వద్దన్నందుకు చితకబాదారు

బంజారాహిల్స్: తన ఇంటి ముందు పార్కింగ్ చేయవద్దని చెప్పిన యజమానిపై దాడిచేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రోడ్డునెంబర్–11లోని సెర్వీ హోటల్ వెనుక నివసించే ఖలీల్‌బాషా అనే వ్యక్తి ఇంటి ముందు ఈ నెల 17న మధ్యాహ్నం కొంత మంది బైక్‌లపై వచ్చి గేటు ముందు పార్కింగ్ చేశారు. ఇందుకు ఖలీల్‌పాషా అభ్యంతరం వ్యక్తం చేసి ఇక్కడి నుంచి తొలగించాలని కోరగా కోపోద్రిక్తులైన వారు ఖలీల్‌ను చితకబాదారు. అంతటితో ఆగకుండా కర్రలతో కొడుతూ అంతు చూస్తామని బెదిరించారు. తాము పోలీసు ఆఫీసర్లమని అంటూ తప్పుడు హెచ్చరికలు జారీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

నిత్యావర వస్తువులు అందజేత



శ్రీనగర్‌కాలనీ: కల్యాణ్‌నగర్ వెంచర్–3 సారథి సొసైటీలోని శ్రీ ఆదర్శ అనాథ శరణాలయాన్ని బుధవారం కన్స్యూమర్ రైట్స్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిత్యావసర వస్తువులు, ఆట సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు మాచర్ల పీటర్, నాగరాజు, భరత్, రమేష్, వినోద్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

శ్రీనగర్‌కాలనీ: అక్రమ కట్టడాలను ఉపేక్షించబోమని జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి నరేష్ అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వద్ద పరిమితికి మించి నిర్మించిన అంతస్తులను కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ అధికారి మాట్లాడుతూ.. సర్కిల్‌లోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆర్టీసీ సమ్మెకు ఉద్యోగులు సిద్ధం

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వద్ద బుధవారం డిపో నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు సమ్మెకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు ఈదురు వెంకన్న, కమలాకర్‌గౌడ్, బాబు, సురేష్, సారంగి, అశోక్, మురళీ కృష్ణ, ఐలయ్య, రాంరెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని విశ్వసాయి మందిరంలో శ్రీ సాయిబాబా మాఘ మాస మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్వామివారికి ఉసిరి రసంతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
– బంజారాహిల్స్

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, గురువారం, 20 ఫిబ్రవరి 2025





ఈ తరం.. సాధారణ జీవనానికి భిన్నంగా.. వినూత్నమైన, విభిన్నమైన పంథాను, జీవనసరళిని కొనసాగించడం ట్రెండ్‌గా మారింది. ఇందులో భాగంగానే అధునాతనాన్ని అందిపుచ్చుకుంటూ నగర జీవనశైలికి కూడా అప్‌డేట్ అవుతూనే ఉంది. ప్రధానంగా ఇంటీరియర్ డిజైనింగ్ ఈ దశాబ్ద కాలంలో కొత్తపుంతలు తొక్కుతోంది. సామాన్య మధ్యతరగతి కుటుంబాలు మొదలు విలాసవంతమైన ఇళ్ల వరకు ఈ ట్రెండ్ కొనసాగుతోంది. నిత్యం ఉండే ఇంటిలో కనీసం ఏదో ఒక ప్రత్యేకత, ఆకర్షణీయ అంశం ఉండాలని కోరుకుంటున్నారు. ప్రొఫెషనల్‌గా, వ్యక్తిగతంగా అభిరుచికి తగ్గట్టు ఇంటిని మలుచుకుంటున్నారు. కొందరు కన్‌స్ట్రక్షన్ నుంచే ఇంటీరియర్‌ను ప్లాన్ చేసుకుంటున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఇంటీరియర్.. ఇదో ట్రెండ్

ప్రత్యేక డిజైన్లపై నగరవాసుల ఆసక్తి

వినూత్న అలంకరణకు విభిన్న విధానాలు

ఇంటీరియర్ హబ్‌గానూ హైదరాబాద్

నగరానికి అంబానీ, బిర్లా వంటి సంస్థల ఉత్పత్తులు

ఇంటీరియర్ డిజైనింగ్ అనేది విలాసవంతమైన జీవనాన్ని కొనసాగించే వారి సంస్కృతి అని చాలా మంది భావిస్తుంటారు. కానీ ఇది మానమూలాల్లోనే ఉంది. దానికి అధునాతన సొగసులు ఈ మధ్య అద్దుతున్నారని ఓ ఇంటీరియర్ డిజైనర్ అంటున్నారు. గతంలో ఇళ్లలో అరుదైన పెయింటింగ్, పురాతనమైన వస్తువు లేదా ఇతర ఔరా అనిపించే వస్తువులతో అలంకరించుకునే వారు. నగర జీవనంలో ఈ సంస్కృతి అప్‌డేట్ అవుతూనే ఇంటీరియర్ డిజైనింగ్ మారిందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో ఇంటీరియర్ డిజైనింగ్ అంటే.. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆకర్షణీయమైన వస్తువులు, స్థానికంగా లభించే అందమైన కళాకృతులు, వేలాడే లైట్లు, కిటికీల పరదాలు, టీ పాయ్ సొగసులు.. ఇలా ఇంటీరియర్‌కేది అనర్హం అనేంతలా ఎన్నెన్నో హంగులు అద్దుకున్నాయి.





మోడ్రన్ క్రిస్టల్ ఆర్ట్స్‌పై ఆసక్తి

ముఖ్యంగా ఇంటిలోపలికి రాగానే అవాక్కవ్వాలనేది అందరి ఆశ.. దీని కోసం అరుదైన గ్లాస్, బ్రాంజ్, పింగాణీ ప్రతిమలను నగరంలో విరివిగా వాడుతున్నారు. దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు, గిరిజనులు తయారు చేసిన హ్యాండ్‌మేడ్ కళాకృతులు, ఈ తరానికి చెందిన మోడ్రన్ క్రిస్టల్ ఆర్ట్స్ పైన ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. నూలు ధారాల అల్లికలతో నేసిన పరదాలు, డిజైన్స్, హ్యాంగింగ్స్ వంటివి కూడా ఇష్టపడుతున్నారు. నగర అధునాతన జీవన శైలిలో దిగుమతి చేసుకున్న అరుదైన, అందమైన ఇంటీరియర్స్‌కు ఎంత ప్రాముఖ్యత ఉందో.. స్థానిక సహజ ఉత్పత్తులు, ఎకో ఫ్రెండ్లీ డిజైనింగ్ వేర్, ఆర్గానిక్ సౌందర్య వస్తువులు, అల్లికలు, చేతివృత్తుల వస్తువులకూ అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటం విశేషం. ఇందులో భాగంగానే అంబానీ కుటుంబానికి చెందిన వ్యాపార సౌధం స్వదేశ్ స్టోర్స్, ఆదిత్య బిర్లాకు చెందిన జైపూర్ స్టోర్స్ వంటివి నగరంలో వెలిశాయి. ఇలాంటి అతిపెద్ద వ్యాపార సంస్థలకు హైదరాబాద్ నగరం కేంద్ర బిందువుగా మారడంలో.. నగరవాసుల ఇంటీరియర్ ఆసక్తి మరింత పెరిగింది.

చిన్న చిన్న షాపులు

హైదరాబాద్ నగరం ఘనమైన చరిత్రకు సాక్ష్యం. ఈ ప్రశస్తిని కొనసాగిస్తూనే ఇప్పటికీ కొందరు నగరవాసులు అరుదైన యాంటిక్ వస్తువులను తమ ఇళ్లలో ప్రదర్శిస్తున్నారు. ఈ వస్తువులను అమ్మడానికి నగరంలోని ఓల్డ్‌సిటీతో పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా షాప్‌లు ఉన్నాయి. ఇందులో లక్షల్లో అమ్మే షాపులు మొదలు కేవలం రూ.వంద వస్తువులు సైతం లభించే చిన్న చిన్న షాపులున్నాయి.



ఇంటీరియర్ మొక్కలను పెంచుతూ..

కాలుష్యరహిత వాతావరణంతో పాటు ఆహ్లాదమైన అనుభూతిని పొందాలనుకునే ప్రకృతి ప్రేమికులు తమఇళ్లలో ఇంటీరియర్ మొక్కలను పెంచుతూ తమ విభిన్న జీవనశైలిని ప్రదర్శిస్తున్నారు. ఇందులో చిన్న సైజు ఆర్కిడ్ మొక్కలు మొదలు పెద్దగా పెరిగే ఆర్నమెంటల్ మొక్కల వరకు ఉన్నాయి. మెయిన్ హాల్, టీ పాయ్, డైనింగ్ టేబుల్, హ్యాంగింగ్ మొదలు విభిన్న హంగులతో ఈ ఇంటీరియర్ డిజైనింగ్ మొక్కలు నగరంలో లభిస్తున్నాయి.

ప్రత్యేక ఆసక్తితో..

ఇంటీరియర్ డిజైన్ ప్రతి ఇంట్లో ఒక ముఖ్యమైన అంశంగా మారింది. వ్యక్తిగత శైలి, సౌకర్యాన్ని ప్రతిబింబించేలా ఇంటిని, పిల్లల గదులు, అతిథి గదులను అలంకరించడంలో ప్రత్యేక ఆసక్తిని చూపిస్తున్నారు. ఫర్నిచర్‌తో పాటు ఇండోర్ జలపాతాలు, బుద్ధుడు, వినాయక విగ్రహాలు.. ఆకర్షణీయమైన లైటింగ్, సుగంధ ధూపం కర్రలతో దైవిక వాతావరణం కోసం అలంకరించుకుంటున్నారు. టీవీ యూనిట్లు, ఖరీదైన సోఫాలు, డైనింగ్ టేబుళ్లు, ఆధునిక గృహాలను విలాసవంతంగా మార్చుకుంటున్నారు.

– ఫిరోజ్ సయ్యద్, ఎంఅండ్‌పీ ఇంటీరియర్స్ వ్యవస్థాపకులు

ఎకో ఫ్రెండ్లీ.. ఫ్యాషన్ ట్రెండీ





సాక్షి, సిటీబ్యూరో: కాదేదీ వృథా... ఉంటే సృజనాత్మకత.. అనే మాటను నిజం చేసింది ఆ ఫ్యాషన్ షో.. నగరానికి చెందిన వోక్సెన్ వర్సిటీలో నిర్వహించిన దుస్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యంగా నిరుపయోగ వస్తువులు, వస్త్రాలు, ఉత్పత్తులు ఉపయోగించి విద్యార్థులు సృష్టించిన వెరైటీ డిజైన్స్ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ షోకి ముఖ్య అతిథిగా బాలీవుడ్ నటుడు మార్క్ రాబిన్సన్ హాజరయ్యారు.



ఏఐ ఉపయుక్తం.. జాగ్రత్తలు అవసరం

సాక్షి, సిటీబ్యూరో: కృత్రిమ మేధస్సు(ఏఐ) అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు డేటా రక్షణ కోసం పటిష్టమైన భద్రతా చర్యలు కూడా చేపట్టాల్సి ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచామ్) ఆధ్వర్యంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్స్(ఐటీ, ఈ అండ్ సీ) సహకారంతో 'ఇన్నోవేషన్ నెక్సస్ – కాన్ఫరెన్స్ ఆన్ సెక్యూరిటీ, డేటా ప్రొటెక్షన్' పేరిట సాంకేతిక యుగంలో అనుసరించాల్సిన రక్షణాత్మక వైఖరిపై హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు – వాణిజ్యం, ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా.జయేష్ రంజన్ మాట్లాడుతూ పటిష్టమైన భద్రతా చర్యలు, గోప్యతా ప్రోటోకాల్‌లతో సాంకేతిక ఆవిష్కరణలను సమతుల్యం చేయాల్సి ఉందన్నారు. వ్యాపారాలు, పాలనతో పాటు రోజువారీ జీవితాన్ని మెరుగుపర్చడానికి ఏఐ సామర్థ్యాన్ని ఉపయోగించుకుంటూనే డేటా రక్షణ విధానాలను నిరంతరం పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని చెప్పారు. జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్ (ఎన్ఎస్‌సీఎస్) జాయింట్ సెక్రటరీ జి.ఎ.నరేంద్రనాథ్ మాట్లాడుతూ దేశ డిజిటల్ పర్యావరణ వ్యవస్థను సురక్షితం చేయడంలో వ్యూహాత్మక దృక్పథాన్ని అవలంబించాలన్నారు. ఐఎస్ఏసీఏ హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌శర్మ గరిమెళ్ల తదితరులు మాట్లాడారు.



సింగర్ కల్పన లైవ్ కన్సర్ట్



సాక్షి సిటీబ్యూరో: నగరంలోని ఎకాన్(దుర్గం చెరువు) వేదికగా ఈ నెల 21వ తేదీన ప్రముఖ సింగర్ కల్పన రాఘవేందర్ తన స్వరంతో పాటల ప్రేమికులను అలరించనున్నారు. కల్పన సంగీత బృందం ఆధ్వర్యంలో రీజినల్, రెట్రో మ్యూజిక్‌తో హోరెత్తించనున్న ఈ లైవ్ కన్సర్ట్ రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుందని నిర్వాహకులు పేర్కొన్నారు. 21 ఏళ్ల వయస్సు పైబడిన వారికి అనుమతి ఉన్న ఈ మ్యూజిక్ కన్సర్ట్‌కు సంబంధించిన టికెట్లు బుక్ మై షోలో అందుబాటులో ఉన్నాయి.

సదరన్ ట్రావెల్స్‌కు అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: పర్యాటక రంగంలో ఉత్తమ సేవలకు సదరన్ ట్రావెల్స్‌కు జాతీయ స్థాయి 'వెటా ట్రావెల్ అవార్డు–2025' లభించింది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన టూరిజం కార్యక్రమంలో సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి కృష్ణమోహన్ అవార్డు అందుకున్నారు. అవార్డు మరింత బాధ్యత పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు. అత్యుత్తమ సేవలను అందించేందుకు అవార్డు మరింత ప్రోత్సహిస్తుందన్నారు. పర్యాటక రంగంలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి కట్టుబడి ఉన్నామని ఆయన వెల్లడించారు.

రూట్ మ్యాటిక్ కమాండ్ సెంటర్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ సంస్థలు, ఉద్యోగులకు వాహన వసతుల్ని ఆన్‌లైన్ ద్వారా అందించే రూట్ మ్యాటిక్ సంస్థ తమ అత్యాధునిక కమాండ్ సెంటర్‌ను మణికొండలో ఏర్పాటు చేసింది. దీన్ని బుధవారం ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది. కార్పొరేట్ ఉద్యోగుల రవాణా రంగంలో దేశంలోనే ఇది తమ 3వ కమాండ్ సెంటర్‌గా పేర్కొంది. ఇది 24/7 పనిచేస్తుందని, కార్పొరేట్ క్లయింట్లకు సేవలు అందిస్తుందని వివరించింది. ప్రస్తుతం తమ సంస్థ ఆధ్వర్యంలో 100 ఎలక్ట్రిక్ వాహనాలతో కలిపి 300 వాహనాలు ఉన్నాయని, నగరవ్యాప్తంగా 50 కార్పొరేట్ సంస్థలకు సేవలు అందిస్తున్నామని తెలిపింది.

కామెడీ టైమింగ్ @ సుముఖి సురేష్



సాక్షి సిటీబ్యూరో: ప్రముఖ రచయిత, నటి, కమెడియన్ సుముఖి సురేష్ తన స్టాండప్ కామెడీ టైమింగ్‌తో నగరవాసులను మరోసారి అలరించనున్నారు. నగరంలోని శిల్పకళ వేదికగా ఈ నెల 22వ తేదీన 'హోయి మోనల్' కామెడీ షోతో స్టాండప్ కామెడీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఇంగ్లిష్ కామిక్‌కు ప్రసిద్ధి చెందిన సుముఖి సురేష్ నగరానికి రానున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా తన అభిమానులు షేర్లు పోస్టులతో సందడి చేస్తున్నారు.



అమెరికా పొమ్మంటోంది.. ఖర్చులు రమ్మంటున్నాయ్..



- మన విద్యార్థులకు ట్రంప్ కష్టాలు
- అటు బ్యాంక్ రుణాలు.. ఇటు అమెరికా ఖర్చులు
- పార్ట్‌టైమ్ జాబ్స్ వదిలేయాల్సిన పరిస్థితి
- పిల్లల పరిస్థితికి తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

హైదరాబాద్‌లోని మీర్జాలగూడ నివాసితులైన దంపతుల కుమారుడు ప్రస్తుతం కాలిఫోర్నియాలో పీజీ చేస్తున్నాడు.. ఖర్చుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఉండాలని, అక్కడే ఒక హోటల్‌లో హౌస్ కీపింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. అది కూడా వారానికి రెండు రోజులు మాత్రమే.. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రతిరోజూ తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ ఉద్యోగం మానేయాలా వద్దా? లేక అమెరికా నుంచి తిరిగి వచ్చేయాలా? అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

– సాక్షి, సిటీబ్యూరో

నగరంలో నివసించే దంపతుల ఇద్దరు కుమారులూ అమెరికాలో ఉన్నత చదువులు చదువుతున్నారు. అక్కడ పంజాబ్‌కు చెందిన ఆభరణాల వ్యాపారుల దగ్గర మంచి వేతనానికి పనిచేస్తున్నారు. వీరు ఇంకా ఉద్యోగం మానమని చెప్పినా వినకపోవడంతో తల్లిదండ్రులు వీరి గురించి ఆందోళన చెందుతున్నారు.

→ కొన్నేళ్లుగా అటు చదువు.. ఇటు పార్ట్ టైమ్ ఉద్యోగాలతో అటు చదువు కోసం చేసిన అప్పుల్ని అమెరికాలో జీవన వ్యయాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ వస్తున్న పలువురు నగర విద్యార్థుల పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు చేస్తున్న కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాలతో బహిష్కరణ భయాల మధ్య యునైటెడ్ స్టేట్స్ (యూఎస్)లోని మన విద్యార్థులు పార్ట్‌టైమ్ ఉద్యోగాలను వదులుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

నిన్నా మొన్నటి దాకా..

మధ్యతరగతికి చెందినప్పటికీ స్తోమతకు మించి విదేశీ విద్యను ఎంచుకున్న మన విద్యార్థుల్లో అత్యధికులు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చదువు కోసం చేసిన భారీ రుణాలను తిరిగి చెల్లించడంతో పాటు అక్కడి జీవన వ్యయాలను భరించడానికి పార్ట్ టైమ్ ఉద్యోగాలపై ఆధారపడుతూ వచ్చిన విద్యార్థుల్లో ప్రస్తుతం తీవ్ర ఆందోళన నెలకొంది. ఇది తదుపరి ఉన్నత చదువులకు అడ్మిషన్లపై ప్రభావం చూపక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. నిన్నా మొన్నటి దాకా అమెరికాకు అత్యధిక సంఖ్యలో విద్యార్థులను పంపిన మన రాష్ట్రం నుంచి భవిష్యత్తులో అమెరికా వెళ్లాలని నిర్ణయించుకున్న వారిని ఈ పరిస్థితులు పునరాలోచనలో పడేస్తున్నాయి.

ఉద్యోగాలకు అనుమతి ఉన్నా..

హెచ్–1 వీసాలపై అమెరికాలో ఉన్న విద్యార్థులు తాము చదువుతున్న క్యాంపస్‌లోనే వారానికి 20 గంటల వరకు పనిచేయడానికి అనుమతిస్తారు. అయితే కాలేజీ క్యాంపస్‌లలో పనిచేసేందుకు అనుమతి ఉన్నప్పటికీ అక్కడ తగినన్ని ఉద్యోగావకాశాలు లేకపోవడం లేదా అక్కడ ఆశించిన ఆదాయం రాకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఖర్చుల్ని భరించడం కోసం క్యాంపస్ వెలుపల రెస్టారెంట్లు, గ్యాస్ స్టేషన్లు, రిటైల్ స్టోర్‌లలో అనధికారికంగా పని చేస్తున్నారు.

→ కాలేజీ సమయం ముగిసిన తర్వాత ఒక చిన్న కేఫ్‌లో ప్రతిరోజూ 6 గంటలు పని చేసేవాడిని. గంటకు 7 డాలర్లు చొప్పున లభించేవి. ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ అధికారుల కఠిన వైఖరితో వారం రోజుల క్రితం పని వదిలేశా.. ఇది ఇబ్బంది పెట్టే సంగతే.. అయినా ఇక్కడ చదువుకోవడానికి 50,000 డాలర్లు(సుమారు రూ.43.5 లక్షలు) రుణం తీసుకున్నా. జాబ్ కోసం చదువును పణంగా పెట్టే పరిస్థితిలో లేను' అని ఇల్లినాయిస్‌లో గ్రాడ్యుయేట్ చేస్తున్న విద్యార్థి ధ్రువన్ చెప్పాడు.

→ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వ్యాపార సంస్థలు కూడా చెల్లుబాటయ్యే వర్క్ వీసాలు కలిగిన వ్యక్తులను మాత్రమే నియమించుకోవడం ప్రారంభించాయి. గతంలో స్థానిక వ్యాపారాలు, ముఖ్యంగా భారతీయ రెస్టారెంట్లు, కిరాణా దుకాణాలు మన విద్యార్థులపై ఆధారపడేవి. ఇప్పుడు, వారు విద్యార్థులను తొలగించి, చెల్లుబాటు అయ్యే జాబ్ వీసాలో ఉన్నవారిని నియమించుకుంటున్నారు. న్యూయార్క్‌లో మాస్టర్స్ చదువుతున్న ఓ విద్యార్థిని నేహా మాట్లాడుతూ 'పని ప్రదేశాలలో తనిఖీలు చేస్తున్నారు.. దాంతో నన్ను నా ఫ్రెండ్స్‌ను పార్ట్‌టైమ్ ఉద్యోగాలు మానేయాలని మాకు జాబ్స్ ఇచ్చినవారు వెళ్లగొట్టారు. ఇది చాలా కష్టం, కానీ పూర్తి బహిష్కరణకు గురికావడం లేదా మా విద్యార్థి వీసా స్థితిని కోల్పోవడం మరింత నష్టం. నన్ను ఇక్కడికి పంపించడానికి నా తల్లిదండ్రులు ఇప్పటికే చాలా రకాల త్యాగాలు చేశారు' అని చెప్పింది. ఈ పరిస్థితులపై ఇమ్మిగ్రేషన్ న్యాయవాది ఒకరు మాట్లాడుతూ 'విద్యార్థులు క్యాంపస్ వెలుపల పనిచేయడం అక్కడ చట్టవిరుద్ధం. మునుపటి పాలకుల్లా కాకుండా ప్రస్తుత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో హెచ్1బీ, గ్రీన్‌కార్డ్‌లతో పాటు తమ భవిష్యత్ ఇమ్మిగ్రేషన్ అవకాశాల గురించి విద్యార్థులు భయపడుతుండటం సహజమే' అని చెప్పారు.

క్లుప్తంగా...

22, 23 తేదీల్లో నాగ్‌పూర్‌లో ప్రకృతి సేద్యంపై సదస్సు

ఆర్‌సీఓఎన్‌ఎఫ్ శాస్త్రవేత్త, సదస్సు నిర్వాహకుడు ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖకు అనుబంధ సంస్థ అయిన రీజినల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ (ఆర్‌సీఓఎన్‌ఎఫ్–నాగ్‌పూర్) ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో నాగ్‌పూర్ (మహారాష్ట్ర)లోని వనమతి ఆడిటోరియంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై ప్రదర్శన, జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓఎన్‌ఎఫ్ సీనియర్ శాస్త్రవేత్త, సదస్సు నిర్వాహకుడు ఊట్ల ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాల నుంచి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, యూనివర్సిటీలు, కేవీకేల శాస్త్రవేత్తలు, సేంద్రియ ఉత్పాదకాల ఉత్పత్తిదారులు పాల్గొని తమ అనుభవాలను పంచుకుంటారని వెల్లడించారు. వివిధ అంశాలపై సదస్సులు, చర్చాగోష్టులు నిర్వహిస్తామన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ డైరెక్టర్ గంగేశ్ శర్మ, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి ఫ్రాంక్లిన్ ఎల్.ఖోబంగ్, అక్షయ కృషి పరివార్ చైర్మన్ మనోజ్ సోలంకి అతిథులుగా పాల్గొంటారని, అందరూ ఆహ్వానితులేనని ప్రవీణ్ తెలిపారు.

సైబర్ నేరాలకు అమాయకులే మోసపోతున్నారు

- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశంలోనే అగ్రగామిగా ఉంది
- 14 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరయ్యారు
- షీల్డ్ 2025 విజయవంతమైంది
- డీజీపీ జితేందర్ వెల్లడి



షీల్డ్ ముగింపు సదస్సులో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్. చిత్రంలో జయేశ్‌రంజన్, శిఖాగోయల్, అవినాశ్ మహంతి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'ఇటీవల మా స్నేహితుడి నంబరు హ్యాక్ అయ్యింది. రూ.లక్ష కావాలని ఇప్పుడే అడుగుతున్నారు. ఆ వ్యక్తికి సుమారు రూ.వెయ్యి లక్షలు ఉంటాయి. రూ.లక్ష అడగడం ఏంటని అనుమానం వచ్చింది. చెక్ చేస్తే సైబర్ నేరగాళ్ల పనిగా తేలింది'అని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన షీల్డ్ సైబర్ సెక్యూరిటీ కాన్‌క్లేవ్ 2025 ముగింపు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. 'ప్రతిరోజూ రాష్ట్రంలో వందల సంఖ్యలో, దేశంలో వేల సంఖ్యలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు వస్తున్నాయి. చాలామంది అమాయక ప్రజలు మోసపోతున్నారు. ఇది చాలా క్లిష్టమైన సమయం. ప్రజల భద్రత మా డ్యూటీ. సైబర్ నేరగాళ్లు డిజిటల్ మీడియాలో కొత్త ఆవిష్కరణలతో వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారు. మేము కూడా అదే స్థాయిలో బాధ్యత కలిగి ఉండాలి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశంలో అగ్రగామిగా ఉంది. సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేశాం. ప్రతినిత్యం కొత్త పద్ధతుల్లో ఆలోచించాలి. కచ్చితంగా దీనిపై పరిశోధనలు కొనసాగిస్తాం. అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అధునాతన ఫోరెన్సిక్ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నాం. సమర్థవంతమైన, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టించడం దీని ముఖ్య ఉద్దేశం'అని పేర్కొన్నారు. షీల్డ్ 2025 నిర్వహించిన ప్రధాన ఉద్దేశం విజయవంతమైందని చెప్పారు. అంతకు ముందు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా నడుస్తున్న సమావేశాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, ఒకరికి ఒకరు సహకరించుకోవడం, కార్యాచరణకు ఒక బలమైన వేదికగా నిలిచిందన్నారు. దీనికోసం మేం రెండు నెలలు కష్టపడ్డామని, విజయవంతంగా ముగించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ దశాబ్దకాలం క్రితం ప్రధాని డిజిటల్ ఇండియా ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. భౌతికయుద్ధాలు ఉండవని, రక్తం చిందించకుండా సైబర్ దాడులే ఉంటాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర పోలీసులు అద్భుతమైన ఖ్యాతిని గడించారంటూ సైబర్ సెక్యూరిటీ బృందాన్ని అభినందించారు. అంతకు ముందు పలుఅంశాలపై బృంద చర్చలు జరిగాయి. ఏఐ పనితీరుపై వర్క్‌షాప్ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, పోలీసు అధికారులు జోయెల్ డేవిడ్, హర్షవర్ధన్, దేవేందర్‌సింగ్ పాల్గొన్నారు.


21 ఏళ్లుగా ఊపిరితిత్తుల్లోనే పెన్ను క్యాప్

- తీవ్రమైన దగ్గు, బరువు తగ్గిపోవడం వంటి సమస్యలతో ఆసుపత్రికి
- శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యులు



సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: చిన్న వయసులో పెన్ను క్యాప్ మింగేసిన ఓ వ్యక్తి 2 దశాబ్దాలకుపైగా దానితోనే జీవించాడు. అయితే ఇప్పుడు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి.. ఆ పెన్ను క్యాప్‌ను బయటకు తీసి యువకుడికి ఊరట కలిగించారు. బుధవారం కొండాపూర్‌లోని కిమ్స్ ఆసుపత్రికి చెందిన ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శుభకర్ నాదెళ్ల మీడియాకు ఈ వివరాలను తెలిపారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన 26 ఏళ్ల యువకుడు.. తీవ్రమైన దగ్గు, బరువు తగ్గిపోవడం, నిద్రలేమితో బాధపడటంతో స్థానిక ఆసుపత్రిలో సీటీ స్కాన్ చేసి ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆ యువకుడికి స్కాన్ చేసి, లోపల ఒక గడ్డలాంటిది ఉండటం వల్లే ఊపిరితిత్తుల్లో సమస్య ఏర్పడి దగ్గు వస్తోందని తేల్చారు. ఈ నేపథ్యంలో దానిని తొలగించే ప్రయత్నంలో వైద్యులకు పెన్ను క్యాప్ కనిపించింది. దాంతో ఆ యువకుడి సోదరుడిని వాకబు చేస్తే.. ఐదేళ్ల వయసులో అతను పెన్ను క్యాప్ మింగేశాడని, అప్పట్లో పరీక్షించిన వైద్యుడు క్యాప్ మలంతో పాటు బయటకు వెళ్లిపోయి ఉండొచ్చని చెప్పినట్లు తేలింది. కాగా, కిమ్స్ వైద్యులు దాదాపు మూడు గంటల పాటు శ్రమించి క్యాప్ చుట్టూ పేరుకు పోయిన కణజాలాలు, కండలను తొలగించి పెన్ను క్యాప్‌ను వెలికి తీశారు. ఇన్ని సంవత్సరాల పాటు అలా క్యాప్ లోపల ఉండిపోవడం వల్ల దెబ్బతిన్న ఊపిరితిత్తులు, ఇతర భాగాలను సరిచేసేందుకు మందులు ఇవ్వడంతో ఆ యువకుడు కోలుకున్నాడు.

మింగితే.. నిర్లక్ష్యం వద్దు



చిన్నపిల్లలు ఆడుకునేటప్పుడు వాళ్లు ఏం చేస్తున్నారో, నోట్లో ఏం పెట్టుకుంటున్నారో గమనిస్తుండాలి. పిల్లలు ఏవైనా వస్తువులను మింగితే వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లి దానిని తీయించాలి. లేకపోతే ఇలాంటి తీవ్రమైన సమస్యలే వస్తాయి. అనుకోకుండా మింగినవి, శరీరం లోపలికి వెళ్లిన వస్తువులు అలాగే ఎక్కువ కాలం ఉండిపోవడం మంచిది కాదు. వాటిని అలాగే వదిలేస్తే దాని చుట్టూ కణజాలం పేరుకుపోతుంది. దాని వల్ల ఆ భాగం పాడైపోతుంది. అప్పుడు శస్త్రచికిత్సతో పాడైన భాగాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.
– డాక్టర్ శుభకర్ నాదెళ్ల

మూడేళ్లలో రూ.3.25 లక్షల కోట్లు పెట్టుబడులు

- 2021– 24 మధ్య సాధించిన తెలంగాణ
- ఆచరణలోకి రూ.75 వేల కోట్ల పెట్టుబడులు
- దేశ ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం వాటా 31 శాతం
- ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహక మండలి నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం మూడేళ్లలోనే రూ.3.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు ఎంఎస్‌ఎంఈ ఎగుమతుల ప్రోత్సాహక మండలి తన నివేదికలో ప్రకటించింది. 2021–22 నుంచి 2023–24 మధ్యకాలంలో ఈ పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు వెల్లడించింది. ఇందులో రూ.75 వేల కోట్ల విలువైన ప్రతిపాదనలు ఆచరణలోకి వచ్చినట్లు ఎంఎస్‌ఎంఈ ఈపీసీ చైర్మన్ డాక్టర్ డీఎస్ రావత్ తెలిపారు. ఇదే సమయంలో ప్రైవేటు రంగం రూ.62,500 కోట్ల పెట్టుబడులను ప్రకటించడంతో పాటు రూ.7,022 కోట్ల ప్రతిపాదనలను ఆచరణలోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.



నివేదికలోని కీలక విషయాలు

- 2021–22లో రూ.85,087 కోట్ల కొత్త పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. 2022–23లో రూ.1.33 లక్షల కోట్లు, 2023–24లో రూ.1.06 లక్షల కోట్ల ప్రతిపాదనలు వచ్చాయి.
- 2021–22లో రూ.22,380 కోట్లు, 2022–23లో రూ.24,910 కోట్లు, 2023–24లో రూ.2.70 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి చేశారు.
- 2023–24 నాటికి మొత్తం పెండింగులో ఉన్న ప్రాజెక్టుల విలువ రూ.8.25 లక్షల కోట్లు. రూ.4.78 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- ముఖ్యమైన ఉత్పత్తుల ఎగుమతుల విలువ 2022–23లో రూ.91,776 కోట్లు ఉండగా, 2023–24లో రూ.1.16 లక్షల కోట్లకు చేరింది.
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగం స్థూల విలువ జోడింపు 18 శాతం వద్ద స్థిరంగా ఉంది.
- భారత సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 31 శాతం. 2016లో 400గా ఉన్న స్టార్టప్‌ల సంఖ్య 2022లో 2 వేలకు పెరిగింది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఐటీ రంగం ఉద్యోగాల కల్పనలో తెలంగాణ వాటా 16.7 శాతంగా ఉంది. జాతీయ సగటు 8.09 శాతంతో పోలిస్తే తెలంగాణలో ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగం ఎగుమతులు 17.93 శాతం మేర పెరిగాయి.
- 2027 నాటికి రాష్ట్ర ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగం ఎగుమతులు 23 శాతం పెరుగుతాయని అంచనా. కొత్తగా 3 లక్షల ఉద్యోగాల కల్పన జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో మరిన్ని ఐటీ హబ్‌ల స్థాపన ద్వారా ఈ రంగంలో 13 లక్షల ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది.
- రాష్ట్రంలోని 26 లక్షల ఎంఎస్‌ఎంఈలలో గ్రామీణ ప్రాంతాల్లో 56 శాతం, పట్టణ ప్రాంతాల్లో 44 శాతం ఉన్నాయి.

విజయవాడ రూట్‌లో బస్సు టికెట్ చార్జీల్లో రాయితీ

తెలంగాణ ఆర్టీసీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–విజయవాడ మార్గంలో తిరిగే రాజధాని, లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, సూపర్ లగ్జరీ బస్ టికెట్ ధరల్లో తెలంగాణ ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సు టికెట్ ధరల్లో 10 శాతం, రాజధాని సర్వీసు టికెట్ చార్జీలో 8 శాతం రాయితీ ఇస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొంది.

'వెబ్‌సైట్ ద్వారా ఇందిరమ్మ దరఖాస్తు స్టేటస్ తెలుసుకోండి'

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇంటికి చేసుకున్న దరఖాస్తు పరిస్థితి ఏంటో మొబైల్ ఫోన్ ద్వారా సులభంగా తెలుసుకునే వెసులుబాటును గృహనిర్మాణ శాఖ కల్పించింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరైందా? దరఖాస్తు తిరస్కరణకు గురైందా? మంజూరైతే ఎల్1, ఎల్2, ఎల్3ల్లో ఏ జాబితాలో ఉంది తదితరల వివరాలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకునే ఏర్పాటు చేసింది. httpr://indirammaind u.teanfana.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేసి గ్రీవెన్స్ స్టేటస్‌లో సెర్చ్‌లో దరఖాస్తు వివరాలను నమోదు చేయటం ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తుదారులు గృహనిర్మాణ శాఖ కార్యాలయాల చుట్టూ ఇక తిరగాల్సిన అవసరం ఉండదు.

రామోజీ ఫిల్మ్‌సిటీ గోడలు బద్దలు కొడతాం

- చర్చలను వాయిదా వేస్తూ వెళితే భూములను స్వాధీనం చేసుకుంటాం
- సీపీఎం, సీపీఐ నేతల హెచ్చరిక


ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేసున్న సీపీఎం నేతలు, లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిల్మ్ సిటీ అధీనంలో ఉన్న పేదల ఇంటి స్థలాల్లో వెంటనే లబ్ధిదారులకు పొజిషన్ ఇవ్వాలని సీపీఎం, సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధ వారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం ఎదుట వేర్వేరుగా ఆందోళన నిర్వహించారు. ఆర్డీఓ అనంతరెడ్డి బుధవారం ఇబ్రహీంపట్నంలోని తన కార్యాలయంలో చర్చలకు రావాలని ఫిల్మ్ సిటీ యాజమాన్యాన్ని ఆదేశించారని, అయితే వారు గైర్హాజరు కావడంపై వామపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం ఆర్డీవో అనంతరెడ్డితో ఆయా పార్టీల నేతలు చర్చలు జరిపారు. గురువారం చర్చలకు రావాలని ఫిల్మ్‌సిటీ ప్రతి నిధులకు ఆర్డీఓ మరో అవకాశం కల్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాల సర్టిఫికెట్లలో ఏ ఒక్కటీ రద్దు చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించకుండా చర్చలను వాయిదా వేసుకుంటూ వెళితే లబ్ధిదారులతో కలిసి రామోజీ ఫిల్మ్‌సిటీ గోడలను బద్దలు కొడతామని హెచ్చరించారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని పేదల ఇంటి స్థలాలను వెంటనే వదిలేయాలని.. లేదంటే పెద్ద ఎత్తున పోరాటం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హెచ్చరించారు.

నగర వార్తలు

మొరాయించిన గూడ్స్ రైలు

మౌలాలి: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని వాజ్‌పేయినగర్ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద బుధవారం మధ్యాహ్నం గూడ్స్ రైలు మొరాయించింది. ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో గూడ్స్ రైలు గంటసేపు వాజ్‌పేయినగర్ లెవల్ క్రాసింగ్ వద్ద ఆగిపోయింది. మౌలాలి నుంచి బొల్లారం వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. నేరేడ్‌మెట్ మీదుగా తిరుమలగిరి, ఏఎస్‌రావు నగర్, ఈసీఐఎల్‌కు, నేరేడ్‌మెట్ నుంచి వాజ్‌పేయినగర్ మీదుగా మల్కాజిగిరి, సికింద్రాబాద్‌లకు వెళ్లాల్సిన వాహనదారులు, ఆర్టీసీ ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. గంట అనంతరం రైల్వే అధికారులు మరో ఇంజన్‌ను పంపించడంతో గూడ్సు రైలు అక్కడి నుంచి బయలుదేరింది.

సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లను నియమిస్తాం

– ఉప ముఖ్యమంత్రి భట్టి



సాక్షి, సిటీబ్యూరో: సబ్‌స్టేషన్లు నిర్మించే సమయంలోనే సరిపడా ఆపరేటర్లను కూడా నియమిస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావులతో కూడిన ప్రతినిధి బృందం భట్టిని కలిసింది. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్(1 బై 800 మెగావాట్లు)ను జెన్‌కో ద్వారా నిర్మించాలని నిర్ణయించడంపై కృతజ్ఞతలు తెలిపింది. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో కమిటీ కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వైస్ చైర్మన్ అనిల్ కుమార్, వజీర్, తులసి నాగరాణి, తాజుద్దీన్ బాబా, సదానందం, నరేష్ ఉన్నారు.

రాజాసింగ్ కేసులో తీర్పు రిజర్వు

సిటీ కోర్టు: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన కేసులపై నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో బుధవారం విచారణ జరిగింది. విచారణకు ఎమ్మెల్యే గైర్హాజరు కావడంతో ఆయన తరఫు న్యాయవాది కరుణసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. రాజాసింగ్ చేపట్టిన శ్రీరామ నవమి ర్యాలీ, గత ఎన్నికల ర్యాలీ సందర్భంగా సిటీలో ట్రాఫిక్‌కు అంతరాయం జరిగిందని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రసంగాలు ఇచ్చారని ఆయనపై ఆయా పోలీస్‌స్టేషన్లలో పలువురు చేసిన ఫిర్యాదుల మేరకు పలు కేసులు నమోదయ్యాయి. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేస్తూ మార్చి మొదటి వారానికి వాయిదా వేసింది. మిగిలిన కేసుల విచారణను కూడా మార్చికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది.

ఇక మామిడి పండుగ..!

ప్రారంభమైన సీజన్.. హోల్‌సెల్ రూ. 70, రిటైల్ రూ.100

బాటసింగారం మార్కెట్‌కు లక్ష మెట్రిక్ టన్నుల మామిడి దిగుమతి



సాక్షి, సిటీబ్యూరో: మామిడి సీజన్ మొదలైంది. ఫలరాజు మామిడి మార్కెట్లకు రానే వచ్చింది. ధరలు అంతగా లేకపోయినా రాను రాను పెరగవచ్చని వ్యాపారులు అంటున్నారు. హోల్‌సెల్ మార్కెట్‌లోనే కిలో రూ. 60–70 వరకు పలుకుతోంది. రిటైల్‌లో వంద రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. దిగుబడి తగ్గిన కారణంగా బహిరంగ మార్కెట్‌లో ఈ ఏడాది ధరలు కాస్త ఎక్కువగానే ఉండవచ్చని వ్యాపారులు భావిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బెనిషాన్ కిలో ధర రూ.70–80 వరకు పలుకుతోంది. బాటసింగారం మార్కెట్‌కు 1,470 క్వింటాళ్ల మామిడి దిగుమతి అయిందని మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది మామిడి సీజన్ ఏప్రిల్‌లో పుంజుకోగా, ఈ ఏడాది మార్చిలోనే జోరు అందుకుంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ఈ ఏడాది పూత సమయంలో వర్షాలు బాగా కురియడంతో మామిడి చెట్లుకు నష్టం బాగా జరిగిందని, అనుకున్న స్థాయిలో పంట రాలేదని రైతులు చెబుతున్నారు. మొదట్లో వచ్చిన పూతతోనే మామిడి సీజన్ తొందరగా ప్రారంభమైందని పేర్కొంటున్నారు.

నాలుగు వేల టన్నుల మామిడి రాక

గత ఏడాది మార్చి మూడో వారం నాటికి దాదాపు 2 వేల టన్నుల మామిడి మార్కెట్‌కు దిగుమతికా గా, ఈ ఏడాది ఇప్పటికే 4 వేల టన్నుల మేర వచ్చింది. మార్చి రెండు, మూడో వారానికి రోజుకు వెయ్యి టన్నుల మామిడి పండ్లు మార్కెట్‌కు రావచ్చని అంచనా. దీంతో మార్కెట్ అధికారులు మామిడి సీజన్‌కు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభించారు. మార్కెట్‌లో తాత్కాలిక షెడ్‌లతోపాటు చలివేంద్రాల ఏర్పాటుకు కేంద్ర కార్యాలయలం నుంచి అనుమతులు తీసుకున్నారు.



మార్కెట్‌లో ఏర్పాట్లు

మార్కెట్‌కు రోజూ 100 టన్ను మామిడి దిగుమతి అవుతుంది. మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. ఫైరింజన్ అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖకు లేఖ రాస్తాం. రైతులు పంట విక్రయించిన వెంటనే డబ్బులు చెల్లించాలని కమిషన్ ఏజెంట్లకు ఆదేశాలు ఇచ్చాం. పండ్లను మగ్గించడానికి ప్రభుత్వం గుర్తించిన ఇన్ రిప్ ప్యాకెట్‌లు విక్రయించడానికి షెడ్ కేటాయించాం. ఇన్ రిప్ ప్యాకెట్లను మాత్రమే వాడాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని కమిషన్ ఏజెంట్లకు సూచనలు జారీ చేశాం.
– ఎల్. శ్రీనివాస్ –ఉన్నతశ్రేణి కార్యదర్శి, గడ్డిఅన్నాం మార్కెట్ సొసైటీ

టీ హబ్‌కు ఇన్నోవేషన్ అవార్డు


ఇన్నోవేషన్ అవార్డును స్వీకరిస్తున్న టీ హబ్ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని టీ హబ్ ప్రతిష్టాత్మకమైన ఇన్నోవేషన్ అవార్డు పొందింది. స్టార్టప్ ఎకో సిస్టమ్‌లో అత్యాధునిక పురోగతిని పెంపొందించడంలో టీ హబ్ నిబద్ధతను నిలుపుకొంటుందనడానికి ఈ అవార్డు నిదర్శనం. రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ అండ్ బిజినెస్ సెంటర్ ఇండియా(ఆర్‌ఎన్‌టీబీసీఐ) ఇన్నోవ్ ఫెస్ట్–2025లో ఈ అవార్డును ప్రకటించారు. ఈ అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందని, ఇక్కడి స్టార్టప్‌లు, తాజా ఆలోచనలు చురుకుదనాన్ని తీసుకువస్తాయని టీహబ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. నూతన ఆవిష్కరణలను ప్రపంచవ్యాప్తం చేయడానికి అవసరమైన స్థాయి, వనరులను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని టీహబ్ అధికారులు తెలిపారు. ఇది సమష్టి కృషికి నిదర్శనమని వారు స్పష్టం చేశారు.

పౌర సరఫరాల శాఖ గోదాము ప్రారంభం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని, నాణ్యమైన బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని అచ్చయ్యనగర్‌లో పౌర సరఫరాల శాఖ సర్కిల్–4, 6 గోదాముల భవనాన్ని ప్రారంభించారు. చౌహాన్ మాట్లాడుతూ శాఖలో అనేక మార్పులు చేస్తున్నామని, పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డైరెక్టర్ వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ప్రియాంకా అలా, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.ఫణీంద్రారెడ్డి, ఇన్‌చార్జి డీఎస్‌వో దీప్తి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


నిజాంకాలం నాటి నాలాపై సర్వే చేయాలి

అధికారులను ఆదేశించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్


పనులపై ఆరా తీస్తున్న కమిషనర్ ఇలంబర్తి, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: పాతబస్తీలోని నిజాం కాలం నాటి నాలాపై సమగ్ర సర్వే చేపట్టి నివేదిక అందజేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌తో కలసి బుధవారం యాకుత్‌పురాలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రంగేళీ కిడికి బస్తీలోని ఇళ్ల మధ్యలో ఉన్న ఈ నాలా నుంచి మురుగునీరు వస్తోందని స్థానికులు, అధికారులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మౌలాకా చిల్లా, గంగానగర్ నాలా విస్తరణ పనులు చేపట్టి మూడేళ్లు కావస్తున్నా ఇంకా పూర్తి కాలేదని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ కమిషనర్‌కు చెప్పారు. వర్షాకాలంలోపు పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సోహెల్ ఖాద్రీ, మహ్మద్ వసీవుద్దీన్, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, డీసీ సురేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ మిషన్ బెల్టులో ఇరుక్కుపోయి మహిళ మృతి


అనిత (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: కంపెనీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ మహిళ ప్రమాదవశాత్తు మిషన్ బెల్ట్‌లో ఇరుక్కుపోయి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్ ప్రాంతానికి చెందిన అనిత స్థానిక కమల ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో స్వీపర్‌గా పని చేస్తుంది. బుధవారం మధ్యాహ్నం సమయంలో కంపెనీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆమె చీర మెషిన్‌లో ఇరుక్కుని గొంతుకు చుట్టుకుపోయింది. దీంతో ఊపిరాడక చనిపోయింది. కొద్ది సేపటి తరువాత విషయాన్ని గమనించిన యాజమాన్యం ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యకుమార్ తెలిపారు. అనితకు భర్త మహేశ్ ఉన్నారు.

హైడ్రాను పటిష్టం చేయాలి

పంజగుట్ట: సామాన్యులకు న్యాయం జరగాలంటే హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు వ్యక్తులు ప్రభుత్వాన్ని కోరారు. కొంతమంది భూకబ్జాదారులు హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా వల్ల విముక్తి పొందిన బాధితులు నవీన్, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, సాయికుమార్ అనే వ్యక్తులు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఫిర్యాదు రాగానే వెంటనే వెళ్లి హైడ్రా కూల్చివేతలు చేపట్టడం లేదని, ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో మాట్లాడి డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల దివ్యానగర్‌లో విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి 4 కి.మీ. అక్రమంగా ప్రహరీ నిర్మించారని, దీంతో కాలనీకి రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని అన్నారు. ఈ విషయమై హైడ్రాను ఆశ్రయించగా కమిషనర్ రంగనాథ్ వచ్చి పరిశీలించి, డాక్యుమెంట్లు చూసి ఆ ప్రహరీని పడగొట్టారని, ఇప్పుడు కేవలం 200 మీటర్లలోపే రాకపోకలు సాగించగలుగుతున్నామని దివ్యానగర్ అసోసియేషన్ ప్రతినిధి నాగేశ్వరరావు అన్నారు.

రిజర్వేషన్ చట్టాలను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

రాయదుర్గం: అన్ని రకాల రిజర్వేషన్ చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, దీని ద్వారా న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి అవి నిరంతరం అమలులో ఉండేలా చేయవచ్చని పలువురు వక్తలు అన్నారు. అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం(ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో బీహార్, తెలంగాణ రాష్ట్రాల సామాజిక, విద్యా, ఆర్థిక సర్వేపై బుధవారం హెచ్‌సీయూలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, అనిల్ జైహింద్ యాదవ్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, ఐఆర్ఎస్ అధికారి నేత్రపాల్, బీసీ నేత వట్టె జానయ్య యాదవ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ కన్వీనర్ చిరంజీవులు, ప్రొఫెసర్ భంగ్యా భూక్యా, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ టైమ్స్ ఎడిటర్ సూర్యారావు మాట్లాడారు. బీహార్, తెలంగాణల్లో కుల సర్వేలు నిర్వహించడం ఒక ముందడుగు అయినప్పటికీ, వాటిలోని లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబూ.. ఇకనైనా కళ్లు తెరువ్

ఏపీలో రైతు బతికే పరిస్థితి లేదు!

గుంటూరు మిర్చి యార్డులో వైఎస్ జగన్ కన్నెర్ర | **నిరుడు మిర్చి క్వింటాల్ రూ.27 వేలు.. నేడు రూ.10 వేలూ కరువే**

సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయానికి... ముఖ్యమంత్రి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న గుంటూరు మిర్చి యార్డులో రైతులు పడుతున్న అగచాట్లు చంద్రబాబుకు కనిపిస్తున్నా కళ్లు మూసుకుని కూర్చున్నారని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో రైతు బతికే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అన్నదాతల పాలిట శాపంగా మారింది. ఏ రైతన్నా సంతోషంగా లేదు. అన్నదాతల అవస్థలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు'' అని మండిపడ్డారు. 'ఇవాళ రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. మరోవైపు దిగుబడులు పడిపోయాయి. మొన్నటి వరకూ ధాన్యం రైతుల కష్టాలు చూశాం.. ఇవాళ మిర్చి రైతుల కష్టాలను చూస్తున్నాం. ఒక్క మిర్చే కాదు.. పత్తి, మినుము, కందులు, పెసర, టమాటా.. ఇలా ఏ పంట తీసుకున్నా రైతులకు గిట్టుబాటు ధర దక్కని దుస్థితి నెలకొంది. దళారులకు తావు లేకుండా పంటల కొనుగోళ్లు జరిపి రైతులను ఆదుకున్న ఆర్బీకే వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఈ క్రాప్ గాలికి వదిలేశారు. ఉచిత పంటల బీమా ఎత్తివేశారు. సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ సబ్సిడీకి స్వస్తి పలికారు. ఇస్తున్న పెట్టుబడి సాయాన్ని నిర్దాక్షిణ్యంగా తీసేశారు. ఇక ఇస్తామన్న దాన్నీ ఎగ్గొట్టారు. సూపర్ సిక్స్‌లో చెప్పినవన్నీ విస్మరించారు. సున్నా వడ్డీ రాయితీ అందడం లేదు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్ ద్వారా పరీక్షలు నిర్వహించి నాణ్యమైన సాగు ఉత్పాదకాలు అందించే విధానానికి తిలోదకాలిచ్చారు. నాడు సీఎం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ధరలను సమీక్షిస్తూ ఎక్కడైనా పతనమైతే వెంటనే రంగంలోకి దిగి రైతులను ఆదుకుంటే నేడు దళారీల దయా


రైతులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దాక్షిణ్యాలకు వదిలేశారు. రైతుల జీవితాల్లో వెలుగులు చూసేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు ఏవీ ఈరోజు కనిపించడం లేదు' అని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గుంటూరులోని మిర్చి యార్డుకు వచ్చిన వైఎస్ జగన్ రైతులను కలిసి వారి సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కనీస మద్దతు ధర కూడా దక్కకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మిర్చి రైతులు ఆయన వద్ద మొర పెట్టుకున్నారు. వారి కష్టాలు, బాధలు తెలుసుకుని చలించిపోయారు. సావధానంగా సమస్యలు ఆలకించి ధైర్యం చెప్పారు. అనంతరం మిర్చి యార్డు బయట వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' ఖాతాలోనూ తన పర్యటన వివరాలను పంచుకున్నారు. రైతన్నలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావడంతో మిర్చి యార్డు ప్రాంతం కిక్కిరిసిపోయిందని.. మీడియా ద్వారా పూర్తిగా మాట్లాడలేకపోయానని.. అన్ని అంశాలను ట్వీట్‌లో పొందుపరుస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

ఏ పంట చూసినా 'మద్దతు' కరువు..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతలకు అడుగడుగునా కష్టాలు, నష్టాలే మిగులు తున్నాయి. పంటలకు మద్దతు ధర దేవుడెరుగు.. అమ్ముకుందామన్నా కొనేవారు లేక అల్లాడుతున్నారు. మన ప్రభుత్వంలో నిరుడు అత్యధికంగా క్వింటాలు రూ.21 – 27 వేల దాకా పలికిన మిర్చి ధర ఇప్పుడు రూ.8 – 11 వేలకు పడిపోయింది. పంట బాగుంటే మిర్చి ఎకరాకు సగటున 20 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. తెగుళ్ల కారణంగా ఈ ఏడాది దిగుబడులు పడిపోయాయి. ఇక పెట్టుబడి ఖర్చులు చూస్తే ఎకరాకు కనీసం రూ.1,50,000 పైమాటే అవుతోంది. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఒక్క మిర్చే కాదు.. కంది పండిస్తున్న రైతులు కూడా ధరలు లేక విలవిల్లాడుతున్నారు. కందిపప్పు క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.7,550 అయితే ఇప్పుడు రూ.5,500 కూడా రావడం లేదు. కానీ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.150 పైనే ఉంది. అదే గతేడాది రూ.9–10 వేల మధ్య ధర వచ్చేది. గత ఏడాది క్వింటాలు పత్తి రూ.10 వేలు ఉండగా ఇప్పుడు రూ.5 వేలు కూడా దాటడం లేదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

టమాటా రైతు లకు కిలోకి రూ.3–5 కూడా దక్కడం లేదు.


సాయం చేయకపోగా.. వ్యవస్థలు నిర్వీర్యం

చంద్రబాబు అధికారంలోకి వచ్చి రైతులకు సాయం చేయకపోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలన్నింటినీ మూలన పడేశారు. సీజన్ మొదలయ్యే సరికి రైతులకు పెట్టుబడి సహాయం, రైతు లకు సున్నా వడ్డీకే రుణాలు, విత్తనాలు, ఎరువులకు సైతం నాణ్యతకు ఆర్బీకేల్లో గ్యారంటీ.. ఇలా మేం తెచ్చిన ప్రతి విప్లవాత్మక మార్పునూ ఉద్దేశపూర్వకంగా మూల నపెట్టారు. ఇవాళ రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించాలన్న ఆలోచనే ఈ ప్రభుత్వానికి లేదు.. ఆర్బీకేల ద్వారా కొను గోలు చేయాలన్న ఉద్దేశమే లేదు. ఆర్బీకేలు, వాటికి అనుసంధానంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లతో సహా ప్రతి వ్యవస్థ ఇవాళ నిర్వీర్యం అయిపోయాయి. గతంలో ఎవరైనా కల్తీ విత్తనాలు అమ్మాలంటే భయపడే పరిస్థితి నుంచి ఇప్పుడు ప్రభు త్వమే దగ్గరుండి ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాల సరఫరా నిలిపివేసింది. రైతులు ప్రైవేట్ డీలర్ల దగ్గర ఎరువులు కొనాల్సి వస్తోంది. వాళ్లు కనీసం రూ.100 నుంచి రూ.400 అధిక ధరలకు బ్లాకులో అమ్ముతున్నారు. క్వాలిటీ కంట్రోల్ విషయంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గతంలో ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించిన పరిస్థితి ఉంటే.. ఇవాళ నాణ్యమైనవేవీ అన్నదాతలకు అందని దుస్థితి నెలకొంది. ఇక పెట్టుబడి సాయం కింద పీఎం కిసాన్ కాకుండా తాము ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వకుండా ఈ ప్రభుత్వం అన్నదాతలను దారుణంగా మోసం చేసింది.

రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి: ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్

- చిలుకూరు అర్చకుడికి ఫోన్‌లో పరామర్శ
- మీరు ఫోన్ చేయడం వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది: రంగరాజన్


వైఎస్ జగన్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న రంగరాజన్. చిత్రంలో కొండా రాఘవరెడ్డి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రంగరాజన్‌ను ఫోన్‌లో పరామర్శించి సంఘీభావం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండా రాఘవ రెడ్డి బుధవారం మధ్యాహ్నం ఆలయానికి వచ్చి రంగరాజన్‌ను కలిశారు. అనంతరం జగన్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. దాడి ఎలా జరిగింది? ఎవరు చేశారని రంగరాజన్‌ను వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారు. అర్చకుడిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. రంగరాజన్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ మీరు ఫోన్ చేయడమే వెయ్యేనుగుల బలాన్నిచ్చిందన్నారు. రామరాజ్యం సైన్యం పేరుతో వచ్చిన దుండగులు 40 నిమిషాలపాటు తనను చిత్రహింసలు చేశారని జగన్‌కు వివరించారు. రామరాజ్యానికి సైన్యం ఇవ్వాలని, వనరులు సమకూర్చాలని చెప్పారని, దానికి నేను అంగీకరించకపోవడంతో దాడికి పాల్పడ్డారని రంగరాజన్ వివరించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు సౌందరరాజన్ కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. రాజశేఖరరెడ్డి చేవెళ్ల నుంచి పాదయాత్ర చేసిన సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి తన తండ్రి సౌందరరాజన్‌తో మాట్లాడారని చెప్పారు.

ధిక్కరణ నోటీసులిచ్చే పరిస్థితి తెచ్చుకోవద్దు

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బీసీఐని హెచ్చరించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బార్ కౌన్సిల్‌కు ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)ని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌ను సమర్పించాలని ఆదేశించినా, అందజేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయశాఖలో ఒక భాగమైన, స్వయంప్రతిపత్తి గల కౌన్సిల్‌కు ధిక్కరణ నోటీసులు జారీ చేసే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించింది. తదుపరి విచారణలోగా ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలంటూ ఈ నెల 25కు వాయిదా వేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ పాలకవర్గ గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించడం లేదంటూ న్యాయవాది కె.అశోక్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గత నెల 10న విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. జనవరి 31లోగా షెడ్యూల్ సమర్పించాలని ఆదేశించారు. అయినా అందజేయకపోవడంతో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఐదేళ్ల పదవీ కాలం ముగిసి ఏడాదైందన్నారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌కు, ఎన్నికలకు సంబంధం లేదని చెప్పారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీవోపీ) అంశంపై మాత్రమే అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపడుతోందని తెలిపారు. బార్ కౌన్సిల్ ఎన్నికలు ఆపేలా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కోర్టు ఆదేశాలను బార్ కౌన్సిల్ పాటించకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్తుందన్నారు.

'ఫోన్ ట్యాపింగ్' కేసు దర్యాప్తు నిలిపివేత

- చక్రధర్‌గౌడ్ కేసులో పంజగుట్ట పోలీసులకు హైకోర్టు ఆదేశం
- హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులకు ఊరట


సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసు దర్యాప్తును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి దర్యాప్తు కొనసాగించవద్దని పంజగుట్ట పోలీసులకు తేల్చిచెప్పింది. ఒకపక్క గడువు కోరుతూ మరోపక్క అరెస్టులు చేయడాన్ని తప్పుబట్టింది. కోర్టులతో ఆటలొద్దని పోలీసులను హెచ్చరించింది. తదుపరి విచారణ వచ్చే నెల 3కు వాయిదా వేసింది. కోర్టు ఆదేశాలతో హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులకు తాత్కాలిక ఊరట లభించినట్లయింది. చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు (ఏ1), మాజీ డీసీపీ రాధాకిషన్ రావు (ఏ2)తోపాటు మరో ముగ్గురిని నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాజకీయ కక్షతో నమోదైన ట్యాపింగ్ కేసును కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఒకే అంశంపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్టవిరుద్ధమని.. కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు.

నరకం చూపిస్తామంటూ బెదిరిస్తున్నారు..

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరుకాలేకపోయారని, విచారణ వచ్చే నెల 3కు వాయిదా వేయాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు కోరారు. దీనికి హరీశ్‌రావు తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే వాదనల కోసం మూడుసార్లు వాయిదాలు తీసుకున్నారన్నారు. ఈ నెల 15న ఇద్దరిని అరెస్టు చేశారని, భయపెట్టి నేరాంగీకారం తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మూడో నిందితుడిని అదుపులోకి తీసుకునేటప్పుడు రెండేళ్ల బాలుడు కూడా ఉన్నాడని, తెల్లవారుజాము 1.30 గంటల దాకా స్టేషన్‌లో ఉంచి తర్వాత అరెస్టు చూపించారని చెప్పారు. చెప్పినట్లు వినకుంటే నరకం చూపిస్తామంటూ పోలీసులు బెదిరిస్తున్నారని, కోర్టులో విచారణ ముగిసే వరకు దర్యాప్తును నిలిపివేయాలని కోరారు. నిందితులను చిత్రహింసలు పెడుతున్నారన్నది అవాస్తవమని పీపీ చెప్పారు. అలాంటి ఘటనకు పోలీసులు నిజంగా పాల్పడితే ట్రయల్‌కోర్టుకు చెప్పాలిగానీ ఇక్కడ కాదన్నారు. న్యాయమూర్తి మెప్పుకోసం చెబుతున్నట్లు ఉండటంతో.. జడ్జి అభ్యంతరం వ్యక్తం చేశారు. తననెవరూ మెప్పించలేరని చెప్పారు. పీపీ విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను మార్చి 3కు వాయిదా వేశారు.

కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడేందుకే కేంద్ర బడ్జెట్

వామపక్ష పార్టీల నిరసనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు జాన్‌వెస్లీ, వెంకటేశ్వరరావు, ఎం.వెంకటేశ్, బండారి రవికుమార్, హన్మేశ్, అనిల్‌కుమార్, తేజ, ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావులు

చిక్కడపల్లి (హైదరాబాద్): కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య ప్రజలకు నేరుగా లబ్ధి కల్పించేందుకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు లేవన్నారు. కానీ ఇది దేశ ప్రజల బడ్జెట్ అంటూ ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐఎం, హైస్పీడ్ రైల్వేట్రాక్‌లకు నిధుల ఊసేలేదని జాన్‌వెస్లీ మండిపడ్డారు. ప్రధాని దేశంలో 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖకు ఎగువకు తెచ్చామని చెప్తూనే 2029 వరకు 80 కోట్ల మందికి 5 కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తామన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి ఎం.వెంకటేశ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

142 జీవో లోపాల సవరణకు మంత్రి దామోదర సుముఖం

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం వెల్లడి


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నరహరి, లాలూ ప్రసాద్ రాథోడ్


సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే విషయంలో 142 జీవో వల్ల జరుగుతున్న నష్టాన్ని గుర్తించి జీవోలోని లోపాలను సవరించేందుకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సుముఖత వ్యక్తం చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం తెలిపింది. బుధవారం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లోని సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి దామోదరను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరహరి, లాలూ ప్రసాద్ రాథోడ్ కలిసి ప్రభుత్వ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. 142 జీవోవల్ల డాక్టర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆ జీవోలోని లోపాలను మంత్రికి వివరించి, న్యాయం చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి

- సీపీఐ, సీపీఎం, టీజేఎస్‌లకు కాంగ్రెస్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఈనెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీలకు.. అధికార కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం ఆయా పార్టీలకు లేఖలు రాశారు. బీఆర్ఎస్ నియంత, బీజేపీ మతతత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజాపాలన అందిస్తున్నందున కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ మేరకు ఆయన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, టీజేఎస్ అధ్యక్షుడు ఎం.కోదండరాంలకు బుధవారం లేఖలు రాశారు.

వైరస్‌తో కోళ్లు మృతి



మదనపురం/చందుర్తి(వేములవాడ): వనపర్తి జిల్లా మదనాపురం మండల పరిధిలోని కొన్నూరులోని ఓ పౌల్ట్రీఫాంలో 4,000 కోళ్లు మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటేశ్వర్ రెడ్డి మృతి చెందిన కోళ్లను పరీక్షించారు. కోళ్లు కొక్కెర వ్యాధితో చనిపోయినట్లు ఆయన స్పష్టం చేశారు. కోళ్ల నమూనాలను ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు.

• రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటకు చెందిన పెగ్గర్ల రమేశ్‌రావుకు చెందిన పౌల్ట్రీలో 2,500 బాయిలర్ కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృతి చెందాయి. మూడు రోజులుగా కోళ్లు చనిపోతుండడంపై పౌల్ట్రీ యజమాని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం 200 కోళ్లు, మంగళవారం 700, బుధవారం 1,600 కోళ్లు చనిపోయినట్లు వివరించారు. 35 రోజుల వయసున్న కోళ్లు చనిపోవడంతో.. దాదాపు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు.

మనం చేసినవన్నీ యువతకు చెప్పండి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనకే విజయావకాశాలు
- పార్టీ ముఖ్యనేతలతో జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి
- ఇంచార్జి హోదాలో తొలిసారి సమావేశానికి హాజరైన మీనాక్షి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూనే రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి యువతకు వివరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పార్టీ నేతలందరూ సమష్టిగా పనిచేసి అభ్యర్థి వి.నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ ముఖ్యనేతల జూమ్ మీటింగ్ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. సమా



వేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు రాష్ట్రంలో స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను మంజూరు చేసి పనులు ప్రారంభించామని, రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రెండు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చామని చెప్పారు. ఈ విషయాలను యువతకు వివరించడం ద్వారా పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని నేతలకు పిలుపునిచ్చారు.

తెలంగాణ అంటే అభిమానం: మీనాక్షి

రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జిగా నియమితులైన తర్వాత మీనాక్షి నటరాజన్ తొలిసారి పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ అంటే తనకు ఎంతో అభిమానమని చెప్పారు. రాష్ట్రంలోని చాలా మంది పార్టీ నాయకులతో తనకు మంచి పరిచయాలు ఉన్నాయని అన్నారు. తెలంగాణను దేశానికి ఒక మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని, రాష్ట్రంలోని పార్టీ నాయకులందరూ కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలని కోరారు. ఎన్నికలను పార్టీ కేడర్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మీనాక్షి చెప్పారు.

ప్రమాదంలో 'శ్రీశైలం'

▶ మొదటి పేజీ తరువాయి

భారీ గుంత (ప్లంజ్ పూల్) ఏర్పడిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేయకపోవడంతో.. క్రమంగా ప్లంజ్ పూల్ విస్తరిస్తూ, జలాశయానికి ముప్పుగా పరిణమించిందని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయాన్ని 14 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా డిజైన్ చేయగా.. 2009లో ఏకంగా 25లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని వివరించారు. భారీగా నీటి విడుదలతో.. స్పిల్ వేకు దిగువన భూమి కోతకు గురై భారీ గుంత ఏర్పడిందని తెలిపారు. ఈ గుంతను పూడ్చకపోతే 143.23 మీటర్ల ఎత్తున్న జలాశయం పునాదులను బలహీనపరిచి, డ్యామ్‌కు ప్రమాదకరంగా మారుతుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషియనోగ్రఫీ వంటి సంస్థలు అధ్యయనంలో తేల్చాయని వివరించారు.

జలాశయానికి ప్రమాదం జరిగితే భారీ నష్టం

శ్రీశైలం జలాశయానికి ప్రమాదం జరిగితేభారీ వరద ముంచేస్తుందని.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో తీవ్ర విపత్తును సృష్టిస్తుందని లేఖలో అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయం పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై తక్షణమే నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఎన్డీఎస్ఏను కోరారు. వచ్చే వానాకాలంలో గుంత మరింత విస్తరించకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం జలాశయం రక్షణకు చర్యలు తీసుకోకపోతే దిగువన ఉన్న నాగార్జునసాగర్, ప్రకాశం బరాజ్‌లు సైతం ప్రమాదాన్ని ఎదుర్కొంటాయన్నారు.

అవసరాలకే కేటాయించాలి.. అత్యాశకు కాదు!

▶ మొదటి పేజీ తరువాయి

వాడుకోవడాన్ని అనుమతించరాదని స్పష్టం చేసింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుపుతున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట.. తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ బుధవారం వాదనలు వినించారు.

శాస్త్రీయ విధానంలో విశ్లేషించాలి

కృష్ణా నదీ పరీవాహకం వెలుపలి ప్రాంతాలకు ఏపీ 323 టీఎంసీల కృష్ణా నికర జలాలను తరలించుకుంటోందని వైద్యనాథన్ ట్రిబ్యునల్ దృష్టికి తెచ్చారు. ఏపీలోని పరీవాహకం వెలుపలి ప్రాంతాలకు పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీలు, పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా 100 టీఎంసీలు, చింతలపుడి ఎత్తిపోతల ద్వారా 27 టీఎంసీల గోదావరి జలాలు తరలించుకుని అవసరాలు తీర్చుకోవడానికి అవకాశముందని తెలిపారు. ఏపీ కృష్ణా జలాలను తరలిస్తున్న ఇతర నదుల పరీవాహక ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న నీటి లభ్యతను వివరించారు. పెన్నా పరీవాహకంలో 75 శాతం లభ్యత ఆధారంగా 98 టీఎంసీలు, సగటు లభ్యత ఆధారంగా 195 టీఎంసీల లభ్యత ఉందని తెలిపారు. గుండ్లకమ్మ వంటి నదుల కింద సైతం నీటి లభ్యత ఉందన్నారు. సమర్థ నీటి వినియోగాన్ని శాస్త్రీయ విధానంలో విశ్లేషిస్తే నీటి అవసరాలు తగ్గుతాయని, దీంతో మిగిలే జలాలను పరీవాహక ప్రాంతంలోపలి ప్రాజెక్టులకు కేటాయించాలని సూచించారు.

గ్రావిటీ ద్వారా నీళ్లొచ్చే అవకాశం పోయింది..

ప్రస్తుతం తమ రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలు నిర్మించుకోవడం తప్ప మరో గత్యంతరం లేదని వైద్యనాథన్ స్పష్టం చేశారు. ఎత్తిపోతల పథకాల కింద రాష్ట్రంలో సాగునీరు సరఫరా చేస్తున్న, సరఫరా చేసేందుకు ప్రతిపాదించిన ప్రాంతాలకు.. వాస్తవానికి అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలోని తుంగభద్ర డ్యామ్, కృష్ణా ప్రాజెక్టు కాల్వలు, భీమా ప్రాజెక్టు నుంచి గ్రావిటీ ద్వారా సాగునీరు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. 1956లో తెలంగాణ, ఆంధ్రను కలిపి ఉమ్మడి ఏపీగా ఏర్పాటు చేయడంతో రాష్ట్ర సరిహద్దులు మారిపోవడంతో గ్రావిటీ ద్వారా నీళ్లను పొందే అవకాశాన్ని తాము కోల్పోయామని చెప్పారు.

నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు కేటాయింపులు జరపాలి

రాష్ట్రంలో నిర్మాణం పూర్తైన ప్రాజెక్టుల కింద నీటి వినియోగం చాలా తక్కువ అని, నిర్మాణంలోని ప్రాజెక్టులకు జరిపే నికర జలాల కేటాయింపులతో కృష్ణా పరీవాహకంలోని 25 లక్షల కుటుంబాలకు చెందిన 80 లక్షల మందికి జీవనోపాధి లభించనుందని వైద్య నాథన్ ట్రిబ్యునల్‌కు వివరించారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 1956 తర్వాత తీసుకున్న నిర్ణయాలు ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. గోదావరి జలాల మళ్లింపునకు ఏపీ చేస్తున్న ప్రయత్నాలను ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీలో రాజధాని ప్రాంత అభివృద్ధితో కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్‌కింద తగ్గిన నీటి వినియోగాన్ని తెలంగాణకు కేటాయించాలని కోరారు. ఏపీలోని వాగుల ద్వారా కృష్ణా డెల్టా సిస్టమ్‌కు సరఫరా అవుతున్న 75 టీఎంసీల జలాలను లెక్కించలేదని, వాటిని సైతం లెక్కించాలని కోరారు. అంతర్రాష్ట్ర నదీ జలాలను న్యాయోచితంగా వాడుకోవాలని పేర్కొంటున్న జాతీయ, అంతర్జాతీయ న్యాయసూత్రాలను వైద్యనాథన్ వివరించారు. గురువారం ఏపీ వాదనలు వినిపించనుండగా, శుక్రవారం రెండు రాష్ట్రాలు ప్రతివాదనలు వినిపించనున్నాయి.


ఏపీ అనధికార నీటి తరలింపును అడ్డుకుంటాం

- రెండు రాష్ట్రాల మధ్య న్యాయబద్ధమైన నీటి పంపిణీకి చర్యలు
- కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హామీ
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్ చేసిన విజ్ఞప్తులపై సానుకూల స్పందన
- 'మేడిగడ్డ'పై నెలాఖరులోగా ఎన్డీఎస్ఏ నివేదిక అందజేస్తాం
- ప్రాజెక్టులకు అనుమతులు, నిధుల ప్రతిపాదనలు పరిశీలిస్తాం

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఏపీ అనధికారికంగా నీళ్లను తరలించుకోవడాన్ని అడ్డుకోవడంతోపాటు ఏపీ, తెలంగాణ మధ్య న్యాయమైన రీతిలో నీటి పంపిణీ జరిగేలా కేంద్రం చర్యలు తీసుకుంటుందని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చెప్పారు. మేడిగడ్డ బరాజ్‌పై నెలాఖరులోగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదికను అందజేస్తామని తెలిపారు. అఖిల భారత నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సులో పాల్గొనడానికి రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌కు వెళ్లిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం అక్కడ సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతో సమావేశమై చర్చలు జరిపారు.

కేంద్రం అత్యవసరంగా జోక్యం చేసుకోవాలి: ఉత్తమ్

మేడిగడ్డ బరాజ్‌పై ఎన్డీఎస్ఏ ఆధ్వర్యంలో ఏడాది కాలంగా విచారణ సాగుతుండడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. బరాజ్ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలతో తుది


కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో కరచాలనం చేస్తున్న ఉత్తమ్

నివేదికను సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఏపీ శ్రీశైలం జలాశయం, నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా అదనపు నీళ్లను అక్రమంగా తరలిస్తోందని చెప్పారు. సాగర్ కింద తెలంగాణలో సాగు చేస్తున్న ఆయకట్టు పంటలు, ప్రత్యేకించి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో సాగు చేస్తున్న ఆయకట్టు పంటలను కాపాడేందుకు కేంద్రం అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకతతో పాటు భవిష్యత్తు వివాదాల నివారణ కోసం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలతో పాటు కృష్ణా నదిపై 35 చోట్ల టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వీటితో నీటి వినియోగం సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలు కలుగుతుందని, వాటాలకు కట్టుబడి నీళ్ల తీసుకునేందుకు దోహదపడుతుందని సూచించారు. మంత్రి అభిప్రాయంతో కేంద్ర మంత్రి ఏకీభవించారు. ఏపీతో ఉన్న నీటి వివాదాల్లో జోక్యం చేసుకుని తెలంగాణ ఆందోళనలకు పరిష్కారం చూపాలంటూ మంత్రి చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు సత్వర అనుమతులిస్తామని భరోసా ఇచ్చారు.

జీరో వడ్డీ, 50 ఏళ్ల గడువుతో రుణాలు.. కేంద్రం

సీతారామ, సీతమ్మసాగర్, పాలమూరు–రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టులకు సత్వర అనుమతులతో పాటు నిధులను కేటాయించాలని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు జీరో వడ్డీతో పాటు తిరిగి చెల్లింపులకు 50 ఏళ్ల గడువుతో రుణాలు అందించేందుకు ఉన్న అవకాశాలను కేంద్రం పరిశీలిస్తుందని ఈ సందర్భంగా దేబశ్రీ ముఖర్జీ హామీ ఇచ్చారు. నెల రోజుల్లోగా సీతారామ ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ ప్రక్షాళన, పునరుద్ధరణతో పాటు గోదావరి–మూసీ అనుసంధానం ప్రాజెక్టుకు కేంద్ర సహాయం అందించాలని కోరగా, ప్రతిపాదనలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో అమలు చేస్తున్న డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డ్రిప్) కింద శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు మరమ్మతుల నిర్వహణతో పాటు జలాశయాల్లో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో కేంద్రం రాష్ట్రానికి సూచించింది. కాగా ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్–2లో జరుగుతున్న విచారణ సత్వరంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పాల్గొన్నారు.

● అతిథి





● కినా, ఫిలిప్పీన్స్, మెర్మైడ్ ఇన్‌స్ట్రక్టర్



● క్లియో, ఇటలీ



● రుత్, ఫిలిప్పీన్స్



● విరోనిక, ఫిలిప్పీన్స్



● డెబోరా, ఇటలీ

రెక్కల గుర్రంపై... విశాఖకు ఎగిరొచ్చిన జల కన్యలు

చందమామ కథల్లో విన్న జలకన్యలు కళ్ల ముందు ప్రత్యక్షమై 'హాయ్' అని పలకరిస్తే ఎలా ఉంటుంది?

సినిమాల్లోనే చూసిన రంగుల వెలుగుల జల కన్యలు 'పదండి మా లోకంలోకి' అని ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది?

ఆశ్చర్యం, ఆనందం, అద్భుతం సొంతమై మరో ప్రపంచంలోకి తీసుకువెళుతుంది.

విశాఖ ఎక్స్‌పో- 2025 మెర్మైడ్స్ (జల కన్యలు) ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా మారింది.

ఎక్కడెక్కడి నుంచో విశాఖకు రెక్కలతో ఎగిరొచ్చిన జలకన్యల పరిచయం...

చిన్నతనంలో కథలు, కార్టూన్‌లలో జలకన్యలను చూసి తెగ సంతోషించేది ఫిలిప్పీన్స్‌కి చెందిన కినా. 'జలకన్యలు' నిజం అనే భావనతోనే పెరిగింది. తాను కూడా వారిలా మారాలని బలంగా అనుకుంది. తరువాత కాలంలో స్కూబా డైవింగ్‌లో శిక్షణ తీసుకుంది. సముద్రంలో కూడా ఈద గలిగే నైపుణ్యాన్ని సొంతం చేసుకున్న కినా మెర్మైడ్ ప్రొఫెషన్ ఎంచుకుంది. 'శ్వాసను మన ఆధీనంలో ఉంచుకోవడం ఎంతో ప్రధానం' అంటున్న కినా నాలుగు సంవత్సరాలుగా ఈ రంగంలో ఉంది. మెర్మైడ్ ఇన్‌స్ట్రక్టర్‌గా విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది.

'మెర్మైడ్‌గా నీటిలో ఈదుతూ ప్రేక్షకులను అలరించాలంటే ఎప్పుడూ చిరునవ్వుతో ఉండాలి. దీనికి మంచి నిద్ర, తగినంత వ్యాయామం అవసరం. నిత్యం ఉదయంవేళల్లో స్ట్రెచ్చింగ్ ఎక్సర్‌సైజ్‌లు, యోగా చేస్తాము. దీనివల్ల నీటిలో ఎక్కువసమయం శ్వాస తీసుకోకుండా ఉండటం సాధ్యపడుతుంది. ప్రత్యేకమైన మాస్క్, ఇయర్ ప్లగ్స్, ప్రత్యేకమైన సూట్, నడుముకి 2 నుంచి 4 కేజీల బరువుండే బెల్ట్, ఫిన్ వంటివి ధరిస్తాము' అంటుంది ఫిలిప్పీన్స్‌కు చెందిన రుత్.

ఇటలీకి చెందిన క్లియో ప్రొఫెషనల్ సింగర్. చిన్నప్పటి నుంచి మెర్మైడ్స్ అంటే ఇష్టం. ఆ ఇష్టంతోనే పాటకు వీడ్కోలు చెప్పి శిక్షణ తరువాత మెర్మైడ్ ప్రొఫెషన్‌లోకి వచ్చింది. 'మమ్మల్ని చూసిన తరువాత చిన్నారుల మోముల్లో కనిపించే చిరునవ్వులు ఎంతోసంతోషాన్ని, వృత్తిపరమైన సంతృప్తిని ఇస్తాయి. మా వృత్తిలో గౌరవప్రదమైన వేతనం ఉంటుంది' అంటుంది క్లియో.

ఫిజికల్ థెరపిస్ట్‌గా ఫిలిప్పీన్స్‌లోని హాస్పిటల్స్‌లో రెండేళ్లు పనిచేసిన విరోనికకు మెర్మైడ్ ప్రొఫెషన్ అనేది చిన్ననాటి కల. తన కలను సాకారం చేసుకోవడమే కాదు రెండువృత్తులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతోంది. 'భారత్‌లో మమ్మల్ని బాగా ఆదరించారు' అంటుంది విరోనిక.

మూవీ థియేటర్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకున్న ఇటలీకి చెందిన క్లియో మెర్మైడ్ ప్రొఫెషన్‌లోకి రావడం ద్వారా తన చిన్నప్పటి కలను నెరవేర్చుకుంది. ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందన, వృత్తిపరమైన సంతృప్తి, సంతోషాల మాట ఎలా ఉన్నా....ఇది ఆషామాషీ వృత్తేమీ కాదు. నిత్యం రెండు నుంచి నాలుగు గంటల సమయం నీటిలో ఉండాల్సి ఉంటుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గిపోతుంది.హైపోథేమియా,హైకోక్సియావంటి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పరిశుభ్రమైన నీరు లేని పక్షంలో చర్మసమస్యలు వస్తాయి. చర్మ, కేశ సంరక్షణకు ఎక్కువ శ్రద్ధ వహిస్తూ ఖర్చు చేయాల్సి వస్తుంది. నీటిలో దిగే సమయంలో శరీరానికి వివిధ లోషన్లు పూసుకుంటారు. పైభాగంలో ఉంచే లైట్ల నుంచి వచ్చే వేడిని దృష్టిలో పెట్టుకొని సన్ స్క్రీన్ వాడతారు. కాళ్లకు ఉపయోగించే ప్రత్యేకమైన తోక వంటి పరికరం వల్ల కాళ్లపై గాయాలు కావడం అనేది సర్వసాధారణం.

నాలుగు దశల శిక్షణ

మెర్మైడ్ ప్రొఫెషన్ కోసం ప్రాథమిక స్థాయి, ఓపన్ మెర్మైడ్, అడ్వాన్స్‌డ్, ఇన్‌స్ట్రక్టర్...నాలుగు దశల్లో శిక్షణ ఉంటుంది. తొలి దశలో ఈత కొట్టడంలో ప్రాథమిక సూత్రాలు, రెండోదశలో సముద్రంలో, ద్వీపాలలో ఈత కొట్టడం, మూడోదశలో మరింత నైపుణ్యంతో ఈత కొట్టడం నేర్పిస్తారు. నాల్గవ దశలో ఈతలో, మెర్మైడ్స్‌గా ఉపాధిని పొందడానికి వచ్చే వారికి అవసరమైన శిక్షణ అందించే ఇన్‌స్ట్రక్టర్‌గా మారడానికి అవసరమైన శిక్షణ ఇస్తారు.

– వేదుల నరసింహం
ఎ.యూ. క్యాంపస్, సాక్షి, విశాఖపట్నం
ఫోటోలు: ఎం.డి. నవాజ్

గ్రానీస్ వర్క్... గ్రాండ్‌గా!

ఏడుపదుల వయసు దాటాక ఇంక చేసేదేముంది అని చాలామందిలో ఒక నిరుత్సాహపూరితమైన అభిప్రాయం ఉంటుంది.
కానీ, చేయాలనుకున్న పనిని చేసి చూపించాలనుకునేవారికి వయసు అనేది ఒక అంకె మాత్రమే అని నిరూపిస్తున్నారు ఈ బామ్మలు.
కుటుంబ జీవనంలో గృహిణిగా, తల్లిగా బాధ్యతలు అన్నీ నిర్వర్తించాక తమకంటూ ఉన్న హాబీలు ఏవైనా ఉంటే వాటిని కొనసాగిస్తుంటారు కొందరు.
హాబీనే వ్యాపారంగా మార్చుకొని ఏడు పదులు దాటిన వయసులోనూ సంపాదనపరులుగా మారినవారి నుంచి మనమూ స్ఫూర్తిని పొందుదాం.



● పద్మ పరిఖా



● శీలా బజాజ్



● ఆశాపురి



● ఎం.ఎస్. చంద్రప్రభ నాయర్

పద్మ పరిఖా ఏడుపదులు దాటి రెండు దశాబ్దాలు అయ్యింది. సరదాగా నేర్చుకున్న క్రోషెట్ అల్లికలతో తన ఇంట్లో పిల్లలకు డ్రెస్సులు రూపొందించేది. కొన్ని రకాల షో పీసులను అల్లికతో అందంగా తయారు చేసేది. పదేళ్ల క్రితం ఆమె మనమరాలు బామ్మ వర్క్‌కు ఆదరణ కల్పించాలనుకుంది. ఆమె ప్రోత్సాహంతో పి.బి. హ్యాండ్‌మేడ్.ఔట్‌లెట్.కామ్ ప్రారంభించింది. దీని ద్వారా వెయ్యిమంది వినియోగదారులకు పద్మ తన ఉత్పత్తులను అందజేస్తోంది. క్రోషెట్ ఉత్పత్తులను పది దేశాలకు ఎగుమతి చేసి, చేతినిండా సంపాదించడమే కాదు... సత్కారాలు పొందుతూ 'స్వీయ సంపాదన ఎంతో ఆనందాన్ని ఇస్తుంది' అని వేదికల మీద గర్వంగా చెబుతుంది ఈ గుజరాతీ వాసి పద్మ పరిఖా.

ఆశాపురి 50 ఏళ్లుగా స్వెటర్లు, మఫ్లర్లు అల్లుతోంది. కుటుంబ సభ్యులకే పరిమితమైన ఆమె తన కళను విజయవంతమైన బిజినెస్‌గా మార్చుకుంది. ఎనిమిదేళ్ల క్రితం మొదలైన ఈ అల్లికల వ్యాపారాన్ని విజయవంతంగా నడుపుతూ తను నివసించే ఢిల్లీలోనే పదహారు మంది ఉద్యోగులను కూడా నియమించుకుంది.

శీలా బజాజ్ 80 ఏళ్లు. ఢిల్లీ వాసి. ఆరేళ్ల క్రితం బిజినెస్ ఉమన్‌గా మారింది. మనవలు, మనవరాళ్ల కోసం స్వెటర్లు, మఫ్లర్లు అల్లే శీలా కరోనా సమయంలో తన అభిరుచిని విస్తృతం చేసింది. తన మొదటి సంపాదన 350 రూపాయలు అంటూ ఆనందాన్ని పంచుకునే శీలా ఎంతో మందికి స్ఫూర్తిని కలిగిస్తోంది.

ఎం.ఎస్. చంద్రప్రభ నాయర్ కొన్నేళ్ల క్రితం తన తోబుట్టువులతో కలిసి పుట్టింటికి వెళ్లినప్పుడు, అక్కడ తన చిన్ననాటి జ్ఞాపకాలు ఆమెను చుట్టుముట్టాయి. తిరిగి ఇంటికి వచ్చాక ఏళ్లుగా పక్కన పడేసిన కుట్లు, అల్లికల పనిని తిరిగి కొనసాగించింది. వాటిని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కానుకగా ఇచ్చింది. ఆర్డర్లు వస్తుండటంతో దానినే వ్యాపారంగా మొదలుపెట్టింది.

● మన(సు)లో మాట

వింత సందేహాలతో బుర్ర తిరిగిపోతోంది..!

దాక్టర్ గారూ నేను గత పదెనిమిది ఏళ్లుగా డిప్రెషన్‌లో ఉన్నాను. ఎందుకో కారణం తెలియదు. దానివల్ల నా స్టడీస్ కూడా దెబ్బతిన్నాయి. అయినా మా అమ్మానాన్న కోసమైనా బతకాలనుకుని ఇంతవరకు ఉన్నాను. కానీ మళ్లీ ఒక సంవత్సరం నుంచి భయంకరమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాను. నా మైండ్‌లో రోజూ విచిత్రమైన ఆలోచనలు నిరంతరం వస్తూ నన్ను బాధపెడుతున్నాయి. ఈ చెట్లు ఎలా వచ్చాయి? భూమ్మీదకు మనుషులు ఎలా వచ్చారు? గాలిని చూడగలమా? ఆత్మలు ఉన్నాయా? నీళ్లు ఎందుకు తాగాలి, అన్నం ఎందుకు తినాలి... ఇలాంటి విచిత్రమైన ఆలోచనలు వచ్చి నరకయాతను అనుభవిస్తున్నాను. ఇవన్నీ నాకే ఎందుకు వస్తున్నాయి, ఇలా రాకూడదని నేనెంత ప్రయత్నం చేసినా అవి ఆగడం లేదు. మాది చాలా బీదకుటుంబం. నన్ను ఎలాగైనా ఇందులోంచి బయట పడేయవలసిందిగా అభ్యర్థిస్తున్నాను.

– విక్రం, పులివెందుల

మీ మెయిల్ చదివాను. మీరు ఎన్నో అనవసరమైన ఆలోచనలతో సతమతం అవుతూ, వాటినుంచి బయట పడలేక మనోవేదనకు గురవుతున్నట్లు అర్థం అయింది. మీకున్న లక్షణాలను ఎగ్జిస్టెన్షియల్ అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అంటారు. ఈ సమస్యతో బాధపడేవారిలో ఎక్కువగా ఫిలసాఫికల్ డౌట్స్ వస్తాయి. భూమి గుండ్రంగా ఎందుకు ఉంది, మనుషులు ఎలా పుట్టారు, సూర్యుడు తూర్పునే ఎందుకు ఉదయించాలి.. లాంటి తాత్వికమైన ప్రశ్నలు వస్తాయి. అయితే సాధారణంగా అందరిలో ఏదో ఒక సమయంలో ఇలాంటి సందేహాలు అప్పుడప్పుడు తలెత్తినా కొంతసేపు ఉండి తగ్గిపోతాయి. మీ విషయంలో మీకు ఇవి ఇష్టం లేకున్నా మిమ్మల్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టేలా వస్తున్నాయి. వాటికి సమాధానాలు వెతకలేక మీరు తీవ్రమైన మానసిక క్షోభకు, డిప్రెషన్‌కూ గురవుతున్నారు. దీనికి మంచి చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. మంచి మందులతోపాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ ద్వారా మీ జబ్బు లక్షణాలను పూర్తిగా తగ్గించవచ్చు. మీరు మీ ఉత్తరంలో చికిత్స తీసుకుంటున్నారో లేదో తెలపలేదు. ఒకవేళ మీరు చికిత్సలో లేనట్లయితే మీకు దగ్గరలో కడప ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మానసిక వైద్యుణ్ణి సంప్రదిస్తే మందులు, కౌన్సెలింగ్‌తో తగ్గిస్తారు. క్రమం తప్పకుండా మందులు వాడి కౌన్సెలింగ్ తీసుకున్నట్లయితే మీ సమస్య వీలైనంత తొందరలో తగ్గిపోతుంది. ఒకవేళ మీరు ట్రీట్‌మెంట్ తీసుకున్నా, సమస్య తగ్గకుంటే మీ రిపోర్ట్స్ అన్నీ తీసుకుని వస్తే మీకు తగిన చికిత్స చేసి, మీ సమస్య నుంచి పూర్తిగా బయట పడేలా చేయగలం. మీ ఆర్థిక పరిస్థితి సరిగా లేదన్న కారణంగా చికిత్స ఆపవద్దు. మీ పరిస్థితిని బట్టి మీకు అవసరమైన సహాయం చేసి, చికిత్స చేయగలం. వెంటనే మంచి నిర్ణయం తీసుకుని ముందుకు వెళ్లండి. అన్నీ మంచిగా జరుగుతాయి. ఆల్ ది బెస్ట్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:sakshifamily3@gmail.com

బ్యూటిప్స్



➡ ఆలివ్ ఆయిల్ రెండు టేబుల్ స్పూన్లు, రాళ్ల ఉప్పు టేబుల్ స్పూన్ చొప్పున తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని శరీరానికి పట్టించి, మృదువుగా నలుగు పెట్టినట్లు చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై మృతకణాలు సులువుగా తొలగిపోతాయి. చర్మకాంతి పెరుగుతుంది.

➡ మూడు చెంచాల ఆరెంజ్ జూస్‌ను, కప్పు పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని శరీరానికి పట్టించి, ఆరనివ్వాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి.

● రివార్డ్



3 నెలల తరువాత.... గ్రేహౌండ్స్ దొరికిందహో!

పెంచుకున్న కుక్క కనిపించకపోతే ఏం చేస్తాం? తిరగాల్సిన చోటుకల్లా తిరుగుతాం. పోలీస్ కంప్లాయింట్ ఇస్తాం. అయినా ఫలితం లేకపోతే ప్రియమైన శునకాన్ని తలచుకొని బాధ పడడం తప్ప ఏంచేయగలం? కాని గురుగ్రామ్‌కు చెందిన దీపయాన్ ఘోష్, కస్తూరి దంపతులు మాత్రం ఏమైనా సరే, ఎక్కడున్నా సరే... తప్పిపోయిన తమ పెంపుడు శునకాన్ని వెదికి పట్టుకోవాల్సిందేనని గట్టిగా డిసైడైపోయారు.

శునకం కనిపించని రోజు నుంచి వారికి నిద్ర, తిండి లేవు. కుక్క జాడ చెప్పిన వారికి యాభై వేల రివార్డ్ ప్రకటించడంతో సహా ఇంటింటికీ వెళ్లి శునకం ఆనవాళ్ల గురించి చెప్పడం, సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడం, డ్రోన్ నిఘా...ఇలా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

'ఇంత కష్టం అవసరమా?!' అని ఎంతోమంది అన్నారు. అయినా సరే కుక్క కోసం వెదకడం ఆపలేదు. ఎట్టకేలకు వారి అలుపెరగని గాలింపుకు ఫలితం దక్కింది. తాజ్‌మహల్ సమీపంలోని అడవిలో సంచరిస్తున్న గ్రేహౌండ్స్‌ను కనుగొన్నారు. దీపయాన్, కస్తూరి దంపతులు సెలవు రోజుల్లో ఆగ్రాకు వెళ్లారు. వూఫ్, గ్రేహౌండ్స్ అనే పెంపుడు కుక్కలను కూడా వెంట తీసుకెళ్లారు. ఫతేపూర్ సిక్రీని సందర్శిస్తున్న సమయంలో....'గ్రేహౌండ్స్ కనిపించడం లేదు' అని తాము బస చేసిన హోటల్ నుంచి ఫోన్ వచ్చింది.

ఎలాగైనా గ్రేహౌండ్స్ ఆచూకి కనుక్కోవాలని అనుకున్న దీపయాన్, కస్తూరి దంపతులు రెండు వారాల పాటు ఆగ్రాలోనే ఉండి పోస్టర్లు వేస్తూ, బ్యానర్లు కడుతూ ఎన్నో ప్రాంతాలు తిరిగారు. అయినా ఫలితం లేకుండా పోయింది. గురుగ్రామ్‌కు తిరిగి వచ్చిన తరువాత కూడా తరచు ఆగ్రాకు వెళ్లేవారు. ఆటోలపై, దుకాణాలు, మెట్రో స్టేషన్ల దగ్గర 'కనిపించడం లేదు' అనే ప్రకటనలు అంటించేవారు. వారి ప్రచారం సోషల్‌మీడియాకు కూడా చేరింది. దీంతో యానిమల్ రెస్క్యూ గ్రూప్‌లు, వాలెంటీర్‌లు కూడా రంగంలో దిగారు. ఒకానొక రోజు గ్రేహౌండ్‌ను చూసిన టూర్ గైడ్ ప్రశాంత్ జైన్ నుంచి దంపతులకు ఫోన్ వచ్చింది. అలా కథ సుఖాంతం అయింది. మూడు నెలల తరువాత గ్రేహౌండ్స్ తన పెంపుడు పేరెంట్స్ దగ్గరికి చేరుకుంది.

● స్ఫూర్తి

అలుపెరగని అరణ్యలక్ష్మి



● అరణ్య మార్గంలో అన్నలక్ష్మి (ఎడమ)

'ఎవరైనా సరే బతకడానికి ఉద్యోగం చేస్తారు. చావడానికి కాదు' అని ఎంతోమంది అన్నలక్ష్మితో అనేవారు.

ఇంతకీ ఆమె చేస్తున్న ఉద్యోగం ఏమిటి?

కేరళలోని చిన్నార్ అభయారణ్యంలో ఉన్న మారుమూల గిరిజన గ్రామం తయ్యన్నన్‌కుడిలోని ఏకైక అంగన్‌వాడీలో ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది.

అన్నలక్ష్మి ఉద్యోగ జీవితం రిస్క్, సాహసంతో కూడుకున్నది. వారం రోజుల క్రితం అటవీమార్గంలో జనావాసాలకు వచ్చిన అడవి ఏనుగు నుంచి త్రుటిలో తప్పించుకుంది. కొన్ని రోజుల క్రితం అదే ఏనుగు ఒక గిరిజనుడిని తొక్కి చంపేసింది. అయినప్పటికీ అన్నలక్ష్మి ఎప్పుడూ భయపడలేదు.

విద్యార్థుల దగ్గరికి వెళ్లడానికి గత పదిహేడు సంవత్సరాలుగా మొబైల్ నెట్వర్క్ కనెక్టివిటీ లేని అడవి మార్గం గుండా ప్రయాణం చేస్తూనే ఉంది. ప్రయాణ మార్గంలో జంతువుల అడుగు జాడలు కనిపిస్తే తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అడవి ఏనుగులు వెంబడించిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి సమయంలో పెద్ద పెద్ద రాళ్లు, చెట్ల వెనుక దాక్కొని తప్పించుకుంది.

38 ఏళ్ల అన్నలక్ష్మి జీవితంలో అరణ్యం, గిరిజన తెగలు భాగం అయ్యాయి. స్థానిక ముత్తువన్ భాషను అనర్గళంగా మాట్లాడే అన్నలక్ష్మి గిరిజన ప్రజలకు ప్రియమైన ఉపాధ్యాయురాలు.

'పిల్లలు ఇంట్లో కంటే టీచర్ దగ్గర ఉండడానికే ఇష్టపడతారు' అంటుంది ఒక గిరిజన తల్లి.

'ఉద్యోగ జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా పిల్లల అమాయక ముఖాలను గుర్తు తెచ్చుకుంటే ఎంతో శక్తి వస్తుంది. నా వృత్తి జీవితానికి వారే వెలుగు' అంటుంది అన్నలక్ష్మి.

● ఫస్ట్ టైమ్

ద్వారక తీరంలో అన్వేషణ



రెండు దశాబ్దాల తరువాత ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) గుజరాత్‌లోని ద్వారకా తీరంలో నీటి అడుగున అన్వేషణను తిరిగి ప్రారంభించింది. ప్రొఫెసర్ అలోక్ త్రిపాఠి నేతృత్వంలో అయిదుగురు పురావస్తు శాస్త్రవేత్తల బృందం ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తోంది. తొలిసారిగా ఈ అన్వేషణ బృందంలో మహిళా పురావస్తు శాస్త్రవేత్తలు ఉండడం విశేషం.

ఏఎస్ఐ డైరెక్టర్(తవ్వకాలు, అన్వేషణలు) హెచ్‌కే నాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ అపరాజిత శర్మ, పూనమ్ వింద్, రాజ కుమారీ బార్బినా పరిశోధన బృందంలో సభ్యులుగా ఉన్నారు.

దశల వారీగా ఈ బృందం అన్వేషణలు కొనసాగిస్తుంది. మొదటి దశలో భాగంగా పరిశోధనల కోసం స్థలాలను గుర్తిస్తారు. తొలిదశలో కనుగొన్న అంశాల ఆధారంగా మరిన్ని పరిశోధనలకు ప్రణాళికలు రూపొందిస్తారు.

'ఇదొక అపూర్వమైన అవకాశం' అంటుంది పూనమ్ వింద్.
నిజమే కదా!



ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్: మళ్లీ నంబర్‌వన్‌గా శుబ్‌మన్ గిల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ రెండోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. స్వదేశంలో 2023 నవంబర్‌లో జరిగిన ప్రపంచకప్ సందర్భంగా తొలిసారి టాప్ ర్యాంక్‌ను దక్కించుకున్న గిల్ తాజాగా రెండోసారి ఈ ఘనత సాధించాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 796 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో గిల్ వరుసగా 87, 60, 112 పరుగులతో ఓవరాల్‌గా 259 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శన గిల్‌ను మళ్లీ నంబర్‌వన్ ప్లేయర్‌గా చేసింది. ఇన్నాళ్లు 'టాప్' ర్యాంక్‌లో ఉన్న పాకిస్తాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్ 773 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ (761 పాయింట్లు) మూడో స్థానంలో, విరాట్ కోహ్లి (727 పాయింట్లు) ఆరో స్థానంలో కొనసాగుతుండగా... శ్రేయస్ అయ్యర్ (679 పాయింట్లు) ఒక స్థానం మెరుగుపర్చుకొని తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ (680 పాయింట్లు) తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు.



బుధవారం ప్రాక్టీస్ సెషన్‌లో సరదాగా భారత ఆటగాళ్లు రోహిత్, శ్రేయస్, అర్ష్‌దీప్

శుభారంభంపై భారత్ గురి

నేడు తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో 'ఢీ'

- ఫామ్‌లో టీమిండియా ఆటగాళ్లు
- మధ్యాహ్నం గం.2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు పోరు నేటి నుంచి మొదలవుతోంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగే తమ తొలి మ్యాచ్‌లో గురువారం బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. బలాబలాలు, ఫామ్ పరంగా చూసుకుంటే రోహిత్ సేన ప్రత్యర్థికంటే ఎంతో బలంగా ఉంది. అయితే ఎప్పటిలాగే బంగ్లాదేశ్ తమ స్థాయికి మించిన ప్రదర్శన కనబర్చి సంచలనాన్ని ఆశిస్తోంది. బ్యాటింగ్‌తో పాటు స్పిన్ ప్రధాన బలంగా భారత్ బరిలోకి దిగుతుండగా... బంగ్లాదేశ్ తమ పేస్ బౌలింగ్‌పై ఆశలు పెట్టుకుంది.

సమష్టిగా చెలరేగితే...

భారత్ తుది జట్టు కూర్పు విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. ఓపెనర్లుగా రోహిత్, గిల్ శుభారంభం అందిస్తే ఆ తర్వాత కోహ్లి దానిని కొనసాగించగలడు. ఇటీవల ఇంగ్లండ్‌తో చివరి వన్డేలో చక్కటి అర్ధసెంచరీ సాధించిన కోహ్లి భారీ ఇన్నింగ్స్ ఆడాలని పట్టుదలగా ఉన్నాడు. ఫామ్‌లో ఉన్న శ్రేయస్ అయ్యర్‌తో పాటు ఐదో స్థానంలో కేఎల్ రాహుల్ కూడా రాణిస్తే తిరుగుండదు. గత సిరీస్‌లో వరుస ప్రయోగాలతో రాహుల్ స్థానం పదే పదే మారింది. అయితే ఈసారి మాత్రం అతనికి అచ్చొచ్చిన ఐదో స్థానంలోనే ఆడించే అవకాశం ఉంది. పాండ్యా, జడేజా, అక్షర్‌ల ఆల్‌రౌండ్ నైపుణ్యం జట్టుకు అదనపు బలం. కుల్దీప్ చాలా కాలంగా చక్కటి ఆట తీరు కనబరుస్తున్నాడు. ముఖ్యంగా మధ్య ఓవర్లలో అతడిని ఎదుర్కోవడం ప్రత్యర్థులకు సవాల్. అనుభవజ్ఞుడైన షమీతో పాటు అర్ష్‌దీప్ ఆరంభంలో బంగ్లాదేశ్‌ను కట్టిపడేయగల సమర్థులు.

బలహీన బ్యాటింగ్...

తమ దేశపు స్టార్ ఆటగాడు షకీబ్ లేకుండా 2004 తర్వాత బంగ్లాదేశ్ తొలిసారి ఒక పెద్ద టోర్నీ ఆడుతోంది. లిటన్ దాస్ కూడా ఈ టోర్నీలో లేడు. అయితే ఇతర సీనియర్లు ముష్ఫికర్, మహ్ముదుల్లా లాంటి ప్లేయర్లు మరోసారి జట్టు భారం మోయాల్సి ఉంది. యువ బ్యాటర్లలో తన్‌జీద్, తౌహీద్ ఇటీవల పెద్దగా ప్రభావం చూపలేదు. కెప్టెన్ నజ్ముల్ చాలా కాలంగా ఫామ్‌లో లేడు. ఇలాంటి స్థితిలో ఈ బ్యాటింగ్ లైనప్ భారత బౌలింగ్‌ను ఏమాత్రం సమర్థంగా ఎదుర్కోగలదనేది సందేహమే. పేసర్లు ముస్తఫిజుర్, నాహిద్ రాణా, తస్కీన్ రాణించాలని జట్టు కోరుకుంటోంది. స్పిన్ ఆల్‌రౌండర్ మెహదీ మిరాజ్ కీలకం కానున్నాడు.



నజ్ముల్

తుది జట్లు (అంచనా):

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, షమీ, అర్ష్‌దీప్. **బంగ్లాదేశ్:** నజ్ముల్ (కెప్టెన్), తన్‌జీద్, సౌమ్య సర్కార్, తౌహీద్, ముష్ఫికర్, మహ్ముదుల్లా, మెహదీ హసన్ మిరాజ్, రిషాద్, తస్కీన్, నాహిద్, ముస్తఫిజుర్.

పిచ్, వాతావరణం

ఈ వేదికపై వన్డేలు అరుదుగా జరుగుతున్నాయి. దాదాపు అన్ని మ్యాచ్‌లలో తక్కువ స్కోర్లే నమోదయ్యాయి. నెమ్మదైన పిచ్‌పై స్పిన్నర్ల ప్రభావం ఖాయం. వర్ష సమస్య లేదు.

41 భారత్, బంగ్లాదేశ్ మధ్య మొత్తం 41 వన్డేలు జరిగాయి. భారత్ 32 మ్యాచ్‌ల్లో...బంగ్లాదేశ్ 8 మ్యాచ్‌ల్లో నెగ్గాయి. ఒక మ్యాచ్ రద్దయింది. చాంపియన్స్ ట్రోఫీలో ఒకే ఒక్కసారి 2017 సెమీఫైనల్లో ఇరు జట్లు తలపడ్డాయి. భారత్ 9 వికెట్లతో ఘన విజయం సాధించింది.

స్పిన్నర్లు ఇద్దరే ఉన్నారు

చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టులో ఐదుగురు స్పిన్నర్లను ఎంపిక చేయడంపై తీవ్ర చర్చ సాగుతోంది. అయితే మా జట్టులో ఇద్దరు స్పిన్నర్లను మాత్రమే ఎంపిక చేశాం. మరో ముగ్గురు బ్యాటింగ్ చేయగల ఆల్‌రౌండర్లు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ చేయగల ప్లేయర్లు జట్టుకు అవసరం. ఈ ముగ్గురు జట్టుకు వైవిధ్యాన్ని అందిస్తారు. అయినా మేం మా బలాన్ని బట్టి ఆటగాళ్లను ఎంచుకుంటాం. ఇతర జట్లలో ముగ్గురు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు ఉంటే వారి వద్ద ఆరుగురు పేసర్లు ఉన్నారేంటి అని ఎవరూ అడగరు. - రోహిత్, భారత కెప్టెన్

అనాబెల్ ఆల్‌రౌండ్ 'షో'

యూపీ వారియర్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం

వడోదర: అనాబెల్ సదర్లాండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడంతో... మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. బుధవారం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. మొదట యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఓపెనర్ కిరణ్ నవగిరె (27 బంతుల్లో 51; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందివ్వగా... శ్వేత సెహ్రావత్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్) హెన్రీ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో అనాబెల్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (49 బంతుల్లో 69; 12 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అనాబెల్ (41 నాటౌట్; 4 ఫోర్లు), మరిజాన్ కాప్ (29 నాటౌట్; 4 ఫోర్లు), షఫాలీ వర్మ (26; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. యూపీ వారియర్స్ బౌలర్లలో సోఫియా, దీప్తి శర్మ, గ్రేస్ హ్యారిస్ తలా ఒక వికెట్ తీశారు. **బెంగళూరులో శుక్రవారం జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో ముంబై ఇండియన్స్ తలపడుతుంది.**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పాక్‌కు పరాభవం

తొలి మ్యాచ్‌లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్

- 60 పరుగులతో న్యూజిలాండ్ గెలుపు
- లాథమ్, విల్ యంగ్ సెంచరీలు

కరాచీ: సొంతగడ్డపై డిఫెండింగ్ చాంపియన్‌గా అడుగు పెట్టిన పాకిస్తాన్ జట్టు పేలవమైన ఆటను ప్రదర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన ఆ జట్టు చాంపియన్స్ ట్రోఫీలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఓటమిని మూటగట్టుకుంది. ఐదు రోజుల క్రితం ఇదే మైదానంలో ముక్కోణపు టోర్నీ ఫైనల్లో పాక్‌ను మట్టికరిపించిన న్యూజిలాండ్ దానిని పునరావృతం చేసింది. అన్ని రంగాల్లో ఆధిక్యం ప్రదర్శిస్తూ టోర్నీలో విజయంతో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో సాంట్నర్ సారథ్యంలోని కివీస్ 60 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టామ్ లాథమ్ (104 బంతుల్లో 118 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), విల్ యంగ్ (113 బంతుల్లో 107; 12 ఫోర్లు, 1 సిక్స్) శతకాలతో చెలరేగారు. యంగ్, లాథమ్ నాలుగో వికెట్‌కు 118 పరుగులు జోడించారు. గ్లెన్ ఫిలిప్స్ (39 బంతుల్లో 61; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. లాథమ్, ఫిలిప్స్ ఐదో వికెట్‌కు 12.2 ఓవర్లలోనే 125 పరుగులు జత చేశారు. చివరి 10 ఓవర్లలో కివీస్ 113 పరుగులు సాధించింది. అనంతరం పాకిస్తాన్ 47.2 ఓవర్లలో 260 పరుగులకే ఆలౌటైంది. ఖుష్‌దిల్ షా (49 బంతుల్లో 69; 10 ఫోర్లు, 1 సిక్స్), బాబర్ ఆజమ్ (90 బంతుల్లో 64; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు.




రిజ్వాన్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (సి) (సబ్) ఫహీమ్ (బి) నసీమ్ 107; కాన్వే (బి) అబ్రార్ 10; విలియమ్సన్ (సి) రిజ్వాన్ (బి) నసీమ్ 1; మిచెల్ (సి) అఫ్రిది (బి) రవూఫ్ 10; లాథమ్ (నాటౌట్) 118; ఫిలిప్స్ (సి) ఫఖర్ (బి) రవూఫ్ 61; బ్రేస్‌వెల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 320. వికెట్ల పతనం:** 1-39, 2-40, 3-73, 4-191, 5-316. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 10-0-68-0, నసీమ్ 10-0-63-2, అబ్రార్ 10-0-47-1, రవూఫ్ 10-0-83-2, ఖుష్‌దిల్ 7-0-40-0, సల్మాన్ 3-0-15-0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షకీల్ (సి) హెన్రీ (బి) రూర్కే 6; బాబర్ ఆజమ్ (సి) విలియమ్సన్ (బి) సాంట్నర్ 64; రిజ్వాన్ (సి) ఫిలిప్స్ (బి) రూర్కే 3; ఫఖర్ (బి) బ్రేస్‌వెల్ 24; సల్మాన్ (సి) బ్రేస్‌వెల్ (బి) స్మిత్ 42; తాహిర్ (సి) విలియమ్సన్ (బి) సాంట్నర్ 1; ఖుష్‌దిల్ (సి) బ్రేస్‌వెల్ (బి) రూర్కే 69; అఫ్రిది (సి) లాథమ్ (సి) లాథమ్ (బి) హెన్రీ 14; నసీమ్ (బి) హెన్రీ 13; రవూఫ్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 19; అబ్రార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (47.2 ఓవర్లలో ఆలౌట్) 260. వికెట్ల పతనం:** 1-8, 2-22, 3-69, 4-127, 5-128, 6-153, 7-200, 8-229, 9-260, 10-260. **బౌలింగ్:** హెన్రీ 7.2-1-25-2, రూర్కే 9-0-47-3, బ్రేస్‌వెల్ 10-1-38-1, ఫిలిప్స్ 9-0-63-0, సాంట్నర్ 10-0-66-3, స్మిత్ 2-0-20-1.



విల్ యంగ్

టామ్ లాథమ్

సాక్షి సినిమా



దయా, బ్రహ్మాజీ, బుచ్చిబాబు, చందు మొండేటి, నాగ్ అశ్విన్, సత్యదేవ్

బాపు ట్రైలర్ సినిమాపై ఆసక్తి కలిగించింది - నాగ్ అశ్విన్

''బాపు' ట్రైలర్ చాలా బాగుంది. ఈ చిత్రంపై క్యూరియాసిటీ కలిగించింది. సినిమా టాక్ బాగుంటే మన తెలుగు ఆడియన్స్ సెకండ్ డే నుంచి హౌస్‌ఫుల్ చేస్తారు. ఇది చాలా మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో దయా దర్శకత్వం వహించిన చిత్రం 'బాపు'. ఆమని, 'బలగం' సుధాకర్ రెడ్డి, అవసరాల శ్రీనివాస్, ధన్యా బాలకృష్ణ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. రాజు, సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ మూవీ రేపు విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ నాగ్ అశ్విన్, చందు మొండేటి, బుచ్చిబాబు సాన, హీరో సత్యదేవ్, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సత్యదేవ్ మాట్లాడుతూ– ''ఈ మూవీ ట్రైలర్‌లో రా ఎమోషన్ కనిపిస్తోంది'' అన్నారు. ''పెద్ద సినిమా, చిన్న సినిమా అని ఉండదు. మంచి సినిమా ఏదైనా పెద్ద చిత్రమే'' అని చందు మొండేటి చెప్పారు. ''ఈ సినిమాని దయాగారు చాలా బాగా తీశారు'' అన్నారు బుచ్చిబాబు సానా. ''ఈ చిత్రంలో మంచి పాత్ర చేశాను'' అని బ్రహ్మాజీ తెలిపారు. ''కిస్మత్' తర్వాత 'బాపు' నా రెండో సినిమా'' అన్నారు భానుప్రసాద్ రెడ్డి. ''మా సినిమాని ప్రేక్షకులు పెద్ద హిట్ చేయాలి'' అని పేర్కొన్నారు దయా.

ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే పాత్రలే చేశాను

''చాలామంది నన్ను సీరియస్ యాక్టర్ అనుకుంటారు. కానీ నాకు కామెడీ సినిమాలంటే చాలా ఇష్టం. 'మజాకా' మూవీలో కొన్ని కామెడీ సీన్స్ చేశాను. ఇక ఓ యాక్టర్‌గా నేను సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌నే. నా జర్నీ పట్ల సంతృప్తిగా ఉన్నాను. నటిగా చాలామంచి పాత్రలు చేశాను. ఆడియన్స్ గుర్తుపెట్టుకునే పాత్రలు చేసినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇంకా యాక్షన్, పీరియాడికల్ ఫిల్మ్స్ చేయాలని ఉంది'' అని అన్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మజాకా'. రీతూ వర్మ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రావు రమేశ్, అన్షు ఇతర కీలక పాత్రల్లో నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేశ్ దండా నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో రీతూ వర్మ మాట్లాడుతూ– ''ఈ చిత్రం రైటర్ ప్రసన్న కుమార్ కథ చెప్పినప్పుడు ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. సినిమాలో ఉన్న రెండు ఫీమేల్ క్యారెక్టర్స్ (రీతూ వర్మ, అన్షు)కు మంచి ఇంపార్టెన్స్ ఉంది. కథలో చక్కని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ సినిమాలో కాలేజీ స్టూడెంట్ పాత్ర చేశాను. నాకు, రావు రమేశ్‌గారికి సింగిల్ టేక్ సీన్ ఉంది. రావు రమేశ్‌గారు డబ్బింగ్ పూర్తి చేసి, నాకు ఫోన్ చేసి, ఆ సీన్‌లో 'చాలా అద్భుతంగా చేశావమ్మా... నా 16 ఏళ్ల కెరీర్‌లో అలాంటి సీన్ చూడలేదు'' అని మెచ్చుకోవడం నాకో మెమొరబుల్ మూమెంట్. ఇక తెలుగులో ఓ కొత్త సినిమా సైన్ చేశాను. అలాగే ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాను'' అని అన్నారు.



సాయిపల్లవి

శ్రీలీల

సంయుక్త

బాలీవుడ్ బులాయా

నార్త్ నుంచి సౌత్‌కి వచ్చే కథానాయికల సంఖ్య ఎప్పుడూ ఎక్కువగానే ఉంటుంది. అయితే సీన్ మారింది. ఇప్పుడు దక్షిణాదిన పాపులర్ అయిన కథానాయికలను బాలీవుడ్ బులాయా (బాలీవుడ్ పిలిచింది). అలా ఇక్కడ సక్సెస్ అయి, బాలీవుడ్‌కి పరిచయం కానున్న కథానాయికలు కొందరు ఉన్నారు. ఆ తారలు హిందీలో చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

డబుల్ ధమాకా

దక్షిణాదిలోని అగ్ర కథానాయికల్లో సాయిపల్లవి ఒకరు. అందం, అభినయం పరంగా ఇక్కడ బోలెడంత ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె హిందీలో రెండు సినిమాలు అంగీకరించారు. ఆ చిత్రాలు 'రామాయణ', 'ఏక్ దిన్'. రామాయణం ఆధారంగా నితీశ్ తివారి దర్శకత్వంలో హిందీలో 'రామాయణ' మూవీ రూపొందుతోంది. ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి, లక్ష్మణుడి పాత్రలో రవి దుబే నటిస్తున్నారు. హనుమంతుడిగా సన్నీ డియోల్, రావణుడిగా యశ్ కనిపిస్తారని బాలీవుడ్ సమాచారం. యశ్‌తో కలిసి నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రిలీజ్ కానుంది. 2026 దీపావళికి తొలి భాగాన్ని, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. అలాగే ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హిందీలో 'ఏక్ దిన్' (వర్కింగ్ టైటిల్) అనే మూవీ చేశారు. ఈ చిత్రంలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించారు. సిద్దార్థ్ పి. మల్హోత్రా ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అయితే 'రామాయణ, ఏక్ దిన్' చిత్రాల్లో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా అధికారిక ప్రకటన రాలేదు. ఆ సంగతలా ఉంచితే... 'ఏక్ దిన్' ముందుగా రిలీజవుతుందని, ఈ మూవీతోనే సాయి పల్లవి బాలీవుడ్ ఫస్ట్ స్క్రీన్ ఎంట్రీ ఉంటుందని టాక్.



రీతూ వర్మ

లవ్ ఫిల్మ్‌తో...

తెలుగులో సక్సెస్‌ఫుల్ స్టార్ హీరోయిన్‌గా పేరు సంపాదించారు హీరోయిన్ శ్రీలీల. ఈ బ్యూటీ ఇప్పుడు హిందీలో నిరూపించుకోవడానికి రెడీ అయ్యారు. బాలీవుడ్ నుంచి తనకు మంచి స్వాగతమే దక్కినట్లుగా తెలుస్తోంది. ఒకేసారి రెండు ఆఫర్లు అందుకున్నారు. కార్తీక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు డైరెక్షన్‌లోని ఓ లవ్ ఫిల్మ్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైందట. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, అనురాగ్ బసు నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది రిలీజ్ కానుంది. ఇక ఈ సినిమాయే కాకుండా సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా నిర్మాత దినేష్ విజన్ ఓ మూవీని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రీలీల నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ సినిమా చర్చల్లో కూడా ఆమె పాల్గొన్నారు.

క్వీన్ ఆఫ్ క్వీన్స్

'బింబిసార, విరూపాక్ష, డెవిల్: ది సీక్రెట్ ఏజెంట్' వంటి తెలుగు హిట్ మూవీస్‌తో ప్రేక్షకులను అలరించారు హీరోయిన్ సంయుక్త. ఇప్పుడు బాలీవుడ్‌లోనూ తన సత్తా చాటుకోనున్నారీ బ్యూటీ. కాజోల్, ప్రభుదేవా, నసీరుద్దీన్ షా లీడ్ రోల్స్ చేస్తున్న హిందీ చిత్రం 'మహారాజ్ఞి: క్వీన్ ఆఫ్ క్వీన్స్'లో సంయుక్త ఓ లీడ్ రోల్ చేస్తు న్నారు. చరణ్ ఉప్పలపాటి దర్శకత్వంలో వెంకట అనీష్, హర్మాన్ నిర్మిస్తున్న ఈ మూవీ ఈ ఏడాదే విడుదల కానుంది.

తెలుగు హీరోయిన్ అనన్యా నాగళ్ల, కన్నడ హీరోయిన్ తన్వీ వంటి మరికొందరు తారల బాలీవుడ్ ఎంట్రీ దాదాపు ఖరారైందని సమాచారం.

నా పేరు వ్యోమ!

'ఓ వెయ్యి గబ్బిలాలు చెవిలో అరుస్తున్నట్లు ఉంటుంది డాక్టర్' అనే డైలాగ్‌తో 'శబ్దం' సినిమా ట్రైలర్ ఆరంభమైంది. ఆది పినిశెట్టి హీరోగా అరివళగన్ దర్శకత్వం వహించిన తెలుగు–తమిళ చిత్రం 'శబ్దం'. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ, ఎంఎస్ భాస్కర్, రాజీవ్ మీనన్ ఇతర పాత్రలు పోషించారు. 7ఎ ఫిల్మ్స్‌పై శివ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఎన్ సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ నైజాంలో రిలీజ్ చేస్తోంది. ఈ మూవీ ట్రైలర్‌ని బుధవారం విడుదల చేశారు. 'నా పేరు వ్యోమ.. నేను నీకు హెల్ప్ చేయడానికొచ్చాను దియా', 'మన చెవులు వినలేని అల్ట్రాసోనిక్ సౌండ్‌ని సృష్టించగల గొప్ప శక్తి ఉంది.., ఆ శబ్దంతోనే అది తను వెళ్లే బాటని, ఆహారాన్ని కనిపెడుతుంది' అంటూ ఆది పినిశెట్టి చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. 'సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'శబ్దం'. 'వైశాలి' వంటి హిట్ మూవీ తర్వాత ఆది, అరివళగన్ కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త తరహా సినిమా అనుభవాన్నిస్తుంది'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: అరుణ్ బత్మనాబన్, సహనిర్మాత: భానుప్రియ శివ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. బాలకుమార్.



ఆది పినిశెట్టి

కామెడీ సుబ్బు



అభినవ్ గోమఠం

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రంలో అభినవ్ గోమఠం కీలక పాత్ర చేశారు. ఆయన నటించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సుబ్బు క్యారెక్టర్ లుక్ పోస్టర్‌ని బుధవారం రిలీజ్ చేశారు. ''మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'సంతాన ప్రాప్తిరస్తు' తెరకెక్కింది. ఓ సమకాలీన అంశాన్ని కథలో చూపిస్తూ వినోదాత్మకంగా తీశాడు సంజీవ్ రెడ్డి. పాన్ ఇండియా మాట్రిమోని ప్రొఫైల్స్ ఉన్న ఫ్రస్టేటెడ్ అన్‌మ్యారీడ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సుబ్బు పాత్రలో అభినవ్ గోమఠం ప్రేక్షకుల్ని నవ్వించబోతున్నారు. ఆయన ఫ్రస్ట్రేషన్ ఏ స్థాయిలో వినోదం పండించిందో థియేటర్స్‌లో చూడాల్సిందే'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మధుసూదన్ రెడ్డి, కెమేరా: మహి రెడ్డి పండుగుల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 28	నిఫ్టీ ▽ 12
75,939	22,933

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	20,049	△ 7
డోజోన్స్	44,406	▽ 150
ఎఫ్‌టీఎస్ఈ 100	8,713	▽ 54
డాక్స్	22,434	△ 411
షాంఘై	3,352	△ 27
నికాయ్	39,164	▽ 106

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,733	△1,043
బంగారం (99.5 స్వచ్ఛత)	86,386	△1,039
వెండి (కిలో)	97,566	△1,543

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	85.12	88.08
£	బ్రిటన్ పౌండ్	107.08	111.98
€	యూరో	88.53	93.00
¥	జపాన్ ఎన్ (100)	46.00	68.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్	52.81	57.65
S$	సింగపూర్ డాలర్	62.47	67.15
SAR	సౌదీ రియాల్	22.29	23.84
UAE D	యూఏఈ దిర్హామ్	22.78	24.57
¥	చైనా యువాన్	11.06	12.88

ఇప్పుడు దాదాపు అన్ని చెల్లింపులూ యూపీఐ ద్వారానే. లేదంటే పెద్ద లావాదేవీలకు క్రెడిట్ కార్డ్ వాడుతుంటారు. మరి క్యూఆర్ కోడ్ చెల్లింపులకు బ్యాంక్ ఖాతాలో కచ్చితంగా బ్యాలెన్స్ ఉండాలి. లేదంటే యూపీఐ లైట్ వ్యాలెట్‌లో అయినా బ్యాలెన్స్ లోడ్ చేసుకోవాలి. ఈ రెండూ లేకుండా రూపే క్రెడిట్ కార్డుతో క్యూఆర్ కోడ్ చెల్లింపులకు గతేడాదే ఆర్‌బీఐ వీలు కల్పించింది. ఇప్పటి వరకు ఇదేమంత ప్రచారానికి నోచుకోలేదు. కానీ, ఇప్పుడు ఫిన్‌టెక్ కంపెనీలు రూపే క్రెడిట్ కార్డుల మార్కెటింగ్‌ను భుజానికెత్తుకున్నాయి. రియో, కివి, క్రెడిట్‌పే తదితర ఫిన్‌టెక్ సంస్థలు బ్యాంకులతో టైఅప్ అయి రూపే క్రెడిట్ కార్డులను కస్టమర్లకు అందిస్తూ, వాటిపై కమీషన్ పొందుతున్నాయి. ప్రముఖ రిటైల్ సంస్థలు, వర్తకులతోనూ చేతులు కలిపి రూపే కార్డు వినియోగంపై చక్కని ఆఫర్లు ఇస్తున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

- వ్యాపారం పెంచుకునే కొత్త మార్గం
- యూపీఐకి లింక్ చేసుకుని చెల్లింపులు
- ఈ ఫీచర్‌తో కస్టమర్లకు చేరువ
- వినియోగంపై రివార్డు పాయింట్లు
- మర్చంట్ భాగస్వాములతో టైఅప్

ఫిన్‌టెక్ కొత్త మంత్రం రూపే కార్డ్

యూపీఐకి అనుసంధానించుకుని చెల్లింపులు చేసుకునే వెసులుబాటు ఉండడంతో రూపే క్రెడిట్‌కార్డుతో కొత్త యూజర్లకు ఫిన్‌టెక్‌లు సులభంగా చేరువ అవుతున్నాయి. చిన్న వర్తకుల వద్ద పీవోఎస్ యంత్రాలు లేకపోవడంతో క్రెడిట్ కార్డులతో చెల్లింపులకు అవకాశం ఉండేది కాదు. పీవోఎస్ లేకపోయినా రూపే కార్డ్‌తో చెల్లింపులు చేసుకోవడం కస్టమర్లను ఆకర్షిస్తోంది. ''పీవోఎస్ మెషిన్ లేని వర్తకుల వద్ద చెల్లింపులకు వీలు కల్పించే ఏకైక కార్డ్ రూపే క్రెడిట్ కార్డ్''అని సూపర్.మనీ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రకాశ్ సికారియా తెలిపారు. పీవోఎస్ లేని వర్తకుల సంఖ్య కోట్లలో ఉంటుంది. దీంతో రూపే కార్డుల రూపంలో ఫిన్‌టెక్‌లకు పెద్ద మార్కెట్టే అందుబాటులోకి వచ్చినట్టయింది. కివి సంస్థ వర్చువల్ రూపే క్రెడిట్ కార్డ్ ప్లాట్‌ఫామ్ నిర్వహిస్తోంది. నెలవారీ రూ.300 కోట్ల విలువైన వ్యాపారాన్ని నమోదు చేస్తోంది. ''కస్టమర్లు యూపీఐ లావాదేవీలను క్రెడిట్ కార్డ్‌తో చేయడం మొదలు పెడితే, సేవింగ్స్ ఖాతా అనుసంధానిత యూపీఐ నుంచి మారిపోతారన్నది మా నమ్మకం. ఎందుకంటే ఇందులో సౌలభ్యంతోపాటు మెరుగైన అనుభవం లభిస్తుంది''అని కివి సహ వ్యవస్థాపకుడు, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మోహిత్ బేడి అభిప్రాయపడ్డారు.



ఆఫర్లతో గాలం..

''యూపీఐ చెల్లింపుల పరంగా సౌకర్యవంతమైన సాధనం. క్రెడిట్ కార్డులన్నవి రివార్డులు, ప్రయోజనాలకు పెట్టింది పేరు. ఈ రెండింటి కలయికతో కస్టమర్లకు మరిన్ని ప్రయోజనాలు, రివార్డులు అందించే ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం''అని సికారియా వివరించారు. కివి జారీ చేసే వర్చువల్ రూపే క్రెడిట్ కార్డ్‌పై 40–50 రోజుల వడ్డీ రహిత (క్రెడిట్ ఫ్రీ) కాలం అమలవుతుంది. దీనికి అదనంగా వ్యయంపై రివార్డులను అందిస్తోంది. ఎయిర్‌పోర్టుల్లో యూపీఐ ఆధారిత లాంజ్ ప్రవేశాలకూ వీలు కల్పిస్తోంది. పెద్ద వర్తకులతో టైఅప్ పెట్టుకుని క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్‌లను సైతం ఫిన్‌టెక్‌లు ఆఫర్ చేస్తుండడంతో కస్టమర్లు సైతం రూపే క్రెడిట్ కార్డులను తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు.

మధ్యవర్తిత్వ పాత్రతో ఆదాయం..

చాలా వరకు ఫిన్‌టెక్‌లు కేవలం మధ్యవర్తిత్వ పాత్రకే పరిమితమవుతున్నాయి. ఇవి నేరుగా క్రెడిట్ కార్డులు జారీ చేయవు. బ్యాంక్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుని పంపిణీ, ఇతర సేవలను అందించడానికి పరిమితమవుతున్నాయి. కార్డు యాక్టివేషన్‌పై కొంత మొత్తం చార్జీ కింద, కార్డు వినియోగంపైనా ప్రయోజనాలను అందుకుంటున్నాయి. సంప్రదాయ క్రెడిట్ కార్డులపై యూజర్లు నెలవారీ 8–9 లావాదేవీలు చేస్తుంటే.. యూపీఐ లింక్డ్ రూపే క్రెడిట్ కార్డుపై దీనికి రెట్టింపు స్థాయిలో ఉండడం గమనార్హం. కివి ప్లాట్‌ఫామ్ ద్వారా జారీ అవుతున్న రూపే క్రెడిట్ కార్డుపై నెలవారీగా ఒక్కో యూజర్ సగటున 22 నుంచి 24 లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. దీనివల్ల కస్టమర్లను నిలుపుకోవడంతో పాటు, అధిక లావాదేవీల రూపంలో ఫిన్‌టెక్‌లకు స్థిరమైన ఆదాయం లభిస్తోంది. తొలిసారి క్రెడిట్ యూజర్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై సెక్యూర్డ్ రూపే క్రెడిట్ కార్డులను ఆఫర్ చేస్తున్నాయి. యూపీఐపై క్రెడిట్ లైన్ సేవలను అందిస్తున్నాయి.

బంగారం.. బూమ్!



- మరోసారి జీవితకాల గరిష్టానికి
- రూ.900 ర్యాలీతో రూ.89,400

న్యూఢిల్లీ: పసిడి పరుగు మళ్లీ వేగాన్ని అందుకుంది. ఒక్క రోజే రూ.900 ర్యాలీ చేసింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర రూ.89,400కు చేరుకుంది. ఇది గత శుక్రవారం నమోదు చేసిన జీవితకాల గరిష్ట స్థాయి కావడం గమనార్హం. మధ్యలో ఒక్కరోజు విరామం అనంతరం మంగళవారం నుంచి మళ్లీ బుల్ ర్యాలీ మొదలు పెట్టింది. వరుసగా రెండు రోజుల్లో కలిపి రూ.1,200 లాభపడింది. అంతర్జాతీయంగా బలమైన సానుకూలతలు బంగారం ధరలు పెరగడానికి కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం రూ.900 లాభపడి రూ.89,000 మార్క్‌ను చేరింది. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం రూ.10వేలకు పైగా ర్యాలీ చేసింది. వెండి ధర కిలో రూ.600 పెరిగి రూ.99,600కు చేరుకుంది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌లో 10 గ్రాముల బంగారం కాంట్రాక్ట్ రూ.479 ర్యాలీ చేసింది. రూ.86,592కి చేరింది. వెండి ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రూ.589 లాభపడి రూ.97,437 స్థాయిని అధిగమించింది. ''అమెరికా టారిఫ్‌ల కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల మధ్య సురక్షిత సాధనమైన బంగారానికి డిమాండ్ పెరిగింది. బ్యాంక్‌లు, ఫండ్స్ అధిక కేటాయింపులు చేస్తున్నాయి'' అని ఎల్‌కేపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది తెలిపారు.

ఫార్మా, ఐటీ షేర్లలో అమ్మకాలు

రెండోరోజూ సూచీలకు స్వల్ప నష్టాలు




ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 28 పాయింట్లు నష్టపోయి 75,939 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 12 పాయింట్లు కోల్పోయి 22,933 వద్ద ముగిసింది. ఇరు సూచీలకిది వరుసగా రెండోరోజూ నష్టాల ముగింపు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 757 పాయింట్ల పరిధిలో 75,581 వద్ద కనిష్టాన్ని, 76,338 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 23,050–22,815 శ్రేణిలో ట్రేడైంది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 2.50%, 1.30 శాతం రాణించాయి. తాజాగా ఆటో, సెమికండక్టర్, ఫార్మా దిగుమతులపై 25% సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- అమెరికా దిగుమతి చేసుకొనే ఔషధాలపై 25% సుంకాలు విధించేందుకు ట్రంప్ సిద్ధమైనట్లు వార్తలు వెలుగులోకి రావడంతో దేశీయ ఫార్మా షేర్లు డీలాపడ్డాయి. నాట్కో 3%, డాక్టర్ రెడ్డీస్ 2.50%, జైడస్ లైఫ్‌సైన్సెస్, అరబిందో ఫార్మా, లుపిన్ 2% పతనమయ్యాయి.
- హెక్సావేర్ టెక్నాలజీస్ షేరు ఇష్యూ ధర (రూ.708)తో పోలిస్తే బీఎస్ఈలో 3% ప్రీమియంతో రూ.731 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 11% ఎగసి రూ.788 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 8% లాభంతో రూ.764 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.46,418 కోట్లుగా నమోదైంది.

పాలసీ జారీ తర్వాతే ప్రీమియం వసూలు

బీమా పాలసీలకూ ఏఎస్‌బీఏ

న్యూఢిల్లీ: కొత్తగా బీమా పాలసీలు తీసుకునే వారి సౌలభ్యం కోసం బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పాలసీ జారీ చేసిన తర్వాతే అందుకు సంబంధించి ప్రీమియం వసూలు చేసుకునేందుకు వీలుగా.. బీమా–ఏఎస్‌బీఏ సదుపాయాన్ని అందించాలంటూ అన్ని బీమా సంస్థలను కోరింది. పాలసీ జారీ అయ్యేంత వరకు ప్రీమియంకు సరిపడా మొత్తం కస్టమర్ బ్యాంక్ ఖాతాలో బ్లాక్ అయి ఉంటుంది. ప్రస్తుతం ఐపీవోలకు ఈ విధానం అమల్లో ఉంది.



దీన్ని అప్లికేషన్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్ (ఏఎస్‌బీఏ) సదుపాయంగా చెబుతారు. ఇదే మాదిరి బీమా–ఏఎస్‌బీఏ విధానాన్ని బీమా పాలసీలకు అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ కోరింది. మార్చి 1 నాటికి ఈ సదుపాయాన్ని అమల్లోకి తీసుకురావాలని ఐఆర్‌డీఏఐ కోరింది. ఈ విధానంలో కస్టమర్ ప్రపోజల్‌ను ఆమోదిస్తున్నట్టు బీమా సంస్థ కస్టమర్‌కు తెలియజేసిన తర్వాతే, ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని ఐఆర్‌డీఏఐ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఐఫోన్ 16ఈ వచ్చేసింది



కాలిఫోర్నియా: ప్రీమియం ఫీచర్లతో కస్టమర్లకు అందుబాటు ధరలో ఉండేలా 'ఐఫోన్ 16ఈ'ని యాపిల్ కంపెనీ బుధవారం మార్కెట్లో విడుదల చేసింది. 6.1 అంగుళాల డిస్ ప్లే, నాచ్ డిజైన్, శక్తివంతమైన 48 మెగా పిగ్జెల్ కెమెరా కలిగిన ఈఫోన్ తెలుపు, నలుపు రంగుల్లో లభిస్తుంది. ముందస్తు ఆర్డర్లు శుక్రవారం (ఫిబ్రవరి 21) నుంచి, అమ్మకాలు ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమవుతాయి. 128జీబీ, 256జీబీ, 512జీబీ స్టోరేజ్ వెర్షన్లలో లభించే ఈ ఫోన్ ప్రారంభ ధర రూ.59,900. కొత్త జెనరేషన్ ఏ 18చిప్‌తో తయారైన 16ఈ ఫోన్ స్మార్ట్ పనితీరుతో కస్టమర్లను ఆకట్టుకుంటుందని కంపెనీ తెలిపింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
భారత్‌పై అమెరికా సుంకాల ప్రభావం కొంతే | ఇన్ఫోసిస్‌లో 20,000 నియామకాలు!

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

డా.బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో బీఆర్‌ఏజీ సెట్-2025



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు, డా.బీఆర్ అంబేద్కర్ ఐఐటీ–నీట్ కోచింగ్ సెంటర్లలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు బీఆర్‌ఏజీసెట్–2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతితోపాటు క్రీడలు/వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తారు.

» **అర్హత:** ఐదో తరగతికి జిల్లాలోని ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో మూడో తరగతి, 2024–25 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి పూర్తిచేసి ఉండాలి.
» జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధిత జిల్లాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తిచేసి ఉండాలి.
» ఐఐటీ నీట్ కోచింగ్ సెంటర్లలో ప్రవేశాలకు బీఆర్‌ఏజీ సెట్(జూనియర్ ఇంటర్) పరీక్ష మెరిట్ జాబితాలో ర్యాంక్ పొందిన విద్యార్థులు ఐఐటీ మెడికల్ అకాడమీల పరీక్షకు 1:3 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేస్తారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,00,000 మించకూడదు.
» **వయసు:** ఐదో తరగతి ప్రవేశాలకు విద్యార్థి వయసు ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 01.09.2012 నుంచి 31.08.2016 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ/బీసీ/బీసీ–సి విద్యార్థులు 01.09.2014 నుంచి 31.08.2016 మధ్య జన్మించి ఉండాలి.
ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులు 31.08.2025 నాటికి 17 ఏళ్ల మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** ఐదో తరగతి ప్రవేశాలకు మొత్తం 50 మార్కులకు–50 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. తెలుగు(10 ప్రశ్నలు–10 మార్కులు), ఇంగ్లిష్(10 ప్రశ్నలు–10 మార్కులు), గణితం(15 ప్రశ్నలు–15 మార్కులు), ఈవీఎస్(15 ప్రశ్నలు–15 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
» ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు–100 ప్రశ్నలు ఉంటాయి. గణితం (15 మార్కులు), ఫిజికల్ సైన్స్ (15 మార్కులు), బయలాజికల్/నేచురల్ సైన్స్ (15 మార్కులు), సామాజిక అధ్యయనాలు (10 మార్కులు), ఇంగ్లిష్ (15 మార్కులు), లాజికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్ (30 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం 2.30 గంటలు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.03.2025
» **అడ్మిట్ కార్డ్‌ల జారీ తేదీ:** 01.04.2025.
» **ఐదో తరగతి బీఆర్‌ఏజీ ప్రవేశ పరీక్ష:** 06.04.2025.
» **జూనియర్ ఇంటర్ బీఆర్‌ఏజీ ప్రవేశ పరీక్ష:** 06.04.2025.
» **ఐఐటీ–మెడికల్ కోచింగ్ సెంటర్ల ప్రవేశ పరీక్ష:** 20.04.2025.
» **వెబ్‌సైట్:**https://apbragcet.apcfss.in

కెరీర్ ఆర్కిటెక్చర్ వయా నాటా!

నిర్మాణ రంగంలో.. ఇంజనీరింగ్ నైపుణ్యాలతో.. అద్భుత కట్టడాలకు రూపకల్పన చేయాలనుకుంటున్నారా..! అయితే మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. అదే.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్.. సంక్షిప్తంగా నాటా!! ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత ఆధారంగా.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో చేరి.. ఆర్కిటెక్చర్ ఇంజనీర్స్‌గా నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు. ఆ తర్వాత అద్భుత కెరీర్ అవకాశాలు దక్కించుకోవచ్చు. తాజాగా నాటా-2025 ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నాటాతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

» నాటా-2025 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశానికి నాటా
» జాతీయ స్థాయిలో 450కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు
» ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్‌తో విస్తృత అవకాశాలు



కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్

ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ వందల ఏళ్ల నుంచి మనుగడలో ఉంది. ఎన్నో చారిత్రక కట్టడాలు, వాటిలో ఇమిడి ఉన్న నిర్మాణ నైపుణ్యాలే అందుకు నిదర్శనం. ఆధునిక సాంకేతికతలకు అనుగుణంగా ఆర్కిటెక్చర్ విభాగంలో నిపుణులను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అయిదు దశాబ్దాల క్రితం ఏర్పాటైన సంస్థ.. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్. ఈ సంస్థ జాతీయ స్థాయిలో ఆర్కిటెక్చర్ విద్య, ఇన్‌స్టిట్యూట్స్ విషయంలో నియంత్రణ వ్యవస్థగా వ్యవహరిస్తోంది. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీ.ఆర్క్) కోర్సులో ప్రవేశాలకు నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా) పేరిట ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది.

నాటా మార్గం

బీ.ఆర్క్ కోర్సు అభ్యర్థులకు ప్రస్తుతం చక్కటి మార్గంగా నిలుస్తోంది.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా). ఈ టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు పొందిన అన్ని ఇన్‌స్టిట్యూట్‌లలో బీ.ఆర్క్‌లో ప్రవేశానికి అర్హత లభిస్తుంది. తాజా సమాచారం ప్రకారం–ప్రస్తుతం జాతీయ స్థాయిలో 450కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు నాటా స్కోర్ ఆధారంగా బీ.ఆర్క్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి.

అర్హతలు

ఎంపీసీ గ్రూప్‌లో 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి లేదా.. మూడేళ్ల డిప్లొమాలో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. 2025లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండు విభాగాలు.. 200 మార్కులు

నాటా–2025ను రెండు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. మొదటి విభాగం పార్ట్–ఎలో.. డ్రాయింగ్ అండ్ కంపోజిషన్ టెస్ట్‌లో భాగంగా.. కంపోజిషన్ అండ్ కలరింగ్(1 ప్రశ్న–25 మార్కులు); స్కెచింగ్ అండ్ కంపోజిషన్–బ్లాక్ అండ్ వైట్ (1 ప్రశ్న– 25 మార్కులు), 3డి కంపోజిషన్ (1 ప్రశ్న - 30 మార్కులు) విభాగాలు ఉంటాయి. మొత్తం 80 మార్కులకు పార్ట్–ఎ ఉంటుంది.

- రెండో విభాగం.. పార్ట్–బిలో విజువల్ రీజనింగ్, లాజికల్ డెరివేషన్, జీకే అండ్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్, డిజైన్ సెన్సిటివిటీ, డిజైన్ థింకింగ్, న్యూమరికల్ ఎబిలిటీ విభాగాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు.
- ఇలా పార్ట్–ఎ, పార్ట్–బి రెండూ కలిపి 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పార్ట్–ఎను ఆఫ్‌లైన్ టెస్ట్‌గా, పార్ట్–బిని ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.
- బహుళైచ్ఛిక ప్రశ్నలు (ఎంసీక్యూస్), మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ (ఒకటి కంటె ఎక్కువ సమాధానాలు ఉండే ఆబ్జెక్టివ్ ప్రశ్నలు), న్యూమరికల్ టైప్ కొశ్చన్స్, ప్రిఫరెన్షియల్ ఛాయిస్, మ్యాచ్ ద ఫాలోయింగ్ తరహాలో ఉంటాయి.

ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ

నాటాలో నిర్దిష్ట కటాఫ్ మార్కులతో స్కోర్ సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్ల కేటాయింపు చేస్తారు.ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న కళాశాలల ప్రాథమ్యాలను పేర్కొనాల్సి ఉంటుంది.

విస్తృత అవకాశాలు

నాటా స్కోర్ ద్వారా సీఓఏ గుర్తింపు ఉన్న ఇన్‌స్టిట్యూట్స్‌లో అయిదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో చేరి పూర్తి చేసుకున్న వారికి ప్రైవేట్, ప్రభుత్వ విభాగాల్లోనూ ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ విభాగాల్లో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రైల్వే, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్, నేషనల్ బిల్డింగ్, ఆర్గనైజేషన్స్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తదితర ప్రభుత్వ, అనుబంధ విభాగాల్లో కొలువులు లభిస్తాయి. అదే విధంగా ప్రైవేట్ రంగంలో గ్రాఫిక్, ఇంటీరియర్ డిజైన్, ఫర్నిచర్ డిజైన్ వంటి సంస్థల్లో, నిర్మాణ రంగంలోని కార్పొరేట్ సంస్థల్లో సగటున రూ.అయిదు లక్షల వార్షిక వేతనంతో కొలువు సొంతం చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** 2025 ఫిబ్రవరి 3 నుంచి
- మార్చి నుంచి జూన్ మధ్యకాలంలో నిర్దేశిత శుక్ర, శనివారాల్లో పరీక్ష ఉంటుంది.
- అభ్యర్థులు తమకు నచ్చిన సెషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఒకటి కంటే ఎక్కువ సార్లు పరీక్షకు హాజరైతే ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nata.in

మెరుగైన స్కోర్‌కు మార్గాలివే

విశ్లేషణ, పరిశీలనను పరీక్షించేలా

నాటాలో అభ్యర్థుల సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. పరీక్షలో డైనమిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.

డ్రాయింగ్ అండ్ కంపోజిషన్

ఈ విభాగంలో అభ్యర్థుల సృజనాత్మకత, ఊహాత్మక దృష్టిని పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. నిర్దిష్టంగా ఒక ఒక సందర్భాన్ని, సన్నివేశాన్ని ఊహించి, విశ్లేషించి సమాధానాలు ఇవ్వాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి. స్కెచ్ విజువలైజేషన్, క్రియేటివిటీ, స్కేల్ అండ్ ప్రపోర్షన్ ఆఫ్ ఆబ్జెక్ట్, జియోమెట్రిక్ కంపోజిషన్, బిల్డింగ్ ఫామ్స్, ఎలిమెంట్స్, కలర్ టెక్చర్, హార్మోనీ అండ్ కాంట్రాస్ట్, డ్రాయింగ్ ఆఫ్ ప్యాట్రన్, ఫామ్ ట్రాన్స్‌ఫర్మేషన్స్, ఇన్ 2డీ, 3డీ, సబ్‌స్ట్రాక్షన్, రొటేషన్, సర్ఫేసెస్ అండ్ వాల్యూమ్స్, జెనరేటింగ్ వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

కంపోజిషన్ ఆఫ్ కలర్

ఇందులో ఆయా సందర్భాలు, సన్నివేశాలకు అనుగుణంగా.. ఊహా చిత్రాలను రూపొందించేందుకు.. ఆకర్షణీయమైన కలర్ కాంబినేషన్స్‌ను వినియోగించే నైపుణ్యాలను పరీక్షిస్తారు.

స్కెచింగ్, కంపాజిషన్

ఈ విభాగంలో అభ్యర్థులకు నిర్దిష్టంగా ఒక సందర్భం, సన్నివేశాన్ని తెలియజేస్తారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు ఆయా భవనాల ఊహా చిత్రాలను గీయాల్సి ఉంటుంది. స్కేల్, ప్రపోర్షన్స్, టెక్స్చర్స్, షాడోస్, షేడ్స్ వంటి వాటిని విశ్లేషించాల్సి ఉంటుంది.

న్యూమరికల్ ఎబిలిటీ

పార్ట్–బిలో.. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, కాలిక్యులస్, ఇంటీజర్స్ వంటి మ్యాథమెటిక్స్ అంశాలపై దృష్టి పెట్టాలి. ఫిజిక్స్‌కు సంబంధించి ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, రే ఆప్టిక్స్, రేడియేషన్, ఆటమ్స్ అండ్ న్యూక్లియస్ వంటి ముఖ్యాంశాలపై పట్టుసాధించాలి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించే ఈ పరీక్షలో అభ్యర్థుల్లోని సృజనాత్మక, పరిశీలనాత్మక దృక్పథం, ఆర్కిటెక్చర్‌పైన ఉన్న అవగాహన, ఇమాజినేషన్, ఆయా సబ్జెక్ట్‌లపై వారికున్న ప్రతిభ నైపుణ్యాలను పరీక్షిస్తారు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- బ్యాంకింగ్ అవేర్‌నెస్


ట్రిపుల్‌రైడ్‌గా వెళ్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

కరెంటోళ్లం.. మాకే ఫైన్ వేస్తారా..?

- మెదక్‌లో ట్రాఫిక్ సిగ్నళ్లకు కరెంట్ కట్
- చలాన్ వేశారని విద్యుత్ ఉద్యోగుల కన్నెర్ర

మెదక్ మున్సిపాలిటీ: 'మేం కరెంటోళ్లం.. మాకే ఫైన్ వేస్తారా?'అంటూ విద్యుత్‌శాఖ ఉద్యోగులు ట్రాఫిక్ సిగ్నళ్లకు విద్యుత్ నిలిపివేసిన ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ నెల 14న ట్రిపుల్ రైడ్‌గా వెళ్తున్న ఓ బైక్‌కు ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేశారు. దీంతో 'మేం కరెంటోళ్లం. డ్యూటీపై వెళ్తున్నాం. మాకే ఫైన్ వేస్తారా? మేమేంటో చూపిస్తాం'అని బెదిరించి వెళ్లిపోయారు. తర్వాత పట్టణంలోని రెండు ప్రధాన కూడళ్లలో ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్లకు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాఫిక్ చలాన్‌లను సరిచేస్తామని చెప్పినప్పటికీ విద్యుత్ లైన్ తొలగించారని సీఐ నాగరాజు తెలిపారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులతో చర్చించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. ఇదే విషయమై ఏఈ నవీన్‌ను వివరణ కోరగా.. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద విద్యుత్ మీటర్లు లేవని, వాటిని బిగించుకోవాలని సూచిస్తూ సరఫరాను నిలిపివేసి.. తర్వాత పునరుద్ధరించినట్లు చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ లాభాల రింగ్‌టోన్



17 ఏళ్ల తర్వాత మళ్లీ మోగెన్

- 2007 తర్వాత తొలిసారి రూ.262 కోట్ల నికర లాభం
- అప్పులు, నష్టాలతో కుదేలైన సంస్థకు సంస్కరణల దన్ను
- 5జీ సర్వీసుల విస్తరణపైనా కసరత్తు

కాళ్లూ, చేతులు కట్టేసి పరుగుపందెంలో ఉసేన్ బోల్ట్‌తో పోటీపడమంటే అయ్యే పనేనా.. కానీ బీఎస్ఎన్ఎల్ పరిస్థితి అలాగే ఉండేది. బ్యూరోక్రసీ బంధనాలతోపాటు స్వయంకృతాపరాధాలు కూడా తోడు కావడంతో కంపెనీ నడక కుంటుపడింది. ఒకవైపు ప్రైవేట్ కంపెనీలు 3జీ, 4జీ, కొత్త ఆవిష్కరణలు, సరళతరమైన టారిఫ్‌లతో దూసుకెళ్తుంటే బీఎస్ఎన్ఎల్ వెనుకబడిపోయింది. లాభాల మాట దేవుడెరుగు.. అప్పులు, నష్టాల్లో కూరుకుపోయి మనుగడ కోసం నానాఅవస్థలు పడింది. అలాంటిది.. దశాబ్దంన్నర తర్వాత మళ్లీ బీఎస్ఎన్ఎల్ లాభాల రింగ్ టోన్ మోగింది. కంపెనీ మళ్లీ కోలుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

సాక్షి, బిజినెస్ డెస్క్: ప్రభుత్వ టెలికం విభాగం సర్వీసులను కార్పొరేటీకరించడంతో 2000లో ఏర్పాటైన బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్).. ల్యాండ్‌లైన్, మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులతో మారుమూల ప్రాంతాలకూ టెలికం సర్వీసులను విస్తరించింది. 2000–2010 మధ్య నాటికి అత్యధిక యూజర్లతో మార్కెట్లో ఆధిపత్యాన్ని సాధించింది. కానీ ఆ తర్వాత నుంచి యూనినార్, ఎయిర్‌టెల్, రిలయన్స్, వొడాఫోన్ లాంటి ప్రైవేట్ దిగ్గజాలు ఉత్తమ కస్టమర్ సర్వీసులను అందిస్తూ, దూకుడుగా వ్యూహాలను అమలు చేస్తుండటంతో పరిశ్రమపై కంపెనీ పట్టు సడలింది. కాలం చెల్లిన టెక్నాలజీ, ప్రైవేట్ కంపెనీలతో దీటుగా పోటీపడేందుకు అవసరమైన సాంకేతికత, పరికరాలను సమకూర్చుకోలేకపోవడం, సకాలంలో స్పందించలేని నిస్సహాయ స్థితి.. ఇలాంటి ఎన్నో కారణాలతో కంపెనీ కుదేలైంది. 2006–07లో 31 శాతంగా ఉన్న మార్కెట్ వాటా 2009 నాటికి 16 శాతానికి పడిపోయింది. 2016లో రిలయన్స్ జియో.. ఉచిత వాయిస్ కాల్స్, అత్యంత చౌకగా డేటా సేవలతో ఎంట్రీ ఇవ్వడమనేది మార్కెట్ పరిస్థితులను ఒక్కసారిగా మార్చేసింది. ఇతర ప్రైవేట్ టెల్కోలతోపాటు బీఎస్ఎన్ఎల్‌ను కూడా గట్టిగా దెబ్బతీసింది. పెరిగిపోతున్న నష్టాలు, సరైన సమయంలో 4జీ సేవలను తేలేకపోవడం, ఉద్యోగుల జీతాల భారం పెరిగిపోవడంలాంటి సవాళ్లతో కంపెనీ సతమతమైపోయింది. 2019 నాటికి దాదాపు కుప్పకూలే పరిస్థితి ఏర్పడింది.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

65,000 దేశవ్యాప్తంగా ఉన్న టవర్లు

1,00,000 జూన్‌నాటికి లక్ష్యం

(నాలుగు మెట్రో నగరాలు, దాదాపు అన్ని రాష్ట్రాల రాజధానుల్లో 4జీ సర్వీసులున్నాయి)

5జీ సర్వీసుల విస్తరణ

ప్రస్తుతం వైర్‌లెస్ విభాగంలో 9 కోట్ల పైచిలుకు యూజర్లతో దాదాపు 8 శాతం, బ్రాడ్‌బ్యాండ్‌లో సుమారు 43 లక్షల కనెక్షన్లతో 17% మేర మార్కెట్ వాటా ఉంది.

బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో..

హై–స్పీడ్ ఇంటర్నెట్‌కి డిమాండ్ పెరగడంతో బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో అందిపుచ్చుకోవడంపై దృష్టి పెడుతూ ఫైబర్–టు–ది–హోమ్ సేవలను వేగంగా విస్తరించింది. కస్టమర్లకు ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా 500 లైవ్ టీవీ చానల్స్ లభించేలా ఫైబర్ ఆధారిత టీవీ సర్వీస్, స్పామ్ ఫ్రీ నెట్‌వర్క్‌లాంటి వినూత్న సేవలు అందిస్తోంది.

ప్రభుత్వ మద్దతు..



సవాళ్లెన్ని ఉన్నప్పటికీ గ్రామీణ, వ్యూహాత్మక ప్రాంతాల్లో టెలికం సేవలను విస్తరించడంలో కీలకంగా ఉన్న బీఎస్ఎన్ఎల్‌కి జవసత్వాలివ్వడానికి కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. 2019 నుంచి 2022 వరకు మూడు విడతలుగా దాదాపు రూ.3.22 లక్షల కోట్ల విలువ చేసే ప్యాకేజీలిచ్చింది. కేవలం ప్యాకేజీ ఇచ్చి ఊరుకోకుండా సంస్కరణలు కూడా చేపట్టేలా చర్యలు తీసుకుంది. వ్యయ నియంత్రణ, భారీ స్థాయిలో ఉన్న సిబ్బందిని క్రమబద్ధీకరించుకోవడం, నిర్వహణ ఖర్చులను తగ్గించుకుని ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లాంటి సంస్కరణలు అమలయ్యేలా చూసింది. వ్యయాలను తగ్గించుకునేందుకు 2020లో స్వచ్ఛంద పదవీ విరమణ స్కీమును కంపెనీ అమలు చేసింది. అప్పట్లో ఏకంగా 80,000 మంది వీఆర్ఎస్ తీసుకున్నారు. దీనితో ప్రతి నెలా జీతాల బిల్లుల భారం రూ. 600 కోట్ల వరకు తగ్గుతుందని కంపెనీ అప్పట్లో తెలిపింది.

25,000 2024 మార్చి నాటికి కంపెనీలో ఉన్న ఎగ్జిక్యూటివ్‌లు

30,000 నాన్-ఎగ్జిక్యూటివ్‌లు

38% ఆదాయంలో జీతభత్యాలకు పోతున్నది

రూ. 7,500 కోట్లు ప్రస్తుతం ఏటా సిబ్బంది జీతాల వ్యయం

సంస్కరణలతో ఏడాదికి నిర్దేశించుకున్న జీతాల లక్ష్యం: **రూ. 5,000 కోట్లు**

గత డిసెంబర్ నాటికి బీఎస్ఎన్ఎల్ సబ్‌స్క్రైబర్లు: **9 కోట్లు**

మరో విడత వీఆర్ఎస్ తెచ్చి కుదించాలనుకున్న సిబ్బంది సంఖ్య: **19,000** (వీఆర్ఎస్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది)

పూర్వ వైభవం దిశగా..

బీఎస్ఎన్ఎల్‌లో చేపట్టిన సంస్కరణల ఫలితంగా గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ. 16,811 కోట్ల నుంచి రూ.19,130 కోట్లకు పెరిగింది. నష్టాలు రూ. 8,161 కోట్ల నుంచి రూ. 5,367 కోట్లకు తగ్గాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో, 2007 తర్వాత.. అంటే 17 ఏళ్ల అనంతరం కంపెనీ తొలిసారిగా లాభాలు చూసింది. రూ. 262 కోట్ల నికర లాభం ఆర్జించింది. పోటీ సంస్థల కన్నా చౌకగా, సరళతరమైన ప్యాకేజీలు ఇస్తుండటంతో వినియోగదారులు ప్రైవేట్ కంపెనీల నుంచి బీఎస్ఎన్ఎల్ బాట పడుతున్నారు. కార్యకలాపాల విస్తరణ, వ్యయ నియంత్రణ చర్యలతో నాలుగో త్రైమాసికంలోనూ ఇదే జోరు కొనసాగిస్తామని కంపెనీ ధీమాతో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం 20 శాతం ఆదాయ వృద్ధిని అంచనా వేస్తోంది. 2025 ఆఖరు నాటికి 25 శాతం మార్కెట్ వాటాను నిర్దేశించుకుంది.

పోలీసు శాఖకు స్కోచ్ అవార్డులు...



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీసు శాఖ ప్రజా సేవల్లో డిజిటల్ పరివర్తన తీసుకుని రావడంలో విశేష కృషికి 'స్కోచ్'అవార్డులను సొంతం చేసుకుంది. భారతదేశ మేధోమథనం సంస్థగా గుర్తించే స్కోచ్ సంస్థ.. ఏటా ప్రభుత్వ రంగ సంస్థలు, రవాణా వ్యవస్థ, కార్పొరేట్ సేవలు, బ్యాంకింగ్ సేవల్లో ఉత్కృష్ట సేవలందించే సంస్థలకు ఈ అవార్డులను అందిస్తోంది. అవార్డులు అందుకున్న సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు జితేందర్ పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. పోలీసింగ్‌లో 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ పబ్లిక్ సర్వీసెస్'విభాగంలో రాష్ట్ర పోలీసుల యంత్రాంగం 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్స్ ఆఫ్ ది పోలీస్'అనుసరిస్తున్న విధానాలను వెల్లడించారు. ఇందులో 'ఎలక్ట్రానిక్ పెట్టీకేస్ మొబైల్ అప్లికేషన్'కు సిల్వర్ అవార్డు, 'స్మార్ట్ పోలీస్ స్టేషన్స్ అండ్ స్మార్ట్ పోలీసింగ్'కు, 'సమీకృత పెట్రోల్ నిర్వహణ పద్ధతి'కి ఆర్డర్ ఆఫ్ మెరిట్ సర్టిఫికెట్ అవార్డులు లభించాయి. ఈ అవార్డులను ఇటీవల ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రం తరఫున ఐటీ సెల్ డీఎస్పీ ఎస్.రవిచంద్ర అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అవార్డును, మెరిట్ సర్టిఫికెట్‌ను డీజీపీ జితేందర్‌కు, అడిషనల్ డీజీ వీవీ శ్రీనివాసరావులకు చూపించారు.

ఎల్‌ఆర్ఎస్‌కు లైన్ క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

అక్రమ లేఅవుట్లనే క్రమబద్ధీకరించనున్నారు. మార్చి 31వ తేదీలోపు పూర్తిగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించినవారికి 25శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకోని వారికి, లేఅవుట్లలో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల క్రమబద్ధీకరణకు కొన్ని వెసులుబాట్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒక లేఅవుట్‌లో 10శాతం ప్లాట్లు రిజిస్టరై.. 90శాతం ప్లాట్లు మిగిలిపోయినా ఎల్ఆర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా క్రమబద్ధీకరణ చాన్స్ ఇచ్చారు. ఈ కేటగిరీల వారికి కూడా మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే, ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకాన్ని రోజు వారీగా సమీక్షించాలని కూడా నిర్ణయానికి వచ్చారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు విజ్ఞప్తి చేశారు.

నిషేధిత భూముల జాబితా పట్ల అప్రమత్తం

ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో జాగ్రత్త వహించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. సాధారణ ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం జనం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా.. సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దనే చెల్లింపులు చేసి ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, దాన కిషోర్, నవీన్ మిట్టల్, జయేశ్ రంజన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల కోట్ల రాబడి అంచనా: రాష్ట్రంలో 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకానికి శ్రీకారం చుట్టింది. దానికి రాష్ట్రవ్యాప్తంగా 25.67 లక్షల దరఖాస్తులు వచ్చాయి. కానీ కోర్టు కేసుల కారణంగా ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎల్ఆర్ఎస్‌పై దృష్టి పెట్టింది. అప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు తగిన ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనేందుకు చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయం అమల్లోకి రావడానికి ఆలస్యమైంది. తాజాగా బుధవారం మంత్రులు సమావేశమై ఎల్ఆర్ఎస్‌కు ఆమోదం తెలిపారు. మార్చి 31వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయడం ద్వారా రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.20 వేల కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు.

ఇక వేగంగా దరఖాస్తుల పరిశీలన

రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు సుమారు 25.67 లక్షలు. ఇందులో 13,844 దరఖాస్తులకు సంబంధించి రూ.107.01 కోట్లు చెల్లింపు కూడా పూర్తయింది. మరో 9.21 లక్షల దరఖాస్తులను పరిశీలించి ఎల్ఆర్ఎస్‌కు ఆమోదయోగ్యమైనవిగా గుర్తించారు. ఫీజు చెల్లించాలని నోటీసులు కూడా జారీ చేశారు. ఇంకా ఆయా నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, గ్రామ పంచాయతీల పరిధిలో వచ్చిన మిగతా సుమారు 16 లక్షల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఇకపై వేగవంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఇదీ ఎల్ఆర్ఎస్ స్కీమ్ పరిస్థితి..

కేటగిరీ	దరఖాస్తుల సంఖ్య	పరిశీలన జరిగినవి	ఫీజు చెల్లింపు పూర్తయినవి	వసూలైన మొత్తం (రూ. కోట్లలో)
మున్సిపాలిటీలు	11,44,335	4,71,742	10,046	71.46
కార్పొరేషన్లు	3,00,568	1,03,022	3,276	31.67
పట్టణాభివృద్ధి సంస్థలు	1,72,834	47,472	78	0.25
హెచ్ఎండీఏ (జీపీలు)	3,01,490	1,21,598	53	0.46
గ్రామపంచాయతీలు	5,39,863	1,34,131	306	0.84
జీహెచ్ఎంసీ	1,08,017	43,751	85	2.33
మొత్తం	25,67,107	9,21,716	13,844	107.01

హైదరాబాద్‌లో 'మిస్ వరల్డ్'

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి మిస్ వరల్డ్ లిమిటెడ్ ఈ పోటీలను నిర్వహించనుంది. పోటీల ప్రారంభ, ముగింపు, గ్రాండ్ ఫినాలే వేడుకలు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు జులియా మోర్లే వెల్లడించారు. 'బ్యూటీ విత్ ఏ పర్పస్'నినాదంతో ఈ పోటీలు నిర్వహించనున్నారు.

ఆసక్తిగా ఎదురుచూస్తున్నా: జులియా

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించేందుకు ఆసక్తిగా ఎదుచూస్తున్నట్లు జులియా మోర్లే తెలిపారు. 'గొప్ప సంస్కృతి, వారసత్వం, అద్భుత ఆతిథ్యం, వేగవంతమైన వృద్ధి ఉన్న తెలంగాణ ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తున్న ఈ పోటీలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిస్ వరల్డ్ అభిమానులకు గొప్ప అనుభూతిని పంచనున్నాయి'అని పేర్కొన్నారు.

ఇది అద్భుతాల తెలంగాణ: స్మిత

ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ వేదిక కావటంపై రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ సంతోషం వ్యక్తంచేశారు. 'ఇది తెలంగాణ.. ఇక్కడ ప్రతి పండుగలో గొప్ప ఆనందం ఉంటుంది. ప్రతి చేతి నైపుణ్యం ఓ కొత్త కథను, ఆరాధనను తెలిపే నేల ఇది. ఇది తెలంగాణ.. అసలైన అందాలను ప్రతిబింబించే నేల. మిస్ వరల్డ్ వేదిక తెలంగాణలోని చేనేత గొప్పతనాన్ని, అద్భుతమైన ఆతిథ్యాన్ని, జానపద రీతులకు వేదిక కాబోతోంది'అని వెల్లడించారు. 2024 మిస్ వరల్డ్ పోటీలు ముంబైలో నిర్వహించారు. ఆ పోటీల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా పిస్కోవా విజేతగా నిలిచారు. మే 31న జరిగే గ్రాండ్ ఫినాలేలో విజేతకు ఆమె వజ్రాల కిరీటాన్ని అలంకరిస్తారు.



అధికారులు మూసివేసిన తన టీస్టాల్ వద్ద రోదిస్తున్న శ్రీనివాస్

'కేటీఆర్ టీస్టాల్' మూసివేత వివాదాస్పదం

ట్రేడ్ లైసెన్స్ లేదని మూసివేయించిన అధికారులు

సిరిసిల్ల టౌన్/హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 'కేటీఆర్ టీస్టాల్'ను అధికారులు మూసివేయించడం చర్చనీయాంశంగా మారింది. ట్రేడ్‌లైసెన్స్ లేకపోవడంతోనే మూసివేయించామని అధికారులు పేర్కొంటుండగా.. కేటీఆర్ పేరుతో టీస్టాల్ నిర్వహిస్తుండటంతో అధికారులు ఉద్దేశపూర్వకంగా మూసివేయించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. బుధవారం జిల్లా కేంద్రం మానేరుతీరంలోని మార్కెట్ కాంప్లెక్స్, బతుకమ్మఘాట్ పరిసర ప్రాంతాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. మడేలేశ్వర ఆలయం ఎదుట రెండు మున్సిపల్ టేలాల్లో టీస్టాల్స్ ఉండగా.. అందులో ఒకటి కేటీఆర్ టీస్టాల్ పేరుతో బత్తుల శ్రీనివాస్ దంపతులు నడిపిస్తున్నారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా ఆ టీస్టాల్స్‌కు అనుమతులున్నాయా? అంటూ ఆరా తీస్తూనే ఒకవేళ లేకపోతే మూసివేయాలని మున్సిపల్ అధికారులకు మౌఖికంగా ఆదేశాలిచ్చారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ దంపతులు గుండెలు బాదుకుంటూ.. లైసెన్సు తీసుకోవాలని తమకు తెలియదని, అదేంటో చెబితే వెంటనే తీసుకుంటామని అధికారులను ప్రాధేయపడ్డారు. అయినా కలెక్టర్ ఆదేశించారని పేర్కొంటూ టీస్టాల్ మూసివేయించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, కత్తెర వరుణ్, దార్ల సందీప్, గెంట్యాల శ్రీనివాస్, సబ్బని హరీశ్ ఆందోళన చేపట్టారు.

ప్రతీది గుర్తు పెట్టుకుంటున్నా.. ఎవర్నీ వదలను

సిరిసిల్లలో జరిగిన ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'లో ఘాటుగా స్పందించారు. 'చిరువ్యాపారిపై కలెక్టర్ అనుచిత ప్రతాపం చూపించారు. ప్రతీది గుర్తు పెట్టుకుంటున్నా.. ఎవర్నీ వదిలే ప్రసక్తే లేదు. ఇదే మాట మీద ఉంటానని మీకు మాట ఇస్తున్నా'అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు టీ షాపు యజమాని బి.శ్రీనివాస్ మాట్లాడుతున్న వీడియోను షేర్ చేశారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

నేటి నుంచి 28 వరకు... చర్లపల్లి–దానాపూర్ మధ్య సర్వీసులు



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 26వ తేదీన మహా కుంభమేళా ముగియనున్న దృష్ట్యా.. చర్లపల్లి–దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి–దానాపూర్ (07791) ప్రత్యేక రైలు ఈ నెల 20వ తేదీ నుంచి 28 వరకు (9 సర్వీసులు) ఉదయం 9.30 గంటలకు చర్లపల్లి నుంచి బయల్దేరి రెండోరోజు తెల్లవారుజామున 1.30 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో దానాపూర్–చర్లపల్లి (07792) ప్రత్యేక రైలు ఈ నెల 20 నుంచి 28 వరకు (9 సర్వీసులు) ఉదయం 4.45 గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి.. మర్నాడు రాత్రి 9.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బర్హంపూర్ తదితర రైల్వే స్టేషన్లలో ఆగుతాయి.

రెండో తరగతిలో కూతురు డిటెన్షన్

- అందుకే వ్యవస్థలపై పోరాటం చేస్తున్నా
- పోలీసుల విచారణలో వీర రాఘవరెడ్డి



మొయినాబాద్: 'నా కూతురును రెండో తరగతిలో డిటెన్షన్ చేశారు. పైతరగతికి పంపలేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలను ఏ తరగతిలోనూ డిటెన్షన్ చేయకూడదు. దీనిపై అధికారుల వద్దకు వెళ్లినా అవమానాలే ఎదురయ్యాయి. ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థలన్నీ ప్రజలకు న్యాయం చేయట్లేదనిపించింది. ఈ వ్యవస్థలకు దీటుగా కొత్త వ్యవస్థనే సృష్టించాలనే లక్ష్యంతో రామరాజ్యం స్థాపించా'అని వీర రాఘవరెడ్డి పోలీసుల విచారణలో వెల్లడించాడు. చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఆయనను కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. బుధవారం మొయినాబాద్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. పదో తరగతి వరకు చదువుకున్న వీర రాఘవరెడ్డి రామాయణం, భాగవతం, భగవద్గీతలను చదివి పురాణాలను ఒంటపట్టించుకున్నాడు. రామరాజ్యం ఏర్పాటుకోసం సైన్యాన్ని తయారు చేస్తున్న క్రమంలో చాలా మంది పూజారులను కలిశామని.. అందరూ తమకు సహకరిస్తామని చెప్పారని.. రంగరాజన్ మాత్రం నిరాకరించారన్నారు. అందుకే ఆయనపై దాడి చేశామని విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. గురువారం కూడా విచారణ కొనసాగనుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

నష్టాల నుంచి లాభాల బాటలోకి విత్తనాభివృద్ధి సంస్థ: చైర్మన్ అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిన పెడుతుందని ఆ సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి చెప్పారు. బుధవారం హాకా భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంస్థకు ఇవ్వాల్సిన రాయితీలు ఎగ్గొట్టడం, చెల్లింపులు జరపకపోవడంతో రూ.400 కోట్లు బ్యాంకు నుంచి ఓవర్‌డ్రాఫ్ట్‌గా తీసుకున్నట్టు తెలిపారు. విత్తనోత్పత్తి, విత్తన సరఫరాను నిర్వీర్యం చేయడంతో ఒకప్పుడు 3లక్షల క్వింటాళ్లు ఉన్న వరి విత్తనోత్పత్తి.. ప్రస్తుతం 87,000 క్వింటాళ్లకు పడిపోయిందని, 1,13,000 క్వింటాళ్లు ఉన్న వరి విత్తన సరఫరా 67 వేలకు పడిపోయిందని తెలిపారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంస్థను తిరిగి లాభాల బాటలోకి తెచ్చేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. తద్వారా రూ.150 కోట్లు సంస్థ ఆదాయం పొందుతుందన్నారు. ప్రైవేట్ వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్ట వేసి, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు విత్తనాభివృద్ధి సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. విత్తన ప్యాకింగ్‌ను కూడా ప్రైవేట్ సంస్థలతో పోటీగా 10, 15 కిలోల బ్యాగ్‌లలో రైతులకు అందిస్తున్నామన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ సృజనలకు.. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ విజ్ఞప్తి చేసింది. క్షేత్రస్థాయిలో కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వారిపై ఆర్థికంగా పడుతున్న భారాలను తొలగించాలని కోరింది. ఇతర శాఖలకు సంబంధించి వారిపై వేస్తున్న అదనపు పనుల భారాన్ని తగ్గించాలని విన్నవించింది. ఈ మేరకు బుధవారం సెంట్రల్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పేషీలోనూ దీని ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఫోరమ్ నేతలు నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫోరమ్ నేతలు వెంకటరమేశ్, టి.మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సర్వేను సద్వినియోగం చేసుకోండి: పొన్నం



సాక్షి, హైదరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారికి.. మరోసారి కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈనెల 28 వరకు సర్వేలో నమోదు చేసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. 3 పద్ధతుల్లో కుల సర్వేలో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇచ్చినట్టు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రతిపక్ష నేతలుగా కేటీఆర్, హరీశ్‌రావు సర్వేలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ పక్షాన.. బలహీన వర్గాల పక్షాన సానుకూలంగా ఉన్నామని వారు చెప్పాలని మంత్రి కోరారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శివాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, తదితరులు



ఎల్లెగడ్డ గ్రామం



ఐకమత్యంతో ఉన్న పల్లెగడ్డ గ్రామస్తులు

ఊరంతా బంధువులే

నేటి ఆధునికయుగంలో బంధాలు.. అనుబంధాలు తగ్గిపోతున్నాయి. అయితే ఆ గ్రామమంతా కలిసికట్టుగా ఉంటోంది. అన్నింట్లో పాలుపంచుకుంటున్న ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. దాదాపు 500 ఏళ్ల క్రితం వలస వచ్చిన ఓ కుటుంబం... ఇప్పుడు 228 ఇళ్లుగా మారి ఓ పంచాయతీగానే రూపాంతరం చెందింది. అదే నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని 'పల్లెగడ్డ'గ్రామం.

ఆదర్శంగా 'పల్లెగడ్డ' గ్రామం...కలిసికట్టుగానే మంచిచెడులు	గ్రామంలో ఎవరైనా చనిపోతే ఊరంతా ఉపవాసమే	90 శాతం వ్యవసాయమే జీవనాధారం... ఇటీవల గ్రామపంచాయతీగా గుర్తింపు

మరికల్: ఒకే కులం.. ఒకే మాటతో గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా అన్న.. తమ్మి, మామ, అల్లుడు అని పలకరిస్తూ కలిసికట్టుగా పరిష్కరించుకుంటారు పల్లెగడ్డ వాసులు. ఒక ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగితే అందరూ అక్కడే ఉండి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఎవరైనా చనిపోతే ఊరంతా ఉపవాసం ఉండి అంత్యక్రియలు నిర్వహిస్తారు. 500 ఏళ్ల క్రితం మరికల్ గ్రామంలో ముదిరాజ్ కులంలోని కట్టకొండ గోత్రానికి చెందినవారు ఉండేవారు. వీరి వ్యవసాయ భూములు మరికల్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఎత్తయిన ప్రాంతంలో ఉండేవి. దీంతో కట్టకొండ గోత్రానికి చెందిన ఓ వ్యక్తి మరికల్ నుంచి అక్కడకు వెళ్లి ఓ గుడిసె వేసి నివాసం ఏర్పరుచుకున్నాడు. కాలక్రమంలో ఈ కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు పుట్టి మూడు తరాలుగా విడిపోయి ఇళ్లు నిర్మించుకోవడంతో ఒక చిన్న పల్లెగా అవతరించింది. ఆనాడు మరికల్ పరిధిలోనే ఈ గ్రామం ఉండటంతో పల్లెగడ్డగా పేరుగాంచింది.

ఒక ఇంటిలో మూడు తరాలుగా విడిపోయిన అన్నదమ్ములే వారసత్వంగా కుటుంబాలు పెరిగి.. నేడు ఇక్కడ 228 ఇళ్లు నిర్మించుకున్నారు. గ్రామంలో ప్రస్తుతం 1,260 జనాభా ఉండటంతో మరికల్ నుంచి విడిపోయి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 349 మంది స్త్రీలు, 357 మొత్తం కలిపి 706 మంది ఓటర్లు ఉన్నారు. 75 శాతం పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువు కుంటున్నారు. గ్రామ శివారులో 1,245 ఎకరాల వరకు భూమి ఉంది. ఇక్కడ 90 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా, 10 శాతం మంది మాత్రమే ఇతర వ్యాపారాలు చేస్తున్నారు.

ఆపద వస్తే సాయం

గ్రామమంతా ఒకే కులంవారు ఉండటంతో అందరూ ఐకమత్యంతో ఉంటున్నారు. గ్రామంలో పెళ్లిళ్లు చేయడానికి దేవాలయం లేకపోవడంతో గ్రామస్తులు కలిసి చందాలు వేసుకొని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలను నిర్మించుకున్నారు. ఎవరికైనా ఆపద వస్తే సాయం చేస్తారు.

ఆనందంగా ఉంది..



మా పూర్వీకులు చెప్పిన ప్రకారం ఇప్పటికే ఏడు తరాలు దాటినట్టు తెలిసింది. ఒకే కులం పేరుతో ఇక్కడ నివసించడం ఆనందంగా ఉంది. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా, అందరూ కలిసి వారి బాధను పంచుకుంటాం. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. **– హన్మంతు**

శ్రీవారి సేవకులం



15 ఏళ్ల నుంచి టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి దేవస్థానంలో నిర్వహించే కార్యక్రమాలకు గ్రామం నుంచి మూడు టీంలుగా వెళతాం. అక్కడే వారం రోజులు ఉండి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సేవలు చేస్తాం. అన్నదానం, లడ్డూ తయారీ, అఖండ భజన కార్యక్రమాలు నిర్వహించడంతో మా గ్రామానికి ప్రత్యేక గౌరవం దక్కింది. **–శ్రీరామ్**

శివాజీకి బీజేపీ నివాళి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల కోసమే కేసీఆర్ నాటకాలు

టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం మాజీ సీఎం కేసీఆర్ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని, ఎన్ని చేసినా తెలంగాణ ప్రజలు ఆయన్ని నమ్మరని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ స్పష్టం చేశారు. పదిహేను నెలలుగా గుర్తుకురాని ప్రజలు కేసీఆర్‌కు ఇప్పుడు గుర్తుకొచ్చారా? అని బుధవారం ఒక ప్రకటనలో దయాకర్ ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కులగణనపై కేసీఆర్ స్పందించలేదని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తన వైఖరి చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన కేసీఆర్ ఇప్పుడు తెలంగాణ భవన్‌కు వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారని దయాకర్ వ్యాఖ్యానించారు.

ఏ బుక్‌లో రాయాలో ఈటలకు అర్థం కావడం లేదు: బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌తో లోపాయికారీ ఒప్పందం ఉంది కాబట్టే పింక్ బుక్‌లో రాయాలో కాషాయ బుక్‌లో రాయాలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు అర్థం కావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. కవిత పింక్ బుక్ అంటే ఈటల కూడా పింక్ బుక్ అంటున్నారన్నారు. బుధవారం వెంకట్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననేది మరోసారి రుజువైందని, అందుకే ఆ పార్టీ నేతలు ఒకేలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బుక్‌లు ఏవైనా బీఆర్ఎస్, బీజేపీలు రాయాల్సి వస్తే పింక్ బుక్‌లో లిక్కర్ స్కాంల గురించి, కాషాయ బుక్‌లో భూ అక్రమాలు, అవినీతి దందాల గురించి రాయాలని సూచించారు. ఈటల రాజేందర్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని వెంకట్ హెచ్చరించారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే పదేళ్లలో ఏడాదికి రెండు కోట్ల చొప్పున దేశ ప్రజలకు ఎన్ని ఉద్యోగాలిచ్చారో తెలంగాణలో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన హక్కులను సాధించిన తర్వాతే మాట్లాడాలని వెంకట్ వ్యాఖ్యానించారు.

శభాష్ గగన్‌చంద్ర

హరియాణా గవర్నర్ దత్తాత్రేయ ఫోన్
త్రీ ఇన్ వన్ హైబ్రిడ్ సైకిల్ రూపకర్తకు ప్రశంసలు



గగన్‌చంద్రతో ఫోన్‌లో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ



హైబ్రిడ్ త్రీ-ఇన్-వన్ సైకిల్‌తో గగన్‌చంద్ర

బల్మూర్: త్రీ ఇన్ వన్ హైబ్రిడ్ సైకిల్‌ను రూపొందించిన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి విద్యార్థి గగన్‌చంద్రకు బుధవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్‌లో అభినందనలు తెలిపారు. దక్షిణ భారతస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గగన్‌చంద్ర సౌరశక్తి, బ్యాటరీ, పెట్రోల్‌తో నడపగల హైబ్రిడ్ త్రీ-ఇన్-వన్ సైకిల్‌ను ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికవడం తెలిసిందే. గగన్ చంద్ర రూపొందించిన సైకిల్ బ్యాటరీ శక్తితో 35 కిలోమీటర్ల వరకు నడుస్తుంది. సౌరశక్తితో రోజంతా పనిచేస్తుంది. ఈ మేరకు అతని ప్రతిభపై 'సాక్షి' దినపత్రిక కథనం ప్రచురించింది. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా అభినందనలు తెలిపారు. గగన్‌చంద్ర ప్రతిభకు హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వయంగా ఫోన్ చేశారు. బల్మూర్ లాంటి కుగ్రామంలో జన్మించి.. హైబ్రిడ్ సైకిల్‌ను తయారు చేసి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి సహాయం కావలసినా అందిస్తానని హామీ ఇచ్చారు. గగన్‌చంద్ర తల్లిదండ్రులతో కూడా మాట్లాడిన దత్తాత్రేయ.. వారిని కూడా అభినందించారు. దీంతో గగన్‌చంద్రతో పాటు అతని తల్లిదండ్రులు భాస్కర్, సువర్ణ సంతోషం వ్యక్తం చేస్తూ గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయలేం

- **బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు**



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో భూ వివాదంపై దాఖలైన కేసును కొట్టివేయలేమని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు హైకోర్టు తేల్చిచెప్పింది. విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అసలేం జరిగిందంటే.. ఆశన్నగారి జీవన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో 2024, మేలో కేసు నమోదైంది. జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తన భూమిని కబ్జా చేశారని దామోదర్ రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తాను ప్రశ్నిస్తే మారణాయుధాలు చూపించి బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. 2022లో ఈర్లపల్లి శివారులోని సర్వే నంబర్ 32, 35, 36, 38లో 20 ఎకరాల 20 గుంటల భూమిని కొనుగోలు చేశానని బాధితుడు సామ దామోదర్ రెడ్డి చెప్పారు. అక్కడ తన తండ్రి పరమ్‌రెడ్డి పేరిట ఓ ఫంక్షన్ హాల్‌ను నిర్మించామని, అప్పటి నుంచి భూమి తన అధీనంలోనే ఉందని చెప్పారు. తన భూమి పక్కనే జీవన్ రెడ్డి భూమి ఉందని తెలిపారు. అయితే 2023లో జీవన్ రెడ్డి, ఆయన భార్య రజిత, తల్లి రాజుబాయి తన భూమిలో సగభాగం ఆక్రమించారని ఆరోపించారు. తాను నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను కూల్చివేసి కొత్త భవనం నిర్మించారని దామోదర్‌రెడ్డి చెప్పారు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు తాము ప్రయత్నం చేస్తే.. బిహార్, పంజాబీ గ్యాంగ్‌తో జీవన్ రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ క్రమంలోనే దామోదర్ రెడ్డి పోలీసులను ఆశ్రయించినట్టుగా చెప్పారు. రాజకీయ కక్షలో భాగంగా తనపై కేసు నమోదు చేశారని, ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని కోరుతూ జీవన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం తీర్పునిచ్చారు. పిటిషన్‌ను కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేశారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు భ్రమే

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్



సాక్షి,హైదరాబాద్: బీఆర్ఎస్‌కు తెలంగాణలో భవిష్యత్తు ఉంటుందనుకోవడం భ్రమ అని, సీఎం రేవంత్‌రెడ్డిని ఎదుర్కోవడం కేసీఆర్ వల్ల కాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల్ని వంచించిన బీఆర్ఎస్‌ను అక్కున చేర్చుకుంటారనేది కల్ల అని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్రమంత్రా?.. మూర్ఖపు మనిషా? అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా బీజేపీకి సహకరిస్తున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. దేశ స్థాయిలో మోదీ ప్రభావం తగ్గిపోతోందని దయాకర్ అభిప్రాయపడ్డారు.

నాగంపై కేసు కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డిపై నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని, కొట్టివేయాలని కోరుతూ జనార్దన్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 2023, నవంబర్ 26న అనుమతి లేకుండా దాదాపు 300 మందితో నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాత్రి 9.30 ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారని ఫిర్యాదు అందింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా, అనుమతి పొందకుండా ర్యాలీ నిర్వహించడం చట్టవిరుద్ధమంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధారాలు లేకుండా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ నాగం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

అసెంబ్లీకి రాని కేసీఆర్... తెలంగాణ భవన్‌లో హడావుడి: ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: 14 నెలలుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమై అసెంబ్లీకి రాని కేసీఆర్ ఇప్పుడు తెలంగాణ భవన్‌కు వచ్చి హడావుడి చేస్తున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌ను ఆడిపోసుకుంటున్నాడని, మునిగిపోతున్న బీఆర్ఎస్‌ను కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడని బుధవారం శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారులతో పనిచేయించుకోవడం రాదని కేసీఆర్ అంటున్నారని, మీలాగా అధికారులతో ఫోన్ ట్యాపింగ్ చేయించడం, కాళ్లు మొక్కించుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి చేయరని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక అర్హత కేసీఆర్‌కు ఉందా? అని ప్రశ్నించారు. 60 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకున్నప్పుడు రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయో చెప్పాలని శ్రీనివాస్ అన్నారు.

5 రాష్ట్రాలకు 1,554 కోట్ల అదనపు సాయం

- **అత్యధికంగా ఏపీకి రూ.608 కోట్లు, తెలంగాణకు రూ.231 కోట్లు**
- **2024లో వచ్చిన వరదలు, విపత్తుల సాయం కింద ప్రకటించిన కేంద్రం**

సాక్షి, న్యూఢిల్లీ: గత ఏడాది ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుఫాన్‌ల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొన్న ఐదు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,554.99 కోట్ల అదనపు సాయం ప్రకటించింది. వీటిలో తెలుగు రాష్ట్రాలకు రూ.839 కోట్లు కేటాయించింది. బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలోని ఉన్నత స్థా యి కమిటీ (హెచ్ఏఎల్) సమావేశం జరిగింది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) ద్వారా ఐదు రాష్ట్రాలకు సాయం అందించేందుకు ఈ కమిటీ ఆమోదం తెలిపినట్లు కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ మొత్తంలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు, తెలంగాణకు రూ.231.75 కోట్లు, నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లు, ఒడిశాకు రూ.255.24 కోట్లు, త్రిపురకు రూ.288.93 కోట్లు కేటాయించినట్లు హోంశాఖ పేర్కొంది. ఎస్‌డీఆర్ఎఫ్ ద్వారా ఇప్పటికే ఆయా రాష్ట్రాలకు కేంద్రం విడుదల చేసిన నిధు లకు అదనంగా తాజా ఆర్థిక సహాయం ఉంటుంద ని వివరించింది. కాగా.. 2024–25లో కేంద్ర ప్రభు త్వం దేశంలోని 27 రాష్ట్రాలకు రూ.18,322.80 కోట్ల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులను విడుదల చేసింది. కాగా, ఈ అదనపు నిధుల కేటాయింపుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ విజ్ఞప్తి


సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని కేంద్రానికి.. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. పత్తి కొనుగోలులో జాప్యం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. న్యాయమైన ధరలు, సమయానికి కొనుగోళ్ల పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వంశీకృష్ణ విజ్ఞప్తి మేరకు కిషన్‌రెడ్డి.. వెంటనే కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో మాట్లాడి పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. పత్తి కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్మన్, ఎండీ లలిత్ కుమార్‌ను ఆదేశించారని వంశీకృష్ణ తెలిపారు.

బీజేపీ మహిళా పక్షపాతి అని నిరూపించుకుంది

ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తా ఎంపికపై ఎంపీ ఈటల హర్షం

సాక్షి, హైదరాబాద్: ఒక మహిళా ఎమ్మెల్యే రేఖా గుప్తాను ఢిల్లీ సీఎంగా ఎంపిక చేసి బీజేపీ మరోసారి మహిళా పక్షపాతి అని నిరూపించుకుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దేశ మొదటి పౌరురాలిగా, దేశ రాజధానికి ముఖ్యమంత్రిగా మహిళలు ఉండటం సంతోషకరమన్నారు. ఢిల్లీలో డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి వేగం పెరుగుతుందని, పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఒక ప్రకటనలో ఈటల ఆశాభావం వ్యక్తంచేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించనున్న రేఖా గుప్తాకు శుభాకాంక్షలు తెలిపారు.

తల తాకట్టు పెట్టైనా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం: మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో పేదలకు ఇచ్చిన మాటను తల తాకట్టు పెట్టైనా నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఇప్పటికే రైతుభరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు వంటి హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మల్లు రవి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించేందుకే మహబూబ్‌నగర్ జిల్లా ఆమనగల్‌లో రైతు దీక్ష చేశారని రవి ఆరోపించారు. సీఎంను విమర్శించడం తప్ప రైతు దీక్షలో కేటీఆర్ చేసిందేమీ లేదని పేర్కొన్నారు. ఇష్టారీతిన మాట్లాడితే ప్రజలు కేటీఆర్ మీద తిరగబడతారని రవి హెచ్చరించారు.

మహా కుంభమేళాలో ఎంపీ లక్ష్మణ్

సాక్షి, న్యూఢిల్లీ: మహా కుంభమేళాలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యస్నానమాచరించారు. బుధవారం పవిత్ర త్రివేణి సంగమంలో వారికి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 144 ఏళ్ల తర్వాత వచ్చిన మహా కుంభమేళాలో స్నానమాచరించడం సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతినిచ్చిందని చెప్పారు.



బడి విద్య కాదిది.. బండి విద్య

చదువుపై ఆ చిన్నారికి ఎంత మక్కువో ఈ చిత్రం చెబుతోంది. బాగా చదువుకొని తన తల్లిదండ్రులను కష్టాల కడలి నుంచి సంతోష ప్రపంచం వైపు తీసుకెళ్లాలనే ఈ చిన్నారి తపన స్ఫూర్తిదాయకం. అనంతపురం లో ఓ చిన్నారి తోపుడు బండి ఎక్కి చదువుకుంటున్న దృశ్యం ఇది. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రకృతి గీసిన చిత్రం

ప్రకృతే వర్ణాలదిద్దితే ఆ చిత్రం ఎలా ఉంటుంది? సహజ సిద్ధంగా కాంతి, వర్ణాలు, వృక్షాలు, పక్షులు కలసి అందమైన చిత్రంగా కళ్లకు కనిపిస్తే ఎలా ఉంటుంది? ఆ అనుభూతిని వర్ణించడం సాధ్యం కాదు. కచ్చితంగా చూసి అనుభవించాల్సిందే. ఇటువంటి దృశ్యాన్నే విశాఖలో 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



తాతయ్యా..రుణం మంజూరు చేయించవా.!

కడప నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రభుత్వం బీసీలకు సబ్సిడీ రుణాలు మంజూరుకు దరఖాస్తుల పరిశీలన నిర్వహించింది. అక్కడ గాంధీజీ విగ్రహం వద్ద 'తాతయ్యా మా కుటుంబానికి రుణం మంజూరయ్యేలా చూడు' అని ఓ బాలిక వేడుకుంటున్నట్లుగా కనిపిస్తున్న దృశ్యాన్ని సాక్షి తన కెమెరాలో బంధించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

బాపట్ల టు గుజరాత్..

రాష్ట్ర సరిహద్దులు దాటిపోతున్న రేషన్ బియ్యం



- వెదుళ్లపల్లి, బాపట్ల, అప్పికట్ల ప్రాంతంలో రైస్ మిల్లుల నుంచి అక్రమ రవాణా
- వెదుళ్లపల్లి నుంచి నెలకు 15 వేల క్వింటాళ్లు..
- బాపట్ల, కర్లపాలెం మిల్లుల నుంచి 10 వేల క్వింటాళ్లు
- బియ్యం వ్యాపారుల నుంచి కిలో రూ.22కు కొంటున్న అక్రమార్కులు
- మిల్లుల్లో పాలీషింగ్ చేసి గుజరాత్‌లో రూ.40కు విక్రయాలు



రేషన్ బియ్యాన్ని సేకరించి పాలీషింగ్ చేసి గుజరాత్‌కు తరలించే బాపట్లలోని రైస్‌మిల్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లాలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు వ్యాపారులు గుజరాత్ రాష్ట్రానికి తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. బాపట్ల సమీపంలోని వెదుళ్లపల్లిలో ఉన్న ఓ రైస్‌మిల్లు యజమాని ఈ చౌక బియ్యాన్ని సేకరించి పాలిషింగ్ చేసి తరలిస్తున్నట్లు సమాచారం. ఆయనతోపాటు బాపట్ల పట్టణం పరిధిలోని మరో రైస్‌మిల్లు యజమానితోపాటు ఇదే మండలం అప్పికట్ల ప్రాంతంలోని ఇంకో రైస్‌మిల్లుకు చెందిన బాపట్ల టీడీపీ నేత అనుచరుడు రేషన్ బియ్యాన్ని కొని పాలీషింగ్ చేసి రాష్ట్ర సరిహద్దులు దాటించేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా సేకరణ..

బాపట్లతో పాటు పర్చూరు, అద్దంకి, రేపల్లె, చీరాల, వేమూరు, పొన్నూరు ప్రాంతాల్లోని డీలర్ల నుంచి కిలో బియ్యాన్ని రూ.15కు ఈ ముఠా కొనుగోలు చేస్తోంది. ఇలా సేకరించిన బియ్యాన్ని వెదుళ్లపల్లితో పాటు మిగిలిన ఇద్దరు మిల్లర్లకు కిలో రూ.22 చొప్పున విక్రయిస్తున్నారు. వెదుళ్లపల్లి మిల్లు యజమాని ఒక్కరే నెలకు సుమారు 15 వేల క్వింటాళ్ల బియ్యాన్ని తన మిల్లుకు తరలించి ఎప్పటికప్పుడు పాలీషింగ్ చేసి లారీలు, ట్రక్కుల ద్వారా పొన్నూరు, గుంటూరు, మిర్యాలగూడా మీదుగా హైదరాబాద్‌కు, అక్కడి నుంచి గుజరాత్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ కిలో రూ.22కు కొన్న రేషన్ బియ్యాన్ని గుజరాత్‌లో కిలో రూ.40కు అమ్ముతున్నట్లు సమాచారం. ఇలా ఒక్కో కిలోకు అన్ని ఖర్చులూపోను రూ.15 తక్కువ కాకుండా వస్తోంది. ఈ లెక్కన నెలనెలా రూ.కోట్లలోనే రాబడి ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, వెదుళ్లపల్లి మిల్లు యజమాని నెలకు 15 వేల క్వింటాళ్లు సేకరిస్తుండగా.. మిగిలిన రెండు మిల్లుల నుంచి మరో 10 వేల క్వింటాళ్లు అనుకున్నా మొత్తంగా జిల్లా నుంచి గుజరాత్‌కు సగటున 25 వేల క్వింటాళ్లు తరలిపోతున్నట్లు సమాచారం. వెదుళ్లపల్లి మిల్లుకు చెందిన వ్యాపారితోపాటు బాపట్ల, అప్పికట్ల మిల్లులకు చెందిన వ్యాపారులు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతోపాటు గుంటూరు జిల్లా పొన్నూరు, పల్నాడు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి ఎగుమతి చేస్తున్నారు.

రేషన్ బియ్యం ఖరీదు ఇలా..

నిజానికి.. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్డుదారులకు డీలర్లు కిలోకు రూ.8 చెల్లించి బియ్యం వ్యాపారులకు రూ.12కు ఇచ్చేవారు. అలాగే, బియ్యం అక్రమ రవాణాదారులు బియ్యం సేకరణ వ్యాపారులకు రూ.20 చెల్లించేవారు. కానీ, రేషన్ బియ్యానికి డిమాండ్ పెరగడంతో కార్డుదారులకు రూ.10 నుంచి రూ.12.. డీలర్లకు రూ.15 నుంచి రూ.17 వస్తోంది. ఇక వ్యాపారుల వద్ద నుంచి అక్రమ ఎగుమతిదారులు కిలో రూ.22 నుంచి రూ.24కు కొనుగోలు చేస్తున్నారు.

కార్డుదారులను వంచిస్తున్న డీలర్లు..

మరోవైపు.. కొందరు డీలర్లు కార్డుదారులకు మొక్కుబడిగా డబ్బులు చెల్లిస్తుండగా.. మరికొందరు దౌర్జన్యంగా లాగేసుకుంటున్నారు. ఏమైనా ప్రశ్నిస్తే తెల్లకార్డు గల్లంతవుతుందని పచ్చనేతలు బెదిరిస్తున్నారు. దీంతో.. బియ్యం పోతే పోయింది కార్డు అయినా మిగులుతుందని చాలామంది పేదలు మిన్నకుండిపోతున్నారు. దీంతో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి, రేపల్లెతోపాటు పర్చూరు, చీరాల, బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లోనూ చాలామంది డీలర్లు గోడౌన్ల నుంచే రేషన్ బియ్యాన్ని వ్యాపారులకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడంలేదు.

ఆధునిక రుషుల తపోవనం

నిరంతరంగా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న రామకృష్ణ మిషన్

సమాజంలో విలువలను పెంపొందించేందుకు కృషి



మిషన్ ఆవరణంలోని సర్వజనీన ఆలయం



స్వామిజీల వసతి గృహం

సాక్షి ప్రతినిధి, కడప: స్వచ్ఛంద సేవా సంస్థల్లో రామకృష్ణ మిషన్ ప్రపంచ స్థాయిలో నెంబర్ వన్‌గా నిలుస్తోంది. అటు ఆధ్యాత్మిక చింతన..ఇటు సమాజం పట్ల బాధ్యతతో సేవలందించడమే కాకుండా విద్య, వ్యవసాయం, విలువలను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. కడపలోని చెన్నూరు బస్టాండ్ సమీపంలో 1910లో రామకృష్ణ సమాజాన్ని ఏర్పాటు చేశారు. అందులో గ్రంథాలయాన్ని నిర్వహించారు. 1992లో రామకృష్ణ సేవా సమితిని భక్తులంతా కలిసి ఏర్పాటు చేసుకున్నారు. 2004 నుంచి దానిని రామకృష్ణ మఠంలో మార్చారు. రెండతస్తుల్లో గ్రంథాలయం, ఆధ్యాత్మిక బోధనలు నిర్వహించారు. 2007లో పుట్లంపల్లె వద్ద అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మఠం నిర్మాణానికి స్థలం ఇచ్చారు. అందులో 2007లో రామకృష్ణ మిషన్ ఏర్పాటైంది. పేదలు, అనాథ బాలలతో బాలకాశ్రామం నిర్వహిస్తున్నారు. వివేకానంద విద్యానికేతన్ పేరిట 7వ తరగతి వరకు మిషన్ ఆవరణంలో పాఠశాలను ఏర్పాటు చేశారు. అదే ఆవరణంలో వివేకానందుని పేరిట భారీ ఆడిటోరియం ఏర్పాటు చేశారు. ఇందులో ఆధ్యాత్మిక, సామాజిక సభలను కొనసాగిస్తున్నారు. ప్రధాన ద్వారానికి ఎదురుగా స్వామిజీ, బ్రహ్మచారుల గృహాలున్నాయి. ఆశ్రమమంతా నిరంతరం ప్రశాంతంగా పూల, పండ్ల తోటలతో ఆహ్లాదంగా ఉంటుంది. ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేకంగా ఆధ్యాత్మిక పుస్తకాల విక్రయాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2012లో ఏర్పాటు చేసిన విశ్వజనీన ఆలయం రామకృష్ణ మిషన్‌కు తలమానికంగా నిలుస్తోంది. ఇందులో అన్ని మతాలకు చెందిన చిత్రపటాలు, వారు తమ మతాచారం ప్రకారం ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా వేదికలు ఉంటాయి. సేవలు–మిషన్ ఆధ్వర్యంలో 'విద్య' పేరిట నైతిక విలువలుగల విద్యాబోధన గురించి పాఠశాలలు, కళాశాలల్లో మిషన్ ప్రతినిధులు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఆశ్రమ ఆవరణంలో యేటా రెండు మార్లు మూడు నుంచి వారం రోజులపాటు యువ రైతులకు పంటలు, దిగుబడిపై నిపుణులైన వారితో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. యేటా ఉపాధ్యాయులకు విలువలుగల విద్యాబోధనపై మూడు రోజులపాటు శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. కాగా, ఫిబ్రవరి 18న జరిగిన రామకృష్ణ పరమహంస జయంతి నేపథ్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు.



ఆశ్రమ ఆవరణంలో ఏర్పాటు చేసిన పాఠశాల

కాంట్రాక్ట్ లెక్చరర్లకు మే నెల వేతనం చెల్లించాలి

సాక్షి, అమరావతి : కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు మే నెలలో పనిచేసిన కాలానికి వేతనం మంజూరు చేయాలని జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2018లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు తాము మే నెలలోనూ విధులకు హాజరవుతున్నామని, ఈ క్రమంలో 2019–20 విద్యా సంవత్సరం నుంచి స్వల్ప విరామంతో 12 నెలల వేతనం అందించేవారని జేఏసీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. కానీ 2023–24 విద్యా సంవత్సరంలో 11 నెలల వేతనం మాత్రమే ఇచ్చారని తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారన్నారు. ప్రభుత్వ కార్యదర్శి ఆమోదం పొందినా ఆర్థిక లోటు, భారం పేరుతో ఆర్థిక శాఖ అధికారులు తమకు రావాల్సిన వేతనాన్ని నిలిపివేసినట్టు పేర్కొన్నారు.

రాష్ట్రంలో స్టాండ్ అలోన్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో స్టాండ్ అలోన్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్(బీఈఎస్ఎస్) ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎన్‌హెచ్‌పీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, ఏపీజెన్‌కో యాజమాన్యంతో తొలి బోర్డు సమావేశం సచివాలయంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌పీసీ డైరెక్టర్లు రజత్ గుప్తా, సందీప్ బాత్రా, ఏపీజెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబుతో పాటు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

అవయదానంతో నలుగురికి పునర్జన్మనిచ్చిన మహిళ



మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన మహిళ అవయదానంతో మరో నలుగురికి పునర్జన్మనిచ్చింది. తాను మట్టిలో కలసినా.. నలుగురి జీవితాలకు వెలుగు ఇచ్చింది. విజయవాడ భవానీపురానికి చెందిన ఎం. సరస్వతి(54) ఈనెల 14న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా, మంగళవారం బ్రెయిన్ డెడ్ అయింది. కుటుంబసభ్యులు అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అభినందించిన వైద్యులు సరస్వతి శరీరం నుంచి జీవన్‌ధాన్ ద్వారా కిడ్నీలు, కళ్లు, గుండె, లివర్, లంగ్స్‌ను సేకరించారు. లివర్, కిడ్నీలను వెంటనే మణిపాల్ ఆసుపత్రికి తరలించి అవసరమైన రోగులకు శస్త్రచికిత్సతో మార్చారు. కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

క్లుప్తంగా...

శాసన వ్యవహారాల సమన్వయకర్తగా దామోదరరాజు

నెలకు రూ.లక్ష వేతనం.. కారు అలవెన్స్‌గా మరో రూ.20,000

సాక్షి, అమరావతి: శాసన వ్యవహారాల సమన్వయకర్తగా కె.దామోదరరాజు అనే వ్యక్తిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెలకు రూ.లక్ష వేతనంతో పాటు కారు అలవెన్స్ కింద రూ.20,000 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. శాసన సభ, శాసన మండలి సమావేశాల సమయంలో సాధారణ పరిపాలన శాఖకు చెందిన ప్రశ్నోత్తరాలు, హామీలు, కాల్ అటెన్షన్‌లకు సంబంధించి సహాయకారిగా వ్యవహరించాలని.. సీఎంవోతో, సభలతో అనుసంధాన సంబంధాలను కొనసాగించాలన్నారు. చర్చల నివేదికలను సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'అర్హులతోనే హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టులు భర్తీ చేయాలి'

సాక్షి, అమరావతి: వైద్యశాఖలోని హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టులను పీజీ డిప్లొమో ఇన్ హెల్త్ ప్రమోషన్ ఎడ్యుకేషన్ (పీజీడీపీహెచ్‌పీఈ) విద్యార్హత కలిగిన ఎంపీహెచ్ఎస్/ఎంపీహెచ్ఏలతో భర్తీ చేయాలని ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ పద్మావతిని ఏపీ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం గొల్లపూడిలో పద్మావతికి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షురాలు అనురాధ వినతిపత్రం అందజేశారు. జోనల్ వారీగా డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న డెప్యూటీ డెమో పోస్టులను సీనియారిటీ ఆధారంగా హెల్త్ ఎడ్యుకేటర్స్‌తో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌సర్వీస్‌లో హెల్త్ ఎడ్యుకేషన్ కోర్సు చదివి ఎడ్యుకేటర్స్‌గా పదోన్నతి లభించని ఎంపీహెచ్ఎస్/ ఎంపీహెచ్ఏల పరిజ్ఞానాన్ని, సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేల అవగాహన సదస్సు వాయిదా

సాక్షి, అమరావతి: ఈ నెల 22, 23 తేదీల్లో అసెంబ్లీలో నిర్వహించతలపెట్టిన ఎమ్మెల్యేల అవగాహన సదస్సును వాయిదా వేసినట్లు శాసన వ్యవహారాల సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల సదస్సును వాయిదా వేయాల్సి వచ్చిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహించే విషయాన్ని తెలుపుతామని పేర్కొన్నారు.

ట్రైకార్ జీఎంగా ఆనంద్ మణికుమార్

సాక్షి, అమరావతి: ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ట్రైకార్) జనరల్ మేనేజర్‌గా గిరిజన సంక్షేమ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆనంద మణికుమార్‌ను నియమిస్తూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీగా విశ్వకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఏపీ ఎంఎస్ఎంఈడీసీ సీఈవో విశ్వ.ఎంకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఈడీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులిచ్చారు.

రేపటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21న ధ్వజారోహణంతో అంకురార్పణ జరగనుంది. 22న ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, రాత్రి నందిసేవ, 27న రథోత్సవం, తెప్పోత్సవం, 28న శివపార్వతుల కల్యాణం, మార్చి 2న గిరిప్రదక్షిణ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకాలతోబ్రహ్మోత్సవాలుముగియనున్నాయి.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 68,427 మంది స్వామివారిని దర్శించుకోగా 21,066 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.81 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

బోయకొండలో లక్ష కుంకుమార్చన



చౌడేపల్లె : చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో ఏటా మాఘ మాసంలో వైభవంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన బుధవారం ప్రారంభమైంది. బోయకొండ ఆలయంలో 16 ఏళ్లుగా హిందూ సంప్రదాయ రీతిలో లక్ష కుంకుమార్చనను నిర్వహిస్తున్నారు. అర్చకుల మంత్రోచ్ఛరణాల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తికి ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి లక్ష కుంకుమార్చన ప్రారంభించారు. 3 రోజులపాటు సాగే కుంకుమార్చనలో భాగంగా అమ్మవారి ఉత్సవ మూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి హోమం, మహా మంగళ హారతి చేశారు.

రాయంచపై వీణాపాణి విహారం

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారు వేణుగోపాల కృష్ణుడు అవతారంలో చిన్న శేషుడిపై ఆశీనులై మాఢవీధుల్లో విహరించారు. రాత్రి 7 గంటలకు స్వామి వారు వీణ ధరించి సరస్వతీ రూపంలో హంస వాహనంపై ఆశీనులయ్యారు. ఉత్తమ జ్ఞానానికి హంస సంకేతం కావున కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు హంస వాహనంపై ఆశీనులై సరస్వతీగా పుస్తకపాణి శుద్ధికి నిదర్శనంగా ఆయన దర్శనమిచ్చారు.



విద్యా సమాచారం

మహిళా సాధికారతే లక్ష్యం

తిరుపతి సిటీ : మహిళా సాధికారతే లక్ష్యంగా పద్మావతి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తామని వైస్ చాన్సలర్ వి.ఉమ తెలిపారు. బుధవారం ఈ మేరకు వీసీగా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. వర్సిటీతో 40 ఏళ్లపాటు సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో వర్సిటీని అంతర్జాతీయ స్థాయి తీసుకెళ్లేందుకు యత్నిస్తామని వివరించారు. విద్యార్థినులను పరిశోధనల దిశగా ప్రోత్సాహం అందిస్తామన్నారు.

అన్వేషణ-25కు ఎస్వీయూ బృందం



తిరుపతి సిటీ: కర్నాటక స్టేట్ బెంగుళూరులోని రామయ్య వర్సిటీలో గురువారం నుంచి రెండు రోజుల పాటు అన్వేషణ–25 పేరుతో జరిగే శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణల అంతర్జాతీయ విద్యార్థుల పోటీలలో పాల్గొనేందుకు కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో సంజయ్ కుమార్, భవ్య శ్రీ, దీప్తి, జాస్మిన్‌లతో కూడిన వర్సిటీ బృందం బుధవారం బెంగళూరుకు పయనమయింది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు ఆ బృందానికి అభినందనలు తెలిపి పోటీలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

వెటర్నరీ జూడాల వినూత్న నిరసన

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పశువైద్య విద్యార్థులు తమకు గౌరవవేతనాన్ని పెంచాలని గత 17రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. బుధవారం సమ్మెలో భాగంగా వర్సిటీ గ్రౌండ్‌లో గౌరవవేతనం పెంచాలంటూ 'హైక్ స్టైఫండ్' అనే ఆంగ్ల అక్షరాల రూపంలో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వర్సిటీ అధికారులు విద్యార్థులతో సమ్మె విరమించాలని కోరగా సమస్య పరిష్కారమయ్యే వరకు విరమించమని తెగేసి చెప్పారు. తిరుపతికి వచ్చిన కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్‌ను విద్యార్థి ప్రతినిధులు బుధవారం ఓ ప్రైవేటు హోటల్ కలసి తమ సమస్యను విన్నవించారు. సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని వెటర్నరీ జూడాలకు కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.



● శివగిరి


శివగిరిపై కొలువుదీరి ఉన్న శివపరివారం విగ్రహాలు

- శివగిరిపై 36 అడుగుల ఎత్తులో పంచముఖ మహాశివలింగం
- 12 అడుగుల ఎత్తులో నందీశ్వరుడు
- 40 అడుగుల ఎత్తున్న ఓంకార స్థూపం
- హిమాలయాల్లోని హిందూ సాధు సంప్రదాయాల ప్రకారం పూజలు

కొలువుదీరిన శివపరివారం

36 అడుగుల పంచముఖ మహాశివలింగం 12 అడుగుల ఎత్తులో నందీశ్వరుడు, 40 అడుగుల ఎత్తున్న ఓం కార స్థూపం, అర్ధనారీశ్వరుడు, దత్తాత్రేయుడు, హరిహరుడు, శివపరివారం విగ్రహాలు ఇవన్నీ ఎక్కడ ఉన్నాయనుకుంటున్నారా... అదేనండీ అమ్మలగన్న అమ్మ కనకదుర్గమ్మ కొలువైన విజయ వాడ మొగల్రాజపురంలోని శివగిరిపైన కొలువు దీరి భక్తులతో పూజలు అందుకుంటున్నాయి.

శివపరివారాన్ని సాధారణంగా చిత్రపటాల్లోనే చూస్తు ఉంటాం కాని ఇక్కడ విగ్రహాల రూపంలో శివ పరివారాన్ని దర్శించుకోవచ్చు. అదెక్కడంటే విజయవాడ మొగల్రాజపురంలోని శ్రీవాగ్దేవీ జ్యోతిర్లింగ క్షేత్రం (శివగిరి)పై 36 అడుగుల ఎత్తు ఉన్న పంచముఖ మహాశివలింగం, శివలింగానికి ఎదురుగా 12 అడుగుల ఎత్తులో నందీశ్వరుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. 40 అడుగుల ఎత్తున్న ఓంకార స్థూపం విజయవాడ నగరం మొత్తం ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటుంది. ఇవే కాకుండా 36 అడుగుల పంచ ముఖ శివలింగం చుట్టూ ద్వాదశ జ్యోతిర్లింగా లను శైవాగమం ప్రకారం ప్రతిష్ఠించారు. శివగిరి పైన శివపార్వతులు, కుమారస్వామి, విఘ్నేశ్వరుడు, వీరభద్రుడు, అయ్యప్ప, నంది, శృంగి, భృంగి, అర్ధనారీశ్వరుడు, నందీశ్వరుడు, దత్తాత్రేయుడు, హరిహరుడు, కనకదుర్గ, గజలక్ష్మి, సరస్వతి అమ్మవార్ల విగ్రహాలు కూడా కొలువు తీరాయి. గోశాలతోపాటుగా హోమగుండం కూడా ఉన్నాయి. శ్రీ చక్ర ఆకారంలో అష్టాదశ శక్తి పీఠాలను కూడా శివగిరిపై ప్రతిష్ఠించారు. ఏడు అడుగుల నాగ పడగ, నాగదేవత విగ్రహాలు కూడా ఇక్కడ భక్తులతో పూజలు అందుకుంటు న్నాయి. ప్రతి ఏడాది మహా శివ రాత్రి రోజున చితాభస్మంతో శివలింగానికి అభిషేకం, కపాల హారతి నిర్వహిస్తుంటారు. ఉజ్జయిని నుంచి నాగ సాధువులు, అఘోరాలు వివిధ అఖండాల (అఘోరాలు ఉండే ఆశ్రమాలు) నుంచి శివగిరిపై పూజలు నిర్వహిస్తారు. శివగిరి కొండపైన మరో వైపున 27 అడుగుల ఎత్తులో అభయ ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. కొండ దిగువ నుంచి ఈ విగ్రహాన్ని చూసినప్పుడు కొండపై నుంచి ఆంజనేయ స్వామి భక్తులకు అభయాన్ని అందిస్తున్నట్లుగా ఉంటుంది.


శివగిరిపై ఉన్న ఏడు అడుగుల నాగ పడగ


శివగిరిపై ఉన్న 36 అడుగుల మహా శివలింగం, ఓంకార స్థూపం


అర్ధనారీశ్వరుడు, దత్తాత్రేయుడు, హరిహరుల విగ్రహాలు


శివుడి విగ్రహాన్ని పూలతో అలంకరిస్తున్న ముస్లిం మహిళ


శివగిరిపై శివలింగానికి అభిషేకం చేస్తున్న నాగసాధువులు

ఎలా వెళ్ళాలంటే...


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల దగ్గర ఉన్న సున్నపుబట్టీల సెంటర్ నుంచి శివగిరిపైకి చేరుకోడానికి మెట్ల మార్గం ఉంది. శివగిరి పైనే పూజలకు అవసరమైన పూజాద్రవ్యాలతో పాటుగా తాగునీటి సౌకర్యం కూడా కల్పించారు. కార్తికమాసం అన్ని రోజులు శివగిరిపై ప్రత్యేక పూజలతో పాటుగా ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తారు. శివరాత్రి రోజున హిమాలయ నాగసాధువులచే చితాభస్మాభిషేకం, శివకళ్యాణంతోపాటుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శివ రాత్రి నాటితో పాటుగా కార్తికమాసంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను విజయ వాడలోని రహదారులపై ఊరేగింపు జరుగుతుంది. ఈ విధంగా ఊరేగింపు జరుగుతున్న సమయంలో అక్కడ ఉండే ఒక ముస్లిం మహిళ వచ్చి శివుడికి హారతులు ఇస్తారు. శివగిరిపైన భక్తులు వారి సొంత ఖర్చులతో శివలింగాన్ని ప్రతిష్ఠించుకోవచ్చునని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ చెప్పారు. మరి ఇంకెందుకు ఆలస్యం ఒకసారి శివయ్యను దర్శించుకుని వద్దాం. .పదండి...

– కొండిబోయిన సుబ్రమణ్యం
– సాక్షి, మొగల్రాజపురం, విజయవాడ తూర్పు

అంతా శివయ్య మహిమే

మా తల్లిదండ్రులు శివయ్యను పూజించేవారు. నేను వృత్తిరీత్యా న్యాయవాదిని, నాకు ఒకరోజు కలలో స్వామి వారు దర్శనం ఇచ్చి కొండపై పంచముఖ శివలింగాన్ని ప్రతిష్ఠించు, నీకు సాధ్యం అవుతుంది, అంతా నేను చూసుకుంటా అని చెప్పినట్లుగా అనిపించింది. అప్పటి నుంచి ఇంటి దగ్గర ఉన్న కొండపై ఈ పంచముఖ శివలింగాన్ని ప్రతిష్ఠించాను. శివయ్యే నా ద్వారా ఇదంతా చేయిస్తున్నాడు.

- మల్లికార్జున శర్మ, శివగిరి వ్యవస్థాపకుడు



● ధర్మ సందేహం

ప్రదోష పూజ అంటే..?



జాతకంలోని ఎలాంటి దోషాన్నైనా శివుడు తొలగిస్తాడు. అందుకు ప్రదోష కాలంలో శివార్చన చేయాల్సిందేనని ఆధ్యాత్మిక పండితులు చెప్తున్నారు. గత జన్మలలో చేసిన పాపాలు కూడా ప్రదోషకాల పూజలో పాల్గొంటే తొలగిపోతాయి. అలాగే ప్రదోష వ్రతాన్ని ఆచరించే వారికి సకలసంపదలు చేకూరుతాయని శాస్త్రోక్తి. రోజూ సూర్యాస్తమయానికి ముందు 24 నిమిషాలు, తర్వాత 24 నిమిషాలు.. అంటే మొత్తం 48 నిమిషాలను ప్రదోష కాలం అంటారు. ఇది నిత్య ప్రదోషకాలం. కృష్ణపక్ష త్రయోదశిని పక్ష ప్రదోషం అంటారు. శుక్లపక్ష త్రయోదశి తిథిలో వచ్చే ప్రదోషాన్ని మాస ప్రదోషం అంటారు ముఖ్యంగా శనివారం, శుక్లపక్ష త్రయోదశి తిథిలో వచ్చే ప్రదోషాన్ని మహా ప్రదోషం అంటారు. దీన్నే శని మహాప్రదోషం అని పిలుస్తారు. దేవతలు పాల కడలిని చిలికినప్పుడు వెలికి వచ్చిన విషాన్ని శివ పరమాత్ముడు తీసుకుని.. లోకాన్ని సంరక్షించిన రోజును శనిప్రదోషంగా పిలుస్తారు. సంవత్సరమంతా వచ్చే ప్రదోషాలకు ఉపవాసం వుండకపోయినా పర్లేదు. కానీ శనివారం వచ్చే ప్రదోషం రోజున ఉపవసించి.. శివార్చన చేయడం ద్వారా అనుకున్న కోరికలు నెరవేరుతాయి.

ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని.. ఆ సమయంలో దేవాలయాల్లో వెలసిన మహేశ్వరుడిని స్తుతించడం, ఆరాధించడం, పూజించడం, అభిషేకించడం ద్వారా జాతకదోషాలు పూర్తిగా తొలగిపోతాయని విశ్వాసం. ప్రదోష కాల పూజ చేస్తే.. శివుడిని మాత్రమే కాదు.. సమస్త దేవతలను పూజించిన ఫలితం దక్కుతుందని విశ్వాసం.

ఇంకా నందీశ్వరుడికి తగిన గౌరవం ఇచ్చేది ప్రదోషకాల పూజనే. నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నందీశ్వరుడిని ప్రదోష కాలంలో పూజించడం ద్వారా అష్టైశ్వర్యాలు చేకూరుతాయి. అన్ని చదువులున్నా.. నందీశ్వరుడు వినయంతో వుంటాడని.. శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నందీశ్వరుడు నివృత్తి చేస్తాడని నమ్మకం. ప్రదోషకాల పూజలో పాల్గొంటే బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం దక్కుతుంది. ప్రదోష కాలంలో ఆవుపాలతో శివునికి అభిషేకం చేయించి, బిల్వ పత్రాలు, శంఖుపూలను సమర్పించుకుని స్తుతిస్తే.. కోరిన కోరికలు నెరవేరుతాయి. సాయంత్రం 4.30 నుంచి ఆరుగంటల వరకు గల సమయాన్ని ప్రదోషకాలం అంటారు. ఈ సమయంలో శివార్చన ద్వారా సకల అభీష్టాలు నెరవేరుతాయి.ఈ శని ప్రదోషాల్లో స్వామిని పూజించడం ద్వారా ఈతిబాధలు తొలగిపోతాయని ఆధ్యాత్మిక పండితులు సూచిస్తున్నారు.

● ఇస్లాం వెలుగు

స్వర్గ నరకాలకు ద్వారాలు



ప్రవక్తా! ఏ యే కార్యాలు సాధారణంగా స్వర్గానికి దారి చూపుతాయి అని అడగ్గా దైవ భీతి, సద్వర్తనం అని బదులిచ్చారు దైవప్రవక్త సల్లం.

ప్రజలను సాధారణంగా నరకంలో పడవేసేవి ఏమిటి? అని మళ్లీ అడగ్గా ఇంద్రియాలు అని సెలవిచ్చారు ప్రవక్త సల్లం.

వివరణ: దైవభీతి అంటే అల్లాహ్ హక్కులను నెరవేర్చాలని భావం. అంటే ఆయనను ఆరాధించడం, ఆయన ఆదేశించిన ఆదేశాలన్నిటినీ పాలించి ఆచరించడం. అల్లాహ్ వారించిన పాపకారాలన్నింటినీ విడనాడడం. ఇవే ఆయన హక్కులు. ఆ హక్కులను నెరవేర్చడానికి అంతకంటే మరో మార్గం లేదు.

సద్వర్తనం: అంటే దేవుడు సృష్టించిన సృష్టితాలపట్ల సద్భావంతో మెలగాలి. దీనికి కనీస స్థాయి ఏమిటంటే మనిషి ఎవ్వరిని బాధించకుండా ఉండడం. అత్యున్నత స్థాయి ఏమిటంటే అపకారం చేసిన వాడికి ఉపకారం చేయడం. ఎవరైతే సృష్టికర్త హక్కులతో పాటు సృష్టితాల హక్కును కూడా నిర్వర్తిస్తాడో అతను దైవ కృపాకటాక్షాలతో స్వర్గంలో ప్రవేశిస్తాడు.

నోరు: ఆహారాన్ని కడుపులోకి పంపే మార్గం. నోటిలో మాట్లాడే నాలుక కూడా ఉంది. ఏ వ్యక్తి నాలుక అతని ఆధీనంలో ఉండదో అక్రమమైన, నిషిద్ధమైన సంపాదనతో ఎవరి శరీరం పెరుగుతుందో ఆ వ్యక్తి తప్పకుండా నరకానికి ఇంధనంగా మారతాడు. ఇంద్రియాల విచ్చలవిడితనం కూడా అతన్ని నరకాగ్నిలోకి నెట్టుతుంది.

సమాజోద్ధరణ: సమాజ ప్రగతి వికాసాలు కేవలం సదాచారం, సద్వర్తనలపై ఆధారపడి ఉన్నాయి. దైవానికి భయపడే వ్యక్తి మంచి నైతిక విలువలు కలిగి ఉంటాడు. అతడు అన్ని విధాలుగా శాంతిని సాంత్వనను కలిగి ఉండి ఓ సజీవ నిదర్శనంగా అలరారుతాడు. మరి ఆ దైవ భీతిని, సద్వర్తనాన్ని పునాదిగా చేసుకున్న అలాంటి దైవభీతి పరాయణులు, సత్పురుషులతో సంఘటితం చేసిన ఓ సమాజం మనగలగడంలో సందేహం ఉంటుందా?

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్
ఖురాన్ అనువాదకులు

● నిర్మల వాణి

ధ్యాన మూలం

"అనంతుడు, సూక్ష్మాతి సూక్ష్మంగా ఉండేవాడు, సృష్టికి ఆధారభూతమైనవాడు, ఊహకందని రూపం కలవాడు, సూర్యుని కన్నా తేజస్సు కలిగిన పరమాత్మను తదేకంగా ధ్యానించు వాడు అజ్ఞానాంధకారం నుండి తప్పక బయట పడతాడు' అని భగవత్ గీతలో శ్రీ కృష్ణ పరమాత్మ ధ్యానానికి ఉన్న ప్రాముఖ్యత గురించి బోధించిన విషయం మనకు తెలిసినదే.

ధ్యానం ఒక తపస్సు లాంటిది

పూర్వకాలంలో మునులు, ఋషులు తమ సంసారాలని, బంధాలని వదులుకుని హిమాలయాలకో, అడవులకో వెళ్ళి తపస్సు చేసుకునే వారు. అయితే ఆ తపస్సు కేవలం ఒక ధ్యేయం కోసమో, లేక తమ స్వీయ ప్రయోజనాల కోసమో వుండేది. భగవత్ సాక్షాత్కారం అనంతరం వారి తపస్సు ముగిసేది.

అటువంటి తపస్సు ప్రయోజనం కోసం, అంతిమ



లక్ష్యం కోసం, సర్వసంగ పరిత్యాగం చేసి కుటుంబాలను, సంసారాలను వదలి సమాజానికి దూరంగా వెళ్లనవసరం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా సరే, చేసుకోగలిగే ప్రక్రియను శ్రీ మాతాజీ నిర్మలా దేవి తన సహజయోగ స్థాపన ద్వారా మానవాళికి అందించారు. కుండలినీ జాగృతి ద్వారా, కేవలం శుద్ధ ఇచ్ఛతో కోరుకుంటే ఆత్మ సాక్షాత్కారం పొంది తమ దైనందిన జీవితంలో చేసుకునే ధ్యానం ద్వారా అతి సునాయసంగా నిర్విచార స్థితిని, తదుపరి నిర్వికల్ప స్థితిని, అంటే భగవంతుని పట్ల ఎటువంటి సందేహాలూ లేని స్థితిని పొందగలరని నిరూపించారు.


పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి

ఈ ఆధునిక కాలంలో మనిషి ఎన్నో శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలతో, ఒత్తిళ్లతో సతమతం అవుతూ, సమతుల్యతను కోల్పోతూ, అనారోగ్యాల బారిన పడుతున్నాడు. అందుకనే వైద్యులు కూడా ఈ మధ్య కాలంలో, వారి చికిత్సలో భాగంగా ధ్యానం కూడా చేసుకోమని సలహా ఇస్తున్నారు.

ఆలోచనలకు అతీతంగా భగవంతుని ధ్యానించడం బహు దుర్లభం. అందుకనే దురదృష్టవశాత్తు ఎందరో అగురువులు, కుగురువులు జనాల బలహీనతల్ని ఆసరాగా చేసుకొని వివిధ రకాల యోగమార్గాలు, ధ్యాన మార్గాలు ఆవిష్కరించి తప్పుదారి పట్టిస్తున్నారు.

సహజయోగ సాధనలో ధ్యానం మన దైనందిన జీవితంలో సమ్మిళతమై వుంటుంది. ఆ ధ్యానంలో మనల్ని, మన ఆరోగ్యాన్ని సమతుల్యం చేసుకోవడం, మెరుగు పరచుకోవడం అనేది ఒక సాధారణ విషయం, అంతేకానీ సహజయోగ ధ్యానం కేవలం ఆరోగ్యం మెరుగు పరచుకోవడం కోసమో, రోగ నివారణ కోసం మాత్రమే కాదు. అందుకు అతీతమైనది .

– డాక్టర్ రాకేష్
(పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

● సువార్త

దీపస్తంభం నుంచి వెలిగే దీపం

మనుష్యులు ఈ లోకంలో ఎలా జీవించాలి అనే విషయంలో ఏసు ప్రభువు కొండమీద ప్రసంగంలో ఈ విధంగా చెప్పారు.

గాంధీజీ తన ఆత్మ కథలో 'సెర్మన్ ఆన్ ది మౌంట్' పేరుతో ప్రసిద్ధి చెందిన యేసు క్రీస్తు 'కొండమీది ప్రసంగం' తనను తీవ్రంగా ప్రభావితం చేసిందని రాసుకున్నాడు. ఒక సారి ప్రభువు ఆ జనసమూహాలను చూసి కొండ యెక్కి కూర్చుని ఈ విధంగా బోధించాడు.

'ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు, పరలోక రాజ్యం వారిది. వాస్తవంగా మనం ఇంతలో కనపడి అంతలోనే మాయమైపోవు మనుష్యులం. ఆత్మ దేవుడు పెట్టిన దీపం. ఈ దేహం మట్టి నుండి తీయబడింది. మంటిలోనే కలిసిపోతుంది. దేవుడిచ్చిన ఆత్మ దేవుని వద్దకు చేరుతుంది. కనుక మనుష్యులు ఆత్మ విషయమై దీనులైన వారికి దైవరాజ్యం/పరలోక రాజ్యం దక్కుతుంది. దుఃఖపడువారు ధన్యులు; వారు భూలోకంలో ఓదార్చబడుదురు. సాత్వికులు వారు భూలోకాన్ని స్వతంత్రించుకుంటారు. నీతి కోసం ఆకలి దప్పులు గల వారు ధన్యులు; వారు కనికరం పొందుతారు. హృదయ శుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూస్తారు. సమాధాన పరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులుగా పిలవబడతారు. నీతి నిమిత్తం హింసించబడువారు ధన్యులు; పరలోక రాజ్యం వారిది. నా నిమిత్తం జనులు మిమ్మును నిందించి, హింసించి మీమీద అబద్ధంగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించండి. పరలోకంలో మీ ఫలం అధికమవుతుంది. ఇలా వారు మీకు పూర్వమందున్న ప్రవక్తను హింసించారు.

మీరు లోకానికి ఉప్పయి ఉన్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారం పొందుతుంది? అది బయట పారవేయబడి, మనుష్యుల చేత తొక్కబడుటకే గాని మరి దేనికీ పనికిరాదు. మీరు లోకానికి వెలుగై వున్నారు. కొండమీద వుండు పట్టణం మరుగై వుండనేరదు. మనుషులు దీపం వెలిగిస్తారు. దీపస్తంభం పైనే ఉంచుతారు. కానీ గంపకింద ఉంచరుకదా! ప్రజలు మీ సత్కార్యాలను చూసి పరలోకంలో ఉన్న మీ తండ్రిని సన్నుతించడానికి మీ వెలుగును వారి ఎదుట ప్రకాశింపనివ్వండి' అంటూ ఆ ప్రసంగంలో 'వ్యభిచారం చెయ్యవద్దు, ఒక స్త్రీని మోహపు చూపుతో చూసే ప్రతివాడు అప్పుడే తన హృదయంలో ఆమెతో వ్యభిచారం చేసినవాడు అవుతాడు' అంటాడు. 6,7 మత్తయి సువార్త అధ్యాయాలలో మనుష్యులు లోకంలో ఎలా జీవించాలో ప్రభువు బోధించాడు.



దేవుడు మనల్ని ఎందుకు సృష్టించాడంటే సత్క్రియలను చేయడానికి సృష్టించాడు (ఎఫెసీ 2:10), ఐక్యత కలిగి వుండటానికి సృష్టించాడు. ఈ విషయంలో దావీదు మహారాజు యాత్ర కీర్తనలో... సహోదరులు ఐక్యత కలిగి నివసించడం ఎంతమేలు! ఎంత మనోహరం అంటూ 133: 1-3 వచనాలలో స్పష్టీకరించాడు.

పడిపోయిన యెరూషలేము దేవాలయాన్ని పునర్నిర్మాణ నిమిత్తం దేవుడు జెరుబ్బాబెలు అనేవాడు నియమింపబడ్డాడు. సత్క్రియలేకాదు, ఐక్యత కలిగి వుండాలి. ఐక్యత అంటే దేవునికి, మానవునికి సంబంధం కలిగి వుండాలి. అందుకోసమే ఒక బంగారు కడ్డీ నుండి ఏడు దీపస్తంభాలు, ఒక పక్క నుండి మూడు దీపస్తంభాలు, మరియొక పక్క నుండి మూడు దీపస్తంభాలు, మధ్యలో పెద్ద దీపస్తంభం మెస్సయ్యాకు సాదృశ్యంగా వున్నవి. మూడు ప్లస్ మూడు= ఆరు. దేవుడు మానవుని 6వ దినమున సృజించిన దానికి సాదృశ్యం. ఒక బంగారు కడ్డీ నుండి ఉన్న 7వ దీపస్తంభం ప్రభువైన దేవునికి సాదృశ్యం. ఏడు అనేది పరిపూర్ణ సంఖ్యకు సాదృశ్యం. నా యందు మీరు, మీ యందు నా మాటలను నిలిపి వుంచితే మీకేది ఇష్టమో అడగండి, అది మీకు అనుగ్రహింపబడును (యోహాను 16 : 7). నూనె అభిషేకానికి సాదృశ్యం.

కనుక సంఘంలో ఐక్యత కలిగి వుండాలంటే భేదాలు వుండకూడదు. ఐక్యత ఎలా కలిగి ఉండాలంటే యేసుప్రభువు వైపు చూసినప్పుడే ఐక్యత కలిగి వుంటున్నాం. మనం దేవుని వైపు చూసినప్పుడు దేవుడు మనల్ని ఆశీర్వదిస్తాడు. ధైర్యం ఎవరి వలన... ఎందువలన అంటే దేవుని వైపు చూడటం వల్లనే వారికి ధైర్యం వచ్చింది. ఐక్యతతో మనం వుంటే దేవుడు తప్పక ఆశీర్వదిస్తాడు. ఐక్యతతో చేసే పనివలన బలం, ఆరోగ్యం అనుగ్రహింపబడతాయి. కావున ఎల్లప్పుడూ మనం దేవుని వైపు చూసేవారమై వుందుముగాక. జెకర్యాకు చూపిన దర్శనం మెస్సయ్యకు సాదృశ్యం. (జెకర్యా 4 :1 –4)

– కోట బిపిన్ చంద్రపాల్

బిజినెస్ రీల్

బెంగళూరులో గూగుల్ కొత్త క్యాంపస్



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ బుధవారం బెంగళూరులో తమ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించింది. దీనికి 'అనంత' అని పేరు పెట్టినట్లు కంపెనీ ఒక బ్లాగ్ పోస్టులో వెల్లడించింది. అంతర్జాతీయంగా తమకున్న భారీ కార్యాలయాల్లో ఇది కూడా ఒకటని పేర్కొంది. నేవిగేషన్‌కి సులభంగా ఉండేలా అనంతలోని ప్రతి ఫ్లోరు.. వీధుల నెట్‌వర్క్‌లాగా ఉంటుందని పేర్కొంది. చిరకాలంగా టెక్నాలజీలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని, దేశీయంగా అంకుర సంస్థలు .. యాప్ వ్యవస్థలు వృద్ధి చెందుతున్న తీరు ఇందుకు నిదర్శనమని తెలిపింది. డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు కోట్ల మంది జీవితాల్లో పరివర్తన తెస్తున్నాయని వివరించింది. వివిధ ఉత్పత్తులు, ప్లాట్‌ఫాంలతో కోట్ల మంది యూజర్లకు చేరువ కావడానికి తమకు భారత్‌లో ప్రత్యేక అవకాశం లభించిందని తెలిపింది.

యాక్టివ్‌గా ఉన్న కంపెనీలు 65 శాతమే

కార్పొరేట్ వ్యవహారాల శాఖ గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా రిజిస్టరయిన సంస్థలు 28 లక్షల పైచిలుకు ఉండగా, వాటిలో 65 శాతం సంస్థలు (దాదాపు 18.1 లక్షలు) మాత్రమే చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 9,43,934 సంస్థలు మూతబడ్డాయి. కంపెనీల చట్టం 2013 కింద నమోదు చేసుకున్న విదేశీ సంస్థలు 5,216 ఉండగా జనవరి నాటికి వాటిలో 3,281 సంస్థలు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. కార్పొరేట్ వ్యవహారాల శాఖ విడుదల చేసిన నెలవారీ బులెటిన్‌లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. రంగాలవారీగా చూస్తే అత్యధికంగా బిజినెస్ సర్వీసుల విభాగంలో 27 శాతం కంపెనీలు, తయారీ రంగంలో 20 శాతం, పర్సనల్..సోషల్ సర్వీసులు వంటి విభాగాల్లో 13 శాతం సంస్థలు పని చేస్తున్నాయి. ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో యాక్టివ్ కంపెనీలు భారీ సంఖ్యలో ఉన్నాయి.

సైయంట్ ఈడీగా సుకమల్ బెనర్జీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటెలిజెంట్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ సైయంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవోగా (డీఈటీ విభాగం) సుకమల్ బెనర్జీ నియమితులయ్యారు. కంపెనీ డైరెక్టర్ల బోర్డులో కూడా ఆయన ఉంటారు. పరిశోధన, టెక్నాలజీ రంగాల్లో సుకమల్‌కి దాదాపు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. సుదీర్ఘ కాలం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో వివిధ హోదాల్లో పని చేసిన సుకమల్.. ఇటీవలే డిజిటల్ ఇంజినీరింగ్ కంపెనీ జోరియంట్ సీఈవోగా వ్యవహరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-2-2025

విశాఖ	437-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	415-00
వరంగల్	517-00
రిటైల్ ధర	4.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	253.25	3.54
HINDALCO	627.95	2.7
EICHERMOT	4,810.00	1.92
AXISBANK	1,009.40	1.53
LT	3,268.95	1.52

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,167.75	-2.48
TCS	3,785.00	-2.28
INFY	1,810.85	-2.22
HINDUNILVR	2,250.00	-2
ADANIENT	2,177.00	-1.95

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,917
ఎన్ఎస్ఈ	84,204
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,75,821
ఎఫ్ఐఐ	- 1,881
డీఐఐ	+ 1,958

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.02 (రాత్రి 11.30కి)	$ 71.83 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.97 (రాత్రి 11.30కి)	$ 75.84 (క్రితం ముగింపు)

భారత్‌పై అమెరికా సుంకాల ప్రభావం కొంతే

- దేశీ వినియోగమే ప్రధాన బలం
- సేవల ఎగుమతులపై టారిఫ్‌లు ఉండకపోవచ్చు
- ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా
- 0.1-0.6 శాతం మేర పడొచ్చు: గోల్డ్‌మన్ శాక్స్



న్యూఢిల్లీ: అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ స్పష్టం చేసింది. భారత ఆర్థిక వ్యవస్థ అధిక శాతం దేశీ డిమాండ్ (వినియోగం)పై ఆధారపడి ఉన్న విషయాన్ని తన తాజా నివేదికలో గుర్తు చేసింది. దీనికితోడు అమెరికాకు భారత్ చేసే ఎగుమతుల్లో ఎక్కువ భాగం సేవల రూపంలో ఉన్నందున, ట్రంప్ పాలనా యంత్రాంగం వీటిని లక్ష్యంగా చేసుకోకపోవచ్చని తెలిపింది. భారత్ సహా తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు వేస్తున్న దేశాలన్నింటి నుంచి వచ్చే దిగుమతులపై అదే మోతాదులో తాము కూడా సుంకాల మోత మోగిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. ప్రధాని మోదీ సమక్షంలోనే స్పష్టం చేయడం గమనార్హం. అమెరికా ప్రతీకార సుంకాలు ఎక్కువగా వియత్నాం, దక్షిణ కొరియా, తైవాన్‌పై ప్రభావం చూపిస్తాయని, ఆ దేశాలు అమెరికాతో అధిక వాణిజ్య మిగులు కలిగి ఉన్నట్టు ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ఆసియా–పసిఫిక్ ఆర్థికవేత్త విశృత్ రాణా తెలిపారు. అమెరికాతో ఎక్కువగా సేవల వాణిజ్యం నడుపుతున్న జపాన్‌పైనా సుంకాలు ఏమంత ప్రభావం చూపించబోవన్నారు.

ధరల ఆజ్యంతో అధిక వడ్డీ రేట్లు

అమెరికా విధించే ప్రతీకార సుంకాలు ధరలకు ఆజ్యం పోస్తాయని, దీంతో ప్రపంచవ్యాప్తంగా అధిక వడ్డీ రేట్లకు దారితీయొచ్చని రాణా అభిప్రాయపడ్డారు. ''భారత్ వృద్ధి కోసం ఎగుమతులపై అంతగా ఆధారపడి లేదు. కనుక అమెరికా టారిఫ్‌ల ప్రభావం చాలా పరిమితంగానే ఉంటుంది''అని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ డైరెక్టర్ ఈఫార్న్ ఫువా తెలిపారు. జ్యువెలరీ, ఫార్మాస్యూటికల్, టెక్స్‌టైల్స్, కెమికల్స్‌పై టారిఫ్‌ల ప్రభావం ఎక్కువగా ఉండొచ్చన్నారు. అయితే, భారత్ నుంచి వచ్చే ఫార్మాస్యూటికల్స్‌పై అమెరికా అధిక సుంకాలు విధించకపోవచ్చని, అలా చేయడం అమెరికాలో ఆరోగ్య వ్యయాలను పెంచుతుందన్నారు. అదే సమయంలో టెక్స్‌టైల్స్, కెమికల్స్ అధిక టారిఫ్‌ల రిస్క్ ఎదుర్కోవాల్సి రావచ్చన్నారు. ట్రంప్ మొదటి విడత పాలనను గుర్తు చేసుకుని చూస్తే మొత్తం మీద భారత్‌పై పడే ప్రభావం పరిమితంగానే ఉండొచ్చని ఫువా విశ్లేషించారు.

ప్రభావం ఏ మేరకు..?

ట్రంప్ టారిఫ్‌లతో భారత జీడీపీపై 0.1-0.6 శాతం మేర ప్రభావం పడొచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. అమెరికా దిగుమతి చేసుకునే అన్నింటిపైనా సగటు వ్యత్యాసం మేర టారిఫ్‌లు మోపితే, అలాంటి పరిస్థితుల్లో భారత్ చేసే ఎగుమతులపై అమెరికా నికర టారిఫ్ రేట్లు 6.5 శాతం మేర పెరగొచ్చని పేర్కొంది. అలా కాకుండా, విడిగా ప్రతీ ఉత్పత్తిపై రెండు దేశాల మధ్య ఉన్న వ్యత్యాసం మేర అదనంగా టారిఫ్ పెంచేస్తే అప్పుడు భారత ఎగుమతులపై పెరిగే సుంకాల భారం 6.5-11.5 శాతం మధ్య ఉంటుందని వివరించింది.

ఫార్మాపై టారిఫ్‌లతో అమెరికన్లపైనే ప్రభావం..

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజా భాను



న్యూఢిల్లీ: భారత ఫార్మా ఎగుమతులపై ప్రతీకార టారిఫ్‌లు విధించేలా అమెరికా నిర్ణయం తీసుకుంటే, అమెరికన్ వినియోగదారులపైనే ప్రధానంగా ప్రభావం పడుతుందని ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజా భాను వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి దేశీయ పరిశ్రమ వేచి, చూసే ధోరణితో వ్యవహరిస్తోందని తెలిపారు. అమెరికాకు భారత్ ఏటా 8 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులు ఎగుమతులు చేస్తోందని చెప్పారు. అమెరికన్ అధ్యయన నివేదికలను ఉటంకిస్తూ.. భారత ఔషధ ఎగుమతులతో అమెరికాలోని హెల్త్‌కేర్ వ్యవస్థకు 2013-2022 మధ్య 1.3 లక్షల కోట్ల డాలర్లు ఆదా అయినట్లు భాను తెలిపారు. వచ్చే అయిదేళ్లలో మరో 1.3 బిలియన్ డాలర్లు ఆదా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. 'ఇలాంటి పరిస్థితుల్లో (మన ఔషధాలతో వాళ్లకు ఇంత ఆదా అవుతున్నప్పుడు) మనపై టారిఫ్‌లు విధిస్తామంటే ఏమనగలం' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం భారత్ నుంచి ఫార్మా దిగుమతులపై అమెరికాలో ఎటువంటి సుంకాలు లేవు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం ఫార్మా ఎగుమతులు 29 బిలియన్ డాలర్లుగా ఉంటాయని అంచనా వేస్తున్నట్లు భాను తెలిపారు.

2024-25లో వృద్ధి 6.3 శాతమే: ఎస్‌బీఐ రీసెర్చ్



దేశ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) 6.2-6.3 శాతమే వృద్ధి చెందొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ విభాగం అంచనా వేసింది. జాతీయ శాంపిల్ కార్యాలయం (ఎన్ఎస్ఓ) జూన్, సెప్టెంబర్ త్రైమాసికాల అంచనాలను పెద్దగా సవరించకపోవచ్చని పేర్కొంది. 6.4 శాతం వృద్ధి నమోదు కావొచ్చని ఎన్ఎస్ఓ లోగడ అంచనా వేయడం గమనార్హం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉండడం స్థిరత్వాన్ని తీసుకొస్తుందని, ఇతర రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ద్రవ్యోల్బణం తగ్గడం విచక్షణారహిత వినియోగాన్ని పెంచుతుందని, అది వినియోగ ఆధారిత వృద్ధికి దారితీస్తుందని అంచనా వేసింది. భారత్ 2024-25, 2025-2026 ఆర్థిక సంవత్సరాల్లో 6.5 శాతం వృద్ధి నమోదు చేస్తుందన్నది ఐఎంఎఫ్ అంచనాగా ఉంది. మరోవైపు ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ సైతం వచ్చే రెండేళ్ల పాటు భారత్ జీడీపీ 6.7-6.8 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని తాజాగా వెల్లడించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరాలతో పోల్చి చూసినప్పుడు తక్కువే అయినప్పటికీ, అదే ఆదాయ స్థాయి కలిగిన దేశాల కంటే ఎగువనే ఉంటుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ డైరెక్టర్ ఈఫార్న్ ఫువా తెలిపారు. పన్ను రేట్లను తగ్గించినప్పటికీ ఆదాయ వృద్ధికి మద్దతుగా నిలుస్తుందన్నారు.

ఇన్ఫోసిస్‌లో 20,000 నియామకాలు!

- 2025-26లో చేపడతాం
- కంపెనీ ప్రతినిధి మాథ్యూ



న్యూఢిల్లీ: ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది ఫ్రెషర్లను నియమించుకునే ప్రణాళికకు అనుగుణంగా సాగుతున్నట్టు వెల్లడించింది. కొత్తగా చేరిన వారికి ఉత్తమ కార్పొరేట్ శిక్షణ ఇవ్వనున్నట్టు చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ షాజీ మాథ్యూ తెలిపారు. కాగా, 300 మంది ఫ్రెషర్లను తొలగించినట్టు కంపెనీ ఇటీవల వెల్లడించింది. 'మైసూరు క్యాంపస్‌లో వీరికి ప్రాథమిక శిక్షణ పూర్తి అయింది. అంతర్గతంగా నిర్వహించిన మదింపు ప్రక్రియలో మెరుగైన పనితీరు కనబర్చలేదు. మూడు విడతలుగా అవకాశం ఇచ్చాం. అయినా ఉత్తీర్ణులు కాలేదు. దీంతో ఉద్వాసన పలకాల్సి వచ్చింది' అని ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఉద్యోగులను ఎటువంటి ఒత్తిడికి గురి చేయలేదని మాథ్యూ వివరించారు. మదింపు ప్రక్రియలో పనితీరు కనబర్చని ఫ్రెషర్ల తొలగింపు సాధారణమే. అయితే గతంలో ఇది 10 శాతానికి లోబడి ఉండేది. ఈ నెలలో ఇది ఏకంగా 30-40 శాతం ఉన్నట్టు సమాచారం. ఇదే వివాదానికి కేంద్ర బిందువైంది.

అక్రమంగా, అనైతికంగా..

ఐటీ ఉద్యోగుల సంఘం నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (నైట్స్) వాదన మరోలా ఉంది. మైసూరు శిక్షణ కేంద్రం నుంచి 700 మందికిపైగా ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ తొలగించిందని ఆరోపిస్తోంది. అక్రమంగా, అనైతికంగా ఉద్యోగులను తొలగించారంటూ కార్మిక శాఖకు సైతం నైట్స్ ఫిర్యాదు చేసింది. ఫిబ్రవరి మొదటి వారంలో టెర్మినేషన్‌కు గురైన వారంతా 2022 హైరింగ్ బ్యాచ్‌కు చెందినవారు. రెండేళ్ల నిరీక్షణ తర్వాత 2024 సెప్టెంబర్‌లో జాబ్స్ అందుకున్నారు. ఇన్ఫోసిస్ 2024లో అమలు చేసిన పరీక్షా విధానం కఠినంగా ఉంది. సిలబస్ ఎక్కువగా ఉండడం, శిక్షణ సమయం తక్కువ కావడంతో ఉత్తీర్ణత శాతం భారీగా పడిపోయిందని నైట్స్ చెబుతోంది. స్వచ్ఛందంగా మానేస్తున్నట్టు ఉద్యోగులతో బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని, బౌన్సర్లు, సెక్యూరిటీ సిబ్బందితో బెదిరింపులకు దిగారని కార్మిక శాఖకు ఇచ్చిన ఫిర్యాదులో నైట్స్ వెల్లడించింది.

వర్ధమాన మార్కెట్లకు తయారీ కేంద్రంగా భారత్

- కార్యకలాపాల విస్తరణలో హ్యుందాయ్ మోటార్ ఇండియా
- కంపెనీ ఎండీ అన్సూ కిమ్ వెల్లడి



న్యూఢిల్లీ: పొరుగు దేశాలతో పాటు ఆఫ్రికా తదితర వర్ధమాన మార్కెట్లకు ఎగుమతులు చేసేందుకు భారత్‌ను తయారీ హబ్‌గా మార్చుకోనున్నట్లు ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటర్ ఇండియా ఎండీ అన్సూ కిమ్ తెలిపారు. దేశీయంగా కార్యకలాపాలను విస్తరించనున్నట్లు వివరించారు. ఆఫ్రికా, మెక్సికో, లాటిన్ అమెరికా మార్కెట్లన్నింటిలోనూ అమ్మకాలు పెరుగుతున్నాయని వివరించారు. రిస్కులను తగ్గించుకునేందుకు ఇతర మార్కెట్లపై కూడా దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకలాంటి పొరుగు దేశాలకు కూడా ఎగుమతులు పెంచుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో హ్యుందాయ్ వాహన ఎగుమతులు 43,650 యూనిట్ల నుంచి 40,386 యూనిట్లకు తగ్గాయి. 2024 క్యాలెండర్ సంవత్సరంలో హ్యుందాయ్ మొత్తం 1,58,686 యూనిట్లను ఎగుమతి చేసింది. గతేడాది సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, మెక్సికో, చిలీ, పెరూ అతి పెద్ద ఎగుమతి మార్కెట్లుగా నిల్చాయి.


బైబ్యాక్ ప్రకటనతో నవ షేర్ల ర్యాలీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మెటల్స్, ఎనర్జీ, మైనింగ్ తదితర రంగాల్లో ఉన్న నవ లిమిటెడ్ తాజాగా రూ.360 కోట్ల విలువైన షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. 72 లక్షల షేర్లను (2.48 శాతం) ఒక్కొక్కటి రూ.500 చొప్పున బైబ్యాక్ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. మంగళవారం నాటి ముగింపు ధరతో పోలిస్తే బైబ్యాక్ ధర 32.10 శాతం ప్రీమియం కావడం విశేషం. దీంతో షేర్లు ర్యాలీ చేశాయి. ఒకానొక దశలో షేరు ధర 13.44 శాతం దూసుకెళ్లి రూ.429.40 తాకింది. మొత్తంగా బీఎస్ఈలో కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బుధవారం 11.61 శాతం ఎగసి రూ.422.45 వద్ద స్థిరపడింది. టెండర్ ఆఫర్ మార్గంలో బైబ్యాక్ నిర్వహిస్తారు. బైబ్యాక్‌లో షేర్లు విక్రయించకూడదని నవ ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ నిర్ణయించినట్టు కంపెనీ వెల్లడించింది. 2025 ఫిబ్రవరి 14 నాటికి ప్రమోటర్లకు సంస్థలో 48.89 శాతం వాటా ఉంది. డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం 23.73 శాతం తగ్గి రూ.250.3 కోట్లు, ఆదాయం 9.4 శాతం క్షీణించి రూ.842.5 కోట్లు నమోదైంది.

మాకూ ట్యాక్స్ ఆడిట్ అవకాశం కల్పించాలి

కేంద్రానికి కాస్ట్ అకౌంటెంట్ల విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ప్రస్తుతం సీఏలకు మాత్రమే ఉన్న ట్యాక్స్ ఆడిటింగ్ అవకాశాన్ని తమకు కూడా కల్పించాలని కాస్ట్ అకౌంటెంట్లు కోరుతున్నారు. జీఎస్‌టీ చట్టంలో, ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్‌గాను, సోషల్ ఆడిటర్లుగాను ఇద్దరికీ సమాన హోదాలనిచ్చినప్పటికీ ట్యాక్స్ ఆడిటింగ్ మాత్రం సీఏలకే పరిమితం చేయడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. కొత్త ఆదాయ పన్ను చట్టం బిల్లులో అకౌంటెంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంట్‌ను చేర్చకపోవడమనేది గతంలో అకౌంటింగ్ వృత్తి నిపుణులందరికీ సమాన హోదా కల్పిస్తామన్న హామీకి విరుద్ధమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు కేసీహెచ్ఏవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. దీనిపై విధాన నిర్ణేతలతో సంప్రదింపులు జరుగుతున్నాయని వివరించారు. అటు అకౌంటెంట్ల నిర్వచనం పరిధిలో తమను చేర్చకపోవడంపై కంపెనీ సెక్రటరీలు ఆందోళన వ్యక్తం చేశారు. పరోక్ష, ప్రత్యక్ష పన్ను చట్టాలపై కంపెనీ సెక్రటరీలకు కూడా పట్టు ఉంటుందని, ట్యాక్సేషన్ వ్యవస్థలో వారు కీలకంగా వ్యవహరిస్తారని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) ప్రెసిడెంట్ ధనంజయ్ శుక్లా పేర్కొన్నారు. మరోవైపు, ఆడిట్ అనేది సీఏల పరిధిలోకి మాత్రమే వస్తుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ చరణ్‌జోత్ సింగ్ నందా స్పష్టం చేశారు. ఈ అంశాన్ని కోఆర్డినేషన్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు.

విద్యుత్ రంగంలో రూ.60 లక్షల కోట్ల పెట్టుబడులు

- వచ్చే పదేళ్లలో అవసరం
- అప్పుడే 2070 నాటికి నెట్ జీరో ఉద్గారాల సాధ్యం
- మూడీస్ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: భారత్ తన ప్రతిష్టాత్మకమైన సున్నా కర్బన ఉద్గారాల స్థితి (తటస్థం)ని 2070 నాటికి చేరుకోవాలంటే.. వచ్చే పదేళ్లలో 700 బిలియన్ డాలర్ల పెట్టుబడులు (రూ.60 లక్షల కోట్లు) విద్యుత్ రంగంలో చేయాల్సి వస్తుందని మూడీస్ రేటింగ్స్ తెలిపింది. పునరుత్పాదక ఇంధనాలు, అణు ఇంధనం, విద్యుత్ ప్రసారం, పంపిణీ, ఇంధన స్టోరేజీ వసతుల కోసం ఈ మొత్తం వెచ్చించాల్సి వస్తుందని వివరించింది. దేశంలో కర్బన ఉద్గారాల విడుదలలో 37 శాతం విద్యుత్ రంగం నుంచే ఉంటోందని పేర్కొంది. 2026 నుంచి 2051 ఆర్థిక సంవత్సరాల మధ్య ఏటా జీడీపీలో 1.5-2 శాతం మేర పెట్టుబడులను (వచ్చే పదేళ్లు ఏటా 2 శాతం) ఈ రంగంలో చేయాల్సి వస్తుందని అంచనా వేసింది. 2034-35 వరకు ఏటా రూ.4.5-6.4 లక్షల కోట్లు చొప్పున, ఆ తర్వాత 2026-51 మధ్యకాలంలో ఏటా రూ.6-9 లక్షల కోట్లు పెట్టుబడి అవసరం అవుతుందని వెల్లడించింది. ఈ స్థాయిలో పెట్టుబడులను ప్రభుత్వం, ప్రైవేటు రంగం, దేశ, విదేశీ మూలధనం రూపంలో సమకూర్చుకోవచ్చని సూచించింది. దేశంలో ఇప్పటికీ అధిక శాతం విద్యుత్ బొగ్గు ఆధారితమే ఉన్నందున, ఈ కాలుష్యాన్ని తగ్గించేందుకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరమవుతాయని అభిప్రాయపడింది. వచ్చే పదేళ్ల పాటు బలమైన ఆర్థిక వృద్ధి అన్నది బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి విస్తరణను సూచిస్తోందని, ఇది కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యానికి ప్రతికూలంగా మారొచ్చని పేర్కొంది.

తలసరి వినియోగం మూడో వంతే


భారత ఆర్థిక వ్యవస్థ ఏటా 6.5 శాతం చొప్పున వచ్చే పదేళ్ల పాటు వృద్ధిని నమోదు చేస్తుందని, దీంతో ఏటా విద్యుత్ డిమాండ్ 6 శాతం చొప్పున కాంపౌండెడ్ వార్షిక పెరుగుదలను చూస్తుందని మూడీస్ రేటింగ్స్ అంచనా వేసింది. ''భారత్‌లో తలసరి విద్యుత్ వినియోగం (2021-22లో 1,255 కిలోవాట్ హవర్) ప్రపంచ వినియోగంలో మూడింత ఒక వంతుగానే ఉంది. ఆర్థిక వృద్ధితోపాటు, జీవన ప్రమాణాల మెరుగుదల నేపథ్యంలో రానున్న కాలంలో వినియోగం మరింత పెరగనుంది. వచ్చే పదేళ్లలో 450 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం డిమాండ్‌ను తీర్చలేదు. ఈ కాలంలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని మరో 35 శాతం పెంచుకోవాల్సి రావచ్చు. 1.7-1.8 రెట్లు పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 2034-35 నాటికి 2-2.2 రెట్లు పెరగాలి. 2023-24 నాటికి శిలాజేతర ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ తయారీ 23.5 శాతంగా ఉంటే, 2034-35 నాటికి 45-50 శాతానికి చేర్చాలి''అని మూడీస్ వివరించింది. పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లే విషయంలో ప్రైవేటు రంగం ఎంతో కీలకమంటూ, విదేశీ నిధులు అంతరాన్ని భర్తీ చేయగలవని పేర్కొంది.

నిరుద్యోగం రేటు తగ్గుముఖం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నిరుద్యోగిత రేటు తగ్గింది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) ప్రకారం.. 2024-25 అక్టోబర్–డిసెంబర్ కాలంలో పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో నిరుద్యోగిత రేటు 6.4 శాతానికి వచ్చి చేరింది. జూలై-సెప్టెంబర్‌లోనూ ఇదే స్థాయిలో నమోదైంది. 2023-24 డిసెంబర్ త్రైమాసికంలో నిరుద్యోగిత రేటు 6.5 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లోని 15 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న స్త్రీలలో నిరుద్యోగిత రేటు 2024 అక్టోబర్-డిసెంబర్‌లో 8.1 శాతానికి తగ్గింది. అంత క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 8.6 శాతంగా ఉంది. 2024 జూలై-సెప్టెంబర్‌లో ఈ రేటు 8.4 శాతం. ఇక పురుషుల్లో నిరుద్యోగిత రేటు అంత క్రితం ఏడాది మాదిరిగానే 2024 అక్టోబర్-డిసెంబర్‌లో 5.8 శాతం వద్ద స్థిరంగా ఉంది. 2024 జూలై-సెప్టెంబర్‌లో ఇది 5.7 శాతం నమోదైంది.

గోల్డ్‌మన్ శాక్స్ చేతికి రూ. 401 కోట్ల బీఎస్ఈ షేర్లు



న్యూఢిల్లీ: బ్యాంకింగ్, ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ బుధవారం 7.28 లక్షల బీఎస్ఈ షేర్లను ఓపెన్ మార్కెట్ లావాదేవీల్లో కొనుగోలు చేసింది. వీటి విలువ రూ. 401 కోట్లు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) బల్క్ డీల్ డేటా ప్రకారం ఒక్కో షేరును సగటున రూ. 5,504.42 రేటుకు కంపెనీ కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో ఎన్ఎస్ఈలో బీఎస్ఈ షేరు 8.14 శాతం పెరిగి రూ. 5,608.50 వద్ద క్లోజయ్యింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బీఎస్ఈ నికర లాభం రెట్టింపై రూ. 220 కోట్లకు చేరింది. అలాగే ఆదాయం కూడా రూ. 431 కోట్ల నుంచి రూ. 835 కోట్లకు ఎగిసింది.



జాతీయ పారాథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో దీప్తికి స్వర్ణ పతకం

సాక్షి, హైదరాబాద్: జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, అంతర్జాతీయ పారాథ్లెట్ జివాంజి దీప్తి 400 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది. దీప్తి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 57.82 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఇటీవల 'అర్జున అవార్డు' పొందిన దీప్తి గచ్చిబౌలి స్టేడియంలో భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కోచ్ నాగపురి రమేశ్ వద్ద శిక్షణ తీసుకుంటోంది.



జగజ్జేత జర్మనీకి భారత్ షాక్

గుర్జంత్ గోల్‌తో నెగ్గిన టీమిండియా

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు సంచలనం సృష్టించింది. ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో బుధవారం జరిగిన రెండో రౌండ్ రెండో మ్యాచ్‌లో టీమిండియా 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఆట నాలుగో నిమిషంలో గుర్జంత్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని భారత్ విజయాన్ని ఖరారు చేసుకుంది. మంగళవారం జర్మనీతో జరిగిన రెండో రౌండ్ తొలి మ్యాచ్‌లో భారత్ 1-4 గోల్స్ తేడాతో ఓడిన సంగతి తెలిసిందే. మరోవైపు భారత మహిళల జట్టుకు మరో ఓటమి ఎదురైంది. స్పెయిన్ జట్టుతో జరిగిన రెండో రౌండ్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-1తో ఓడిపోయింది. స్పెయిన్ తరఫున సెగూ మార్గా (49వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది.

శ్రీజ శుభారంభం



షెన్‌జెన్ (చైనా): ఆసియా కప్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ గ్రూప్-1 తొలి లీగ్ మ్యాచ్‌లో శ్రీజ 11-7, 11-5, 11-4తో అయా మొహమ్మద్ (ఖతర్)పై గెలుపొందింది. గ్రూప్-8లో ఉన్న మరో భారత ప్లేయర్ ఐహిక ముఖర్జీ 8-11, 7-11, 11-13తో షి జున్‌యావో (చైనా) చేతిలో... గ్రూప్-5లో ఉన్న యశస్విని 9-11, 9-11, 5-11తో చెంగ్ ఐ చింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్‌లో గ్రూప్-3లో ఉన్న ఆచంట శరత్ కమల్ (భారత్) తొలి మ్యాచ్‌లో 4-11, 4-11, 9-11తో లియాంగ్ జింగ్‌కున్ (చైనా) చేతిలో... గ్రూప్-8లో ఉన్న హర్మీత్ దేశాయ్ 5-11, 7-11, 12-10, 6-11తో అన్ జేహైన్ (కొరియా) చేతిలో... గ్రూప్-7లో ఉన్న మానవ్ ఠక్కర్ 9-11, 9-11, 9-11తో లిన్ యున్ జు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు.





భారీ బరువును ఎత్తబోయి...

17 ఏళ్ల పవర్‌లిఫ్టర్ దుర్మరణం



బికనేర్: ప్రాక్టీస్‌లో భారీ బరువులెత్తబోయి యువ పవర్ లిఫ్టర్ మృతి చెందిన విషాద ఘటన బుధవారం చోటు చేసుకుంది. రాజస్తాన్‌కు చెందిన 17 ఏళ్ల యస్తిక ఆచార్య పవర్‌లిఫ్టర్‌గా జాతీయ స్థాయిలో రాణిస్తోంది. గత ఏడాది సబ్ జూనియర్ విభాగంలో (ప్లస్ 84 కేజీలు) జాతీయ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం కూడా సాధించింది. తన రెగ్యులర్ ప్రాక్టీస్‌లో భాగంగా జిమ్‌లో ఆమె కోచ్‌తో కలిసి సాధన చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. 270 కేజీల బరువును ఎత్తే క్రమంలో పట్టు జారి ఆమె వెనక్కి పడిపోయింది. రాడ్ ఆమె మెడ వెనక భాగంలో పడటంతో మెడ విరిగిపోయి యస్తిక కుప్పకూలిపోయింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా లాభం లేకపోయింది. ఇంత భారీ బరువు ఎత్తుతున్నప్పుడు సాధారణంగా వెనక నిలబడి కోచ్ సహకరిస్తాడు. కానీ అతను కూడా నిలువరించలేకపోవడంతో యువ క్రీడాకారిణి జీవితం ముగిసింది. ఈ క్రమంలో కోచ్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి.

ప్రియాంక్ ప్రతాపం

- దీటుగా బదులిస్తున్న గుజరాత్
- తొలి ఇన్నింగ్స్‌లో 222/1
- కేరళ తొలి ఇన్నింగ్స్ 457 ఆలౌట్

అజేయ సెంచరీతో చెలరేగిన ఓపెనర్


ప్రియాంక్ పాంచాల్

అహ్మదాబాద్: సీనియర్ ఓపెనర్ ప్రియాంక్ పాంచాల్ (200 బంతుల్లో 117 బ్యాటింగ్; 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ శతకంతో అదరగొట్టడంతో... కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మాజీ చాంపియన్ గుజరాత్ జట్టు దీటుగా బదులిస్తోంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మొదట కేరళ బ్యాటర్లు భారీ స్కోరు చేయగా... ఇప్పుడు గుజరాత్ కూడా అదే బాటలో నడుస్తోంది. బుధవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి గుజరాత్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 222 పరుగులు చేసింది. ప్రియాంక్ సూపర్ సెంచరీకి ఆర్య దేశాయ్ (118 బంతుల్లో 73; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకం తోడవడంతో గుజరాత్ ఇన్నింగ్స్ సజావుగా సాగింది. ఈ జంట కేరళ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పరుగుల రాక సులువైంది. ముఖ్యంగా ఆర్య దూకుడుగా ఆడాడు. తొలి వికెట్‌కు 131 పరుగులు జోడించిన అనంతరం అతడు అవుటయ్యాడు. ఆ తర్వాత మనన్ హింగ్‌రాజియా (108 బంతుల్లో 30 బ్యాటింగ్; 3 ఫోర్లు)తో కలిసి ప్రియాంక్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ క్రమంలో ప్రియాంక్ ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 29వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తాజా రంజీ సీజన్‌లో అతడికిది రెండో శతకం. మూడో రోజు 71 ఓవర్లు వేసిన కేరళ కేవలం ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టింది. బాసిల్‌కు ఆ వికెట్ దక్కింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 418/7తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ జట్టు చివరకు 187 ఓవర్లలో 457 పరుగులు చేసి ఆలౌటైంది. వికెట్ కీపర్ మొహమ్మద్ అజహరుద్దీన్ (341 బంతుల్లో 177 నాటౌట్; 20 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మూడో రోజు 10 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు మరో 39 పరుగులు జోడించి మిగిలిన మూడు వికెట్లు కోల్పోయింది. చివరి వరుస బ్యాటర్లు ఎక్కువసేపు నిలవలేకపోయారు. గుజరాత్ బౌలర్లలో అర్జాన్ మూడు, చింతన్ గజా రెండు వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం చేతిలో 9 వికెట్లు ఉన్న గుజరాత్ జట్టు కేరళ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 235 పరుగులు వెనుకబడి ఉంది.

స్కోరు వివరాలు

కేరళ తొలి ఇన్నింగ్స్: అక్షయ్ (రనౌట్) 30; రోహన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రవి బిష్ణోయ్ 30; వరుణ్ (సి) ఉర్విల్ (బి) ప్రియజీత్‌సింగ్ 10; సచిన్ బేబీ (సి) ఆర్య దేశాయ్ (బి) అర్జాన్ 69; జలజ్ సక్సేనా (బి) అర్జాన్ 30; అజహరుద్దీన్ (నాటౌట్) 177; సల్మాన్ నిజర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) విశాల్ 52; ఇమ్రాన్ (సి) ఉర్విల్ (బి) అర్జాన్ 24; ఆదిత్య (బి) చింతన్ 11; నిధీశ్ (రనౌట్) 5; బాసిల్ (సి) ఆర్య (బి) చింతన్ 1; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (187 ఓవర్లలో ఆలౌట్) 457. వికెట్ల పతనం:** 1-60, 2-63, 3-86, 4-157, 5-206, 6-355, 7-395, 8-428, 9-455, 10-457, **బౌలింగ్:** చింతన్ 33-9-75-2; అర్జాన్ 34-9-81-3; ప్రియజీత్ సింగ్ 21-2-58-1; జైమీత్ 13-1-46-0; రవి బిష్ణోయ్ 30-7-74-1; సిద్ధార్థ్ దేశాయ్ 33-13-49-0; విశాల్ జైస్వాల్ 22-5-57-1; ఆర్య దేశాయ్ 1-0-3-0.

గుజరాత్ తొలి ఇన్నింగ్స్: ప్రియాంక్ (బ్యాటింగ్) 117; ఆర్య దేశాయ్ (బి) బాసిల్ 73; మనన్ (బ్యాటింగ్) 30; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం: (71 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి) 222. వికెట్ల పతనం:** 1-131. **బౌలింగ్:** నిధీశ్ 10-1-40-0; జలజ్ 25-5-71-0; బాసిల్ 15-1-40-1; ఆదిత్య 17-2-55-0; అక్షయ్ చంద్రన్ 3-0-11-0; ఇమ్రాన్ 1-0-3-0.

బోపన్న జోడీ సంచలనం



దోహా: ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-నునో బోర్జెస్ (పోర్చుగల్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో బోపన్న-బోర్జెస్ ద్వయం 7-6 (7/2), 7-6 (7/4)తో రెండో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వావాసోరి (ఇటలీ) జంటను బోల్తా కొట్టించింది. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఏడు ఏస్‌లు సంధించింది. మ్యాచ్ మొత్తంలో రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్‌లు అనివార్యమయ్యాయి. టైబ్రేక్‌లో బోపన్న-బోర్జెస్ పైచేయి సాధించి విజయాన్ని అందుకోవడంతోపాటు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు.

జొకోవిచ్‌కు చుక్కెదురు



దోహా: కెరీర్‌లో 100వ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ఈ ఏడాది బరిలోకి దిగిన మూడో టోర్నమెంట్‌లోనూ సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు నిరాశ ఎదురైంది. ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో మూడో సీడ్‌గా పోటీపడ్డ జొకోవిచ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ప్రపంచ మాజీ ఆరో ర్యాంకర్, 2021 వింబుల్డన్ టోర్నీ రన్నరప్ మాటియో బెరెటిని (ఇటలీ)తో జరిగిన మ్యాచ్‌లో 37 ఏళ్ల జొకోవిచ్ 6-7 (4/7), 2-6తో ఓడిపోయాడు. గతంలో జొకోవిచ్‌తో ఆడిన నాలుగుసార్లూ ఓడిపోయిన బెరెటిని ఐదో ప్రయత్నంలో తొలిసారి గెలుపొందడం విశేషం. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 9 ఏస్‌లు... బెరెటిని 13 ఏస్‌లు సంధించారు. బెరెటిని సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసేందుకు వచ్చిన అవకాశాలను జొకోవిచ్ చేజార్చుకోగా... బెరెటిని తన ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు.

క్వార్టర్ ఫైనల్లో సాకేత్ ద్వయం



పుణే: మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో సాకేత్-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) ద్వయం 6-0, 6-4తో మైకేల్ గీర్ట్స్ (బెల్జియం)-బిల్లీ హ్యారిస్ (బ్రిటన్) జంటను ఓడించింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్ తొమ్మిది ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థుల సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్‌కు డబుల్స్ తొలి రౌండ్‌లోనే నిరాశ ఎదురైంది. అనిరుధ్ (భారత్)-రే హో (చైనీస్ తైపీ) ద్వయం 6-7 (3/7), 7-6 (7/5), 4-10తో 'సూపర్ టైబ్రేక్'లో ఇలియా సిమాకిన్-బిర్యుకోవ్ (రష్యా) జంట చేతిలో ఓడిపోయింది. టాప్ సీడ్ జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ తొలి రౌండ్‌లో 6-3, 7-6 (9/7)తో హోల్మ్‌గ్రెన్-ఎల్మెర్ మోలెర్ (డెన్మార్క్) జంటపై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు ఐదో విజయం



జైపూర్: ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఐదో విజయం నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ 2-1 గోల్స్ తేడాతో రాజస్తాన్ యునైటెడ్ ఎఫ్‌సీ జట్టును ఓడించింది. 10 మ్యాచ్‌ల తర్వాత రాజస్తాన్ జట్టుకిది తొలి ఓటమి కావడం గమనార్హం. శ్రీనిధి జట్టు తరఫున ఏంజెల్ ఒరెలియన్ (43వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (73వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. రాజస్తాన్ యునైటెడ్ జట్టుకు మైకోల్ కబ్రెరా (75వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఈనెల 25న జరిగే తదుపరి మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్‌తో శ్రీనిధి జట్టు తలపడుతుంది. 12 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో 15 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 19 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది.

పట్టుబిగించిన విదర్భ

- ప్రస్తుతం 260 పరుగుల ఆధిక్యంలో మాజీ చాంపియన్
- రెండో ఇన్నింగ్స్‌లో 147/4
- ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 270 ఆలౌట్
- ఆకాశ్ ఆనంద్ సెంచరీ


ఆకాశ్ ఆనంద్

నాగ్‌పూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు కష్టాల్లో పడింది. విదర్భతో జరుగుతున్న పోరులో బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోగా... బౌలర్లు కూడా ప్రభావం చూపలేకపోయారు. ఆరంభంలో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచినప్పటికీ... దాన్ని చివరి వరకు కొనసాగించలేకపోయారు. దీంతో కోలుకున్న విదర్భ జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. యశ్ రాథోడ్ (101 బంతుల్లో 59 బ్యాటింగ్; 4 ఫోర్లు) అర్ధశతకంతో రాణించగా... కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (102 బంతుల్లో 31 బ్యాటింగ్; 2 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. అథర్వ తైడె (0), కరుణ్ నాయర్ (6), ధ్రువ్ షోరే (13), దానిశ్ (29) విఫలమవడంతో... ఒకదశలో 56 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన మాజీ చాంపియన్ విదర్భ జట్టును యశ్ రాథోడ్, అక్షయ్ ఆదుకున్నారు. వీరిద్దరూ అజేయమైన ఐదో వికెట్‌కు 91 పరుగులు జోడించారు. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగుల ఆధిక్యం దక్కించుకున్న విదర్భ జట్టు... ప్రస్తుతం ఓవరాల్‌గా 260 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ 2... శార్దుల్ ఠాకూర్, తనుశ్ కొటియాన్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 188/7తో బుధవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై జట్టు చివరకు 92 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (256 బంతుల్లో 106; 11 ఫోర్లు) విలువైన సెంచరీ చేశాడు. తనుశ్ కొటియాన్ (33; 4 ఫోర్లు, 1 సిక్స్) అతడికి సహకరించాడు. విదర్భ బౌలర్లలో పార్థ్ 4 వికెట్లు పడగొట్టాడు.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 383; **ముంబై తొలి ఇన్నింగ్స్:** ఆయుశ్ (సి) దానిశ్ (బి) దర్శన్ 9; ఆకాశ్ ఆనంద్ (సి) అక్షయ్ (బి) నచికేత్ 106; సిద్ధేశ్ (బి) యశ్ ఠాకూర్ 35; రహానే (బి) పార్థ్ 18; సూర్యకుమార్ (సి) దానిశ్ (బి) పార్థ్ 0; శివమ్ దూబే (సి) అథర్వ (బి) పార్థ్ 0; షమ్స్ ములానీ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్ష్ దూబే 4; శార్దుల్ (సి) దర్శన్ (బి) యశ్ ఠాకూర్ 37; తనుశ్ (బి) పార్థ్ 33; మోహిత్ (బి) హర్ష్ దూబే 10; రాయ్‌స్టన్ డయస్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (92 ఓవర్లలో ఆలౌట్) 270. వికెట్ల పతనం** : 1-18, 2-85, 3-113, 4-113, 5-113, 6-118, 7-178, 8-247, 9-261, 10-270, **బౌలింగ్:** దర్శన్ 12-1-46-1; యశ్ ఠాకూర్ 16-0-73-2; హర్ష్ దూబే 25-3-68-2; నచికేత్ 9-2-25-1; పార్థ్ 30-9-55-4.

విదర్భ రెండో ఇన్నింగ్స్: అథర్వ (ఎల్బీడబ్ల్యూ) (బి) శార్దుల్ 0; ధ్రువ్ షోరే (ఎల్బీడబ్ల్యూ) (బి) తనుశ్ 13; దానిశ్ (సి అండ్ బి) ములానీ 29; కరుణ్ నాయర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ములానీ 6; యశ్ రాథోడ్ (బ్యాటింగ్) 59; అక్షయ్ వాడ్కర్ (బ్యాటింగ్) 31; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (53 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి) 147. వికెట్ల పతనం:** 1-0, 2-40, 3-52, 4-56, **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 6-2-14-1; మోహిత్ 2-0-13-0; షమ్స్ ములానీ 20-3-50-2; రాయ్‌స్టన్ డయస్ 7-4-11-0; తనుశ్ కొటియాన్ 14-1-33-1; శివమ్ దూబే 3-0-17-0; ఆయుశ్ 1-0-3-0.

ముంబై మాజీ కెప్టెన్ మిలింద్ కన్నుమూత

ముంబై జట్టు మాజీ సారథి, మాజీ సెలెక్టర్ మిలింద్ రేగె (76) బుధవారం గుండెపోటుతో కన్నుమూశారు. దేశవాళీల్లో ఆల్‌రౌండర్‌గా రాణించిన మిలింద్ కెరీర్‌లో 52 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి 1532 పరుగులు చేయడంతో పాటు 126 వికెట్లు పడగొట్టారు. 26 ఏళ్ల వయసులోనే గుండెపోటుకు గురైన మిలింద్ ఆ తర్వాత తిరిగి కోలుకొని ముంబై రంజీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మిలింద్ మృతికి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సంతాపం వ్యక్తం చేశాడు. మిలింద్ చిన్ననాటి మిత్రుడు సునీల్ గావస్కర్‌తో పాటు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) సంతాపం వ్యక్తం చేశాయి. మిలింద్ మృతికి సంతాపంగా విదర్భతో రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో ముంబై ప్లేయర్లు నల్లరిబ్బన్లతో బరిలోకి దిగారు.



తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన కొర్ర అఖిల, నేనావత్ విజయలక్ష్మి... హైదరాబాద్ అథ్లెట్ ఇస్లావత్ నితిన్ నాయక్ మెరిశారు. ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో బుధవారం జరిగిన ఈ మీట్‌లో నితిన్ 400 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. అఖిల జావెలిన్ త్రోలో పసిడి పతకం, డిస్కస్ త్రోలో రజత పతకం... విజయలక్ష్మి 400 మీటర్ల విభాగంలో స్వర్ణం, జావెలిన్ త్రోలో రజత పతకం గెలిచారు. ఈ ముగ్గురు హయత్‌నగర్‌లోని అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్‌లో కోచ్ నేనావత్ వినోద్ కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

ఐదు దోమలకు రూపాయిన్నర





చంపినా, సజీవంగా పట్టి తెచ్చినా నజరానా

దోమలపై దండయాత్ర మొదలెట్టిన ఫిలిప్పీన్స్ గ్రామం

మనీలా: డెంగీ వ్యాధి పేరు చెబితే ఎవరైనా హడలిపోవాల్సిందే. ప్రజాసంక్షేమానికి, తమ పౌరుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే ఫిలిప్పీన్స్ ప్రభుత్వం సైతం డెంగీ పేరు చెబితే వణికిపోతోంది. విజృంభిస్తున్న డెంగీ కేసులు, దోమలకు చెక్ పెట్టాలంటే ప్రభుత్వ యంత్రాంగం, సిబ్బంది మాత్రమే రంగంలోకి దిగితే సరిపోదని స్థానిక పాలకులు భావించారు. పౌరులను ఈ క్రతువులో భాగస్వాములను చేయాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా దోమలను చంపితే నజరానా ఇస్తామని ప్రకటించారు. ప్రతి ఐదు దోమలకు ఒక ఫిలిప్పీన్స్ పేసో(1 పేసో అంటే భారతీయ కరెన్సీలో రూ.1.50) చొప్పున డబ్బులు ముట్టజెప్తామని సెంట్రల్ మనీలాలోని బరాంగే అడిషన్ హిల్స్ గ్రామ పెద్ద కార్లిటో సెర్నాల్ స్పష్టంచేశారు. దోమలను చంపితే కూడా డబ్బులిస్తారా? అంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు నెటిజన్లు వ్యంగ్య పోస్ట్‌లు చేసినా ఆయన దానిని సానుకూలంగా స్పందించారు. ''ఎవరేమనుకున్నా పర్లేదు. మాకు మా పౌరుల ఆరోగ్యమే ముఖ్యం''అని తాపీగా సమాధానమిచ్చారు. ఇటీవల ఈ ప్రాంతంలో ఇద్దరు విద్యార్థులు దోమకాటు కారణంగా డెంగీ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ దోమల దండుపై దండయాత్రకు గ్రామపెద్ద పిలుపునిచ్చారు. ''ఏమాత్రం ఆలస్యం చేయకుండా మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపించిన దోమనల్లా చంపేయండి. కేవలం నెలరోజులు మాత్రమే ఈ ఆఫర్ ఉంటుంది''అని ఆయన మరోసారి గుర్తుచేశారు. ఖాళీగా కూర్చోకుండా దోమల బ్యాట్‌తో రంగంలోకి దిగితే మంచి డబ్బులొస్తాయని కొందరు వెంటనే పని మొదలెట్టారు. గ్రామంలో ఇప్పటికే 21 మంది తాము చంపిన, సజీవంగా పట్టితెచ్చిన దోమలు, వారి లార్వాలను చూపించారు. వాళ్లు వందలాది దోమలు, లార్వాలను తీసుకొచ్చారు. బతికున్న దోమలను అవి డెంగీ వ్యాధికారక రకం దోమలో కాదో అతినీలలోహిత కిరణాల కింద పెట్టి పరీక్షించి నిర్ధారిస్తామని గ్రామ పెద్ద చెప్పారు. ఈ తతంగం చూసి నవ్వుకున్న కొందరు తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో వ్యంగ్య పోస్ట్‌లు పెట్టారు. ''పట్టుకునే, చంపే క్రమంలో దోమ రెక్క ఒకటి ఊడిపోతే దానిని లెక్కలోకి తీసుకుంటారా? లేదంటే తిరస్కరిస్తారా?''అని ఒక వ్యక్తి పోస్ట్‌చేశారు.

మెచ్చుకున్న ప్రభుత్వం

స్థానిక యంత్రాంగం స్థాయిలో దోమల వ్యాప్తి కట్టడికి జరుగుతున్న కృషిని ఫిలిప్పీన్స్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ మెచ్చుకుంది. ''ఇలాంటి కార్యక్రమాలు జరగాల్సిందే. పౌరులు సైతం తమ వంతు బాధ్యతగా స్థానిక ఆరోగ్య అధికారులు లేదా ఫిలిప్పీన్స్ మంత్రిత్వ శాఖ ప్రాంతీయ ఆఫీస్‌లకు వెళ్లి డెంగీ నివారణ, దోమల వ్యాప్తి నిరోధక పద్ధతులపై అవగాహన పెంచుకోండి'' అని ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ''మా ప్రాంతంలో దోమల బెడద చాలా ఎక్కువ. ఇటీవలే 44 డెంగీ కేసులు వెలుగుచూశాయి. సొంతంగా కట్టడి చర్యలకు ఉపక్రమించాం. ఎవరేమనుకుంటున్నారు అనేది మాకు అనవసరం. మాకు తోచినంతలో మా ప్రాంతాన్ని మేం దోమలరహితంగా మారుస్తున్నాం''అని గ్రామ పెద్ద అన్నారు. ''సెంట్రల్ మనీలాలోని 400 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న బరాంగే అడిషన్ హిల్స్ జనాభా 70,000. డెంగీ కారక దోమలు లార్వాలను విడిచేందుకు వీలులేకుండా ఎప్పటికప్పుడు నీటి నిల్వ ప్రాంతాలను శుద్ధిచేయడం చేస్తున్నాం''అని ఆయన చెప్పారు. ఉష్ణమండల దేశమైన ఫిలిప్పీన్స్‌లో దోమల సమస్య ఎక్కువే. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటిన 40 శాతం అధికంగా ఏకంగా 28,234 డెంగీ కేసులు నమోదైనట్లు దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇటీవల ప్రకటించింది. నీరు నిల్వ ఉండే టైర్లు, నిరుపయోగ డ్రమ్ములు, బకెట్లను పారేయాలని, ప్రజలు చేతులు పూర్తిగా కప్పేసేలా వస్త్రధారణ ఉండాలని సూచించింది.

కెంటకీకి కేఎఫ్‌సీ గుడ్‌బై

హెడ్డాఫీస్ టెక్సాస్‌కు తరలింపు

కెంటకీ ఫ్రైడ్ చికెన్. క్లుప్తంగా కేఎఫ్‌సీ. పరిచయమే అక్కర్లేని ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్. ఈ ఫుడ్ జాయింట్ దిగ్గజానికి పిల్లల నుంచి పండు ముసలి దాకా లెక్కలేనంత మంది అభిమానులు! అమెరికాకు చెందిన ఈ బ్రాండ్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఇంత కాలం తన కేరాఫ్‌గా నిలిచిన కెంటకీలోని లూయిస్‌విల్లే నుంచి టెక్సాస్‌లోని ప్లానోకు ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తోంది. కొన్ని కార్యకలాపాలు మాత్రం కెంటకీ నుంచి ఇకముందూ కొనసాగుతాయని యాజమాన్యం ప్రకటించింది. కేఎఫ్‌సీ నిర్ణయంపై కెంటకీ రాష్ట్ర గవర్నర్ ఆండీ బెషెర్ విచారం వెలిబుచ్చారు. ఈ విషయం తెలిస్తే బహుశా ఆ సంస్థ వ్యవస్థాపకుడు కల్నల్ హార్లండ్ శాండర్స్ కూడా బాధపడి ఉండేవాడన్నారు. ''ఆ కంపెనీ పేరే మా రాష్ట్రంతో మొదలవుతుంది. తన ఉత్పత్తుల విక్రయానికి మా రాష్ట్ర సంస్కృతిని, వారసత్వాన్ని ఉపయోగించుకుంది''అని చెప్పుకొచ్చారు. పరిశ్రమలు, సంస్థలపై పన్నుల భారాన్ని టెక్సాస్ కొన్నేళ్లుగా బాగా తగ్గించింది. దాంతోపాటు అక్కడి వ్యాపార అనుకూల వాతావరణానికి అమెరికన్ కంపెనీలు ఆకర్షితమవుతున్నాయి. పెద్ద సంఖ్యలో ఆ రాష్ట్ర బాట పడుతున్నాయి. కేఎఫ్‌సీని 1930ల్లో కెంటకీలోని కోర్బిన్‌లో ఓ సర్వీస్ స్టేషన్ దగ్గర ఫ్రైడ్ చికెన్ చిన్న దుకాణంగా శాండర్స్ మొదలు పెట్టారు. దాని రుచికి జనాలు ఫిదా కావడంతో చూస్తుండగానే యమా పాపులరైంది. ఇప్పుడు 145కు పైగా దేశాల్లో సంస్థకు ఏకంగా 24 వేల పై చిలుకు ఔట్‌లెట్లున్నాయి! ప్రతి కేఎఫ్‌సీ షాపు ముందూ కన్పించే గమ్మత్తైన ఫేసు దాని వ్యవస్థాపకుడు శాండర్స్‌దే.

– సాక్షి, నేషనల్ డెస్క్

కేసు దాకా వెళ్లిన కోడి కూత

కేరళలో వింత ఘటన

పథనంథిట్ట(కేరళ): ప్రకృతి రమణీయతకు, ప్రశాంత వాతావరణానికి పెట్టింది పేరైన కేరళలో పథనంథిట్ట జిల్లా అంతే స్థాయిలో ప్రశాంతంగా ఉంటుంది. ఆ జిల్లాలో భూమి కోసమో నగదు కోసమో తగాదా జరిగితే అది వార్త స్థాయికి చేరేదికాదు. కానీ ఒక కోడి కూత ఇప్పుడు ఫిర్యాదుచేసి కేసు పెట్టేదాకా వెళ్లింది. ఆ కోడి అన్ని కోళ్లలాగా ఉదయం ఆరు గంటలకో అంతకు కాస్తంత ముందే కూత పెట్టట్లేదు. ఆ కోడి పుంజు ప్రతిరోజూ ఠంచనుగా తెల్లవారుజామున మూడు గంటలకే కూత అందుకుంటోంది. నిశ్శబ్దం రాజ్యమేలే మూడు గంటల వేళ అందరూ గాఢ నిద్రలోకి జారుకున్న సమయంలో ఈ కోడి కూత ప్రభావం మరింత ఎక్కువగా ఉంటోంది. ఇది ముఖ్యంగా పక్కింట్లో ఉండే వృద్ధుడు రాధాకృష్ణ కురూప్ నిద్రకు తీవ్రస్థాయిలో భంగం వాటిల్లజేస్తోంది. ఆ శబ్దాలకు నిద్ర పట్టక రాధాకృష్ణ తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని ఆ కోడి యజమాని అనిల్‌కుమార్‌కు చెప్పిచూసినా లాభం లేకుండాపోయింది. దీంతో చేసిదిలేక అదూర్ రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆ కోడి పుంజుపై ఫిర్యాదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ రాత్రిళ్లు నిద్రలేక ఇబ్బందులు పడుతున్న ఆ పెద్దాయన అవస్థ చూడలేక అధికారులు కోడి యజమాని అనిల్ కుమార్‌ను పిలిపించారు. తన తప్పేంలేదని యజమాని అనిల్ వాదించారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పోలీసులు రంగంలోకి దిగి కోళ్లను పరిశీలించేందుకు వచ్చారు. అనిల్ కుమార్ ఆ కోళ్లను నేలపై పెంచకుండా తన స్థలంలోని తొలి అంతస్తులో పెంచుతున్నాడు. ఎత్తు నుంచి శబ్దం వస్తుండటంతో చుట్టూతా గోడలు, ఎలాంటి అడ్డూ లేకపోవడంతో కోడి కూత పెద్దగా వినిపిస్తోందని అధికారులు తేల్చారు. దీనికి పరిష్కారంగా కోళ్లను మొదటి అంతస్తు నుంచి తరలించి అదే స్థలంలో దక్షిణ వైపు నేలపై పెంచుకోవాలని అధికారులు సూచించారు. మరో 14 రోజుల్లోపు ఈ కోళ్ల తరలింపు ప్రక్రియ పూర్తవ్వాలని యజమాని అనిల్‌కు అధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో వృద్ధుడు కాస్తంత ఆనందం వ్యక్తంచేశారు. కోడి కూత అంశం కేసుదాకా వెళ్లిందని ఇరుగుపొరుగు తెగ మాట్లాడుకుంటున్నారు. పళ్లిక్కల్ గ్రామంలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది.

యాడ్‌తో టైమ్ వేస్ట్ చేశారు

- పీవీఆర్–ఐనాక్స్‌పై యువకుని కేసు
- 65 వేలు చెల్లించాలని కోర్టు ఆదేశం

బెంగళూరు: పీవీఆర్ ఐనాక్స్, బుక్‌మై షోలపై ఓ యువకుడు కోర్టుకెక్కాడు. సుదీర్ఘమైన వాణిజ్య ప్రకటనలతో తన సమయాన్ని వృథా చేశారని, మానసిక క్షోభకు గురి చేశారని ఆరోపిస్తూ కేసు వేశాడు. అతనికి రూ.65 వేల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది! ఈ ఆసక్తికరమైన ఘటన బెంగళూరులో జరిగింది. నగరానికి చెందిన అభిషేక్ 'సామ్ బహదూర్'సినిమా కోసం బుక్‌మై షోలో మూడు టికెట్లు కొన్నాడు. సాయంత్రం 4.05కు మొదలవాల్సిన సినిమా కాస్తా ఏకంగా 30 నిమిషాలు సినిమా ప్రకటనలు, ట్రైలర్ల ప్రసారంతో 4.30కు మొదలైంది. దాంతో సకాలంలో ఆఫీసుకు వెళ్లలేకపోయానని అభిషేక్ ఆరోపించాడు. ''నా విలువైన సమయం వృథా అయింది. ప్రకటనలు ద్వారా ప్రయోజనం పొందడానికి థియేటర్ వారు షో టైమింగ్స్‌ను తప్పుగా పేర్కొన్నారు. ఇది అన్యాయం ''అంటూ వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. సమయాన్ని డబ్బుగా పరిగణిస్తామని వినియోగదారుల కోర్టు స్పష్టం చేసింది. ఫిర్యాదుదారుకు జరిగిన నష్టాన్ని పీవీఆర్ సినిమాస్, ఐనాక్స్ పూడ్చాలని పేర్కొంది. అనైతిక వ్యాపార చర్యలకు పాల్పడ్డందుకు, సమయాన్ని వృథా చేసినందుకు రూ.50 వేలు, మానసిక వేదనకు రూ.5 వేలు, ఫిర్యాదు, ఇతర ఉపశమనాలకు రూ.10 వేలు చెల్లించాలని ఆదేశించింది. పీవీఆర్ సినిమాస్, ఐనాక్స్ సంస్థలకు రూ.లక్ష జరిమానా కూడా విధించింది. బుక్‌మైషో కేవలం టికెట్ బుకింగ్ వేదిక కాబట్టి ఎలాంటి పరిహారమూ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ప్రకటనల స్ట్రీమింగ్ సమయంపై నియంత్రణ లేకపోవడాన్ని కోర్టు తప్పుబట్టింది.

హసీనాను రప్పించడమే ప్రాథమ్యం

బంగ్లా ప్రభుత్వ ప్రకటన

ఢాకా: భారత్‌లో తలదాచుకుంటున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించడమే తమ తొలి ప్రాధాన్యత అని ఆ దేశ ప్రభుత్వం ఉద్ఘాటించింది. హసీనాను విచారించేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తామని దేశ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ ప్రెస్ కార్యదర్శి షఫీకుల్ ఆలం తెలిపారు. ''హసీనా పార్టీ అవామీ లీగ్ భవితవ్యంపై నీడలు కమ్ముకున్నాయి. ఆ పార్టీ దేశ రాజకీయ ముఖచిత్రంలో ఉండాలా, వద్దా అనేది ప్రజలతో పాటు ఇతర పార్టీలు నిర్ణయిస్తాయి. హత్యలు, అదృశ్యాలు, నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడాల్సిందే''అని నొక్కి చెప్పారు. హసీనా ప్రభుత్వం మానవాళిపై నేరాలకు పాల్పడుతోందంటూ ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం ఇచ్చిన నివేదికను ఉదాహరించారు. ఈ నేపథ్యంలో హసీనాను అప్పగించే విషయమై భారత్‌పై ఒత్తిడి పెరిగిందన్నారు.

యూనస్‌కు శిక్ష తప్పదు: హసీనా

మహమ్మద్ యూనస్ బంగ్లాలో అరాచకాలకు పాల్పడుతున్నారని హసీనా ఆరోపించారు. ''నన్ను అధికారానికి దూరం చేసే కుట్రలో భాగంగానే హత్యలకు పాల్పడ్డారు. అందుకు కారణమైన 'దుండగుడు'యూనస్‌ను, ఇతరులను బంగ్లా గడ్డపై శిక్షిస్తా''అని ప్రతినబూనారు. జూలై తిరుగుబాటులో మరణించిన పోలీసుల కుటుంబాలతో ఇటీవల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె వర్చువల్‌గా పాల్గొన్నారు. మృతుల భార్యలతో ముఖాముఖి మాట్లాడారు. యూనస్ వచ్చాక గతంలో ఎన్నడూ లేనంతగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. 2024 తిరుగుబాటు నేపథ్యంలో తన ప్రభుత్వం కుప్పకూలడంతో హసీనా భారత్‌కు పారిపోయి వచ్చి ఆశ్రయం పొందుతుండటం తెలిసిందే. ''విచారణ కమిటీలన్నింటినీ యూనస్ రద్దు చేశారు. ప్రజలను చంపడానికి ఉగ్రవాదులను మధ్యంతర ప్రభుత్వం విడుదల చేసింది. వారు బంగ్లాను నాశనం చేస్తున్నారు. హత్యాయత్నం నుంచి నేను త్రుటిలో తప్పించుకున్నా. ఏదో మంచి చేయడానికే దేవుడు నన్ను బతికించాడని భావిస్తున్నా. నేను బంగ్లా తిరిగొచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తా''ఆమె ప్రకటించారు.



బుధవారం కోల్‌కతాలో స్వామీ వివేకానంద విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు, అభిమానులు. షికాగోలో చరిత్రాత్మక ప్రసంగం అనంతరం ఆయన తొలిసారి నగరానికి తిరిగొచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఇలా అభిమానం చాటుకున్నారు.

24న పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ము

న్యూఢిల్లీ: పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి కింద 19వ విడత సొమ్ము ఈ నెల 24వ తేదీన రైతుల ఖాతాల్లో జమ కానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ఈ పథకం నిధులను విడుదల చేయనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో సంవత్సరానికి రూ.6 వేల చొప్పున జమ చేస్తున్న సంగతి తెలిసిందే. సంవత్సరానికి మూడుసార్లు రూ.2 వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం నేరుగా బదిలీ చేస్తోంది. 19వ విడతలో దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుందని అధికారులు పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్

నలుగురు నక్సలైట్ల మృతి

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో పోలీసులు, నక్సలైట్లకు మధ్య జరిగిన పరస్పర ఎదురుకాల్పుల్లో నలుగురు నక్సలైట్లు మరణించారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని అదనపు పోలీస్ సూపరింటెండెంట్ విజయ్ దాబర్ గురువారం ప్రకటించారు. మహారాష్ట్రలోని గోండియా జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్, ఖైరాగఢ్ జిల్లాలతో సరిహద్దు పంచుకుంటున్న మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా అటవీప్రాంతంలో గురువారం ఉదయం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. గర్హీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుప్ఖార్ ఫారెస్ట్ రేంజ్‌లోని రోండా అటవీ శిబిరం సమీపంలో ఈ ఘటన జరిగిందని విజయ్ వివరించారు. ఎదురుకాల్పులు జరిగిన ప్రదేశంలో ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, .303 రైఫిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన తర్వాత అడవిలోకి పారిపోయిన నక్సలైట్ల జాడ కనిపెట్టేందుకు పోలీసు బృందాలను పంపించామని అధికారి వెల్లడించారు.

నేటి నుంచి బరేలీలో రాహుల్ పర్యటన

రాయ్‌బరేలీ: ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గంలో స్థానిక ఎంపి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం నుంచి రెండు రోజులపాటు పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపాయి. రాహుల్ తొలుత లక్నో ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా రాయ్‌బరేలీకి చేరుకుంటారు. బ్రాహ్మవస్, జగత్‌పూర్, భీరా గోవింద్‌పూర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తారు. మోడ్రన్ రైలు కోచ్ ఫ్యాక్టరీని సందర్శిస్తారు. యువజనుల భేటీలో పాల్గొంటారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.

కిషిదపై దాడి ఘటన దోషికి పదేళ్ల జైలు

టోక్యో: జపాన్ మాజీ ప్రధానమంత్రి ఫుమియో కిషిద పైకి బాంబు విసిరిన ఘటనలో దోషిగా తేలిన పాతికేళ్ల రియుజి కిమురాకు పదేళ్ల జైలు శిక్ష పడింది. ఈ వివరాలను బుధవారం వకయామా జిల్లా కోర్టు అధికారులు వెల్లడించారు. 2023 ఏప్రిల్ 15న ఎన్నికల ప్రచారంలో భాగంగా వకయామా సిటీలోని చేపల పట్టే చిన్న ఫిషింగ్‌పోర్ట్‌కు కిషిద వచ్చారు. ప్రసంగించడానికి ఆయన సిద్ధమవుతున్న వేళ దేశవాళీ పైప్ బాంబ్‌ను కిమురా విసిరాడు. అదృష్టవశాత్తు ఆ పేలుడు ఘటన నుంచి కిషిద త్రుటిలో తప్పించుకున్నారు. బాంబు విసిరి పారిపోతున్న కిమురాను పోలీసులు వెంటనే బంధించారు. అధికారులు హత్యాయత్నం, బాంబు దాడి, పేలుడు పదార్థాల అక్రమ వినియోగం, ఆయుధాల చట్టాల కింద ఇతనిపై కేసు నమోదుచేసి తాజాగా దోషిగా తేల్చారు.

'ముడా' కేసులో సిద్ధరామయ్యకు క్లీన్‌చిట్

- నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లభించలేదు
- కర్ణాటక లోకాయుక్త స్పష్టీకరణ

బెంగళూరు: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూముల కుంభకోణం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతోపాటు ఆయన భార్య పార్వతి, ఇతర నిందితులకు లోకాయుక్త క్లీన్‌చిట్ ఇచ్చింది. నిందితులకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లభించలేదని లోకాయుక్త అధికారులు బుధవారం స్పష్టంచేశారు. సాక్ష్యాధారాలు లేకపోవడం వల్ల వారిపై ఆరోపణలు రుజువు కాలేదని అన్నారు. కర్ణాటక హైకోర్టులో తుది నివేదిక సమర్పించామని వెల్లడించారు. ముడా భూముల కుంభకోణంపై ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు అధికారులు ఈ మేరకు ఒక లేఖ రాశారు. ఈ కేసులో సిద్ధరామయ్య, పార్వతి దంపతులతోపాటు సిద్ధరామయ్య బావమరిది మల్లికార్జున స్వామి, భూయజమాని దేవరాజు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కర్ణాటకలోని మైసూర్ సిటీలో పార్వతికి సంబంధించిన భూమిని 'ముడా'గతంలో సేకరించింది. పరిహారం కింద అత్యంత విలువైన ప్లాట్లను ఆమెకు అక్రమంగా కట్టబెట్టినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు కొనసాగిస్తోంది.

చాక్లెట్లు దొంగలించిందని చంపేశారు !

- యజమాని దంపతుల దెబ్బలకు తాళలేక చనిపోయిన బాలిక
- పాకిస్తాన్‌లో దారుణం

రావల్పిండి: పాకిస్తాన్‌లో పేదరికం కారణంగా చిన్నతనంలోనే బాలకార్మికులుగా ఇంటిపని చేసే చిన్నారుల్లో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. ఇంట్లో చాక్లెట్లు దొంగతనం చేసిందని ఆరోపిస్తూ 13 ఏళ్ల బాలికను ఆ ఇంటి యాజమానులు చితకబాదడంతో గాయాలపాలై ఆ అమ్మాయి చనిపోయిన ఘటన ఆగ్నేయ పాకిస్తాన్‌లో గత బుధవారం సాయంత్రం జరిగింది. రావల్పిండిలో నమోదైన ఈ కేసులో యజమాని రషీద్ షఫీఖ్, ఆయన భార్య సనా, వాళ్ల ఖురాన్ బోధకుడినీ పోలీసులు అరెస్ట్‌చేశారు. బాలిక కాళ్లు, చేతులు, చీలమండ పలు చోట్ల విరిగినట్లు పోస్ట్‌మార్టమ్ ప్రాథమిక నివేదికలో తేలింది. సమగ్ర నివేదిక ఇంకా రావాల్సి ఉంది. బాలిక ఇఖ్రా పనిచేస్తున్న యజమాని దంపతులకు 8 మంది సంతానం. వాళ్ల బాగోగులు, ఇంటి పనులు చూసుకునేందుకు రెండేళ్ల క్రితం వాళ్లింట్లో ఇఖ్రా పనికి కుదిరింది. జీతంగా నెలకు దాదాపు రూ.2,430 ఇచ్చేవారు. చాక్లెట్లు దొంగతనం చేసిందని ఆరోపిస్తూ ఇఖ్రాను దారుణంగా హింసించారని పోలీసులు అనుమానిస్తున్నారు. తలకు తీవ్రగాయమైనట్లు సంబంధిత వీడియోల్లో తెలుస్తోంది. అన్నపానీయాలు ఇవ్వకుండా కడుపు మాడ్చారని, కట్టేసి కొట్టారని, చపాతీలు చేసే కర్రతో కొట్టడంతో పుర్రె పగిలిందని వార్తలొచ్చాయి. బాలిక మరణవార్త తెల్సి దేశవ్యాప్తంగా వేలాది మంది బాలల హక్కుల కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇఖ్రాకు న్యాయం జరగాలని డిమాండ్‌చేశారు. తన బిడ్డ మరణాన్ని 45 ఏళ్ల రైతు సనా ఉల్లాహ్ ఏడుస్తూ చెప్పారు. ''నా కుమార్తె ఆరోగ్యం బాలేదని పోలీసులు ఫోన్‌చేసి ఆస్పత్రికి రమ్మన్నారు. వచ్చి చూస్తే ఆస్పత్రి బెడ్‌పై ఇఖ్రా చలనంలేకుండా పడి ఉంది. కొద్దిసేపటికి ప్రాణాలు కోల్పోయింది. నాకున్న అప్పు తీర్చుకునేందుకు గతిలేక ఇఖ్రాను పనికి పంపించాను''అంటూ తండ్రి దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చారు. తండ్రి అప్పులు తీర్చేందుకు, ఇంట్లో ఖర్చులకు పనికొస్తాయనే ఉద్దేశ్యంతో ఇఖ్రా ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పటి నుంచే పనులకు వెళ్లడం మొదలెట్టింది. పేదరికంలో మగ్గిపోతున్న బాలకార్మికుల కుటుంబాలు ఇలాంటి సందర్భాల్లో న్యాయం కోసం తుదికంటా పోరాటం చేయడం పాకిస్తాన్‌లో చాలా అరుదు. నిందితులను దేవుడే క్షమిస్తాడని మనసును రాయి చేసుకుని ఆ దోషులు నష్టపరిహారంగా ఇచ్చే ఏంతో కొంత మొత్తాలను తీసుకుని కోర్టుల బయటే రాజీ కుదుర్చుకోవడం పాకిస్తాన్‌లో పరిపాటిగా మారింది. ఇఖ్రా కేసు సైతం చివరకు ఇలాంటి 'పరిష్కారం'దిశలో పయనిస్తుందని పలువురు సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యూనిసెఫ్ గణాంకాల ప్రకారం పాకిస్తాన్‌లో 33,00,000 మంది బాలకార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్‌లో ఇంటి పనుల్లో నిమగ్నమైన మొత్తం 85 లక్షల మంది కార్మికుల్లో అత్యధిక శాతం మంది మహిళలు, బాలికలేనని అంతర్జాతీయ కార్మిక సంఘం(ఐఎల్‌ఓ) పేర్కొంది.

పాకిస్తాన్‌లో ముష్కరుల అకృత్యం

ఏడుగురు ప్రయాణికుల కాల్చివేత

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో దారుణం జరిగింది. గుర్తు తెలియని ముష్కరులు ఏడుగురు ప్రయాణికులను పొట్టనపెట్టుకున్నారు. బస్సు నుంచి ఏడుగురు ప్రయాణికులను కిందికి దించి తుపాకులతో కాల్చిచంపారు. బలూచిస్తాన్ ప్రావిన్స్ రాజధాని క్వెట్టా నుంచి పంజాబ్ ప్రావిన్స్‌కు బస్సు వెళ్తుండగా బుధవారం ఈ ఘోరం చోటుచేసుకుంది. బస్సు బర్ఖాన్ ప్రాంతానికి రాగానే జాతీయ రహదారిపై సాయుధ ముష్కరులు బారికేడ్లు అడ్డంగా పెట్టి నిలిపివేశారు. బస్సులోకి ప్రవేశించి, ప్రయాణికుల గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. ఏడుగురిని బలవంతంగా కిందికి దించారు. సమీపంలోని పర్వతంపైకి తీసుకెళ్లి తుపాకులతో కాల్చారు. దాంతో ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. మృతదేహాలను రాఖ్నీ ఆసుపత్రికి తరలించారు. ముష్కరుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అకృత్యానికి పాల్పడింది ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. దాదాపు 12 మంది సాయుధాలు బస్సులోకి వచ్చారని, వారివద్ద ఆధునిక ఆయుధాలున్నాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. స్థానిక బలూచ్ ఉగ్రవాద గ్రూప్‌లు ఇటీవల ఒక్కసారిగా చురుగ్గా మారిపోయాయి. ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. తాజా దాడి సైతం ఆయా గ్రూప్‌ల పనే అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అమాయలకు బలి తీసుకున్న రాక్షసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని బలూచిస్తాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ తేల్చిచెప్పారు. బర్ఖాన్‌లో జరిగిన హత్యాకాండను పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఖండించారు.

పబ్లిక్ స్థలాల్లో మహిళలు, శిశువులకు వసతులు కల్పించాలి



రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: పబ్లిక్ స్థలాల్లో నిర్మించిన భవనాలు, నిర్మించబోయే భవనాల్లో శిశువుల సంరక్షణకు, వారికి తల్లులు స్తన్యం ఇచ్చేందుకు ప్రత్యేక వసతులు కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలని సూచించింది. ప్రత్యేక గదుల్లాంటివి నిర్మిస్తే తల్లుల గోప్యతకు భంగం వాటిల్లకుండా ఉంటుందని, పిల్లలకు సైతం మేలు జరుగుతుందని వెల్లడించింది. పబ్లిక్ స్థలాల్లో ఫీడింగ్ రూమ్‌లు, చైల్డ్‌కేర్ గదులు నిర్మించేలా ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ప్రసన్న బి.వరాలీతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. తల్లులు, బిడ్డల కోసం భవనాల్లో తగినంత స్థలం కేటాయించి, వసతులు కల్పించాలని పేర్కొంది. సుప్రీంకోర్టు విచారణకు కేంద్ర ప్రభుత్వం తరపు హాజరైన న్యాయవాది స్పందిస్తూ... పబ్లిక్ స్థలాల్లో తల్లులు, శిశువులకు వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సూచిస్తూ 2024 ఫిబ్రవరి 27న కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ ఆదేశాలపై ధర్మాసనం సంతృప్తి వ్యక్తంచేసింది. ఆదేశాలను రాష్ట్రాలకు మరోసారి గుర్తుచేయాలని పేర్కొంది.


రహస్యాల లీకేజీ కేసులో మరో ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ: దేశ రక్షణ రహస్యాలను లీక్ చేసి, పాకిస్తాన్ నిఘా సంస్థలకు చేరవేసిన కేసులో మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) వెల్లడించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కార్వార్ నావల్ బేస్, కొచ్చీ నావల్ బేస్‌లో భారత రక్షణశాఖకు సంబంధించిన కీలక సమాచారాన్ని వీరు తస్కరించారని పేర్కొంది. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లాలో లక్ష్మణ్ తండేల్, అక్షయ్ రవి నాయక్, కేరళలోని కొచీలో అభిలాష్ పి.ఎ.ను అదుపులోకి తీసుకున్నట్లు ఎన్‌ఐఏ అధికారులు పేర్కొన్నారు. ఈ ముగ్గురూ పాకిస్తాన్ నిఘా అధికారులతో సోషల్ మీడియా ద్వారా సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇండియా రక్షణ శాఖకు సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తూ పాకిస్తాన్ నిఘా సంస్థల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు గుర్తించామని స్పష్టంచేశారు. ఈ కేసులో ఇప్పటిదాకా మొత్తం 8 మందిని అరెస్టు చేశామన్నారు.

సాక్షి ప్లస్ గురువారం : 20-2-2025

రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం చట్టం చేయొచ్చా?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదాన్ని ప్రయోగించపోయినా.. భారతదేశం సమాఖ్య రాజ్యమే. ఎందుకంటే సమాఖ్య మౌలిక లక్షణాలన్నీ భారత సమాఖ్యలో ఉన్నాయి. సమాఖ్యలో అత్యంత ముఖ్య లక్షణం అధికార విభజన. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య చాలా విస్తృతమైన, స్పష్టమైన అధికార విభజన జరిగింది.

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య మూడు రకాల సంబంధాలను పొందుపర్చారు.

1. శాసన సంబంధాలు (Legislative Relations)-11వ భాగం,ప్రకరణ 245 నుంచి 255
2. పరిపాలనా సంబంధాలు (Administrative Relations)-11వ భాగం, ప్రకరణ 256 నుంచి 263
3. ఆర్థిక సంబంధాలు (Financial Relations) -12 భాగం, ప్రకరణ 264 నుంచి 300

కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు

భాగం 11లోని ప్రకరణలు 245 నుంచి 255 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న శాసన సంబంధాలను పొందుపరిచారు. శాసన సంబంధాలు అంటే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు ఏయే అంశాలపై చట్టాలు చేయవచ్చో వివరించే ప్రక్రియ.

ప్రకరణ-245: కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల చట్టాల భౌగోళిక పరిమితులు:

- పార్లమెంట్ రూపొందించే చట్టాలు దేశంలో అన్ని ప్రాంతాలకు,అన్ని సంస్థలకు వర్తిస్తాయి. ఇవి ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా వర్తిస్తాయి(ప్రకరణ 245(2)). ఈ అధికారాన్నే 'Extra Territorial Legislation' లేదా 'సీమాంతేతర చట్టాలు' అంటారు.
- రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు ఆ రాష్ట్ర భూభాగాలకు మాత్రమే వర్తిస్తాయి. వీటికి సీమాంతేతర చట్టాల పరిధి లేదు.

పార్లమెంట్ చట్టాలపై పరిమితులు:

- పార్లమెంట్ చేసిన చట్టాలు కొన్ని ప్రాంతాలకు.. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలీ, డామన్-డయ్యూ ప్రాంతాలకు వర్తించవు. వీటి పరిపాలనను రాష్ట్రపతే నేరుగా నియంత్రిస్తారు. పరిపాలన ఆదేశాలను రాష్ట్రపతి జారీ చేస్తారు. ఇవి పార్లమెంట్ చట్టాలతో సమాన ప్రతిపత్తిని కలిగి ఉంటాయి.
- రాష్ట్రాల్లోని కొన్ని షెడ్యూల్ట్ ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు వర్తించవు. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తారు. అసోం గవర్నర్‌కు ఆ రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లా మండలి (Autonomous District Council)కి సంబంధించి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.
- మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లాలపై రాష్ట్రపతికి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ- 246: కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన: కేంద్ర,రాష్ట్రాల మధ్య అధికారాలను మూడు జాబితాల్లో విభజించారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడో షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

జాబితాలు

కేంద్ర జాబితా (Union List) ప్రకరణ 246 (1): రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్రారంభంలో ఈ జాబితాలో 97 అంశాలున్నాయి. తర్వాత ఈ జాబితాకు 2ఎ, 92ఎ, 92బి, 92సి అంశాలను చేర్చారు. 33లో ఉన్న అంశాలను తొలగించారు. ప్రస్తుతం ఇందులో వంద అంశాలున్నాయి.

జాబితాలోని ముఖ్యాంశాలు: దేశ రక్షణ, అంతర్జాతీయ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, అణుశక్తి, బీమా, ప్రసారాలు, వైమానిక, నౌకా సర్వీసులు మొదలైన జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలను కేంద్ర జాబితాలో పొందుపరిచారు.

కేంద్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలను రూపొందించవచ్చు, సవరించవచ్చు, రద్దు చేయవచ్చు.

రాష్ట్ర జాబితా (State List) ప్రకరణ 246(3): రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ఇందులో 66 అంశాలున్నాయి. ప్రస్తుతం 61 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలోని ఎంట్రీ 11, 19, 20, 29, 36లోని అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

జాబితాలోని ముఖ్యాంశాలు: శాంతి భద్రతలు, పోలీస్, వ్యవసాయం, నీటిపారుదల, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం, పారిశుధ్యం, జైళ్లు, గ్రంథాలయాలు, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం తదితర స్థానిక ప్రాముఖ్యం ఉన్న అంశాలను ఈ జాబితాలో పొందుపరిచారు.

ఉమ్మడి జాబితా (Concurrent List) ప్రకరణ 246(2): ప్రారంభంలో ఈ జాబితాలో 47 అంశాలు ఉండేవి. ప్రస్తుతం 52 ఉన్నాయి. ఈ జాబితాలో ఎంట్రీ నంబర్ 11ఎ న్యాయపాలన, సబార్డినేట్ కోర్టుల వ్యవస్థీకరణ, 17ఎ అడవులు, 17బి వన్యప్రాణుల సంరక్షణ, 20ఎ జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, 25 సాధారణ విద్య, సాంకేతిక విద్య, 33ఎ తూనికలు, కొలతలు.

పై అన్ని అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అందువల్ల ఉమ్మడి జాబితాలోని అంశాలు 47 నుంచి 52కు పెరిగాయి.

కేంద్ర, రాష్ట్ర శాసనాల మధ్య వైరుధ్యం

ఉమ్మడి జాబితాలోని అంశాలపైన పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్ర శాసనానికి, రాష్ట్ర శాసనానికి మధ్య వైరుధ్యం ఏర్పడితే.. అంతిమంగా కేంద్ర శాసనానికే ఆధిక్యత ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రపతి పూర్వానుమతితో రాష్ట్ర శాసనసభ చట్టం చేసి, ఇదే అంశంపై పార్లమెంట్ కూడా చట్టం చేస్తే.. పార్లమెంట్ చేసిన చట్టం రాష్ట్ర శాసనసభ చేసిన చట్టానికి విరుద్ధమైతే, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటవుతుంది.

కేంద్ర, రాష్ట్ర చట్టాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన సూత్రాలు (Doctrines)

కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజనకు సంబంధించి వివాదాలు తలెత్తితే.. వాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు కొన్ని న్యాయ సూత్రాలను అవలంబిస్తుంది. ప్రతి సూత్రానికి అంతర్గతంగా ఒక పరమార్థం ఉంటుంది. వాటిని కింది విధంగా వివరించవచ్చు.

డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్: సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరిగిన సందర్భాల్లో ఒక నిర్ణీత అంశం లేదా చట్టాన్ని ఒక జాబితాలో పొందుపరుస్తారు. ఆ జాబితాలో పొందుపరిచిన అంశం, మరో జాబితాలో పొందుపరిచిన అంశాన్ని సందర్భానుసారం కొంత వరకు అతిక్రమించినా, ఆ చట్టాలను రద్దు చేయరు. అలాంటి సందర్భాల్లో ఆ అంశంలోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. దీన్నే 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' అంటారు. ఉదాహరణకు, మనీ లెండింగ్ (రుణం ఇవ్వడం) అనే అంశం రాష్ట్ర జాబితాలో ఉంది. దీనికి సాక్ష్యంగా ఆధారంగా రాసే ప్రామిసరీ నోటు అనే అంశం కేంద్ర జాబితాలో ఉంది. మనీ లెండింగ్‌ను నియంత్రిస్తూ రాష్ట్రం చేసిన చట్టం సందర్భానుసారం కేంద్ర జాబితాలోని ప్రామిసరీ నోటు అనే అంశంలోకి చొరబడ్డా.. రాష్ట్రం తన శాసనసభ పరిధిని అతిక్రమించిందనే నెపంతో న్యాయస్థానం ఆ చట్టాలను కొట్టివేయదు. ఎందుకంటే ఆ చట్టంలోని ప్రధాన సారాంశం రాష్ట్ర జాబితాలోనే ఉంది. అనుకోకుండా ఆ చట్ట పరిధి కేంద్ర జాబితాలోకి విస్తరించినా.. ప్రధాన ఉద్దేశం రాష్ట్ర జాబితాలోని అంశాన్ని నియంత్రించడమే అవుతుంది. కేంద్ర, రాష్ట్రాలు తమ పరిధులను అతిక్రమించాయనే సమస్య ఉత్పన్నమైనప్పుడు న్యాయస్థానం 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' సూత్రం ప్రకారం తీర్పులు చెబుతుంది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సదరన్ ఫార్మాస్యూటికల్ వర్సెస్ కేరళ ప్రభుత్వం(1981), స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ చావ్లా కేసుల్లో స్పష్టీకరించింది.

డాక్ట్రిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్: కేంద్ర రాష్ట్రాల అధికారాల విభజన ఉద్దేశం రెండింటి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా చూడటం. అయితే శాసన శాఖ తన పరిధిలో లేని అంశాలను ఉన్నట్లుగా ఊహించుకుని దురుద్దేశపూర్వకంగా చట్టాలు చేస్తే, అలాంటి చట్టాలను కలరబుల్ లెజిస్లేషన్ అంటారు. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం.. ప్రత్యక్షంగా చేయలేని పనిని పరోక్షంగానూ చేయకూడదు (You can not do indirectly what you can not do directly i.e. no person who has no title can not transfer it to others)ఉదాహరణకు 'రైల్వేలు' కేంద్ర జాబితాలో ఉంది. ఆ అంశాలపై రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేస్తే, ఆ చట్టాలు కలరబుల్ లెజిస్లేషన్ అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ: రిపగ్నెన్సీ అంటే ఇష్టం లేకపోవడం లేదా అసంబద్ధం అని అర్థం. ఒక చట్టం ఒక పనికి అనుమతించి, మరో చట్టం ఆ పనికి అనుమతిని నిరాకరిస్తే దాన్ని అసంబద్ధం లేదా డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ అంటారు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు చేయవచ్చు. రెండింటి మధ్య వివాదం ఏర్పడితే అంతిమంగా కేంద్ర చట్టమే చెల్లుబాటవుతుంది. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు రెండూ పరస్పర విరుద్ధమైతే, డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ ప్రకారం ఆ చట్టాల చెల్లుబాటును నిర్ణయిస్తారు.

ఉదాహరణకు హత్య నేరానికి ఐ.పి.సి. 302 ప్రకారం శిక్ష పడుతుంది. బాల నేరస్థులకు సంబంధించి ఒకవేళ ఆ రాష్ట్రం ప్రత్యేక చట్టం చేసి ఉంటే, ఆ రాష్ట్ర చట్టం ప్రకారం వారిని విచారించి శిక్షించాల్సి ఉంటుంది. అలాంటి చట్టాలకు సి.ఆర్.పి.సి. లో మినహాయింపు ఉంటే రాష్ట్ర చట్టాలే చెల్లుబాటు అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్: రెసిడ్యూరీ అంటే మిగిలిపోయిన భాగం అని అర్థం. మూడు జాబితాల్లో ప్రస్తావించని అంశాలను అవశిష్ట అధికారాల పేరుతో కేంద్రానికి ఇచ్చారు. కాబట్టి అవశిష్ట అధికారాలపై చట్టం చేసే అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేయడమే.

ఉదాహరణకు పార్లమెంట్ అవశిష్ట అంశాలకు సంబంధించి పార్లమెంట్ సంపద పన్ను చట్టం-1957; బహుమతి పన్ను చట్టం-1957; కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 మొదలైన చట్టాలను రూపొందించింది. ఇవి డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్‌లోకి వస్తాయి.

డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆస్తులపై పరస్పరం పన్నులు విధించుకోడానికి మినహాయింపు ఉంది. దీన్ని డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్ అంటారు. ప్రకరణలు 285, 287, 288, 289లో వీటిని ప్రస్తావించారు.

ప్రకరణ 247 ప్రకారం.. కేంద్ర జాబితాలో పొందుపరచిన అంశాలకు సంబంధించి అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేసే అధికారం పార్లమెంట్ కలిగి ఉంటుంది.

అవశిష్ట జాబితా (Residual List) ప్రకరణ 248(1): అవశిష్ట జాబితాలోని అంశాలపై పార్లమెంట్ మాత్రమే చట్టం చేస్తుంది. అవశిష్ట జాబితా అంటే కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో ప్రస్తావించని అంశాలు.

ప్రకరణ 248 (2) ప్రకారం.. రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అంశాలకు పన్ను విధించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.

అమెరికా, ఆస్ట్రేలియాలో అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు ఇచ్చారు. కెనడాలో అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఇచ్చారు. భారత ప్రభుత్వ చట్టం -1935 ప్రకారం అవశిష్ట అధికారాలను ఆనాటి గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

ప్రకరణ 249 (1) ప్రకారం.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో ఒక తీర్మానం చేస్తే.. ఆ తీర్మానాన్ని లోక్‌సభ కూడా ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది. ఆ విధంగా రాష్ట్ర జాబితాలో అంశాలపై పార్లమెంట్ చేసిన చట్టాలు ఒక సంవత్సరం వరకే అమల్లో ఉంటాయి (ప్రకరణ 249(2)). అవసరమైతే తీర్మానం ద్వారా మరో ఏడాది వరకు పొడిగించవచ్చు. గడువు ముగిసిన తర్వాత, ఆరు నెలల వరకు మాత్రమే అలాంటి చట్టాలు అమల్లో ఉంటాయి. తాత్కాలికంగా కేంద్ర జాబితాలోకి బదలాయించిన అంశం తిరిగి రాష్ట్ర జాబితాలోకి చేరుతుంది.

ప్రకరణ 250 (1) ప్రకారం.. దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ప్రకరణ 352) అమల్లో ఉన్నప్పుడు, పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలను రూపొందిస్తుంది. అలాంటి శాసనం అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంత కాలం చెల్లుబాటవుతుంది.

ప్రకరణ 250 (2) ప్రకారం.. అత్యవసర పరిస్థితి ఎత్తేసిన ఆరు నెలల తర్వాత ఆ చట్టాలు రద్దవుతాయి.

ప్రకరణ 251 ప్రకారం.. ప్రకరణలు 249, 250 అనుసరించి పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలకు, అంతకుముందే రాష్ట్రాలు వాటి జాబితాలో చేసుకున్న చట్టాలకు వైరుధ్యం ఏర్పడితే.. పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ప్రకరణ 252 (1) ప్రకారం.. రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనార్థం రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయమని కోరితే.. అలా కోరిన రాష్ట్రాలకు వర్తింపజేస్తూ రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది.

ఉదాహరణకు ఎస్టేట్ సుంకం చట్టం-1955; ప్రైజ్ కాంపిటీషన్ చట్టం-1955; వన్యప్రాణి సంరక్షణచట్టం-1972; జలకాలుష్య నివారణ చట్టం-1974; పట్టణ, ఆస్తుల పరిమితి చట్టం-1976; మానవ అవయవాల మార్పిడి చట్టం-1994 మొదలైన చట్టాలను పార్లమెంట్ రూపొందించి రాష్ట్రాలకు వర్తింపజేసింది.

ప్రకరణ 252(2) ప్రకారం.. పైన పేర్కొన్న విధంగా రూపొందించిన శాసనాన్ని సవరించే లేదా రద్దు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది.

ప్రకారణ 253 ప్రకారం.. అంతర్జాతీయ ఒప్పందాల అమలు కోసం అవసరమైన శాసనాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఈ ఒప్పందాల అమలుకు రాష్ట్రాల చట్టాలు అవరోధాలుగా ఉంటే వాటిని పార్లమెంట్ సవరించవచ్చు.

ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అవసరాల రక్షణ చట్టం-1947; జెనీవా ఒప్పందం చట్టం-1960; హైజాకింగ్ వ్యతిరేక చట్టం-1982 లాంటి చట్టాలను పార్లమెంట్ రూపొందించింది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని వైరుధ్యాలను తొలగించడం, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి రాష్ట్ర విధానసభలు రూపొందించిన శాసనం విరుద్ధంగా ఉంటే, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి ఆధిక్యత ఉంటుంది.

ప్రకరణ 255 ప్రకారం.. కొన్ని చట్టాలను రూపొందించే సమయంలో రాష్ట్రపతి, గవర్నర్‌ల పూర్వానుమతి అవసరం. ఒకవేళ అలాంటి చట్టాలను వీరి పూర్వానుమతి లేకుండా రూపొందిస్తే అవి చెల్లవు అని చెప్పే అధికారం రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఉండదు. వారి అనుమతి తీసుకోవడమనేది కేవలం ప్రక్రియకు సంబంధించిందే కానీ, వారి అధికారాలకు చెందింది కాదు.

ఇతర భాగాల్లోని ప్రకరణలు (18వ భాగం)

ప్రకరణ 352 ప్రకారం.. జాతీయ అత్యవసర పరిస్థితి సమయంలోనూ కేంద్రం రాష్ట్ర జాబితాలో చట్టాలు చేయవచ్చు.

ప్రకరణ 356 ప్రకారం.. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ రాష్ట్ర శాసనసభ తరఫున చట్టాలను రూపొందించవచ్చు.

కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?


టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా, బోట్స్‌వానా, కాంగో, కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు,ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్థరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:

- మధ్యప్రదేశ్ - కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ - అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ - కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. **అవి:**

1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబీ మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోపైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయొటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:

- బిహార్ - గయ.
- జార్ఖండ్ - కోడెర్మా, హజారీబాగ్, సింగ్భుమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ - నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ - ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:

- ఆంధ్రప్రదేశ్ - కడప.
- తెలంగాణ - ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు, పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్(కర్నూలు, గుంటూరు), తెలంగాణ (నల్గొండ,ఖమ్మం),బిహార్,ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్థరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్,ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్(జువార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.

ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం,సహజవాయువు)ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్థరాల్లో లభ్యమవుతోంది. **అవి:**

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్థరాల్లోని దామోదర్ లోయ (జార్ఖండ్-దామోదర్), సోన్ (మధ్య ప్రదేశ్), మహానది (ఒడిశా), గోదావరి (తెలంగాణ), వార్ధా (మహారాష్ట్ర)లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము-కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..

1. **అంత్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90-95 శాతం కార్బన్ ఉం టుంది. జమ్ము-కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిట్యూమినస్:**ఇందులో 85-90శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30-40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటి దశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు

జార్ఖండ్ - జారియా, బొకారో, డాల్టన్‌గాజ్.
పశ్చిమ బెంగాల్ - రాణీగంజ్, గిరిధి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్ - కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌డో- అరండ్, తాతాపాని- రామ్‌కోలా.
మధ్యప్రదేశ్ -సింగ్రౌలి,సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర - చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ - సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:

తమిళనాడు - నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం - మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ - బికనీర్.
ఉత్తర ప్రదేశ్ - నామ్‌చిక్, నాంరూఫ్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:

యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రెయిన్: డొనెట్స్క్ ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క్ బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా, జపాన్, ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకలిన్' క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై-హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, థోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హుగ్రీజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర: మూమ్‌బాగ,బారాముర,దేవ్‌టమూరు.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది – HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:

1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కానియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ(నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కానియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
   సి. లియోనైట్ డి. సెడరైట్
   1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?
   1) పెరైట్ 2) బాక్సైట్
   3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?
   1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?
   1) అమెరికా 2) ఉక్రెయిన్
   3) చైనా 4) రష్యా
5. కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?
   1) కజకిస్థాన్ 2) జర్మనీ
   3) ఉక్రెయిన్ 4) జాంబియా
6. సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) తెలంగాణా 4) ఒడిశా
7. మార్గేరీటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?
   1) మేఘాలయ 2) అసోం
   3) మణిపూర్ 4) త్రిపుర
8. ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?
   1) కాపర్ 2) క్రోమైట్
   3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1)1; 2) 2; 3) 3; 4) 4; 5) 1; 6)3; 7) 2; 8) 2

‘నీలి విప్లవం’ అనేది వేటి ఉత్పత్తికి సంబంధించింది?



గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాసక్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారెవరు?
   1) సర్‌హాన్స్ క్రెబ్స్ 2) బెన్సన్
   3) మెల్విన్ కాల్విన్ 4) ష్వాన్
2. అయోడిన్ చర్య దేన్ని కనుగొనడానికి ఉపయోగపడుతుంది?
   1) కాంతి 2) గ్లూకోజ్
   3) పిండి పదార్థం 4) కార్బన్ డై ఆక్సైడ్
3. తేనెటీగలు తేనె పట్టును దేని కోసం నిర్మించుకుంటాయి?
   1) మకరంద సేకరణ
   2) జాతి (సంతానం) ఉత్పత్తి కోసం
   3) రక్షణ 4) పైవన్నీ
4. వర్గం అనే వర్గీకరణ అంతస్తును ప్రవేశ పెట్టిన వారెవరు?
   1) లిన్నెయస్ 2) హెకెల్
   3) హైమన్ 4) విట్టేకర్
5. స్పంజికల్లో కణాంతర జీర్ణక్రియ ఏ కణాల్లో జరుగుతుంది?
   1) ఆర్కియోసైట్స్ 2) కాలర్ కణాలు
   3) పినాకోసైట్స్ 4) అమీబోసైట్స్
6. కిందివాటిలో సమవిభజన ఉపయోగంకానిది?
   1) క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి తోడ్పడుతుంది
   2) జీవుల్లో పెరుగుదల కోసం దోహదపడుతుంది
   3) గాయాలు మానడానికి తోడ్పడుతుంది
   4) పాత కణాల నుంచి కొత్త కణాలు ఏర్పడటానికి దోహదపడుతుంది
7. సామాన్య సూక్ష్మ దర్శినిని కనుగొన్న వారెవరు?
   1) జకేరియస్ జాన్సన్ 2) రస్కా
   3) నాల్ 4) లీవెన్ హాక్
8. కిందివాటిలో క్లోరోప్లాస్టులు లోపించిన కణాలేవి?
   1) జంతుకణాలు 2) శైవలాలు
   3) శిలీంధ్రాలు 4) 1, 3
9. కిందివాటిలో సౌరశక్తిని వినియోగించుకో గలిగినవి ఏవి?
   1) ఉత్పత్తిదారులు
   2) వినియోగదారులు
   3) విచ్ఛిన్నకారులు
   4) ద్వితీయ వినియోగదారులు
10. జీవి మనుగడకు అవసరం కాని క్రియ ఏది?
   1) శ్వాసక్రియ 2) ప్రత్యుత్పత్తి
   3) ప్రసరణ 4) విసర్జన
11. టోనోప్లాస్ట్ కలిగిన కణాంగం ఏది?
   1) మైటోకాండ్రియా 2) గాల్జి సంక్లిష్టం
   3) రిక్తిక 4) కణత్వచం
12. వ్యాధులు సంక్రమించినప్పుడు తయారయ్యే ప్రతిరక్షకాలు అనేవి..?
   1) ప్రోటీన్ నిర్మాణాలు
   2) ప్రోటీనేతర నిర్మాణాలు
   3) కార్బోహైడ్రేట్ నిర్మితాలు
   4) సెల్యులోజ్ నిర్మితాలు
13. పెద్ద వృక్షాల్లో నీటి ప్రసరణ జరగడానికి తోడ్పడే ప్రక్రియ ఏది?
   1) బాష్పోత్సేకం
   2) విసరణ, ద్రవాభిసరణ
   3) వేరు పీడనం, బాష్పోత్సేకం
   4) వేరు పీడనం
14. కిందివాటిలో సేంద్రీయ పదార్థం కానిది?
   1) కొవ్వు పదార్థం 2) విటమిన్లు
   3) పిండి పదార్థం 4) డీఎన్ఏ
15. ఏ మొక్కలో దారు నాళాలు నీటి ప్రసరణలో చురుగ్గా పాల్గొంటాయి?
   1) టెరిస్ 2) ఫైకస్
   3) పైనస్ 4) ఏదీకాదు
16. ఏ మొక్కల్లో రెసిన్ నాళాలు కనిపిస్తాయి?
   1) టెరిడోఫైట్‌లు 2) శైవలాలు
   3) బ్రయోఫైట్‌లు 4) వివృత బీజాలు
17. అంతర్జాతీయ ఆహార దినోత్సవం ఏ రోజున నిర్వహించుకుంటారు?
   1) అక్టోబరు 10 2) అక్టోబరు 26
   3) అక్టోబరు 16 4) అక్టోబరు 24
18. ‘మింగడం’ అనేది ఏ రకమైన చర్య?
   1) నియంత్రిత 2) అనియంత్రిత
   3) అసంకల్పిత 4) ప్రతీకార చర్య
19. ప్రౌఢ మానవుని నోటిలో ఉండే కుంతకాల సంఖ్య?
   1) 8 2) 4 3) 6 4) 2
20. వినడంలో పాత్ర వహించే లోపలి చెవి నిర్మాణం ఏది?
   1) పేటిక
   2) కర్ణావర్తం
   3) అర్ధవర్తుల కుల్యలు
   4) యూస్టాషియన్ నాళం
21. మానవుడికి చీకటిలో వస్తువులన్నీ బూడిద రంగులో కనిపించడానికి కారణమైన కణాలేవి?
   1) దండాలు
   2) కోనులు
   3) దండాలు, కోనులు
   4) పైవేవీకాదు
22. రోమాలు, గోర్లు, గిట్టల రూపంలో జీవులకు రక్షణ కలిగించే కణజాలం ఏది?
   1) ఉపకళా 2) అస్థి
   3) ఎడిపోస్ 4) కార్టిలేజ్
23. రసభరితమైన పొలుసు ఆకులను కలిగి ఉండే మొక్కలో కనిపించే భూగర్భ కాండ రూపాంతరం ఏది?
   1) దుంప 2) కొమ్ము
   3) లశునం 4) మొగ్గలు
24. ‘అవిసీనియా’ మొక్కలో ప్రధాన వేర్లను కాకుండా వాయుగత వేర్లను తొలగిస్తే ఏమవుతుంది?
   1) కిరణజన్య సంయోగక్రియ జరగదు
   2) నత్రజని స్థాపన ఆగిపోతుంది
   3) బాష్పోత్సేకం ఆగిపోతుంది
   4) శ్వాసక్రియ ఆగిపోతుంది
25. ఒక విద్యార్థి తనకు దొరికిన మొక్క కాండం నుంచి అనేక వేర్లు సమాన పరిమాణంలో ఉండటాన్ని గమనించాడు. అది కిందివాటిలో ఏ మొక్క అయి ఉండవచ్చు?
   1) వేరుశనగ 2) కంది
   3) మొక్కజొన్న 4) చిక్కుడు
26. కిందివాటిలో జన్యు వ్యాధికి ఉదాహరణ?
   1) డిప్తీరియా 2) హీమోఫిలియా
   3) టెటానస్ 4) రేచీకటి
27. రక్తంలో సహజ రక్త స్కందక నివారిణి?
   1) హీమోలైసిన్ 2) హిరుడిన్
   3) హెపారిన్ 4) సోడియం సిట్రేట్
28. కింద పేర్కొన్న ఏ చేపల్లో అంతర అస్థి పంజరం మృధులాస్థితో నిర్మితమై ఉంటుంది?
   1) టీలియోస్ట్ 2) రోహు
   3) వల్లగో అట్టు 4) షార్క్
29. కణంలోని జీవ పదార్థంలో నీటి శాతం?
   1) 90-95 2) 85-90
   3) 70-80 4) 30-40
30. నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక ప్రమాణం ఏది?
   1) డెండ్రాన్ 2) నెఫ్రాన్
   3) న్యూరాన్ 4) ఆక్సాన్
31. ఎర్ర రంగు గులాబీ పసుపురంగు కాంతిలో ఎలా కనిపిస్తుంది?
   1) తెలుపు 2) ఎరుపు
   3) పసుపు 4) నలుపు
32. కంటి చూపుపై ప్రభావం పడకుండా ఉండాలంటే టీవీకి కంటికి మధ్య కనీసం ఎంత దూరం ఉండాలి (మీటర్లలో)?
   1) 1.5 2) 2.5 3) 5.5 4) 0.5
33. మొక్కలు నీటిని, ఖనిజ లవణాలను పీల్చుకునే విధానం గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థి దేన్ని అధ్యయనం చేయాలి?
   1) ప్లాంట్ మార్ఫాలజీ
   2) ప్లాంట్ ఫిజియాలజీ
   3) ప్లాంట్ ఇకాలజీ
   4) ప్లాంట్ ఎంబ్రియాలజీ
34. కిందివాటిలో లైకేన్లలో కనిపించే జీవనం, అందులో పాల్గొనే జీవులు వరుసగా?
   1) పరాన్న జీవనం - శైవలం, శిలీంధ్రం
   2) సహజీవనం - శైవలం, బ్రయోఫైట్
   3) పూతికాహారం - శైవలం, శిలీంధ్రం
   4) సహజీవనం - శైవలం, శిలీంధ్రం
35. నిస్సల్ కణికలు కలిగిన కణాలేవి?
   1) న్యూరాన్లు 2) నెఫ్రాన్లు
   3) ఇసినోఫిల్స్ 4) లింఫోసైట్లు
36. శరీరం మొత్తం బరువులో మెదడు బరువు సుమారుగా ఎంత శాతం?
   1) 13 2) 5 3) 2 4) 8
37. మానవుని సామాన్య రక్తపీడనం 120/80. ఇందులో పై సంఖ్య దేన్ని సూచిస్తుంది?
   1) డయాస్టోలిక్ పీడనం
   2) సిస్టోలిక్ పీడనం
   3) ఊర్ధ్వ పీడనం
   4) రక్తపోటు
38. పత్రం ద్వారా కొత్త మొక్కలను ఏర్పరిచే మొక్క ఏది?
   1) చేమంతి 2) కరివేపాకు
   3) రణపాల 4) గడ్డి
39. ఒక పుష్పాన్ని పరిశీలిస్తే అందులో రక్షక, ఆకర్షక పత్రావళి మాత్రమే ఉన్నాయి. అయితే అది ఏ రకమైన పుష్పం?
   1) ద్విలింగ 2) అసంపూర్ణ
   3) ఏకలింగ 4) సంపూర్ణ
40. కొబ్బరిలో తినే భాగం ఏ స్థితిలో ఉంటుంది?
   1) ఏకస్థితిక 2) ద్వయస్థితిక
   3) త్రయస్థితిక 4) బహుస్థితిక
41. కణ విభజనలో ద్విగుణీకృతం అయ్యేవి?
   1) రైబోజోములు 2) గాల్జీ సంక్లిష్టం
   3) క్రోమోజోములు 4) క్లోరోప్లాస్టులు
42. ‘టానిన్స్’ అనే పదార్థాల ఉపయోగం ఏమిటి?
   1) పాలను నిల్వ చేయడానికి వాడతారు
   2) తోళ్లను శుద్ధి చేయడానికి వాడతారు
   3) ఆల్కహాల్ తయారీలో ఉపయోగిస్తారు
   4) జున్ను తయారీలో వినియోగిస్తారు
43. ‘నీలి విప్లవం’ అనేది వేటి ఉత్పత్తికి సంబంధించింది?
   1) పాలు 2) కూరగాయలు
   3) తేనెటీగలు 4) చేపలు
44. కిందివాటిలో డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్నది ఏది?
   1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
   3) ఇన్సులిన్ 4) వ్యాక్సినేషన్
45. ఒక తరం నుంచి మరో తరానికి లక్షణాలు సంక్రమించే విషయం గురించి తెలియజేసే శాస్త్రం ఏది?
   1) పిండోత్పత్తి శాస్త్రం
   2) జన్యు శాస్త్రం
   3) సూక్ష్మజీవ శాస్త్రం
   4) జీవ సాంకేతిక శాస్త్రం
46. మానవుని జీర్ణ వ్యవస్థలో కిందివాటిలో ఏ పదార్థం జీర్ణం కాదు?
   1) ప్రోటీన్లు 2) కార్బోహైడ్రేట్లు
   3) కొవ్వులు 4) సెల్యులోజ్
47. కాడ్‌లివర్ నూనెలో అధికంగా ఉండేది?
   1) విటమిన్-బి 2) ప్రోటీన్లు
   3) విటమిన్-ఎ 4) విటమిన్-సి
48. ఇందిరాగాంధీ జూ పార్క్ ఎక్కడ ఉంది?
   1) ఏలూరు 2) గుంటూరు
   3) నెల్లూరు 4) విశాఖపట్నం
49. ఎడారి మొక్కల్లో ఆహారాన్ని తయారు చేసే భాగం ఏది?
   1) పత్రం 2) వేరు
   3) కాండం 4) ఫలం
50. అగ్‌మార్క్ ప్రయోగశాల మనరాష్ట్రంలో ఎక్కడ ఉంది?
   1) కాకినాడ 2) విజయవాడ
   3) గుంటూరు 4) అనంతపురం
51. బొద్దింకలో రక్తాన్ని హృదయంలోకి పంపడానికి ఉపయోగపడే నిర్మాణాలేవి?
   1) వాయు నాళ కండరాలు
   2) పక్షాకార కండరాలు
   3) హృదయ కండరాలు
   4) ఉరః కుహర కండరాలు
52. కిందివాటిలో ఏ జీవిలో చర్మం శ్వాసాంగంగా ఉండదు?
   1) బొద్దింక 2) వానపాము
   3) జలగ 4) సాలమాండర్
53. కిందివాటిలో శరీర కుహర ద్రవం కలిగిన జీవి ఏది?
   1) అమీబా 2) పారమీషియం
   3) వానపాము 4) వర్టిసెల్లా
54. పీయూష గ్రంథిలోని తమ్మెల సంఖ్య?
   1) 4 2) 3 3) 2 4) 5

సమాధానాలు

1) 3;	2) 3;	3) 4;	4) 2;
5) 4;	6) 1;	7) 4;	8) 4;
9) 1;	10) 2;	11) 3;	12) 1;
13) 3;	14) 4;	15) 2;	16) 4;
17) 3;	18) 1;	19) 1;	20) 2;
21) 1;	22) 1;	23) 3;	24) 4;
25) 3;	26) 2;	27) 3;	28) 4;
29) 2;	30) 3;	31) 4;	32) 2;
33) 2;	34) 4;	35) 1;	36) 3;
37) 2;	38) 3;	39) 2;	40) 3;
41) 3;	42) 2;	43) 4;	44) 1;
45) 2;	46) 4;	47) 3;	48) 4;
49) 3;	50) 3;	51) 2;	52) 1;
53) 3;	54) 2.		

Indian Financial Network is the..



BANK EXAMS

BANKING AWARENESS

Model Questions

1. The Reserve Bank's affairs are governed by a central board of directors. The board is appointed by the Government of India in keeping with the Reserve Bank of India Act. It is Appointed/ nominated for a period of....
   a) 6 years
   b) 5 years
   c) 4 years
   d) 3 years
   e) 2 years
2. As per SEBI guidelines, in a Book Building process the cap in the price band
   a) should be at least 10 per cent of the floor price
   b) should not be more than 20 per cent of the floor price
   c) should not be more than 30 per cent of the floor price
   d) no limits
   e) none
3. ________ is a short term security (7 days to 365 days) issued by a corporate entity (other than a bank), at a discount to the face value?
   a) Commercial Paper
   b) Certificate of Deposit
   c) Non-convertible Debenture
   d) Treasury Bill
   e) None of the above
4. Who is the chairman of NITI Ayog ?
   a) Narendra Modi
   b) Arvind Pangaria
   c) Mangu Singh
   d) Anupam Srivastava
   e) Ashok Kumar Roy
5. The Nai Manzil Scheme is designed as an integrated education and training programme that provides youth from minority communities skills needed for different tasks in a rapidly changing world. It also provides them trade related training in which of the following areas:
   a) Manufacturing
   b) Engineering
   c) Services
   d) Soft skills
   e) All the above
6. Indian Financial Network [INFINET] is the...
   a) Communication backbone for the Indian Banking and Financial sector
   b) Association of the employers of the banking and financial sector
   c) Closed user group network of SBI and its subsidiaries
   d) All of the above
   e) None of the above
7. In Mutual Funds, A close ended fund means:
   a) The corpus is of fixed size with a definite redemption period
   b) Listing on stock exchanges provides easy liquidity
   c) The market price is always below the Net Asset Value
   d) All of the above
   e) None of the above
8. Which of the following is correct statement in respect of debit cards
   a) Debit card facility is provided to those having savings bank account/current account holders
   b) This facility is not extended to cash credit/loan account holders
   c) It is an unsecured credit facility
   d) Debit card is issued to all the persons who visit the branch
   e) a and b
9. In the term IPO, what do you mean by "P"?
   a) Provisions
   b) Public
   c) Private
   d) Prudent
   e) Pension
10. The Overall Priority Sector Lending Target to be increased to _______ by Foreign Bank with more than 20 Branches by 2018?
   a) 60 percent of adjusted Net Bank Credit
   b) 40 percent of Adjusted Net Bank Credit
   c) 32 percent of adjusted Net Bank Credit
   d) 25 percent of adjusted Net Bank Credit
   e) 30 percent of adjusted Net Bank Credit
11. When it comes to scheduled commercial banks, which out of the following is not true?
   a) Nationalised banks
   b) Regional Rural banks
   c) Foreign banks
   d) Private sector banks
   e) Local area banks
12. Which amongst the following is called as mother of deposits?
   a) Current account
   b) Fixed deposit
   c) Recurring deposit
   d) Savings bank
   e) Reinvestment deposit
13. "Micro Finance" is a ______ of banking services?
   a) Introduction stage
   b) Saturation stage
   c) Research stage
   d) Decline stage
   e) None of the Above
14. Which amongst the following is not term deposits issued by commercial banks?
   a) Current account
   b) Fixed deposit
   c) Recurring deposit
   d) Reinvestment deposit
   e) All the above
15. What is the main purpose of Open market operations?
   a) A fiscal device which assists Government borrowing
   b) A monetary measure to regulate quantity of money in circulation and the cash reserves of the commercial banks
   c) A measure to counteract extreme trends in business
   d) A measure to influence the balance of payments position
   e) None of the above
16. What is the full form of MSME?
   a) Mini, Small and Medium Enterprises
   b) Micro, Small and Medium Enterprises
   c) Mini scale Marketing Enterprises
   d) Medium Scale Marketing Enterprises
   e) None of the above
17. A customer is required to maintain adequate balances in his/her accounts in order to use his ____ card in the merchant establishments?
   a) Smart Card
   b) Credit Card
   c) Add-on Credit card
   d) Debit Card
   e) None of the above
18. Which of the following are the latest guidelines issued by the RBI in respect of opening new branches in villages?
   a) To open more brick and mortar branches in villages where there are no banking facilities and population is more than 5,000.
   b) Banks to submit a roadmap on how many branches they will be opening by 31 March 2017.
   c) The roadmap by end of January 2016.
   d) BCBF Model to be discontinued
   e) Only a, b, c
19. Name the financial instrument which is/are issued for short term (up to one year) borrowing by RBI on behalf of the Government of India?
   a) Treasury Bills
   b) Commercial Paper
   c) Certificate of Deposit
   d) Non-convertible Debenture
   e) Only b & c
20. KYC (Know Your Customer) norms were implemented in the Indian banking system in 2002 as per the directive of ?
   a) SEBI b) RBI
   c) IBA d) IRDA
   e) None of these
21. Often, we read in the newspapers that several Indian companies are taking the FCCB route to raise capital. What does the term FCCB stand for?
   a) Foreign Currency Convertible Bond
   b) Foreign Convertible Credit Bond
   c) Financial Consortium and Credit Bureau
   d) Future Credit and Currency Bureau
   e) None of these
22. ATM cards are issued to a person who maintains any of following accounts with the bank
   a) saving bank account
   b) current accounts
   c) term deposits
   d) loan or cash credit accounts
   e) either a or b
23. A commercial paper is
   a) A paper issued by Reserve Bank of India an trade and commerce
   b) An unsecured money market instrument issued in the form of promissory note
   c) A document issued by IDBI for seeking refinance facility from Reserve Bank India
   d) All of the above
   e) None of the above
24. Which of the following would fall under the category of retail banking?
   a) Home Loans
   b) Credit Cards
   c) Personal Loans
   d) Car Loans
   e) All of these
25. Who decides how much quantity of the coins to be minted?
   a) Reserve Bank of India
   b) Central Government
   c) Finance Ministry
   d) Both RBI and Central Government decide
   e) None of the above
26. What are the components of Foreign Exchange Reserves?
   a) Foreign currency assets,
   b) Gold,
   c) Special Drawing Rights
   d) Reserve Position in the IMF
   e) All the above
27. The chairman of Regional Rural Bank is appointed by _____?
   a) State Government
   b) Reserve Bank of India
   c) Central Government
   d) Sponsoring bank in consultation with NABARD
   e) None of the above

KEY

1) c	2) b	3) a	4) a
5) e	6) a	7) d	8) e
9) b	10) b	11) e	12) d
13) a	14) a	15) b	16) b
17) d	18) e	19) a	20) b
21) a	22) e	23) b	24) e
25) b	26) e	27) d	